Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 1

నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

# కథ 2019

సారథ్యం

**ముల్కనూరు ప్రజాగ్రంథాలయం**

సంకలనం

**నమస్తే తెలంగాణ**

ప్రచురణ

**ముల్కనూరు ప్రజాగ్రంథాలయం**

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 2

నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

# కథ 2019

Namasthe Telangaana,
Mulkanuru PrajaGrandhalayam
katha 2019

@ Publisher

**Price : Rs. 150 /-**

First Edition : **Oct 2019**

Publisher
**ముల్కనూరు ప్రజాగ్రంథాలయం,**
**ముల్కనూరు (గ్రా),**
**భీమదేవరపల్లి (మం),**
**వరంగల్ అర్బన్ (జి), తెలంగాణ**

Cover Image
**Mallibhat Vasu**


Design & Page Layout
**Kiran Kumar Dasari**
**Sridhar Ravula**

Printed @
**Sai Likhita Printers**
Khairatabad, Hyderabad

For copies
All Leading book stores

for e-books
kinige.com

# కథా ఉత్సవం



కట్టా శేఖర్ రెడ్డి

**తెలంగాణలో కథలున్నాయా? కథా రచయితలున్నారా? అని** ఒక ప్రముఖ కథారచయిత రెండు దశాబ్దాల క్రితం ఎగతాళి చేశారు. అది ఆధిపత్య భావజాలం రచయితలతో సహా మేధావుల మెదళ్లను నడిపిస్తున్న కాలం. ప్రాంతాల అస్తిత్వాన్ని, భాషను, మాండలికాన్ని, రచనలను, రచయితలను చిన్నచూపు చూస్తున్న కాలం.

వెనకటికి తెలంగాణలో కవులున్నారా, రచయితలున్నారా అని ప్రాంతీయ దురహంకారంతో ఒక రచయిత వేసిన ప్రశ్న సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ కవుల సంచిక తేవడానికి కారణమయింది. నిజానికి తెలంగాణ తన సృజనశీలతను, రచనా పాటవాన్ని ఎవరికీ రుజువు చేసుకోనవసరం లేదు. తెలంగాణ పొత్తిళ్లలో ఎగసిన ఆర్థి, రాజకీయ, సామాజిక ఉద్యమాలకు రచన ఒక పతాకమై, సృజనాత్మకత ఒక నినాదమై ప్రజలను చైతన్యపరుస్తూ, ఏకోన్ముఖం చేస్తూ ముందుకుసాగింది.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నిన్నమొన్నటి ఉదాహరణ. అమెరికన్ కవయిత్రి మాయా ఏంజిలో చెప్పినట్టు పంజరంలో పక్షివలె తెలంగాణ గొంతెత్తి పాడింది. గజ్జెకట్టి ఆడింది. ప్రతి పల్లె చైతన్యదీపమైంది. ప్రతివేదిక రంగస్థలమైంది. తెలంగాణ తల్లి దాస్య శృంఖలాలు బద్దలు కొట్టడం కోసం ఆడని, పాడని.. కవులు, కళాకారులు తెలంగాణలో లేరు. కవిత్వం, పాటలు.. ఆవేదన, ఆగ్రహం, నిరసన, అసమ్మతి నుంచి అప్పటికప్పుడు జనించే భావోద్వేగ స్పందన. కథలు, నవలలు అనంతర స్పందనలు. అంతర్మథనం, ఆలోచన, అన్వేషణ నుంచి జనించే రచనా శిల్పాలు.

కథలను విశ్లేషించే నైపుణ్యం నాకు అంతగా తెలియదు. కానీ, కథలను చదివే పాఠకునిగా ఏది మంచి కథో ఏది మామూలు కథో అంచనా వేసుకునేంత పరిమిత జ్ఞానం అందరికీ ఉంటుంది. అటువంటి కథా పాఠకుడిగానే కథలంటే మక్కువ. ముల్కనూరు ప్రజాగ్రంథాలయం మిత్రులు కథల పోటీలు పెడదామని చెప్పగానే నమస్తే తెలంగాణ చాలా సంతోషించింది. కథలను అన్వేషించే మిత్రులు ఇంకా అనేకమంది ఉన్నారని తెలిసినప్పుడు గొప్ప భరోసా ఏర్పడింది. కథ, కవిత్వం, నవల, జర్నలిజం అన్ని స్రవంతులు సజీవంగా ప్రవహిచినప్పుడు సమాజం నిత్యచైతన్యశీలమై ముందుకు సాగుతుంది.

సాహిత్యం ఏదైనా సమాజానికి అద్దం వంటిది. అద్దం నిరపేక్షమైనది. దానికి దయ ఉండదు. మన సౌందర్యాన్ని చూపుతుంది. మన వికృతత్వాన్ని చూపుతుంది. అలా చేయలేనప్పుడు ఆ అద్దంతో పనిలేదు. ప్రయోజనం లేదు. అదొక వృథా ప్రయాస. సృనాత్మకత పతనమైన సమాజాలు ఎలా ఉంటాయో తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ సాగిన ఉద్యమాలను చూసినప్పుడు మనకు తెలిసివచ్చింది. ఆడడం, పాడడం, రాయడం బలహీనపడిన సమాజాలు సృజనశీలంగా, గతిశీలంగా మనజాలవు. అందుకే మన రచనా పతాకాలు నిరంతరం సమున్నతంగా రెపరెపలాడాలి.

కవితలు, పాటలు, కథలు, నవలలు కలకాలం వర్ధిల్లాలి. వీటి అవసరం తీరిపోయిందని ఎప్పుడు అనుకుంటామో అప్పుడు గతిశీల సమాజం అంతిమయాత్ర మొదలైందని భావించాలి. ముల్కనూరు ప్రజాగ్రంథాలయం, నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీకి అపూర్వ స్పందన వచ్చింది. సుమారు మూడు వందల కథలు పంపారు. పేరుకు పోటీ అని పెట్టినా, కొన్ని కథలను ఉత్తమ కథలుగా ఎంపిక చేసి బహుమతులు ఇచ్చినా అన్ని కథలూ విలువైనవే. తెలంగాణ సామాజిక జీవితాన్ని చదవడానికి అవి గొప్ప అవకాశం కల్పించాయి. ఈ కథాయజ్ఞంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు.

**కట్టా శేఖర్ రెడ్డి**
ఎడిటర్,
నమస్తే తెలంగాణ దినపత్రిక

# చిన్న ప్రయత్నం



**వేముల శ్రీనివాసులు**

**పదివేల జనాభా కూడా లేని గ్రామం. ఇంత పెద్ద నగదు బహుమానాలతో** తెలుగు కథలపోటీని నిర్వహించడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. ముల్కనూరు ప్రజాగ్రంథాలయం, నమస్తే తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన ఈ కథలపోటీ సాహితీ సమాజంలో ఒక ముచ్చటగా మారింది.

మా గ్రంథాలయం ఒక పుస్తకపఠన కేంద్రంగానే కాకుండా, విద్యార్థులకు పోటీపరీక్షలకు తర్ఫీదునివ్వడం, కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, వ్యక్తిత్వ వికాస తరగతులతో పాటు వారిలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడానికి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను కూడా నిర్వహిస్తున్నది. స్త్రీల భాగస్వామ్యం కోసం పాటలు, రంగవల్లుల వంటి కార్యక్రమాలూ నిర్వహిస్తున్నది. ఈ విధంగా మా గ్రంథాలయం ఒక విద్యాకేంద్రంగా, సాంస్కృతిక కేంద్రంగా, మేథోవికాస కేంద్రంగా నిత్యం చైతన్యవంతంగా ఉండేలా కృషి చేస్తున్నాం.

మిత్రులందరం కలిసి తెలుగు సాహిత్యం.. ముఖ్యంగా కథాసాహిత్యం గురించి చర్చించినప్పుడు కథారచయితలకు ప్రోత్సాహం పెద్దగా లేదని.. తెలుగు కథను, కథా రచయితలను గుర్తించే ప్రయత్నం చేయాలని, కొత్త రచయితలను గుర్తించాలని అనుకున్నాం. ఈ క్రమంలో నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ శ్రీ కట్టా శేఖర్‌రెడ్డి గారిని సంప్రదించాం. వారు తాము కూడా ఇలాంటి ఆలోచన చేస్తున్నట్లుగా చెప్పారు. తెలుగు కథకు కొత్త వెలుగులు తీసుకురావాలని నిశ్చితాభిప్రాయానికి వచ్చాక నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా కథలపోటీని నిర్వహించి రూ. యాభై వేలు మొదటి బహుమతిగా ఇద్దామని నిర్ణయించాం.

''Stories are light. Light is precious in a world so dark''

చిమ్మ చీకట్లలో ఉన్న ప్రపంచంలో కథలు వెలుగును నింపుతాయి. కథలు మానవ సంబంధాల సంఘర్షణే కాకుండా మానవునికి, ప్రకృతికి జరుగుతున్న ఘర్షణను ఆవిష్కరిస్తాయి. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా రచయితలు సమాజంలో చైతన్య ప్రసరణ కోసం కథలు రాస్తూనే ఉన్నారు.

కథను బతికించాలి. మంచికథ మనల్ని కట్టి పడేస్తుంది. కన్నీళ్లు తెప్పిస్తుంది. కదిలిస్తుంది. కవ్విస్తుంది. అన్ని సాహితీ ప్రక్రియల్లో సమాజానికి ఎక్కువగా దగ్గరయ్యేది కథే. నేటి సోషల్‌మీడియా ప్రపంచంలో కథకు సరైన స్థానం లభించిందా అనే ప్రశ్నకు సమాధానం లేదనే చెప్పాలి.

తెలుగు కథ విస్తృతి రోజుకింత పెరుగుతున్నది. నేడు తెలంగాణ వారు మన దేశంలోనే కాకుండా అమెరికా, యూరప్, ఆఫ్రికా, గల్ఫ్ వంటి దేశాల్లో ఎక్కువ సంఖ్యలో జీవిస్తున్నారు. దీని కారణంగా మనవాళ్లు అక్కడి భాషా సంస్కృతుల్లో ఇమిడే క్రమంలో ఎన్నో కొత్త విషయాల, వారనుభవిస్తున్న కష్టసుఖాలను కథల రూపంలో తెలియజేస్తున్నారు.

ఈ కథల పోటీకి 294 కథలు రాగా ఈసారి తెలంగాణ సామాజిక చిత్రానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రచయితలు తెలంగాణ సమాజపు ఆత్మను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

స్వామి భక్తికన్నా, కండ్ల ఎదుటి పురిటినొప్పులతో తల్లడిల్లుతున్న ఒక అమ్మను కాపాడే ప్రయత్నంలో తన జీవితంలో అన్నీ కోల్పోయిన బొందయ్య కథ. మనం మంచి చేస్తే మనకు మంచే జరుగుతుంది కద దొర నాకెందుకు జరగడం లేదని కర్మ సిద్ధాంతాన్ని ప్రశ్నించే బొందయ్య మనల్ని చాలాకాలం వెంబడిస్తాడు. 'విత్తనం' కథలో రచయిత పెద్దింటి అశోక్ కుమార్ పూర్వకాలపు గ్రామీణ సామాజిక వ్యవస్థ కట్టుబాట్లు, కష్టాలు, కన్నీళ్లు వాటి మధ్యన మానవీయ విలువలను ఆవిష్కరించారు. బొందయ్యను ఇంకో బొందయ్య ఆలింగనం చేసుకోవడం ద్వారా కథను సుఖమయం చేయడమే కాకుండా మనదేశపు కర్మ సిద్ధాంత జ్ఞానాన్ని కొత్తగా వ్యక్తీకరించారు.

హరామ్ కథలో రచయిత హుమాయున్ సంఘీర్ మతాచారాలకు మనం నివసిస్తున్న సమాజపు సంస్కృతుల మధ్య వైరుధ్యాల వల్ల కుటుంబసభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు, మనోవేదనలు కళ్ళకు కట్టినట్లు చెప్పారు. మతాన్ని, మతగ్రంథాలను సరైన రీతిలో అర్థం చేసుకోకుండా పుట్టిన మతాచారాలు మానవత్వం కంటే గొప్ప కాదని తన తల్లిని కాపాడుకోవడంలో విజయం సాధించిన కథానాయకుడు నయీం పాత్ర ఉదాత్తంగా ఉంది.

శిరంశెట్టి కాంతారావు గారి ఒట్టిపోయిన అడవిలో వర్షాలు పడని కాలంలో మనుబోతుల గూడెం ఆదివాసుల జీవన్మరణ సమస్యగా మారిన నీటి కొరతను, వర్షాలు పడాలంటే భూమి పండుగ చేయాలనే తపనతో అడవంత గాలించినా చివరకు బలివ్వడానికి ఒక్క జంతువు దొరకని పరిస్థితులు, అడవి, అడవులను నమ్ముకున్న ఆదివాసులు, జంతుజాలము మనుగడ ఎంత దయనీయంగా ఉందో మనల్ని మనుబోతులగూడేనికి తీసుకెళ్లి ప్రత్యక్ష వీక్షణం చేయిస్తాడు.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 7

బుక్కెడంత బువ్వకోసం శారడంత పోడు కొట్టుకునే మమ్ముల దొంగలెక్క జూసే బదులు రకరకాల పేర్లతోటి అడవిల జొరబడే కాంట్రాక్టర్లు మెషిన్లు మీద వొందలెకరాల అడవిని, వాగుల్లో ఇసుకను, కొండలమీద రాళ్లను తీస్కపోతుంటే వాల్ల జోలికి మాత్రం పోరు అని బలమైన ప్రశ్నను సంధించిన కథ.

ఉద్యోగులంటే యాంత్రికంగా పనిచేస్తూ నెలనెల జీతాలు తీసుకునే మరమనుషులు కాదని వారికి సమాజం పట్ల, వారికి తారసపడే వ్యక్తుల సుఖదుఃఖాల పట్ల స్పందించే గుణం ఉంటుందని పుట్టగంటి గోపీకృష్ణ రాసిన బేబక్క కథ ఆవిష్కరిస్తుంది. ఇరాక్‌లోని ఒక నోరు తిరగని పట్టణంలోని మార్కెట్‌లో మానవబాంబుగా మారిన మన బేబక్క జీవితాన్ని ఆమె అనుభవించిన కష్టాలను, వలస కార్మికుల కష్టాలను, ఈ కష్టాల్లో కూడా బ్రోకర్ల నీచప్రవృత్తి, మనసులేని రాక్షసుల మధ్య జీవిస్తున్న ఎంతోమంది బేబక్కల జీవితాలను దృశ్యరూపం చేసిన తీరు ఆకట్టుకుంటుంది. చాలాపెద్ద కాన్వాస్.

'అమ్మపండుగ'లో రచయిత ఎగుర్ల గణేష్ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తనతల్లిలో దాగివున్న సృజనాత్మకతను, గాయనిని, తత్త్వవేత్తను మొదటిసారి దర్శిస్తాడు. బతుకమ్మ పండుగకు అమ్మతో అమ్మమ్మ వాల్లింటికి చాలా ఏండ్ల తర్వాత వెళ్లిన తనకు తనతల్లిలోని అనేక కోణాలు కనిపిస్తాయి. బతుకమ్మ పండుగ నిజంగా అమ్మల పండుగే. బతుకమ్మ పాటల్లో దేవుళ్లకు, రాజుకుండే కష్టాల గురించి పాడుకోవడం వల్ల దేవతలకే కష్టాలు తప్పలే మనకెంత అన్న తాత్వికతను మన పండుగలు, ఆచారాలు, పాటలు అన్నింట్లో కనిపించే, కనిపించని జీవిత సత్యాలు తత్త్వాల గురించి అద్భుతంగా చెప్పారు రచయిత.

ప్రొఫెసర్ రామాచంద్రమౌళి 'సిద్ధయ్య మఠం' కథలో వందల గుట్టలను మాయం చేస్తున్న మాఫియాలు మైనింగ్ పేర మాఫియాలు ప్రకృతి విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయో ఈ ప్రకృతి విధ్వంసంలో దాగివున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక కోణాలను ఒక్కటొక్కటిగా ఆవిష్కరించారు. సమకాలీన సమస్యను, దానికి సమాధానాన్ని చెప్పిన ఈ కథ ప్రకృతి ప్రసాదించిన అద్భుతాలను ఒక్కటొక్కటిగా హరించుకుంటూ పోతే మిగిలేది అనర్థమే అని చెబుతుంది. ''ఎవడౌరా నువ్వు మా గుట్టను ముట్టుకోనేటానికి. నీ అయ్యదా ఇది.. ఏదీ రారా'' అని ముత్తక్క అందరికీ మార్గదర్శనం చేసింది.

మానవత్వానికి మతం అడ్డుకాదు అని తెలంగాణ గ్రామీణ ప్రాంతంలోని హిందూ ముస్లింల జీవన గతిని హృద్యంగా మలిచాడు ఖుర్బాని కథలో సయ్యద్ గఫార్. చాలాకాలం గుర్తుండే కథ. చరిత్ర శిథిలాల మీద నిట్టాడు ఆనందపు శకలాల జ్ఞాపకాలను 'అంటరాని బతుకమ్మ' కథలో పంచాడు సిద్దెంకి యాదగిరి. పట్టు చీరె మడతలల్ల అమ్మ దాచిపెట్టిన గంధపు పొట్లం సువాసనలు 'అమ్మల గాజులు' కథలో వెదజల్లారు ప్రభాకర్ జైనీ. పేదలకు వైద్యం అందని ద్రాక్ష అయిన వైనాన్ని వాస్తవానికి దగ్గరగా 'రేణుక' కథలో ఆవిష్కరించాడు పర్కపెల్లి యాదగిరి. తెలంగాణ సంస్కృతిలో భాగమైన 'ఒడిబియ్యం' ఆచారాన్ని ఎంతో హృద్యంగా చెప్పారు గంగుల నరసింహారెడ్డి. గడి బండరాతి గుండెలను దడదడలాడించి, కోట గోడల మీద చల్లని గాలిలాంటి కొత్త పాటలా 'గడి' కథను చెప్పారు చందుతులసి.

ఎక్కడ పుట్టిన గడ్డి అక్కడే వాడిపోవాలన్నట్లు.. తన అవ్వను చూస్కుంటూ బొడ్రాతు లెక్క ఊర్లోనే ఉండాలనుకున్న ధనుజా కథ 'బొడ్రాతు'. జంగుభాయి వంటి ఆదివాసీల్లో అంతులేని ధైర్యన్ని నింపిన 'అతడు మార్గదర్శి' కథ సమకాలీన అంశాలను స్పృశించింది. అవయవ దానం ఆవశ్యకతను అంతర్లీనంగా అందమైన అనుబంధాల మధ్య చెప్పిన కథ 'తులసమ్మ బతికింది'. కనకలచ్చిమి 'బర్రె లేకుంటే బతుకే లేకుంట పోయేది' అట్టాంటి తప్పిపోయిన బర్రె కోసం అన్వేషణను ఆకట్టుకునేలా చెప్పిన కథ 'సుక్క బర్రె'. పోటీతత్వాన్ని అర్థం చేసుకోలేని తత్వాన్ని ఆధునికత హంగులతో అందంగా బంధించిన కథ 'బూరుగు సందుగ'. మాధురీ మేడమ్ అసొంటోల్లుంటే గరీబోళ్లకి తక్లీపులుండవని మధురంగా చెప్పిన కథ 'స్వీట్ బాక్స్'. 'కట్టం వస్తే పోరాటం చెయ్యాల'ని మేడారం అమ్మల స్ఫూర్తిని రగిలించిన కథ 'పోరాటం'. రైతు సంక్షేమం కోసం ఆరాటపడే గంగాధర్ ద్వారా యువతకు కొత్త మార్గ నిర్దేశం చేశాడు రచయిత 'ఒక ఆకుపచ్చని ఆశ' కథ ద్వారా. ప్రజలందరికీ ఉపయోగపడే గుట్టను కాపాడేందుకు అమ్మోరు ఎలా వచ్చిందో 'గుట్ట మీద దేవుడు' కథలో సూక్ష్మంలో మోక్షంలా చెప్పాడు రచయిత. బతుకు వాసన తెలిసినోడు ఎవర్నీ చంపడని, చావు శిక్షలా కాకుండా, పాఠంలా ఉండాలని చెప్పింది 'బతుకు వాసన' కథ.

ఇన్ని కథలను చదివి నిష్పక్షపాతంగా ఫలితాలను ప్రకటించిన జ్యూరీ సభ్యులు శ్రీ గింజల మధుసూధన్ రెడ్డి, శ్రీ కోడూరి విజయకుమార్, శ్రీ పెనుగొండ బసవేశ్వర్, శ్రీ నగేష్ బీరెడ్డి , కుమారి ఇట్టేడు అర్కనందనాదేవికి ప్రత్యేక ధన్యవాదాలు. ముల్కనూరు ప్రజాగంథాలయం ప్రతి పనిలో ఏ ప్రయోజనం ఆశించకుండా పాటుపడుతున్న మిత్రబృందం వంగ రవీందర్, ప్రమోద్‌రెడ్డి, కోడూరు సుగుణాకర్, తిరుపతి, గోవర్దన్ రెడ్డి, లక్ష్మయ్య గారు, వీరేశం, కొమురయ్య, సుద్దాల సంపత్, మూల శ్రీనివాస్, ఐత కిషన్ ప్రసాద్, శ్యాంసుందర్, శంకర్రావు, నటరాజ్ సుందర్, రమేష్, చొల్లేటి సంపత్, ప్రవీణ్, దర్శన్ మరియు ముల్కనూరు మిత్రులందరికీ కృతజ్ఞతలు.

ముల్కనూరు ప్రజాగ్రంథాలయాన్ని భాగస్వామ్యంగా చేసుకొని కథల పోటీని నిర్వహించిన నమస్తే తెలంగాణ పత్రిక యాజమాన్యానికి ధన్యవాదాలు. మా ప్రతి పనిలో ఆర్థికంగా తోడ్పాటునందించి మార్గదర్శగా నిలిచిన రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతారావు గారికి, శాసనసభ్యులు శ్రీ వొడితల సతీష్ కుమార్ గారికి, ఎమ్మెల్సీ శ్రీ కడియం శ్రీహరి గారికి, ఎమ్మెల్సీ శ్రీ నారదాసు లక్ష్మణ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. అదేవిధంగా ఈ కథల పోటీకి నగదు బహుమతులను ఇవ్వడానికి ముందుకువచ్చిన వైఆర్‌పీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రవిప్రసాద్ గారికి ధన్యవాదాలు.


ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహించాలనే మా ప్రయత్నానికి భగవత్ కృప కావాలని కోరుకుంటూ..

**వేముల శ్రీనివాసులు**
సలహాదారు,
ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 9

## నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం కథలపోటీ - 2019

# న్యాయనిర్ణేతలు



**శ్రీ గింజల మధుసూదన్ రెడ్డి**
రచయిత



**శ్రీ కోడూరి విజయకుమార్**
కవి, రచయిత



**శ్రీ పెనుగొండ బసవేశ్వర్**
రచయిత, కరీంనగర్



**శ్రీ నగేష్ బీరెడ్డి**
ఫీచర్స్ ఎడిటర్, నమస్తే తెలంగాణ




**కుమారి ఇట్టేడు అర్కనందనాదేవి**
ఎంఏ పీహెచ్‌డీ, రచయిత్రి

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 10


# ముల్కనూరు ప్రజాగ్రంథాలయం చిత్రమాలిక













# విషయ సూచిక


| | |
|---|---|
| 1. **విత్తనం** : పెద్దింటి అశోక్ కుమార్ | 13 |
| 2. **హరామ్** : హుమాయున్ సంఘీర్ | 25 |
| 3. **ఒట్టిపోయిన అడవి** : శిరంశెట్టి కాంతారావు | 35 |
| 4. **బేబక్క** : పుట్టగంటి గోపీకృష్ణ | 47 |
| 5. **అమ్మ పండుగ** : ఎగుర్ల గణేష్ | 59 |
| 6. **సిద్ధయ్య మఠం** : రామా చంద్రమౌళి | 67 |
| 7. **ఖుర్బాని** : సయ్యద్ గఫార్ | 75 |
| 8. **అంటరాని బతుకమ్మ?** : డా. సిద్దెంకి యాదగిరి | 85 |
| 9. **అమ్మల గాజులు** : డా. ప్రభాకర్ జైనీ | 93 |
| 10. **రేణుక** : పర్కపెల్లి యాదగిరి | 101 |
| 11. **ఒడి బియ్యం** : గంగుల నరసింహారెడ్డి | 113 |
| 12. **గడి** : చందు తులసి | 123 |
| 13. **బొడ్రాతు** : రావుల కిరణ్మయి | 131 |
| 14. **అతడు మార్గదర్శి** : కూతురు రాంరెడ్డి | 139 |
| 15. **తులసమ్మ బతికింది!** : యు. రాజ లింగమూర్తి | 149 |
| 16. **సుక్కబర్రె** : మ్యాకం రవికుమార్, పెద్దపల్లి | 161 |
| 17. **బూరుగు సందుగ** : చెన్నూరి సుదర్శన్ | 169 |
| 18. **స్వీట్ బాక్స్** : నండూరి సుందరీ నాగమణి | 177 |
| 19. **పోరాటం** : చేవూరి శ్రీరాం, హన్మకొండ | 185 |
| 20. **ఒక ఆకుపచ్చని ఆశ** : బి. మురళీధర్, ఆదిలాబాద్ | 193 |
| 21. **బతుకు వాసన** : గంగ్రడకోట సూర్యనారాయణ శర్మ | 203 |
| 22. **గుట్ట మీద దేవుడు** : మధుకర్ వైద్యుల | 211 |

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 12

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 13

# విత్తనం

పెద్దింటి అశోక్ కుమార్

**ప్రథమ బహుమతి రూ. 50,000 పొందిన కథ**

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 14



తెలుగు సాహిత్యంలో పరిచయం అక్కర్లేని పేరు పెద్దింటి అశోక్ కుమార్. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డి పేటలో జన్మించారు. వృత్తిరీత్యా గణిత ఉపాధ్యాయులు. M.sc B.Ed చదివారు. ఇంతవరకు 200 కథలు, ఆరు నవలలు, వందకు పైగా సామాజిక వ్యాసాలు, ఐదు నాటకాలు రాశారు. ఏడు కథా సంకలనాలను ప్రచురించారు. 'ఓ అక్రమన్ కబ్ కా హో చుకా' పేరుతో హిందీలో, 'ఓ ఘర్ బంద్ డాలియా' పేరుతో మరాఠీలో కథా సంకలనాలు వెలువడ్డాయి. కొన్ని కథలు హిందీ ఇంగ్లీషు మరాఠీ కన్నడలోకి అనువాదం అయ్యాయి. ఆయన రాసిన జిగిరి నవల 9 భాషల్లోకి అనువాదమయింది. తెగారం నాటకానికి నంది అవార్డు వచ్చింది. తెలంగాణ ఉద్యమ చరిత్రను రికార్డు చేస్తూ కథలే కాకుండా యథార్థ సంఘటనలతో 'పోరుగాలి' నాటకాన్ని, 'లాంగ్ మార్చ్' అనే నవలను కూడా ఈ మధ్య రాశారు. ఐదు సినిమాలకు రచయితగా పని చేశారు. మల్లేశం సినిమాకు ఆయన రాసిన మాటలు, ఒక పాట అందరి మన్ననలను అందుకున్నాయి. ఆరు చిన్న సినిమాలకు కథలను అందించారు. భారతీయ భాషా పరిషత్ యువ పురస్కారంతోపాటు ఎన్నో అవార్డులు, రివార్డులు పొందారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతీకాత్మకంగా కథలు రాయడం తన ప్రత్యేకత. తెలంగాణ భాష నానుడులు సామెతలకు పెట్టింది పేరు పెద్దింటి. ఆయన రాసిన 'మాయి ముంత', 'ఊటబాయి', 'భూమడు', 'జుమ్మేకిరాత్ మే' కథలు చాలా ప్రసిద్ధి పొందాయి. ప్రస్తుతం కొన్ని సినిమాలకు కథలు, మాటలు రాస్తున్నారు.

**బండలింగంపల్లిలో రెవెన్యూ సదస్సు** ముగిసింది.

రెవెన్యూ సదస్సు అంటే రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వాళ్లే వస్తరు. కాని అక్కడికి పోలీసులు గూడా వచ్చారు. మండలంలో ఏ ఊరికి లేని సమస్యలు ఆ ఊరికే ఉన్నయి మరి. ఊరు చిన్నదే అయినా వాడకో లీడరు. లీడరుకో క్యాడరు.

అనుకున్నట్టుగనే రైతులంతా మనిషికో సమస్యతో కచీరు దగ్గర జమయ్యారు. పట్టాలని, పరం పోగులని, బినామీలని, ఆర్వోఆర్‌లని, భూమి తక్కువుందని, ఎక్కువుందని, పాస్ బుక్కులని సమస్యలన్నీ చెప్పుకున్నరు. ఎంత రచ్చ అయితదో అనుకున్నరు అధికారులు. కానీ అంతా సాఫీగానే జరిగింది. ఒకటి రెండు చిన్నచిన్న లొల్లులు తప్ప వివాదాలన్నీ పరిష్కారమైనయి.

సిబ్బంది తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నరు. ఎమ్మార్వో ఈడు చిన్నదే కాని మంచి మనిషి. భూమి లేని ఎందరో పేదలకు భూములు పంచిండు. ఏ ఊరుకు వెళ్లినా రైతులు చేతులెత్తి మొక్కుతరు. చిన్న వివాదం కూడా రావద్దని ఒకటికి రెండు సార్లు అడిగి సమస్యలన్నీ విని ఆరైకి ఆన్‌లైన్‌కు సంబంధించిన గైడ్‌లైన్స్ ఇచ్చి కారువద్దకు వచ్చిండు.

అప్పటికి పొద్దు గూకుతున్నది. ఎక్కడివాళ్లక్కడ వెళ్లిపోయారు. కారు కదులుతుండగా ఎక్కడినుంచో పరుగెత్తుకొచ్చిండు బొందయ. అటు ఇటుగా అరవై ఏళ్లుంటయి. వంగిన నడుము, చిరిగిన అంగీ, మాసిన దోతి, తెల్లటి గడ్డం.. మనిషి కొద్దిగ మోటుగనే ఉన్నడు. వస్త వస్తనే కారుకు అడ్డంతిరిగి 'అయ్యా.. నా భూమి.. నా భూమి..' అన్నడు.

కారును ఆపి గ్లాస్‌ను దించి బయటకు చూస్తూ విసుగ్గా 'ఆ.. నీ భూమి.. ఏమయింది' అడిగిండు ఎమ్మార్వో.

'ఇప్పల్ల.. కాలువ కింద రెండెకరాలు కుష్కీ గుడ్డం. అది నాదే.. నలుపయేండ్లకిందనే రాసిచ్చిండు. పట్టాలేదని మొన్న గుంజుకున్నరు. ఎట్లన్న చేసి నా భూమి నాకు ఇప్పియ్యాలె సార్. ఇప్పుడది పంట భూమి.. బంగారం పండుతుంది' అన్నడు బతిమాలుతున్నట్టు.

ఏమనుకున్నడో ఎమ్మార్వో. ఓపికగా వివరాలన్నీ అడిగిండు. బొందయ చెప్పిండు.

అన్నీ విన్న ఎమ్మార్వోకు నవ్వొచ్చింది.'రిజిస్ట్రేషన్ కాలేదు.. సాగు చెయ్యలేదు.. సాక్ష్యాలు లేవు.. అసలు అనుభవదారువు కూడా కాదు.. కాని, నీ పేరుమీద రాయాలి.. ఇంతకూ ఎవలదయ్యా ఆ భూమి.. నీకెట్లచ్చింది' అడిగిండు ఎమ్మార్వో.

'మా ఊరే సారూ... భూపాల్ రావు దొరది.. నా పేరు మీద రాసిండు' అన్నడు.

ఒక్కసారి ఉలిక్కి పడ్డడు ఎమ్మార్వో. అది కొంత లావన్ పట్ట. కొంత శికం భూమి. దాని జోలికే పోవద్దనుకుని 'రిజిస్ట్రేషన్ లేకుంటె పట్టా ఇయ్యరాదు..' అన్నడు.

'అదేంది సారూ.. పేదోళ్లకు ఏకాయిదం లేకున్నా మీరు నిలవడి చేపిత్తున్నరట. నాకు దొర రాసిచ్చిన కాయిదం ఉంది..' అంటూ ప్లాస్టిక్ కవరు మడతల్లో దాచిన ఒక పాత కాగితాన్ని తీసి ఇచ్చిండు. అది నాలుగు ముక్కలయింది. రాతంతా అల్లుక పోయింది. అతని తృప్తికోసం అన్నట్టు అటూ ఇటూ తిరిగేసి చూసి ఇస్తూ 'ఇది ఉత్త కాయిదమే.. చేతిరాత నడువది..' అన్నడు.

నీరసంగా చూసిండు బొందయ. ఎంతో ఆశతో వచ్చినట్టున్నడు. కళ్లల్లో నీళ్లు తిరిగినయి. ఎమ్మార్వో కూడా బాధగా చూసి పోని అన్నట్టు డ్రైవర్‌కు సైగ చేసిండు.

కారు ముందుకు కదిలింది. ఏదో గుర్తొచ్చినట్టు వెంట పరుగెత్తి 'సార్ సార్.. మీరు సిరిసిల్లకే గదా.. నేను గీ ఎంకటపురం దాకత్త. ఇప్పుడు బస్సులేదు' అన్నడు బొందయ. నిజానికి అతనికి అక్కడ పనేం లేదు. పక్కన కూర్చొని తన ఎతను చెప్పుకొని కాళ్లు మొక్కయినా పట్టా రాయించుకుందామని అడిగిండు.

కారు మళ్లీ ఆగింది. 'అయ్యో.. నేను ఇట్ల తుర్కపల్లె మీదికెళ్లి పోత.. అటుపోను' గ్లాసు దించి ఓపికగా చెప్పిండు ఎమ్మార్వో.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు బొందయకు. ఏడుపొచ్చింది. 'అరే తాశిలి బొందిగా.. ఆనాడు అట్ల జెయ్యకుంటే రెండెకురాల భూమి నీకే ఉండు గదరా. ఇప్పుడక్కడ బంగారం పండవట్టె. ఎటూ గాకుండైతివి. థూ.. నీ బతుకు జెడ' ఊంచుతూ యాష్టగా తిట్టుకున్నడు.

ఏమనుకున్నడో ఎమ్మార్వో ఒక్కసారిగా కోపానికచ్చిండు. 'ఏయ్.. ఏం మాట్లాడుతున్నవ్.. ఆ.. నీకు కాయిదం లేకపోతె నేనేం జేత్త. నన్నెందుకు తిడుతున్నవు. అసలు తలుకాయుందా నీకు.. యూజ్‌లెస్ ఫెలో..' అన్నడు గదిరిస్తూ.

ఊలిక్కి పడ్డడు బొందయ.అతడెందుకు అంత కోపానికచ్చిండో తెలువలేదు. భయం భయంగా చూస్తూ 'అయ్యో.. నిన్నెందుకు తిడుత సారూ.. నా గాశారాన్ని నేనే తిట్టుకుంటున్న.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 17

ఎవలెవలకో పట్టాలు గావట్టె.. లాగోడి పైసలు రావట్టె. నాకే భూమి లేదాయె.. పైస రాదాయె' అన్నడు.

ఎమ్మార్వో అతడిని వింతగా చూసి 'నీ పేరు బొందయనా..' అడిగిండు ఆశ్చర్యంగా.

అవునన్నట్టు తలూపిండు బొందయ. అతన్ని మరోసారి పరిశీలనగా చూసి 'ఎక్కమన్నట్టు' డోర్ తెరిచిండు ఎమ్మార్వో. ముందుగా అనుమానపడ్డా ఎక్కి పక్కనే కూర్చున్నడు బొందయ. కారు ముందుకు కదిలింది.

దిగేలోపు ఎట్లన్న ఒప్పించాలనుకున్నడు. ఊరు దాటినంక మెల్లెగా కదిలిస్తూ 'ఒకలకు మంచి చేస్తే మనకు గూడా మంచే జరుగుతదంటరు.. మరి నాకేంది సారూ మంచి చేస్తే చెడ్డగ జరి గింది..' అన్నడు బొందయ కొంత బిడియంగా.

ఎమ్మార్వో అతడినే చూస్తుండు. 'మంచి అనేది విత్తనం లాంటిది. మనం ఏసి మరిసిపోతం. కాని అది మొలువడం మరిచిపోదు. ఎప్పుడో ఎనుకనో ముందో మొలువనే మొలుత్తది.. ఇంతకూ నువ్వు ఏం మంచి పని చేసినవు..' అడిగిండు.

కొంత బిడియం పోయింది. తేలికగా నవ్వుతూ 'ఇప్పుడా అప్పుడా.. నా చిన్నప్పటి ముచ్చట. ఈ ఊర్లెనే దొర సవారు కచ్చురం నడుపుతుంటి. ఒకసారి జీపుల ఇద్దరం చిప్పలపెల్లి జంగల్‌కు షికారికి పోయినం. అప్పుడది పెద్ద అడివాయె. పెద్దపులి దాడి చేసింది. నేను పాణాలకు తెగిచ్చి దొరను కాపాడిన. అప్పటికప్పుడే రాసిచ్చిండు ఈ కాయిదం' చెప్పిండు జేబులున్న కవరును చూపిస్తూ.

'అయితే అప్పుడే పట్టా చేసుకోవద్దా మరి.. పట్వారితోని రాపిత్తె అయిపోతుండె' అన్నడు.

'అప్పుడే రాపిత్తనన్నడు సార్. తెల్లారితె పని అయిపోతుండె. అగో.. అదే రాత్రి దరిద్రం నా నెత్తిమీద కూసున్నది. నేను మంచి పనే చేసిన్ననుకున్న. కాని దొరకు కోపమచ్చింది. 'భూమి కాదుగదా నేను కనవడితె నరుకుతా అన్నడు' చెప్పిండు బొందయ బాధగా.

ఎమ్మార్వోకు ఏదో గుర్తొచ్చింది. ఆసక్తిగా చూస్తూ 'అంత చెడ్డ పనేం జేసినవ్ మరి.. మత్రవ డ్డవా..' అడిగిండు.

వింటడో లేదో అనుకున్న బొందయకు ఎమ్మార్వో మాటలతో ఉషారు వచ్చింది. 'చెప్పిన గద సారూ.. శనేశరం నెత్తిమీద కూసుందని. అప్పుడు జర అన్నల భయముండె. దొర సిరిసిల్లకు మారిండు. కారు కొన్నడు. నేను కారు డ్రైవర్‌ను అయిన. గీత దాటనంత దాకనే గదా దొర ప్రేమ. దాటినమనుకో.. అగ్గిల చెయ్యి వెట్టినట్టు ముప్పే' అంటూ చెప్పడం మొదలువెట్టిండు.

కారు వేగంగా పోతున్నది. డ్రైవర్‌కు నెమ్మదిగా వెళ్లమని చెప్పి అతడు చెప్పింది వింటుండు ఎమ్మార్వో.

* * *

'అరె బొందా..' పిలిచిండు దొర. లోపలినుంచి పరుగెత్తుకొచ్చిండు బొందయ.

'వీర్నపెల్లి పోవాలెరా' అన్నడు దొర.

అప్పుడప్పుడే పొద్దు గూకుతుంది. వరుసగా వారంనుంచి వానలు. వాగులు ఒర్రెలు పొంగి పారుతున్నయి. రోడ్డు కూడా బాగలేదు. ఈ రాత్రిపూట వీర్నపెల్లి పోవుడంటే చాలా కష్టం. అయినా ఎందుకని అడుగలేదు. 'సరే' అన్నడు బొందయ.

'దొర్సానులిద్దరత్తరు. ఇట్ల వోయి అట్ల రా.. అసలే రోజులు మంచిగ లెవ్వు. రాత్రి ముచ్చట. ఔగనీ, రేపు ఒక్కముచ్చట యాది జెయ్యిరా. బండలింగంపల్లి పోతన్న. పట్వారికి చెప్పి నీకు ఇత్తనన్న భూమి నీ పేరుమీద రాయిస్త' అన్నడు.

'సరే' అంటూ బొందయ్య పైకి చూసిండు. పొద్దు తల్లి కడుపుల పడ్డది. బట్ట అందుకుని కారు దగ్గరికి వచ్చిండు. అక్కడే పనిమనిషి బాలయ ఉన్నడు. 'అరే బాలీ.. నువ్వు గూడ వోరా.. సోపతోలుంటది. నువ్వుంటే జెల్దినత్తరు. వీడసలే జాం మనిషి' అన్నడు దొర.

బాలయకు ఎప్పటినుంచో కారు ఎక్కాలని కోరిక. బొందయను ఎన్నోసార్లు అడిగిండు కనీ వాడు సందు ఇయ్యలేదు.

'ఆ.. పోత దొరా..' సంబురంగా అంటూ తనూ ఓ బట్టను అందుకుని కారును తుడుచుడు మొదలు వెట్టిండు.

ఐదు నిమిషాల్లో అత్తా కోడలు ఇద్దరూ వచ్చి కారు ఎక్కి కూసున్నరు. అందరికి అన్ని జాగ్రత్తలు చెప్పిండు దొర. మరోసారి 'బాలీ.. అరేయ్.. వాళ్లు ఆడోళ్లు.. జాము జేత్తరు. మీరే తొందర పెట్టాలె. పోను గంట రాను గంట. అక్కడో రెండు గంటలు అంతే. పదిటి వరకు మీరు ఇక్కడ లేరనుకో.. నీ బొక్కబొక్కకు నీళ్లు వోత్త..' బెదిరించిండు.

బాలయకు పెత్తనమిచ్చినట్టయింది. 'అట్లనే దొరా అద్దగంట ముందే ఉంటం సూడూ' అంటూ ఎక్కి బొందయ పక్కన కూసున్నడు. ఎలిసిందనుకున్న వానముసురు మళ్లీ మొదలయింది. కారు ముందుకు సాగింది. పోతుంటే పోతుంటె వాన పెరిగిందిగనీ తగ్గలేదు. వెంకటాపురం దాటి పదిర చేరుకోనేసరికి మరింత జోరందుకుంది. పదిర వాగును చూసినంక బొందయ గుండె దడీలు మంది. అప్పటికి చీకటి పడింది.

'దొర్సానీ.. మనమైతే కొనముట్టం సూడు.. నడుమల నుంచి తిరిగి వచ్చుడే. వాగుజూడు ఎంత వారుతుందో. అక్క పెల్లి వాగు మనను అస్సలు దాటనియ్యది సూడు..' అన్నడు.

వెంటనే బాలయ అందుకుని 'పిచ్చోడా.. తొవ్వ తెలుసుకోందే తోలినాడురా దొర.. అక్క పెల్లి వాగు దాటనియ్యకపోతే గొల్లపెల్లి మీదినుంచి పోదాం..' అన్నడు.

ఈ మాటలు విన్నది పెద్ద దొర్సాని. వెనుకనుంచి గదరాయస్తూ 'అరేయ్.. అక్కపెల్లి గొల్లపెల్లని ఇటే తిరుక్కుంట ఉంటవా.. సక్కగ రాజన్నపేట మీదికెల్లి పోని.. వాగుండది వరుదుండది. ఎల్లమ్మకాడికి తేలవోతం' చెప్పింది.

'ఆ.. ఔనవును.. నేను గట్లనే అనుకుంటున్న దొర్సానీ..' అన్నడు బొందయ.

'ఆ.. నీ బొంద.. అట్లనుకున్నోనివి ఇట్లెందుకు చెప్పినవు. దొర్సాని చెప్పకపోతె ఆగం జేత్తువు..' దెప్పిపొడిచిండు బాలయ.

'నీ.. నేనెన్ని సార్లు పోలేదు కాకా.. చిన్న దొర్సానిని తీసుకుని.. ఇంక అడుగు' అన్నడు బొందయ.

ఎక్కిరిత్తున్నట్టు నవ్వి 'అరేయ్.. నువ్వు చిన్న దొర్సాని పెండ్లి నుంచి వత్తున్నవు.. నేను పుట్టుక నుంచే వత్తున్న తెలుసునారా.. ఈ తొవ్వల ఒంటెద్దు కచ్చురం కొట్టింది నేనే.. దొర ఎవలను నమ్మకపోతుండె. బాలుగాడే పోవాలని నన్నే తోలుతుండె. అప్పుడు నింగంపెల్లిలనే ఉంటిమి.. కాదా దొర్సానీ..' వెనక్కి తిరిగి అన్నడు బాలయ.

అసలే పెద్దదొర్సాని కోపం మీదుంది. మేనరికమని పట్టువట్టి తమ్ముని బిడ్డను చేసుకుంది. చేసుకున్నంక మరదలితో మాట వచ్చింది. రాకడ పోకడ బందయింది. అన్నదమ్ములకు కుడుక చెక్కర్లు పొయ్యాలని పుకారు పుట్టింది. పట్నం ఎవలు పోతరులే అనుకుంది. కాని ఏదో పని మీద తమ్ముడే ఊరికి వచ్చిండు.పాసిపోతమా ఓ పనైపోతదిలే అనుకుని ముండ్లమీద పోయి నట్టు పోతుంది.

'అరేయ్.. పిచ్చి పిచ్చిగుందారా.. బాతకాండ్లు గొడుతరా బండి నడుపుతరురా..' విసుక్కుంది దొర్సాని.

ఇద్దరు భయం భయంగా మొహాలు చూసుకున్నరు. నోర్లకు తాళం పడ్డది. కారు గొల్లపెల్లి దాటి రాజన్నపేట తొవ్వ పట్టింది. సిరిసిల్ల నుంచి ఇక్కటిదాక వచ్చింది ఒకెత్తు. ఇక్కడినుంచి వీర్నపెల్లికి పోవుడు ఒకెత్తు. పైన వాన. కింద బురద. పైగా చీకటి.

వాన కొద్దిగ తెరిపినిచ్చినా ఎప్పుడో ముంత పొగలు పోసేతట్టుగా మొగులు నిండుకుంది. గుంతల రోడ్డులో పడవ ఊగుతున్నట్టుగా ఊగుతంది కారు. వట్టిగ తిడితినని ఏమనుకుందో దొర్సాని 'బాలుగా.. బిడ్డలగ్గం ఎప్పుడు జేత్తవురా... యాడన్న కుదిరిందా..' అడిగింది.

అదే పదివేలన్నట్టు 'యాడ బాంచెన్.. మీకు తెలువకుంటనే కుదురుతదా.. పెద్దపొల్ల లగ్గమప్పుడు మీరు పూనుకుంటెనే అయింది. దీనికి గూడ అట్లనే జెరంత సాయం జేత్తిరా గడ్డకు వడుత..' అన్నడు.

'నువ్వు కాయం జేసుకోరా.. కట్నం కర్సు నీది కాయగూర కర్సు నాది... మరి గీ బొందడెప్పుడు చేసుకుంటడట.. వో పోడా.. జెట్టన జేసుకోరా.. మీ అవ్వకింత ఆసరుంటది..ఒక్కతి సావు జత్తుంది' అన్నది గదరాయిస్తూ.

బొందయ సిగ్గు పడ్డడు. బాలయ అందుకుని 'వీని పోకడ చూసింద్రా దొర్సానీ.. సదువుకున్న పొల్ల గావన్నట.. యాడ దొరుకుతది..' ఎక్కిరిస్తూ అన్నడు.

చిన్న దొర్సాని కిసుక్కున నవ్వింది. బొందయకు కోపమచ్చింది. 'గట్ల నేను నీతో జెప్పిన్నా కాకా..' అన్నడు బాలయతో.

'ఓ దిక్కు మీ అయ్య పాటనే పాడవట్టే.. నా కొడుకు సదివిండు కోడలుగూడా సదువాలని..' అన్నడు బాలయ.

చీకటి నిండుగా ముసురుకుంది. వాన ముసురు మళ్లీ మొదలయింది. అటో ఇటో రాజన్న

పేట దాటింది కారు. అక్కడినుంచి తొవ్వ మరింత బురదగా ఉంది. ఊరు దాటగానే అడవి మొద లయింది. పెద్ద పెద్ద గుట్టలు. గుట్టలమీదచెట్లు. దారికడ్డంగా పరిగెత్తుతున్న నెమళ్లు. అక్కడక్కడా కారు లైటుకు ఆగుతున్న కుందేళ్లు. మందలు మందలుగా పోతున్న అడవి పందులు.

ఆగి ఉన్న ఓ కుందేలును చూసి కారును ఆపి ఉషారుగా 'పడుదామా కాకా..' అన్నడు బొందయ.

'ఓ పోడా.. పైత్యమారా.. పోనీ. చీకట్ల వచ్చుడే ఇదంటే జంగల్ల ఆగుతవా ఇంక..' గద్దిం చింది దొర్సాని.

రోడునిండా బొందలు, కయ్యలు, ఒర్రెలు. వీర్నపెల్లికి చేరుకునేసరికి గంట అనుకున్న ప్రయాణం గంటన్నర దాటింది.

కారు దిగగానే బాలయ 'దొర్సాని జర జెట్టన గానియ్యిండ్రి... లేటయితే దొర కోపానికత్తడు..' అన్నడు.

'ఆ.. నేను సుట్టీర్కానికచ్చిన్నారా.. మీకంటె ఎక్కో నాకే ఉంది పోవాలని. ముందు మీరు తినుపోండ్రి. అద్దగంటల పోదాం..' అంటూ వాళ్లకు అన్నం పెట్టమని ఎవరికో చెప్పి కోడలుతో లోపలికి పోయింది దొర్సాని.

'బొందిగా తింటావురా.. నువ్వు మా తింటవు.. వల్లనంటవా.. నాకయితె వద్దు' నవ్వుతూ అన్నడు బాలయ.

'ఏ...గిప్పుడేం తింటం. రాంగనే తింటిమి గనీ ఊరు చూసొద్దాం పా.. బాగ రోజులయింది రాక..' అన్నడు బొందయ.

'గీ చీకట్లేం జూత్తవురా.. అయినా ఊర్లేముంది.. ఇదేమన్న పట్నమా..' అడిగిండు బాలయ.

'అన్నలుంటరటగదా.. ఎట్లుంటరో సూద్దాం..' అన్నడు బొందయ.

'అ.. నువ్వచ్చినవని ఎదురుంగత్తారురా.. వాళ్లు మనలెక్క మనుసులే..ఏ గుట్టలల్లనో చెట్ల ల్లనో ఉంటరు. అయినా మన దొరలు మంచోళ్లురా.. వీల్లని అన్నలేమనరు..' అన్నడు.

'నువ్వత్తవా రావా.. అది జెప్పు ముందు. జెట్టన తిరిగద్దాం' కారెక్కుతూ అన్నడు.

'అరేయ్.. కారును తుడుసుడే గనీ ఎన్నడెక్కింది లేదు.. నిన్ను బతిలాడితే చింతకొమ్మల్ల కూసుంటివి. లేకలేక ఇయ్యల్ల దొరికె. ఎందుకురాను.. మరి జెల్దిన రావాలె పా..' అంటూ ఎక్కి కూసున్నడు బాలయ.

ముసురు ముసురుగా ఉంది. చల్లగాలి జివ్వుమంటుంది. వీధిలైట్లు వెలుగుతున్నయి. అప్పు డప్పుడు గొంగడి కప్పుకునో చెత్తిరి పట్టుకునో ఒకరిద్దరు తప్ప జన సంచారం లేదు. గతుకుల గతుకుల మట్టిరోడ్డు. ఒక్కోచోట పయ్యలు మునిగేంత బురద. సెకండ్ గేర్‌లో తప్ప కారు నడ వడం లేదు. మూల మలుపుల దగ్గర ఇరుకుగా ఉండి తిరగడం కష్టంగా ఉంది. రావడమైతే వచ్చిండు గానీ ఎందుకు వచ్చినరా అనుకుంటున్నడు బొందయ. బాలయ మాత్రం సంతోషంగా చుట్టూ చూస్తున్నడు.

అటో ఇటో కారు ఊరు దాటింది. 'ఇంతేరా ఊరు. ఎనుకకు తింపుకో, వచ్చిన తొవ్వనే పోదాం..' చెప్పిండు బాలయ.

'ఈ సందిలకెళ్లి పోతదిగదా..' అడిగిండు బొందయ.

'ఆ.. పోతదిగనీ...అటన్ని మాదిగిండ్లున్నయి..'

'అయితేంది ఊరు గాదా.. పోదాం..' అంటూ ఆటువైపు కారును మలిపిండు బొందయ.

అక్కడ వీధిలైట్లు కూడా లెవ్వు. అంతా చీకటిగా ఉంది. కారు చప్పుడువిని కొందరు లైటు వెలుతురును చూసి కొందరు బయటకు వచ్చి వింతగా చూస్తున్నరు. నాలుగిండ్లు దాటాక ఒకింటిముందు నలుగురైదుగురు మనుషులు నిలబడి ఉన్నరు.

'అగో.. కాకా.. ఆన్నలే అంటవా..' ఆసక్తిగా అడిగిండు బొందయ. బాలయకు కొద్దిగా భయమయింది. కంగారుగా పక్కకు చూసి గొంతు తగ్గించి 'అన్నలు లేరు తమ్ములు లేరు.. నడుపురా.. దొర్సాని కోపానికత్తది..' అన్నడు.

'ఏ.. నీ కథ.. ఇప్పడిదిప్పుడే పనయిపోతదా.. గట్లనే అంటరుగనీ గంట రెండు గంటలయితది సూడూ. రాకరాక వచ్చింర్రని ఇడువకుంట ముచ్చట వెడుతరు.' అంటూ కారును స్లో చేసి బయటకు చూసిండు బొందయ..

ఒక్కసారిగా పెద్దగా ఏడుపు వినిపించింది. 'యాడవోదునే బిడ్డా నేనేమిజేద్దునే బిడ్డా.. ఎంత పనాయెనే.. బిడ్డా..' ఎవరో ఆడమనిషి. ఇంకెవరో మూలుగుతూ అరుస్తున్నరు. బయట నిలబడ్డవారు వానకు నిలువునా తడిసి ఆగమాగమున్నరు.

'ఏంది కాక ఏమయింది.. ఎవలో ఏడుత్తున్నట్టున్నరు' కారును ఆపి అడిగిండు బొందయ.

'నాకేం తెలుసురా.. ముందు నువ్వు నడుపు.. పోదాం..' గదమాయించిండు బాలయ.

బొందయకు కోపమచ్చింది. 'ఏ.. ఆగు.. పోత పొత.. మా పోదువు తియ్యి.. అక్కడెవలో సావు కేక వెడితే నువ్వు పోతపోత నంటవు' అంటూ కారు దిగిండు. బాలయ మాత్రం గొనుక్కుంటూ అందులోనే కూర్చున్నడు.

పక్కనే ఆగిన కారును, దిగిన బొందయను భయం భయంగా చూస్తూ మాటలు ఆపేసారు నిలబడ్డవారు. చీకట్లో వారి మొఖాలు కనిపించడం లేదు కాని భయపడుతున్నట్టు మాత్రం తెలిసిపోతున్నది. అరుపులు ఏడుపులు మాత్రం ఇంట్లోంచి అలాగే వినిపిస్తున్నయి.

వారి భయాన్ని గమనించి ముందుకు నడిచి సూరుకింద నిలబడుతూ 'సావిత్రవ దొర్సానితోని వచ్చినం. మాది సిరిసిల్లనే. ఏమయింది ఏడుత్తున్నరు..' అడిగిండు బాలయ.

అప్పుడే ఎవరో స్త్రీ బయటకు వచ్చింది. అక్కడ నిలబడ్డవారు ఆమె చుట్టూ చేరారు. 'ఇగ నాతోని గాదు..పిండెం ఎదురు తిరిగింది... దవాఖాన్లకు పోతెనే బతుకుతది... ఇన్ని జేసినగని ఇంత కష్టపు కానుపు ఎవలకు సూడలేదు..' అన్నది.

'ఈ రాత్రి పూట వానల ఎటువోవత్తది. దవఖాన అంటే ఎల్లరెడ్డి పేట పోవాలె. ఇక్కడనా అక్కడనా.. బండిగట్టుకుని పొవాలంటె తెల్లారుతది..' ఎవలో అన్నరు. ఇంకెవలో 'దేవుని దయ.

బండి తేంఁడ్రి' అంటున్నరు. అప్పుడే వాన ఎక్కువయింది.

లోపలికి వెళ్లి చూసిండు బొందయ. ఎక్కడో గుడ్డి దీపం వెలుగుతున్నది. నొప్పులు పడుతున్న యువతి అరుస్తూ కొట్టుకుంటున్నది. చుట్టూ ఉన్న అడవాళ్లు ఏడుస్తున్నరు. తల్లి మాత్రం 'ఓ బిడ్డో ఓ బిడ్డో' ఆని బొచ్చెంతా చరుచుకుంటుంది. బొందయకు కళ్ల నీళ్లు తిరిగినయి. మనసు వికలమై పోయింది. బయట ఎవరో ఎడ్లను తెస్తున్నరు. అదే వానలో ఎవరో బండిని సదురుతున్నరు. ఎవరో కొయ్యల చుట్టూ దోతిని చుడుతున్నరు.

అరుపులు వినలేక బయటకు వచ్చిండు బొందయ. 'ఈ వానల.. చీకట్ల బండిమీద ఎట్ల పోతరు... పోయేదాక ఆమె బతుకుతదా..' అడిగిండు. ఎవరూ సమాధానం చెప్పలేదు. అసలు విన్నట్టుకూడా లేదు. ఎవరి పనిమీద వారున్నరు.

ఏం చెయ్యాలో తోచలేదు బొందయకు. వెంటనే లోపలికి వెళ్లి 'ఆమెను కారెక్కించుండ్రి.. నేను తీసుకపోత...' అన్నడు. అందరూ భయం భయంగా చూసారు. మరోసారి అదేమాట గట్టిగా చెప్పి కారువద్దకు పరుగెత్తుకొచ్చిండు.

'అరేయ్.. ఇంతసేపు ఏం జేసినవు.. నడువురా... పోదాం..' బాలయ అన్నడు కోపంగా బయటకు చూస్తూ.

'కాకా.. ఎవరో ఆడిమనిషి ఆపది వడుతుంది...నేను జెట్టన ఎల్లరెడ్డిపేట దవాఖానల దించి వత్త.. ఏమంతసేపు అద్దగంట.. నువ్వు నాతోనేరా..' పక్కగా వచ్చి అన్నడు బొందయ.

పిచ్చోడిని చూసినట్టుగా చూసిండు బాలయ. 'ఔలగానివారా.. దొర సంగతి నీకు తెలువది. సంపనే సంపుతడు.. నోరు మూసుకుని నడువు.. వాళ్లు ఎవలనుకున్నవు..' బెదిరించిండు.

బొందయ బతిమాలుతున్నట్టుగా గదువ పట్టుకుని 'ఎవలయితేంది కాకా మనుషులే కదా.. ఆపద ఎవలకయినా ఒక్కటే గదా.. దవాఖానకు పోకుంటే రెండు పాణాలు పోతయి..' అన్నడు.

'పోతేపోని.. ఎవని పిండము.. ఎవని గండమురా.. నీకు బతుక బుద్దయితందా లేదా.. నడువూ..' అన్నడు.

అప్పటికి పూర్తిగా నానిండు బొందయ. నెత్తిలోంచి నీళ్లు దారలు గట్టినయి. 'కాకా.. మనమే అయితే ఇంటిముందు ఆగిన కారును జూసి జర వత్తరా అని అడుగుదుము. పాపం... ఇంత ఆపదలకూడా వాళ్ల పని వాళ్లు చేసుకుంటున్నరు గనీ అడుగుతున్నారా.. అమాయకులు. వాళ్ల తరపున మనమే ఆలోచించాలె..' నచ్చజెప్పుతున్నట్టుగా మళ్లీ గదువ పట్టుకున్నడు.

అతని చేతిని విసిరి కొడుతూ 'ఒరేయ్.. దొర్సానికి లేటయితదిరా పిచ్చోడా.. దొర చెప్పింది విన్నవు గదా..' అన్నడు.

వినిపించుకోలేదు బొందయ. 'గంట అరగంట లేటయితే ఏమయితది కాకా.. పాణాలేం పోవుగదా.. ఇక్కడ పాణాలే పోతున్నయి.. మన అక్కనో చెల్లెనో అయితే ఇట్లనే ఊకుందుమా..' అంటూ వెనక డోరు తెరిచిండు.

అతని నిర్ణయం ఏమిటో తెలిసిపోయింది బాలయకు. అరుస్తున్నట్టుగా 'నీకు మర్యాదగ

చెప్పితే ఇనరాదురా.. తంతనే సక్కగైతవు.. బాడుకావ్.. వత్తవా లేదురా' అంటూ కారు దిగి చెయ్యెత్తిండు.

బొందయకు సహనం నశించింది. బతిమాలితే వినడని తెలిసిపోయింది. ఎత్తిన చేతిని అలాగే అందుకుని వడి తిప్పుతూ 'అరేయ్.. బాలుగా.. ఎంతసేపూ, దొరా దొర్సాని అని తప్ప మని షిలా ఆలోచించవారా.. ఓ గంటలో వత్తనన్నగదా.. జెరంత లేటయితే ఎవలకేం నొత్తందిరా. అక్కడ పాణాలు పోయినా లెక్కలేదారా.. నాతోని వత్తవా.. పీకుతవా..' అన్నడు అరుస్తున్న ట్టుగా.

ఆ అరుపునకు ఒక్కసారి గజ్జుమన్నడు బాలయ. కన్నెర్రజేసి చూస్తూ 'దొర్సానిని గంత మాటంటావురా.. ఎంత కావురంరా నీకు..అగు నీ సంగతి చెప్పుత. నువ్వు ఎట్ల పోగువోత్తవో సూత్త' అనుకుంటూ వానలోనే నడుచుకుంటూ వెళ్లిపోయిండు.

ఇద్దరు మగ మనుశులు ఆడమనిషిని ఎత్తుకచ్చి కారులో కూర్చోబెట్టారు. ఆమెతోపాటు తల్లికూడా ఎక్కి కూర్చుంది. నొప్పులు ఎక్కువయినట్టున్నయి. ఇంకా ఎక్కువగా అరుస్తున్నది. కారును చూడగానే తల్లికి ధైర్యం వచ్చినట్టుంది. ఏడుపును ఆపి కూతురుకు ధైర్యం చెబుతుంది. ఎక్కుదుమా వద్దా అని బిడియపడుతున్నట్టున్నరు మిగతావారు. వానలో తడుస్తూ బయటనే నిలబడ్డరు. వారిని ఎక్కమని కారును ముందుకు నడిపిండు బొందయ. ఊరు దాటేదాక బాలయ ఎవరినైనా తెచ్చి అడ్డుకుంటాడేమోనని భయమయింది. ఊరు దాటినంక కారు వేగాన్ని అందుకుంది.

ఆమె అరుపులతోపాటు వర్షం కూడా ఎక్కువయింది. గతుకుల దగ్గర ఎంత జాగ్రత్తగా నడి పినా కారు ఎగిరెగిరి పడుతుంది. అరుపులు వింటుంటే కారులోనే చనిపోతుందా అని భయం పట్టుకుంది బొందయకు. వచ్చినప్పుడున్నంత సులువుగా లేదు ప్రయాణం. ఎల్లారెడ్డిపేటకు చేరు కునేసరికి అరగంట అన్నది గంట పట్టింది. కాని, హాస్పిటల్‌లో డాక్టర్ లేదు.

అందరికీ గుండెలో రాయి పడ్డట్టయింది. బొందయకు పాణం జల్లుమంది. ఇక్కడ దించి వెంటనే వెళ్దామనుకున్నడు. అప్పటికే రక్తంతో సీటంతా తడిసింది. అరిచి అరిచి ఆమే నీరసిం చింది. ఆలోచించేంత సమయంకూడా లేదు. ఏదయితే అదయిందని సిరిసిల్లకు తీసుకపో యాడు. దారిలో విరిగిపడ్డ చెట్లు తెగిపోయిన రోడ్లు దాటుకుని సివిల్ హాస్పిటల్ చేరుకునేసరికి మరోగంట పట్టింది.

డాక్టర్లు అందుబాటులోనే ఉన్నరు. వెంటనే లోపలికి తీసుకెళ్లారు. అందరూ లోపలికి వెళ్లారు. బొందయ మాత్రం భయంగా అలసటగా అక్కడనే కూర్చున్నడు. దొర దొర్సాని ఎవరూ గుర్తుకు రావడం లేదు. కానుపు కాక తల్లడిల్లిన ఆమె.. బిడ్డకోసం గుండెలు బాదుకున్న తల్లి వీరే కనిపి స్తున్నరు. ఏమయితుందా అని ఆందోళనగా ఎదురు చూస్తున్నడు. పావు గంటలో చంటిపిల్ల ఏడుపు వినిపించింది. అరిచి అరిచి ఆగిపోయిన ఆమె అరుపులాగే ఆకాశం కూడా శాంతించింది.

'మొగ పిల్లగాడు.. మొగ పిల్లగాడు' ఎవరో మురిపెంగా అంటున్నరు.

ఆ మాట వినంగనే బొందయకు అలసటంతా పోయింది. ఆనందంగా లేచి నిలబడ్డడు.

అప్పుడు గుర్తొచ్చింద్రు దొర దొరసాని, బాలయ.. వచ్చిన పని. ముందుకు నడువబోతూ పిలుపు వినిపించి ఆగి వెనక్కి తిరిగిండు బొందయ. ఆమె తల్లి చంటిగుడ్డును ఎత్తుకుని పరిగెత్తుకుంటూ వచ్చింది. బొందయ కాళ్లమీద వేసి కళ్లనీళ్లు తీసుకుంటూ 'దేవుని లెక్క వచ్చినవు బిడ్డా' అన్నది. పిల్లవాడిని దీవిస్తున్నట్టు చిన్నగా తాకి ముందుకు నడిచిండు బొందయ.

వెళ్తుంటే 'కొడుకా.. నీ పేరేంది..' అడిగింది తల్లి.

'బొందయ.. చచ్చేటోన్ని బతికిన్నట. అందుకే ఆ పేరు పెట్టుకున్నరు' అంటూ కారు వద్దకు వచ్చిండు.

* * *

చెప్పడం ఆపి ఊపిరి పీల్చుకుని సీటు వెనక్కి వాలిండు బొందయ. అతని ముఖంలో ఏదో బరువు దిగిన భావన.


'తర్వాత ఏం జరిగింది. ఆ తల్లి పిల్లల్లో ఎవరైనా కలిసారా..' ఆసక్తిగా అడిగిండు ఎమ్మార్వో.

'కారును మొత్తం కడుక్కున్న. అదే రాత్రి వీర్నపెల్లికి పోయిన. ఎవలూ లేరు. తిరిగి సిరిసిల్లకు దొర ఇంటికి వచ్చిన. అప్పటికి బలబల తెల్లారుతున్నది. కాళ్లు చేతులు వణుకుతున్నయి. తప్పయిందని దొర కాళ్లు మొక్కుదామనుకున్న. బాలయ ఎంత ఎక్కిచ్చి చెప్పిండోగని వంట జేసే లచ్చక్క వాకిట్లనే కలిసి 'దొర్సానిని గంతమాటంటావురా ముం.. కొడుకా.. దొర నీకోసమే సూత్తండు. జరాగు నీలగ్గమైతది' అన్నది. నాకు ధైర్యం ఆసలేదు. కారు అక్కడ పెట్టి భీవండి బస్సెక్కిన. రెండేండ్ల దాక ఇంటిమొఖం సూడలేదు. ఆ తర్వాత నేనెప్పుడూ వీర్నపెల్లి పోలేదు. తల్లి పిల్లలు ఎవలూ నాకు కలువలేదు' చెప్పిండు.

ఎమ్మార్వో చిన్నగా నవ్విండు. అతని మొఖం నిండా పరవశం. ఏండ్లకేండ్లు తపస్సు జేసినంక కనిపించిన దేవున్ని చూసినట్టు బొందయను చూసిండు.

'మనం మంచి చేస్తే మంచే జరుగుతది బాపూ. అది నీకే జరుగాలని లేదు. జనాలకు జరిగితే చాలు. నాతో చాలమంది పేద ప్రజలకు మంచి జరుగుతుంది. అన్నట్టు ఆ తల్లి నీపేరెందుకు అడిగిందో తెలుసునా. నాకు పెట్టుకోవడానికే. నువ్వు ఆనాడు పాణంపోసి మంచి చేసిన ఆ పసిగుడ్డును నేనే.. నా పేరు బొందయ..' అంటూ బిగ్గరగా అలుముకున్నడు ఎమ్మార్వో.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 25




# హరామ్

హుమాయున్ సంఘీర్

**ద్వితీయ బహుమతి రూ. 25,000 పొందిన కథ**



హుమాయున్ సంఘీర్ ఊరు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం గోపాల్ పేట్. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉంటూ వెబ్ చానెల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి రాసే అభిరుచి ఉన్న సంఘీర్ సినిమాలకు పనిచేయాలని హైదరాబాద్ వచ్చాడు. కొన్ని సినిమాలకు రచనా సహకారం అందించడంతో పాటు కొన్ని సీరియళ్లు.. సినిమాలకు దర్శకత్వ శాఖలో పనిచేసిన అనుభవం ఉంది. వివిధ పత్రికలలో కలుపుకొని ఇప్పటివరకు ఆయన రాసిన 25 కథలు ప్రచురితం అయ్యాయి. వెబ్ చానెల్స్ హవాను గుర్తించిన సంఘీర్ షార్ట్ ఫిలిమ్స్.. వెబ్ సిరీస్‌ల్లో నటిస్తూ గుర్తింపు పొందాడు. ముఖ్యంగా మూలుగుబొక్క, ఏం బతుకురా నీది, తంగేడుపూలు వంటి లఘుచిత్రాలు ఆయనకు మంచి పేరు తీసుకొచ్చాయి. ఇటీవల విడుదలైన 'దొరసాని' సినిమాలో కామ్రేడ్ యాదగిరిగా వెండితెరపై కనిపించాడు.

**'అమ్మీ (అమ్మ) ప్రవర్తనల ఈమధ్య** బాగా మార్పు కన్పిస్తున్నది నాకు. కడుపునిండ తింటలేదు, నోటి నిండ మాట్లాడ్తలేదు, కంటినిండ నిద్రవోతలేదు. ఏమైంది అమ్మీకి? వయసు మీదవడ్డది గదా ఛాదస్తం అప్పుడే వచ్చేసిందా. ఊరునుంచి తోల్కచ్చి నెలరోజులు గూడ కాలేదు. అప్పుడే పెద్దకొడుకు, మన్మల మీద పానం గుంజుతున్నదా?' ఆఫీస్‌లో పని చేసుకుంటున్న నయీం ఆలోచనలు అమ్మ మీదకు మళ్ళాయి.

మనసులో ఏదీ పెట్టుకోకుండా ముఖం మీదే అన్నీ అనేసే అమ్మ ప్రవర్తనలో ఎందుకింత మార్పు?

ఈ ప్రశ్న పదేపదే నయీంను కర్రను బాడిశ చెక్కినట్టు చెక్కుతున్నాయి.

ఉండబెట్టలేక ఇంటికి ఫోన్ చేశాడు. షమీం ఫోన్ ఎత్తింది.

'అమ్మీ ఏం జేస్తున్నది?'

'పండుకొని నిద్రలనే మాట్లాడుతున్నది' షమీం సమాధానం వినగానే నయీంకి ఆఫీస్‌లో ఉండబుద్ధికాలేదింక.

వెంటనే బాస్ దగ్గర పర్మీషన్ తీసుకుని ఇంటికి బయలుదేరాడు.

ట్రాఫిక్ సిగ్నల్స్ దాటుతూ వెళ్తున్నా గానీ అతని ఆలోచనలన్నీ అమ్మీ చూట్టే

తిరుగుతున్నాయ్.

* * *

నాకు మూడేండ్లున్నప్పుడే నాన్న కాలంజేశిండు. పెద్ద పెండ్లాం, ఆమె పిల్లలు అప్పటికే పెద్దగైవున్నరు.

పప్పా సావుకు అమ్మనే కారణమని నిందమోపిస్రు.

ఇల్లు, పొలం, జాగ ఆకిర్కి పించిన్ పైసలు గూడా వాళ్ళ దిక్కే మల్పుకున్నరు.

ఇంకో పెద్ద ఘోరం ఏం జేశిస్రంటే చట్టం దృష్టిల అమ్మీ, మేము లేకుంట కేసు కొట్టిపిచ్చుకున్నరు. అప్పటిసంది మా పాలనే అమ్మీ ఆశయం అయింది.

పప్పా మాకు ఒక ఫోటోల గుర్తులెక్క, సదువుకునే జాగల, కొలువుజేశే జాగల పప్పా పేరు మాకు వాడికకు అచ్చిందంతే.

అయినా అమ్మీ తన గుండెల కొండసుంటి దుఖ్ఖమున్నా గుండెలనే దింపుకొన్నది. ఉన్న మా ముగ్గురికి పప్పా లేని లోటు తీర్చాలని అమ్మీ ఆరాటపడింది. పెద్దగా చదువుకోలేదు.

తన రెక్కలనే నమ్ముకున్నది.

వ్యవసాయం పనులన్నీ అమ్మీకి వచ్చు.

మాకోసం రోజూవారీ కూలీ అవతారం ఎత్తింది.

ఎవరు నాటెయ్యాలని, కల్సుడు, పొలంగొట్టుడు.. ఇట్ల ఏ పనైనా అమ్మీ పోయింది.

పొద్దుగాల్ల పది గంటలనుంచి పొద్దిమీకి ఆరు గంటలదాక అమ్మీ పచ్చని శివారు మీద మా భవిష్యత్తు పచ్చగా ఉండాలని కష్టవడ్డది.

'తుర్కోల్ల ఆడోళ్ళు ఎప్పుడు బుర్కలనే ఉంటరు. గనీ గా తుర్క బేగం శిన్నతనాన్నే ముండమోశింది.

గుడ్ల పొచ్చెలకెల్లి కోడిపిల్లలను తీశి పోదన జేస్కున్నట్టు సాదుకుంటున్నది.

'నాగలేని కైకిలి జేస్కుంట అసలీమె తుర్కామెనేనా అన్నట్టు పనిజేస్తది' అని ఊర్ల అందరు అంటరు. అమ్మీకి ఊర్లనే గాదు సుట్టుపక్కల ఊర్లల్ల గూడ మంచి పేరుంది.

అప్పట్ల పదిహేను రూపాల కైకిలి సీస కల్లు ఇచ్చేటోళ్ళు. అమ్మీకి అప్పటిసందే కల్లు తాగే అలవాటువడ్డది.

పొద్దంత చేశిన కష్టం, పప్పా సచ్చిపోయిండనే పచ్చిగాయాలను మాన్పే మందు కల్లే అయింది అమ్మీకి.

ఈ ముచ్చట తెల్సిన ఆడకట్టు తుర్క ఆడోళ్ళు అమ్మీ గురించి ఎగతాళిగా మాట్లాడేటోళ్ళు.

'ఏందమ్మ గా బేగం మొత్తం తెన్గు సోపతివట్టి అటే వోయేటట్టున్నది. ఒక నమాజు లేదు, ఒక రోజా లేదు. దినాం కల్లు గూడ తాగుతదట. అల్లాహ్ మాఫ్ కరే'

'థూ.. ఇసుంటోళ్ళు పక్కా దోజఖ్ (నరకం)కే వోతరు' అని ఎంతమంది ఎన్ని మాటలతోని గుండెను పొడ్శినా ఎవరి మాటలు పట్టిచ్చుకునేది గాదు అమ్మీ.

ఇట్ల సుట్టుపక్కల ఊర్లల్ల అమ్మీలలాంటోళ్ళు శానామంది ఉన్నరు. మొగోడు సచ్చో, సరైన సదువు లేకనో, తరాలుగా వస్తున్న వ్యవసాయానికి అలవాటు పడ్డ్రు. ఎండకు, వానకు, సలికి రెక్కల కష్టం జేస్కునేటోళ్ళకు కల్లే అమృతం. పక్కా ముస్లిం అనుకునేటోళ్ళకు వీళ్ళంతా పక్కా దుష్మన్ లు.

వాళ్ళు నమాజులు చేసి, రోజాలు ఉండి, ఫిత్రేలు, జకాత్‌లు ఇచ్చి ఇస్లాంను గౌరవిస్తున్నట్టు, వీళ్ళు కష్టంజెయ్యంది కడుపులకు రాదనుకునే బడుగుజీవులు వాళ్ళ దృష్టిల ఇస్లాంకు వ్యతిరేకులు??

ఎవరెన్ని అన్నా తన పని తనది అంతే. సాంప్రదాయవాదుల ఎదుట అమ్మీ ఎప్పుడూ ఓ దోషిలా ముఖానికి కొంగు అడ్డం పెట్టుకొని బతుకు పోరాటం జేస్తున్నది.

కైకిలి లేన్నాడు అమ్మీ ఉత్తగుండేదిగాదు. చీపురుగొయ్యలు కోస్కచ్చుడో, సుట్టాకులు, మొర్రాకులు తెంపుకచ్చుడో, గట్టుకువోయి పొయిలకు కట్టెలు ఏర్కచ్చుడో.. ఇట్ల ఏదన్న ఒక పని ముంగటేస్కునేది. కనీ ఖాళీగైతే అస్సలుండేదిగాదు.

కన్నకష్టంజేశి మమ్ములను పెద్దోల్లను జేశింది.

మంచిగ సదివిచ్చింది. నేను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన. అన్న సొంత వ్యాపారం జేస్కుంటున్నడు. అక్క లగ్గం అయి కాపురం జేస్కుంటున్నది.

అంత మంచిగనే ఉందిగనీ కోడండ్ల విషయంల అమ్మీకి అవమానాలు తప్పలేదు.

కేవలం ఒక్క కల్లు తాగే మాటను ముంగటేస్తుంటరు.

'కోడండ్ల ముంగట నేను తాగన్రా. అది తాగుడు హరామ్ అంటున్నరు. మీ పిల్లలు జూశినా నేర్సుకుంటరు. సాటుమాటుకు తాగుతా. మున్పటోలె సీస కల్లు గూడ పోతలేదు. గిలాసెడు కల్లు తాగినా నా ఆత్మ తుర్తివడ్తది. అది తాగకవోతె నాకు నిద్రవట్టది' అని అమ్మీ ఇప్పుడు మాకు చిన్నపిల్ల లెక్కట అడుగుతుంటే.. చిన్నప్పుడు చారాణ కోసం అమ్మ శింగులు వట్టుకొని మేము గీమాడిన దినాలు యాదికచ్చినయి.

గుడ్లల్ల నీళ్ళు గిర్రున తిర్గినయి.

అన్నీ ఇచ్చిన అమ్మీ మమ్మల్ని కేవలం గా కల్లు మాత్రమే కోరుతున్నది. బంగారం బటువలు అస్సలు అడుగది. కల్లు తాగుడు తప్పు ఎట్లయితది?

హదీస్ చెప్పినట్టు షరాబ్ హరామ్. చెట్టునుంచి అచ్చే కల్లు హరామ్ ఎట్ల అయితదని నేను

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 30

ఇప్పుడిప్పుడే ప్రశ్నించుకుంటున్న.

కల్లుల గుల్ ఫారం కల్పితే అది పానానికి మంచిదిగాదు, సాంప్రదాయం లెక్కన జూస్కున్నా మంచిదిగాదు.

'వాళ్ళు వీళ్ళు, కోడండ్లు అన్నట్టు నేను కల్లు తాగుతే నర్కానికి పోతాన్ర కొడ్కా? నేనేం పాపం జెయ్యలే. మీకోసం జిందగీ మొత్తం కష్టానికి రైనువెట్టిన గదా' అని అమాయకంగా అంటుంటే నా గుండెలో గుణపంతో పొడిచినట్టయ్యేది.

'ఊకే ఏం అల్వాటు అమ్మీ కల్లు తాగుడు మానేస్తె గాదు?' అని నేను గూడ అన్నగనీ తర్వాత అర్థంజేసుకునుడు సురువుజేశిన.

నా పెండ్లాం పిల్లలను నడ్పుకున ఒక మొగోన్నె ఎంత కింద మీద వడ్తున్న.. మరి ఒక ఆడామై ఉండి అమ్మీ మా ముగ్గుర్ని ఎట్ల సాధింది? సదివిచ్చింది? పెండ్లీలు పేరంటాళ్ళు ఎట్ల జేశింది? ఒంటిగ యుద్ధమే జేశిన వీర వనిత అమ్మీ. పుట్టెడు కష్టాలు మరిచిపోనీకి గా గుక్కెడు కల్లు తాగుడు తప్పే కాదనిపిచ్చింది.

ఇగ ఆన్నుంచి నేను అమ్మీ కోసం మారిన.

కల్లు తాగే అల్వాటు లేదుగనీ అమ్మీకోసం దినాం ఆఫీస్ ఐపోంగనే బైక్ మీద మందు కల్పని తాజా చెట్టు కల్లు కోసం నానక్ రాంగూడ సైడ్ పోయి ఒక బాటిల్ తెచ్చిస్తే దినాం పొద్దిమీకి ఒక గిలాస కల్లు తాగుతది. తుర్తిగ పండుకుంటది.

నేనుండె టోలీచౌకీ ఏరియాల మంచి కల్లు దొర్కది.

ఎప్పుడన్న కల్లు దొర్కన్నాడో, ఆఫీస్‌ల లేట్ అయి కల్లు తేకపోతే ఆయాల్ల అమ్మీ ముఖం గుంజుకపొయ్యేది. అలిగేది.

* * *

గుంభనంగా ఇంటికి పోయిండు. ఇంట్లకు అడుగు పెట్టంగనే అమ్మీ దినాం మాదిరి తన బ్యాగ్ వంక ఆశగా చూసింది. తనూ అమ్మీని చూస్తూ తెచ్చానన్నట్టు కండ్లతోనే సైగజేసి లోపలికి పోయిండు. అమ్మీ అంతలోనే తన ముఖం మాడ్చుకునుడు నయీం చూపులు దాటిపోలేదు.

లోపటి రూంలకు పోయిండు. పిల్లలిద్దరూ ఆడుకుంటున్నరు. షమీం దురూద్ చదువుకుంటోంది.

పిల్లలు తనను చూడగానే అబ్బూ తనకోసం ఏం తెచ్చాడా అని అల్లరిచేస్తూ అల్లుకుపోయారు.

వాళ్ళను ఎత్తుకుని కాసేపు లాలించి బ్యాగ్‌లో నుంచి చాక్లెట్లు, బిస్కెట్లు వారి చేతిలో పెట్టాడు.

మళ్ళీ హాల్లోకి వచ్చి తన బ్యాగులో ఉన్న కల్లు ప్యాకెట్ తీసి, గ్లాసులో పోసి అమ్మీకి ఇచ్చాడు.

దాన్ని చూడగానే అమ్మీ ముఖంలో వెలుగు.. అంతలోనే ఆవిరవుతున్న ఛాయలు.

నయీం బాత్‌రూంకి వెళదామని టవల్ తీసి వెళ్తుండగా అమ్మీ ఆ గ్లాసు కల్లును సింక్‌లో గుమ్మరిస్తుండటం చూసి షాకయ్యాడు.

స్నానం చేసి వచ్చి అమ్మీతో తీరంగా మాట్లాడదామని వెళ్ళాడు.

కాసేపటికి స్నానం ముగించుకుని వచ్చాడు.

మిగిలివున్న కల్లు ప్యాకెట్టు డస్ట్‌బిన్‌లో ఉంది.

అదిచూసి నయీం స్థాణువులా బిగుసుకుపోయాడు.

కోపంగా 'షమీం' అని అరిచిండు.

షమీం వచ్చింది.

'ఏందిది?'

'నేనే పారేశిన'

'ఎందుకు?'

'హరామ్ (నిషిద్ధం) వస్తువులు తెస్తే ఇంట్ల బర్కతి ఉండదు. పైగా ఇది రంజాన్ నెల. నేను ఒక్కపొద్దులు ఉంటున్న. అందుకే పారేస్తున్నా' షమీం మాటలతో నయీంకి మొత్తం అర్థమైపోయింది. నెలరోజుల నుంచి అమ్మీకు కల్లు బ్యాన్ చేసింది షమీమే అని అర్థమైంది. ఈ విషయంలో కోడలు అత్తను భయపెట్టినట్టు ద్యోతకమైంది.

'ఊకో.. హరామ్ అంట హరామ్.. మనిషి కన్న ఎక్కనా?'

'అవును.. మన కోరికలను అదుపులో ఉంచుకోవాలి. నమాజ్ సదవాలి, దువా చెయ్యాలి' అమ్మీని, నయీంను హీనంగా చూస్తూ మాట్లాడుతోంది షమీం.

'హలాల్ (అనుమతించబడింది), హరామ్ అనుకుంట కూసుంటే ఈ ప్రపంచంల మనం ఏ పని చెయ్యలేం అర్థమైందా? మనిషిగా ఆలోచించు కట్టుబాట్లు అనుకుంట తల్లి చిన్న కోరికను తీర్చలేకపోవడం కన్నా పెద్ద హరామ్ పని వేరేది ఉండదు' కోపంగా మాట్లాడుతున్నాడు నయీం.

మధ్యలో అమ్మీ అందుకుంది.

'పోనియ్ బేటా.. నాకోసం మీరిద్దరు ఎందుకు గీసులాడుకుంటరు. నేను కల్లు తాగ ఇగ'

'నవ్వు ఊకో అమ్మీ.. వీళ్ళకి సాంప్రదాయాలు బాగా తలకెక్కి అవి పైత్యంగా మారినయి. అసుంటోళ్ళకు వేరే మనుషులు పశువుల లెక్క కానస్తరు. వాళ్ళకేదో అల్లాహ్ జన్నత్ (స్వర్గం) టికెట్ ఇచ్చేశినట్టే పోకట జూపిస్తుంటరు. ఎవర్కీ తెలవని అల్లాహ్ కోసం తెలిసిన మనుషులను సాధిస్తుంటరు ఇసుంటోళ్ళే. అయినా మీదికి వోయినంక ఎవరి జవాబ్ వాల్లే ఇచ్చుకుంటరు

గదా.. మరి ఈల్లకేంది నొప్పి?' ఆక్రోషంతో ఊగిపోతున్నాడు నయీం.

వెంటనే షమీం అందుకుంటూ..'శెప్పంగ ఇననోళ్ళను శెడంగ సూడాలంటరు' అంది.

'అట్లనా.. సరే ఒక సవాల్ అడుగుత జవాబియ్యి ఇగ? మీ నాయిన ఏం జేస్తడు?'

'చిట్టీల కారోబార్ జేస్తడు'

'ఎన్నేండ్ల సంది?'

'నేను పుట్టకముందు నుంచే'

'అయితే మీరు ఇంతవరకు తిన్నది, తాగింది, తొడిగిందంత హరామ్ సొమ్మే'

'అట్ల ఎట్ల అయితది?'

'ఎందుగ్గాదు.. ఆల్ల పైసల మీద ఈల్ల పైసల మీద మునాఫా(కమీషన్) కొట్టుడు హరామ్ గాకపోతే హలాలా? మిత్తి పైసలు తినుడు హరామ్ అని హదీస్ చెప్తున్నది గదా. నీ లగ్గం, మీ అన్నదమ్ములై, అక్కచెల్లెండ్లయి లగ్గాలు గా హరాం సొమ్ముతోనే చేశిండు'

'మీరంత ఉల్ట మాట్లాడుతున్నరు'

'మీరు జేస్తే రాజ పని మంది జేస్తే లత్కోర్ పని గదా? నీ ఇద్దరు అన్నలు రియల్ ఎస్టేట్ బిజినెస్ జేస్తున్నరు గదా అది గూడ హరామే. రూపాయి పెట్టబడి వెట్టి నూరు రూపాలు సంపాంచుతున్నరు గదా. ఇంకోటి చెప్పుడు మరిశిన మీకు తెల్వకుంట మీ అయ్య, అన్నలు మస్తు బీర్లు, బ్రాండీలు తాగుతరు' అంటున్న నయీం కళ్ళు ఎర్రబడ్డాయి.

'వాళ్ళు అవన్నీ చేశినా నమాజులు, జకాత్‌లు చేస్తరు. మీ అమ్మ ఏం జేస్తది?'

నయీం ఒక్కసారిగా నవ్వాడు. ఆడుకుంటున్న పిల్లలు తండ్రినే చూస్తున్నారు.

'లంగ పనులన్ని జేశి అల్లా నన్ను మన్నించని మజీద్‌కు పోంగనే సరిపోయిందా? ఆల్లకన్న ఏ పాపం జెయ్యకుండ నమాజ్ చెయ్యని మా అమ్మీ అసుంటోళ్ళే గొప్ప. అయినా అమ్మీ జుమ్మా నమాజ్ సదువుతది. ఇంకేమన్నవు.. మా అమ్మీ ఏంజేశిందా? తన బతుకును మాకోసం త్యాగం జేశింది. మీ చాచా ఉన్నడుగదా నడిగూడెపాయిన. ఆయినకు ఇద్దరు పిల్లలు అయినంక పెండ్లాం సచ్చిపోయింది. యాడాది తిర్గకముందే ఇంకొగామెను నికా జేస్కున్నడు. కనీ మా అమ్మీ గట్ల జెయ్యలేదు. మంచి వయసుల ఉన్నప్పుడే పప్పా కాలంజేస్తే అమ్మీ ఏరే షాదీ జేస్కోలె. అట్లనే ఉన్నది మాకోసం. నాకింకో డౌటేందంటే అమ్మీ ఇంకో లగ్గం జేస్కోకపోవడానికి కారణం తనకు జరంత తెలిసిన సాంప్రదాయమే గావచ్చు. సూశినవా సాంప్రదాయాలకు విలువిచ్చి ఎంతమంది ఎన్నిరకాలుగా నష్టపోతున్నరో? ఆ ముసుగుతోనే మూర్ఖులుగా మారుతున్నరు నీలెక్క' అంటున్న భర్త ముఖంలోకి ఉడికిపోతూ చూసింది షమీం.

'అవును మేము మూర్ఖులమే. మీరే మంచోళ్ళు గదా.. అత్తమ్మ బాధ్యతలు తీరిపోయినయి

ఆమెను హజ్‌కు తీస్కపొమ్మంటే పైసల్లేవంటున్నరు. ప్రతీ ముసల్మాన్ హజ్ చెయ్యాలని హదీస్ చెప్తున్నది'

'మనుషులకు సాయం జెయ్యుండ్రి, వాళ్ళకు సాయపడుండ్రని ఖురాన్ చెప్తున్నది. కనీ మీరంత ఇంటి ముంగట్కి బిచ్చపోడు వస్తే బిచ్చం ఎయ్యరు. ఎందుకంటే బిచ్చం ఏసుట్ల గూడ వాడు మన కులపోడా కాదా అని జూస్తున్నరు'

'మీ పెద్దమ్మ హజ్ చేసింది, మీ మర్మన్న అన్నలు గూడ ఉమ్రా చేశివచ్చిరు. చెహ్రా(గడ్డాలు) పెంచిరు. నమాజ్, జమాత్‌లు అనుకుంట దీన్‌ల ఎక్కవుంటరు తెల్సా'

'తెల్సు తెల్సు.. ఎందుకు తెల్వది. మా హక్కును గుంజుకున్నరు వాళ్ళు, చట్టం దృష్టిల మేము ఫలానోని పెండ్లాం పిల్లలమని కాకుండ జేశిరు. పప్పా సంపాదనతోని బిజినెస్‌లు, కొలువులు. అసుంటోళ్ళు ఎన్ని హజ్‌లు చేశినా పాపాత్ములే. చేశిన పాపాలు కడుకునే వాళ్ళు గవన్నీ జేస్తున్నరు. దీన్ పేరుతోని స్వర్గాన్ని కొట్టేయ్యాలని సూశే రకాలవి. అల్లాహ్ అనేవాడుంటే అన్యాయం అయిపోయిన మాకు స్వర్గమే ప్రాప్తిస్తడేమో. ఇంతవరకు మా పప్పా ఖబర్ (సమాధి) ఎక్కడుందో తెల్వది. మాకు తెల్వనియ్యరు. తెలుస్తే మల్ల పాలు పంచుకుంటమని వాళ్ళ భయం. మాకుండదా రంజాన్, బక్రీద్. పండుగులకు పోయి పప్పా ఖబర్ మీద ఇన్ని పూలు ఏశి రావాలని? అసుంటి మూర్ఖులు ఎన్నిజేశినా పుజూలె' అంటున్న భర్త ముఖంలోకి చూడకుండా విసురుగా లోపలి గదిలోకి వెళ్ళిపోయింది షమీం.

అమ్మీని చూస్తున్న నయీం కళ్ళు చెమ్మగిల్లాయి.

'అమ్మీ ఈ ఇల్లు నీది. నువ్వు ఎవరికి భయపడాల్సిన అవుసరం లేదు. గిలాసెడు కల్లు కోసం నువ్వు ఎవరి ముందు లాచార్ గావాల్సిన అవుసరం లేదు. నీ లెక్కట ఎండల ఎన్నలెక్కట మలమల మాడుకుంట కష్టపడితే నువ్వేందో వాళ్ళకు అర్థమయ్యేది. కడ్పుల సల్ల కదలకుంట ఇండ్లల్ల కూసుండి మస్తు మాట్లాడ్తరు ఇసుంటోళ్ళు. నువ్వు వాళ్ళ మాటలు పట్టిచ్చుకోకు' అంటూ గ్లాసులో కల్లు అందించాడు.

అమ్మీ సంశయిస్తూనే గ్లాసు అందుకుంది. కానీ, కల్లు అమ్మీ గొంతు దిగలేకపోతున్నది. గడిగడికి కోడలు గది దిక్కు రందివోయి చూస్తున్నది.

మనసులో ఏమనుకున్నదో లేచి ఆ కల్లును సింకులో గుమ్మరించి వచ్చి అటు మొఖం పెట్టుకొని ముదురుకొని పడుకున్నది.

అమ్మీని అంత నిస్సహాయంగా చూసి నయీం మనసు చివుక్కుమన్నది.

* * *

వారం గడిచింది. నయీం కల్లు ప్యాకెట్ తెచ్చుడు.. అమ్మీ సింకులో గుమ్మరించుడు అయితున్నది. అమ్మీ కల్లు తాగుతలేదని నయీంకు అర్థమైంది గనీ ఏం చెప్పలేకపోతున్నాడు.

మనసులో మాత్రం మెరమెర పెట్టుకున్నడు.

ఆరోజు ఏ ఫరిష్తా వచ్చి షమీం మనసును కడిగిండో.

నయీం ఆఫీస్ నుంచి రాగానే సంకకెల్లి బ్యాగ్ అందుకున్నది.

కల్లు ప్యాకెట్ తీసి గ్లాసులో పోసి అత్తకు ఇచ్చింది.

అది చూసి నయీం జరుగుతున్నది కలనో నిజమో తెల్సుకోలేకపోయాడు?

కండ్లు నులుముకొని చూశాడు.

అమ్మీ కూడా కోడలి చర్యకు బీరిపోయి చూస్తున్నది.

'అమ్మీ.. అమ్మీ.. ఇగో తీస్కో. ఇయాలటి సంది నువ్వు ఎవరికి భయపడాల్సిన అవుసరం లేదు, తాగు' అంటూ గ్లాసు అందించింది.

అమ్మీ కొడుకును చూసింది. నయీం కండ్లల్లో ఆనందబాష్పాలు చూసి గ్లాసు అందుకున్నది.

షమీం లోపలికి వెళ్ళింది. ఆమెను అనుసరిస్తూ నయీం గదిలోకి వెళ్ళాడు.

'షమీం నువ్వేనా?' అన్నాడు.

'అవును నేనే. నా మొగోడు, అత్త ఖుషీ కన్న నాకు ఏది ఎక్కగాదు. హలాల్ హరామ్ అనుకుంట ఎంతమంది రీతి తప్పిన బతుకులు బతుకుతున్నరో సమజైంది. చెప్పేటియి శ్రీరంగ నీతులు దూరేటియి దొమ్మరి గుడిశెలు. మంచి మనసున్నది అత్తమ్మ. ఎంతో కష్టపడి బంగారమసుంటి నిన్ను పెంచి పెద్దజేశి నాకు భర్త అనే కన్నా వరంగ ఇచ్చింది అనాలె. నన్ను ఏనాడు కోడలు లెక్క సూడలేదు. కన్నబిడ్డె లెక్కనే సూశింది. అసుంటి మంచి అమ్మీను నేను గా కల్లు విషయంల తక్కజేశి మాట్లాడుడే హరామ్ అనిపిచ్చింది' షమీం గొంతుల జీర.

'షుక్రియానే.. నన్ను అర్థం జేస్కున్నందుకు' షమీంను గాఢంగా అలుముకున్నడు నయీం.

'కనిపించని జన్నత్ కోసం బతుకులు దోజఖ్ (నరకం) జేస్కునుడు సుత ఇష్టం లేదు నాకు' అంటూ తన రెండు చేతులతో నయీం వీపును గట్టిగా ముడివేసింది షమీం.


Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 35



# ఒట్టిపోయిన అడవి

శిరంశెట్టి కాంతారావు

ద్వితీయ బహుమతి రూ. 25,000 పొందిన కథ



శిరంశెట్టి కాంతారావు విశ్రాంత ఉద్యోగి. సూర్యాపేట జిల్లా ఫణిగిరి వీరి సొంతూరు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఉంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు రెండు వందల కథలు రాశారు. ఐదు కథా సంపుటాలు, ఒక హిందీ కథా సంపుటి, ఏడు నవలలు రాశారు. తెలుగు విశ్వవిద్యాలయం, తెలంగాణ సాహిత్య అకాడమీల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 37

**మనుబోతులగూడెం నడిమిగుంపు పెద్ద పద్దం** అడివయ్య ఊరు మధ్యనున్న దేవరచెట్టు కిందనిల్చుని కడుపులో పేగులన్నీ నోట్లోకొచ్చేటట్టు బుక్కబట్టి మూడుసార్లు హక్కుం (అర్ధచంద్రాకృతిలో ఉండే చిన్న బూర) ఊదాడు.

ఆ నాదాన్ని విన్న గుంపు మొత్తం బిర బిరమంటూ వచ్చి అతణ్ణి చుట్టుముట్టింది.

అక్కడ చేరిన వాళ్ళందరి వంక చూస్తూ నాకిప్పుడు డెబ్బై రొండేండ్లు. ఇప్పటిదాకా నా జన్మల ఇంత ఒరుపు ఎరగ. నాలుగేండ్లసంది పట్టుమని రొండు దుక్కుల వానగూడ పడ్డపాపాన పోలేదు. ఆడివిల కాయ గసరు, దుంప దుట్ట అన్నీ బంగారమైపోయినై. పుట్టిన గడ్డనిడి మనం ఇటుదిక్కొచ్చిన రోజుల్ల ఈ లోతువాగు యాడాది పొడుగున నడుముల్లోతున పార్తనే ఉండేది. మరిప్పుడుజూస్తే నిండువానకాలంగూడ మోకాటిలోతునున్న పట్టుమని పదిరోజులు పారట్లేదు.

పుబ్బకార్తెగూడ సాంతిమి ఎల్లకముందల్నే ఎండిపోయిన వాగులబడి, లారీలకొద్ది ఇసిక తోల్కపోతున్నరు. ఇసికతోడిన వాగు సచ్చిన కొండసిలువ బొక్కలగూడు లెక్క కనబడ్తాంది.

లారీలోల్లు తోడుపోంగ మిగిలిపోయి వాగు ఇసికెల సెలిమలు తోడుకోని ఆనీల్లతోటె పశులు, మేకలు, మనం కనాకష్టంగ రోజులు ఎల్లదీస్తున్నం. కడుపునిండ రెండుపూటల బువ్వలేకపోయినా వొకపూట వాగునీల్లన్న తాగి బత్కోచ్చున్కుంటే, సెలిమల్లగూడ గుటికెడు నీల్లు దొర్కుత లెవ్వాయె. మరింగ మనం బత్కే దెట్ల?' అంటూ తన మనసులోని ఆవేదననంతా

వెళ్ళగక్కాడు.

అతని మాటలిన్న గుంపంతా 'మరిప్పుడేంజేద్దామా? నువ్వే జెప్పు!' అంది.

'ఆయిన్నేం జెప్పమంటరు? నిన్నగాక మొన్న ఈసం పుల్లన్న ఇంట్లో ఏం జరిగిందో మీకు తెల్వదా?' బలంగా ఊపిరి తీసుకుంటూ అన్నాడు పూజారి కంపయ్య.

అతని మాటలను విన్న గుంపు మొత్తం ఒక్కసారిగా నిశ్శబ్దమై పోయింది.

## 2

మనుబోతులగూడెం ఎగువ గుంపు ఈసం పుల్లన్న బిడ్డ గట్టెమ్మకు, నడిమిగుంపు వాసం సుకన్న కొడుకు చిగురన్నకు అడివికి మేకలు కాయబోయినకాడ మనసులు కలిశాయి.

ఏముచ్చటదాగినా ఆ ముచ్చట దాగదన్నట్టు వాళ్ళ ప్రేమ సంగతి త్వరలోనే రెండు గుంపుల్లోనూ తెలిసిపోయింది.

ఓరోజు రెండు గుంపుల పెద్దమనుషులు పుల్లన్న ఇంటిముందు కూర్చుని మంచీచెడూ మాట్లాడుకొన్న తరువాత పూజారి కంపన్నతో 'పెండ్లి ముహూర్తం పెట్టు' అన్నారు.

కొంతసేపు తన్లో తాను ఏదో కూడబలుక్కుని 'రోణికార్తె జొరబడ్డ మూడోరోజు గుంపు అడివికి పొయ్యే పొద్దుల లగ్గం ఖాయం జేస్తున్న' అంటూ ముహూర్తం పెట్టాడు.

పుల్లన్న తన ఇంటివెనుకనున్న జీలుగుచెట్ల కల్లు దింపించుకొచ్చాడు. పుల్లన్న భార్య పువ్వమ్మ పొయ్యిమీద ఉడికున్న చిక్కుడు గుగ్గిల్లు పోపునేసింది.

ఇరుగు పొరుగు ఆడవాళ్ళల్లో కొందరు పారుటాకు డొప్పలు కుట్టి అక్కడున్న వాళ్ళందరికీ పేరుపేరున అందిస్తే.. మరికొందరు వాటిల్లో కల్లు నింపసాగారు.

కల్లుతాక్కుంటూ, గుగ్గిల్లు తినుకుంటూ 'పెండ్లి ఎట్లెట్ల చెయ్యాల?' అన్న ఆలోచన చెయ్యసాగారు.

అందరి మాటలు వింటూ అప్పటిదాకా నిశ్శబ్దంగా కూర్చున్న వృద్ధుడు తాటి ముసలయ్య 'అసలు సంగతి పట్టించుకోకుంట అట్ల ఏందేందో మాట్లాడున్నరేంది!?' బోసినోటిలో పోసుకున్న గుగ్గిల్లను దౌడలతో ఒత్తి నములుకుంటూ అన్నాడు.

'ఏందో సెప్పరాదు' అన్నాడు పెండ్లికొడుకు తండ్రి సుక్కన్న

'ఏంజెప్పాల? కత్తెర్లనే ఇంతగనం ఎండలు కాస్తున్నై, మూర్తం జూస్తే ఇంక పద్దినాలుగూడ లేదు. ఇప్పటికే సెలిమలన్ని బిక్కిపొయ్యి, తాగనికే నీల్లుదొర్కుతలెవ్వు. మరి కాలం గిట్లనేవుంటే రేపు పెండ్లి నాటికి నీల్లకు ఎంత కష్టమైతదో ఆలోసించిండ్రా? నీల్లులేకుంట పెండ్లెట్ల జేద్దామను కుంటుండ్రు?' ముఖం మీది ముడుతలు జీవితానుభవాన్ని సూచిస్తుంటే తన మనసులోని ఆలోచనను బయటపెట్టాడు ముసలయ్య.

'ఈ ముసలోనికి ఎక్కల్లేని అనుమానాలొస్తై'

'అన్ని సొండి మాటలు మాట్లాడ్తుంటడు'

'అప్పటిగూడ వానలు పడవంటడా ఏంది?' ఎవరికి తోచినట్టు వాళ్ళు ముసలయ్య మీద గయ్యిన లేచారు.

'మీలెక్కన్నే నాకు తోసింది నేను జెప్పిన అండ్ల తప్పేముంది?' మరోసారి కల్లు కోసం చేతిలోని డొప్పను ముందుకు చాపుతూ అన్నాడు ముసలయ్య.

అతని మాటల్లోని వాస్తవాన్ని అర్థం చేసుకున్న కాబోయే వియ్యంకులిద్దరూ 'ఏంజేద్దాం?' అన్నట్టు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

'ముందైతే మూర్తం పెట్టురి. పెండ్లికి నీల్లు దొర్కుతయో, లేదోనని మూర్తం బెట్టుకోకుంట కూసుంటెట్ల? ఒకేల వానలు పడితే? అప్పటికప్పుడు రమ్మంటే సుట్టాలొస్తరా' అన్నారు కొంతమంది యువకులు.

వాళ్ళ మాటలకు పెద్దవాళ్ళెవరూ బదులు చెప్పలేక 'సరే మూర్తం ఖాయం జెయ్యి!' పూజారి కంపయ్యతో అన్నారు.

అదేం చిత్రమోగాని! గడ్డెమ్మ, చిగురన్నల పెండ్లి ముహూర్తం పెట్టుకున్న దగ్గర్నుండి ముసలయ్య అన్నట్టుగా ఎండలు అంతకంతకూ ముదిరిపోతున్నాయి తప్ప వర్షం పడే సూచనలు కనుచూపుమేరలో కన్పించడంలేదు.

అసలే అంతంతమాత్రంగా నీల్లు దొరికే వాగులో చెలిమలన్నీ పూర్తిగా ఇంకిపోయాయి. ఇకదాంతో గత్యంతరంలేక గుంపంతా మరింతదూరం వాగుదిగువకు బొయ్యి చెలిమలు తోడారు.

కొద్ది కొద్దిగా ఊరుతున్న నీల్లను లోటలతోను, గ్లాసుల్తోనూ ఎత్తి కుండల్లో పోయడానికి వీలుగాక పాతబట్టలను నీల్లమీదవేసి, అవి పీల్చుకున్న నీళ్ళను కుండల్లోకి పిండుకోసాగారు.

ఆ విధంగా వాళ్ళు పాతబట్టలనే స్పాంజులుగా చేసుకొని ఒక్కో నీటి బొట్టును ఒడిసిపట్టుకొని ప్రాణాలను నిలబెట్టుకోసాగారు.

సాధారణంగా గుంపుల్లో మగవాళ్ళు బుడ్డగోసులు పెట్టుకుని, వాటిమీద ముదురురంగు గల్ల తువ్వాలలు చుట్టుకుని వాటిమీద రంగు రంగుల బనీన్లు వేసుకుంటారు.

అడవాళ్ళు నాసిరకం లోలంగాలు తొడుక్కుని వాటిమీద చీరతుంపులను లుంగీల మాదిరిగా చుట్టుకుంటారు. జాకెట్లు ఉన్నవాళ్ళు, లేనివాళ్ళుకూడా ఛాతికి అడ్డంగా తువ్వాలనో, పాతగుడ్డలనో మెడలమీదికి తీసి కట్టుకుంటారు.

ఆడామగ తేడా లేకుండా చిన్నపిల్లలంతా ఒంటి మీద బట్టల్లేకుండానే తిరుగుతుంటారు.

మామూలుగా గుంపుల్లో వాళ్ళు స్నానాలు చెయ్యాలనుకుంటే వాగుకెళ్ళి స్నానాలు చేసి, బట్టలు పిండుకుని వస్తుంటారు.

మరిప్పుడు తాగటానికే నీల్లు దొరక్క వాళ్ళు కిరుసుగడ్డలు నములుతూ దప్పిక తీర్చుకుంటుంటే ఇంక స్నానాలెక్కడ చేస్తారు? స్నానాల్లేక, బట్టలు మార్చుకోక, చమరకాయలతో శరీరాలు పెట్టిపోయి పిల్లలు పెద్దలు నానా ఇబ్బందులు పడసాగారు.

పశువులు, మేకలు, ఆవులు, పందులు నీల్లకోసం వెంపర్లాడిపోతుంటే, కొంతమంది వాటి బాధ చూడలేక నీల్ల తావుల్లో ఉన్న తమ చుట్టాల దగ్గరికి వాటిని తోలుకుపోయారు.

అట్లాంటి వసతిలేనివాళ్ళు సంతలకు తోలుకుపోయి అడ్డికి పావుశేరన్నట్టు వచ్చిన కాడికి అమ్మేసుకున్నారు. పొద్దునలేస్తే ప్రాణాలన్నీ చూపుల్లోకి తెచ్చుకుని మబ్బులవంక ఆశగా చూస్తూ రోజొక యుగంగా బతుకుతున్నారు.

ప్రాణాలు నిలబెట్టుకోవడానికి ఆసరాగా మిగిలున్న ఒకటిరెండు చెలిమెలమీద రాత్రివేళల్లో ఏ అడవి జంతువులోపడి ఊరిన ఆ కాసిని నీళ్లను తాగి పోతాయన్న భయంతో వాటిచుట్టూ దట్టంగా ముండ్లకంచెలు ఏర్పాటుచేశారు.

గడ్డెమ్మ, చిగురన్నల పెండ్లి ఇంకో ఐదురోజులుందనగా ఆ సాయంత్రం రెండుగుంపుల పెద్దమనుషులు గడ్డెమ్మ వాళ్ళ ఇంటిముందు కూర్చుని 'తాగనికే నీల్లులేక పూట పూటకు సచ్చి బత్కుతుంటే ఇంగ పెండ్లి జేసేదెట్ల?' అంటూ పెండ్లిని నిరవధికంగా వాయిదా వేశారు.

## 3

చూస్తుండగానే మరో వారం పది రోజులు పడమటి కొండల్లో కుంగిపోయాయి.

ఎక్కడా వానచుక్క జాడలేదు.

అలుకుపిడచల మాదిరిగా బతుకులు పిడచ కట్టుకుపోతుంటే వధ్యశిలమీది గొర్రెపిల్లల మాదిరిగా ఏమీచేయలేక 'సినుకు పడ్డదాన ఇండ్లకు తడికలు అడ్డంకట్టి కొన్నాల్లపాటు భద్రాచలం దిక్కుబొయ్యి పానాలు నిల్పుకుందాం' అనుకోసాగారు.

'గుంపుకేదన్న ఆపదొస్తే దాన్ని దాటేటందుక్కు నేనే ఏదన్న తొవ్వ జూపిచ్చాల. పూజారిగ అది నా ధర్మం' అనుకున్న కంపయ్య ఓరోజు రాత్రి గుంపునంతా దేవరగద్దె దగ్గరపోగేసి 'మృగశిర కార్తెగూడ ఎల్లిపొయ్యి ఆరుద్ర సెరిసగాన పడ్డది. అయినా, వానసినుకు జాడలేదు. అందుకే ఎట్లనన్నజేసి వచ్చే ఆదారం నాడు భూమి పండగజేద్దాం. అప్పుడన్న పేన్కుమనమీన దయజూపిచ్చి వాన కురిపిస్తడేమో' అంటూ తన అభిప్రాయాన్ని తెలియజేశాడు.

వరదన కొట్టుకుపోయేవాడికి పూచిక పుల్లదొరికినా అదో వటవృక్షంలా భావించి దాని సాయంతో గట్టెక్కొచ్చనుకుంటాడు. పూజారి మాటలను అదేవిధంగా భావించిన గుంపంతా వెంటనే 'సరే! అంటే సరే!' అంది.

గుంపులో ఇండ్లన్నీ గుంజలమీద నిట్టాడు వేసి, దానికి వాసాలు కొడతారు. వాటిమీద పెండెకట్లుకట్టి గుట్టగడ్డితో కప్పుతారు. గుంజల్ని కలుపుతూ ఇంటిచుట్టూ జానపొరకతో దళ్ళుకడతారు. ఆ దళ్ళమీద పాటిమట్టి, ఆవుపేడలతో లోపల వెలుపల నున్నగా అలుకుతారు. ఇంటిని, ఇంటి ముందుండే అరుగులను కూడా అదేవిధంగా అలుకుతారు.

ఇంటిలోపల, అరుగులమీద సున్నంతో చుక్కల ముగ్గులు వేస్తారు. ఇంటికి వెనుకపక్క తప్ప మిగిలిన మూడుపక్కలా ఉండే గోడలమీద తమ ఇలకట్ల (ఇంటి పేర్ల) చరిత్రను తెలిపే పటం బొమ్మలు వేస్తారు.

ఆవులకు, మేకలకు దొడ్లను, కోల్లకు, పావురాలకు గూల్లను ఏర్పాటు చేస్తారు. ఇంటింటికి ఒకటో రెండో తాటి, జీలుగు, మామిడి చెట్లను పెంచుతారు. చూడ్డానికా ఇండ్లు అందంగా, ప్రశాంతంగా ఋష్యాశ్రమాల్లా ఉంటాయి. అటువంటి ఇండ్లిప్పుడు నీల్లులేక మిడతల దండుపడిన జిల్లేడుపొదల మాదిరిగా అయిపోవడంతో 'అటువంటి ఇండ్లల్ల పండగెట్ల జెయ్యాల?' అన్న ఆలోచనతో అడవాళ్ళంతా మౌనంగా నిల్చుండిపోయారు.

వాళ్ళ మౌనం వెనుకనున్న వేదనను అర్థం చేసుకోలేకపోయిన పూజారి కంపయ్య 'మీరంతట్ల ఏనే గుండ్ల లెక్క నిలబడి పోతిరేంది!?' అంటూ గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు.

దాంతో వాళ్ళంతా ఒక్కొక్కరు ఒక్కోరకంగా తమ గోడును వెళ్ళబోసుకున్నారు.

'సూద్దాం. ఏ పుట్టల ఏ పాముంటదోనన్నట్టు, పండుగ జేస్తేనన్న దేవున్కి మనమీన శమదర్మంకల్గి వాన కురిపిస్తడేమో' అంటూ వాళ్ళందరినీ ఊరడించాడు కంపయ్య.

ఇకదాంతో వాళ్ళంతా విధిలేక సగం మనసుతోనే 'సరే' అంటూ తలలూపారు.

లంద తయారు చెయ్యడానికని ఆ రాత్రే ఎవరింట్లో వాళ్ళు వడ్లు నానబోశారు.

మూడోనాటికల్లా మొలకలొచ్చిన వడ్లను తీసుకుపోయి గుంపు చివరనున్న పర్పుబండ మీద ఆరబోశారు.

సాయంత్రంకల్లా అవి ఉసిళ్ళ మాదిరిగా ఆరిపోయాయి.

బండమీద ఆరబోసిన వడ్లను ఎత్తుకొచ్చి దంచిన పువ్వమ్మ, బియ్యాన్ని ఓ వెదురుబుట్టలోకి ఎత్తి పెట్టింది.

పొద్దు గూట్లో పడకముందే ఇంత తిని, కిరసనాయిల్ బుడ్డి గుడ్డి వెలుగులో విసుర్రాయి ముందేసుకొని బిడ్డతో కలిసి పాటలు పాడుకుంటూ వెదురు బుట్టలోని బియ్యాన్ని మొత్తం పిండి విసిరింది.

ఆ బియ్యప్పిండితోపాటు అంతకు ముందే విసిరివుంచిన మొక్కజొన్న పిండినీ ఓ మట్టికుండలోకి ఎత్తారు.

ఎంత పిండికి ఎన్ని నీళ్లు కలపాలో అన్నే కలిపి దాన్నో చుట్టకుదురుమీద ఊరబెట్టి అప్పుడు పడుకున్నారు.

మూడో రోజుకల్లా కుండలో కలిపి పెట్టిన పిండి పుల్లగా పులిసి ఇల్లంతా ఓ విధమైన వాసనతో నిండిపోయింది.

నాలుగో రోజు చుట్టకుదురు మీదనుంచి దించిన బానలో ఏవేవో చెట్టు బెరల్లు వేసి పొయ్యిమీద పెట్టి జావగాసింది పువ్వమ్మ.

అట్లా తయారైన లందవంక సంతృప్తిగా చూసుకుంటూ దాన్ని తిరిగి చుట్టకుదురు మీదికెక్కించింది.

గుంపులోని ప్రతి ఇంటివాళ్ళు ఆవిధంగా లంద, విప్ప సారాలు తయారుచేసి పెట్టుకున్నారు.

ఆదివారం పండుగ కాబట్టి శుక్రవారం పొద్దున్నే కొంతమంది యువకుల్ని వెంటబెట్టుకున్న గుంపుపెద్ద అడివయ్య ఇంటింటికీ తిరిగి ఐదు లీటర్ల నీళ్లు, రెండు కిలోల బియ్యం, యాభై రూపాయల వంతున వసూలు చేసుకొచ్చి ఇంట్లో పెట్టాడు.

సందకాడ అన్నం తినగానే అడివయ్య 'హక్కుం' పూరించాడు.

పావుగంట అటూ ఇటుగా గుంపంతా దేవరగద్దె దగ్గరికి చేరుకుంది.

ఆడామగ, చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా వచ్చినవాళ్ళంతా లందనో, సారానో తాగివచ్చారు.

వచ్చిన వెంటనే కొంతమంది యువకులు 'పురికట్టలు' (ఎద్దు కొమ్ములతో చేసిన తలపాగాలు) తలలమీద పెట్టుకొని 'గండ్లలు' (డోల్లు) కొడుతుంటే, మరికొంతమంది యువతులు 'గుజ్జోడీ' (మడత మంచం కడ్డీల్లాంటి కడ్డీల చివర ఇనుముతో తయారుచేసిన అవిశ పువ్వుల్లాంటి పూలగుత్తులు)లను భూమికి తాటిస్తూ లయబద్ధంగా వెనక్కి ముందుకు అడుగులు వేస్తూ నాట్యం చెయ్యసాగారు.

వాళ్ళ చుట్టూ గుమిగూడిన జనంలో నుంచి కొంతమంది ఆడవాళ్ళు..

**'యాటకు పొవ్వాల**

**మెకాన్ని కొట్టాల**

**దేవరకు బెట్టాల**

**పండగ జెయ్యాల**

**వానల్లు కురవాల**

**అడివంత పండాల..**' అంటూ పాట అందుకున్నారు.

సముద్రం మధ్యలో చిన్నగాలేచిన తుఫాన్ క్రమక్రమంగా బలం పుంజుకుని ఉప్పెనై పెను ఉప్పెనై గుండెలు జలదరించి పోయేలా హోరుమనే ప్రళయ భీకరనాదం వలయాలు వలయాలుగా సముద్రమంతటా విస్తరించినట్టు..

మెలమెల్లగా మొదలైన ఆట, పాటలు క్రమక్రమంగా ఉధృతమై మోడుబారిన అడవిని, ఎండకు కాగీ కాగీ నలుపెక్కిన కొండలను అలలు అలలుగా ముంచెత్తసాగాయి.

అట్లా అర్ధరాత్రిదాకా సాగిన ఆటపాటలు పూజారి సూచనతో మెల్లగా ఆగిపోయాయి.

ఇండ్లకు వెళ్ళిన మగవాళ్ళంతా 'రేప్పొద్దున్నే లేసి అడివికి పొయ్యి దేవరకు బలియ్యనికి ఏదొక మెకాన్ని కొట్టకరావాల' అనుకుంటూ నిద్ర కొరిగారు.

## 4

వేగుచుక్కతోపాటే లేచిన అడివయ్య దేవర గద్దె దగ్గరికి చేరి 'హక్కుం' పట్టాడు.

ఆ మోత వింటూనే చప్పున పక్కలమీద నుంచి లేసిన ఆడామగ, పిల్లజెల్ల, ముసలిముతక అంతా గద్దెదగ్గరికి చేరారు.

వస్తూ వస్తూ పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా గుంపులో మొలతాడుగట్టిన మగవాళ్ళంతా వలలు, కత్తులు, గొడ్డల్లు విల్లంబులతోపాటు కుక్కల్ని కూడా తీసుకుని వచ్చారు.

ఆడవాళ్ళంతా సొరబుర్రల్లో కల్లు, సారా, లంద, నీళ్లను డబరా గిన్నెల్లో అన్నం కూరల్ని సద్దులు గట్టుకొని తెచ్చారు. అంతా కలిసి గుంపు చివరనున్న సమ్మక్క గద్దె దగ్గరికి చేరుకున్నారు.

అమ్మకు మొక్కుకున్న తరువాత ఆడవాళ్ళు వేటకు సంబంధించిన పాటలు పాడుతూ 'మంచి యాటపడాల' అంటూ మగవారికి వీడ్కోలు చెప్పి వెనుదిరిగారు.

మగవాళ్ళంతా అడవిలో కొంతదూరం వెళ్ళిన తరువాత పిల్లలను, ముసలివాళ్ళను ఓ బయలు ప్రదేశంలోవున్న నెమలిచెట్లకింద ఎంచి వాళ్ళకు కావాలిన్స అన్నం నీళ్లను ఏర్పాటుచేసి తిరిగి ముందుకు కదిలారు.

చీకట్లో సైతం వాసన చూసి జంతువుల జాడను పసిగట్టి పట్టిచ్చే కుక్కలకు ఆరోజు ఒక్క జంతువు జాడ కూడా దొరక్క పోవడంతో అవి ఉన్మాదంగా మారిపోయి అడవంతా పరుగులు పెట్టసాగాయి. కంప, కట్టె, చెట్లు, తుప్పలని చూసుకోకుండా అంతా వాటి వెనుకే పరుగులు తీయసాగారు.

వాళ్ళకు తెలిసిన నీళ్ళ తావులన్నీ గాలించారు.

ఏ ఒక్కతావులోనూ చుక్కనీరులేదు. నీరేలేని తావుల్లో జంతువులు మాత్రం ఎందుకుంటాయ్? అవి నీటిజాడలను వెతుక్కుంటూ ఎటు వెళ్ళిపోయాయో? దాంతో ఎక్కడివాళ్ళక్కడ నీరసంతో ఈడిగిలబడి పోసాగారు.

సారబుద్రలు, డబరా గిన్నెలు మొత్తం ఖాళీ అయిపోయాయి. కానీ, వేట మాత్రం పడలేదు.

జంతువులే కాదు కనీసం పక్షులు కూడా కనిపించకపోవడంతో ఆశ్చర్యానికిలోనైన వాళ్ళంతా 'ఏందిది!? లూటుబోయిన పత్తిసేన్ల లెక్క అడివంత వొక్కసారే ఇట్ల గొడ్డుబోయినట్టు అయ్యిందేంది!?' అనుకున్నారు.

ఇదీ అని చెప్పలేని ఓ రకమైన కసితో అసహనానికి లోనైన వాళ్ళంతా రాత్రివేళల్లో తిప్పతీగ తొక్కిన వాళ్ళ మాదిరిగా తిరిగిన తావుల్లోనే తిరుగుతూ అడవంతా జల్లెడబట్టి గాలించినా కనీసం కుందేలు పిల్ల కూడా దొరక్కపోవడంతో 'యాటలేకుంట ఇండ్లకు బొయ్యి ఆడోల్లకు మొకాలెట్ల సూపించాలె?' అనుకుంటూనే చీకటి తెరలు అడవిని కమ్మేస్తుండడంతో ఇక అక్కడ ఉండలేక ఒక అడుగు ముందుకి ఏడడుగులు వెనక్కి అన్నట్టు ఊరిబాట పట్టారు.

సందెచీకట్లు ముసురుకుంటుండగా అడవాళ్ళంతా ఊరు చివర సమ్మక్కగద్దె దగ్గర చేరి, మగవాళ్ళు ఏసుకొచ్చే వేటకోసం ఆశగా ఎదురు చూడసాగారు.

కండ్లు కణతల్లో చేరి, ముఖాలు పీక్కుపోయి, ఒళ్ళంతా ముండ్లు గీరుకుపోయి నెత్తుర్లు కారుతుంటే యుద్ధరంగాన శత్రువుల చేతిలో శృంగభంగమైపోయిన సిపాయిల మాదిరిగా ఎట్ల వెళ్ళినవాళ్ళు అట్ల ఉత్తచేతులతో తమవాళ్ళు తిరిగిరావడాన్ని గమనించిన ఆడవాళ్ళకు అడవిలో జరిగిందేమిటో అర్థమై ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ..

'యాటకు బోయిన కోయోనికి ఓ కుందేలు పిల్లగూడ దొర్కని పాడుకాలమొచ్చెగద!'

'యాట దొరక్కపోతే రేపు పండగ జేసేదెట్ట!?' అన్న ఆందోళనకు లోనవ్వసాగారు.

'యాట పడ్డా పడకపోయిన మనం ఏదోరకంగ పండగైతే సెయ్యాలగద?' అన్నాడు పూజారి కంపయ్య.

'ఎట్ల జేస్తం?' అన్నట్టు అతని వంక చూశాడు అడివయ్య.

ఎట్లా చెయ్యాలో ఓ మార్గాంతరాన్ని తెలియజేశాడు కంపయ్య.

## 5

మరునాడు పొద్దున్నే కొంతమంది ఊళ్ళో వసూలు చేసిన బియ్యం, నీల్లతోపాటు వొంట గిన్నెల్ని కూడా మోసుకుని గుంపుకి దక్షిణం దిక్కున ఉన్న దేవర తునికి చెట్టుకిందికి చేరారు.

కొంతమంది పారుటాకులు ఏరుకొచ్చి తునికిచెట్టు పక్కనేవున్న చింతకింద కూర్చుని డొప్పలు కుట్టి పక్కన అద్దపెట్టసాగారు. ఇంకొంతమంది పచ్చనాకుల్తో దేవరచెట్టు కింద పందిరేసి దాని చుట్టూ దడికట్టారు.

పొలిమేర అవతల్నుంచి తెచ్చిన జీవినే దేవరకు బలియ్యాలనడంతో చీకటితోనే ఇద్దరు మనుషులు వేములూరు పొయ్యి ఓ జుట్టు (ఫారం) కోడిని కొనుక్కొచ్చారు.

చెట్టు మొదట్లో దేవరను నిలబెట్టి, పసుపు కుంకుమలతో అలంకరించిన పూజారి తన్లో తను ఏవో మంత్రాలు చదువుతూ జుట్టుకోడిని దేవరకు ఎదురిచ్చి కాల్లు, తలకాయను దేవరకు ఎదురుగా పందిరికి వేల్లాడదీశాక 'ఇగ దీన్ని పొతం జెయ్యుండ్రి!' అంటూ మిగిలిన కోడిని పక్కనున్న వాళ్ళకందించాడు.

వెంటనే వాళ్ళు దాని బూరు పీకి, మంట మీద కాపి, ముక్కలు కొట్టి పావుగంటలో తిరిగి అతనికి అందించారు. ఇంతలో మరికొంతమంది చింతచెట్టు కింద పొయ్యిరాల్లు పొందిచ్చి వంట మొదలు పెట్టారు. అన్నం గంజి పట్టకుండా చూసుకొని ఉయ్యాల్ల మాదిరిగా ఉన్న రెండు పెద్ద వెదురు బుట్టల్లోకి వార్చారు. అదే పొయ్యి మీద కోడికూర కూడా వండి పక్కన పెట్టారు.

వంటలు అయిపోగానే కంపయ్య ఇంత నిండుకుండ అన్నాన్ని, కూరను పారుటాకు విస్తళ్ళు పర్చిన కొత్తచాటలోకి తీసుకుని దాన్ని బాగాకలిపి బోనం తయారుచేశాడు.

బోనాన్ని దేవరముందు పెట్టి సొర బుర్రల్లో తెచ్చిన లందను, సారాను వారబోసిన తరువాత అక్కడున్న వాళ్ళందరితో 'ఇండ్లకు బొయ్యి బుట్టలు తీసుకొచ్చుకోండ్రి!' అన్నాడు.

వెంటనే వాళ్ళంతా ఇండ్లకురికి పారుటాకు విస్తళ్ళు పరిచిన నలుచదరపు చిన్న చిన్న వెదురుబుట్టల్ని తీసుకొచ్చి పొయ్యి రాలకు దగ్గర్లోనే ఒకదానివెనుక ఒకటి వరుసగా నేలమీద పెట్టి పక్కకు తప్పుకున్నారు.

కంపయ్య దేవర ముందుంచిన బోనాన్ని తీసుకొచ్చి పారుటాకు డొప్పల్లో తలా ఇంత ప్రసాదం మాదిరిగా పెట్టాడు. ఆ ప్రసాదం తిన్న డొప్పల్లోనే అందరికీ కల్లు, లంద, సారాలను వంచారు. తాగడం అయిన తరువాత మళ్ళీ వాటిల్లోనే అన్నాన్ని పెట్టించుకుని తిన్నారు. తిన్న తరువాత ఎంగిలి డొప్పలను ఎక్కడ పడితే అక్కడ పారెయ్యకుండా ప్రతివాళ్ళు వాటిని తీసుకుపోయి ఆ పక్కనే ఉన్న విప్పచెట్ల ఆకులకు వెదురు ఈనెలతో కుట్టి వేళ్ళాడదీశారు. ఎంత తాగినా, తిన్నా వేటపడక కొనుక్కొచ్చిన జుట్టుకోడితోటి పండుగ చేసుకోవాల్సి వచ్చిందే అన్న విషయాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోతున్న బాధ వాళ్ళ ప్రతి కదలికలోనూ కన్పిస్తుంది.

భోజనాలైన తరువాత పెద్దబుట్టల్లో మిగిలిన అన్నాన్ని వరుసలో పెట్టి ఉంచిన చిన్న బుట్టల్లో సమానంగా పెట్టేశారు.

పొద్దు పడమరకు తిరుగుతుండగా వాళ్ళంతా 'మొదట్రోజు మన మొగోల్ల పండగ పద్దతెమ్మటి జరుగల' అనుకుంటూ అన్నం బుట్టల్ని, సామాన్లను తీసుకుని ఇండ్లకు మళ్ళారు.

## 6

దేవర చెట్టు దగ్గర్నుంచి ఇండ్లకొచ్చిన వాళ్ళంతా అక్కడి విశేషాలను ఆడవాళ్ళతో పంచుకుంటూ మెల్ల మెల్లగా మగత నిద్రలోకి జారుకున్నారు.

'హక్కుం' చప్పుడుకు గుంపంతా ఉలిక్కి పడిలేచింది.

మరునాడు జరుగబోయే ఆడవాళ్ళ పండగ కోసం మొన్నటి మాదిరిగానే మగవాళ్ళంతా

మళ్ళీ వేట సరంజామానంతా తీసుకొని దేవరగద్దె దగ్గరికి చేరుకున్నారు.

వారి వెనుకనే ఆడవాళ్ళు, పిల్లలూ వచ్చారు.

మొన్నటి మాదిరిగానే ఆటపాటలు మొదలయ్యాయి.

లేగదూడలు ఇండ్లచుట్టూ గెంతులు వేస్తూ తూర్పుదిక్కుగా పరుగులు తీయసాగాయి.

గూళ్ళల్లో కూర్చున్న పక్షులు ఖుషీగా ఉషాబాలకు స్వాగతం పలుకుతూ చేస్తున్న కలరవాలు చెవులకు ఇంపుగా సోకుతున్నాయి.

తూరుపుగాలి పడుతున్న వింజామరకు పరిసరాలు ఆహ్లాదంతో పులకరింతకు లోనవ్వసాగాయి.

ఆటపాటలను కట్టిపెట్టిన తరువాత మగవాళ్ళంతా మొన్నటి మాదిరిగానే వేటకోసం అడవిలోకి దారితీశారు. వాళ్ళను సాగనంపిన ఆడవాళ్ళంతా..

'ఈ రోజన్న యాటపడుద్దా?'

'రీతి దప్పి జేస్తున్న పండగతోటి దేవర మెచ్చి వాన కురిపిస్తడా?'

'నీల్ల కర్వు తీరుద్దా?'

'బుక్కెడంత బువ్వ కోసం శారడంత పోడు కొట్టుకొనే మమ్ముల దొంగలెక్క జూసే సర్కారోడు, రకరకాల పేర్లతోటి అడివిల జొరబడే కాంట్రాక్టర్లు మిషిన్ల మీన వొందలేకరాల అడివిని, వాగుల్ల ఇసికను, కొండలమీది రాల్లను దోస్కపోతుంటే వాల్ల జోలికి మాత్రం పోడు'

'వాల్లంత అట్ల అడివిని దోస్కతిన్నంక మరి వాన పడమంటే యాడపడుద్ది? మా నీల్ల కర్వోట్ల దీరుద్ది?' ప్రశ్నల మీద ప్రశ్నలు జవాబుల్లేని ప్రశ్నలు మెదళ్ళను కుమ్మరి పురుగుల మాదిరిగా తొలుస్తుంటే నివురుగప్పిన నిప్పుకణికల మాదిరిగా ఇండ్లకు మళ్ళారు.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 47



# బేబక్క

పుట్టగంటి గోపీకృష్ణ

**తృతీయ బహుమతి రూ. 10,000 పొందిన కథ**



పుట్టగంటి గోపీకృష్ణది గుంటూరు జిల్లా తెనాలి. ప్రస్తుతం కర్ణాటకలోని ధార్వాడ్ పట్టణంలో ఉంటున్నారు. 2008లో రచనలు మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ 26 నవలలు, వంద కథలు రాశారు. అవి వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

**ఇరాక్‌లో ఒక నోరు తిరగని పట్టణంలోని మార్కెట్‌లో** మానవ బాంబు పేలిందని ఏడో పేజీలో వచ్చిన అర కాలమ్ వార్త ఎవరినీ ఆకర్షించే చాన్స్ లేదు. కనీసం పేలుడులో వంద మంది చనిపోయారంటే, ఆ వార్త ముందు పేజీలోకి వచ్చి నలుగురు కళ్లలో పడేదేమో. కానీ, ఆ పేలుడులో కేవలం ఇద్దరే చనిపోవడంతో ఆ పత్రిక ఎడిటర్‌కి దానికి అంతకు మించిన ప్రాముఖ్యం ఇవ్వాల్సిన అవసరం కనిపించలేదు. అరుగుల మీద కూర్చుని అక్షరం వదలకుండా పత్రిక మొత్తం చదివే పనిలేనివాళ్లు తప్ప ఆ వార్తని ఎవరూ చదవలేదు. అలా ఆ వార్త చదివిన మన రాష్ట్రంలోని ఒక మారుమూల పల్లె వారికి కూడా ఆ చనిపోయిన వారిలో ఒకరు తమ ఊరి వారని తెలియదు.

* * *

కొన్ని రోజుల ముందుకు వెళ్తే ..

కరువు జిల్లాగా పేరు పొందిన ఆ జిల్లాలోని ఒక మారుమూల పల్లెటూరిలో బ్యాంకు మేనేజర్‌గా విహారి ఛార్జ్ తీసుకుని రెండు రోజులయ్యింది.

రోజు మొత్తం మీద బ్యాంకుకు పది మంది కూడా వస్తున్న జాడ కనిపించలేదు అతనికి. అది కాస్త విచిత్రంగా అనిపించి 'ఏమిటి కస్టమర్లు ఎవరూ రావటం లేదు?' అని అడిగాడు బ్యాంకు క్లర్కు రామారావుని.

'ఇక్కడి జనాలకు బ్యాంకుతో ఏం పని సార్? దాచుకోవడానికి డబ్బులుండవు. తీసుకోవడానికి బ్యాలెన్స్ ఉండదు. వ్యవసాయం చేయడానికి వానలు ఉండవు. ఖర్మ కాలి లోను ఇస్తే తీర్చడానికి రాబడి ఉండదు..' కవితాత్మకంగా చెప్పాడతను. అతను ప్రతి విషయాన్నీ నెగిటివ్‌గానే చూస్తాడు.. మాట్లాడతాడని విహారికి అతనితో పరిచయమయిన కొన్ని గంటల్లోనే తెలిసింది.

'అదేంటోయ్. ఛార్జ్ తీసుకునేటపుడు చూశాను. సేవింగ్స్ ఖాతాల్లో లావాదేవీలు బానే ఉన్నాయిగా' అడిగాడు విహారి.

'అవన్నీ ఎన్నారై ఖాతాలు సార్' నాలుక చప్పరిస్తూ అన్నాడు రామారావు. 'వాటిలోకి డబ్బులొచ్చి పడితే బ్యాంకుకు మనుషులు రావడం మొదలవుతుంది'

'ఈ ఊర్లో ఎన్నారై ఖాతాలా?' ఆ విషయం అప్పటిదాకా గమనించని విహారి ఆశ్చర్యంగా అన్నాడు.

అసలు ఎన్నారై అంటే అప్పటిదాకా విహారి ఊహల్లో మెదిలే వ్యక్తులు వేరు. ఎన్నారైలు అంటే.. బ్రాండెడ్ డ్రెస్సులు వేసుకుని, ఖరీదైన కార్లు తిరుగుతూ, తెలుగు సభల్లో సందడి చేసేవాళ్లు. రెండు మూడేళ్లకు ఒకసారి ఇండియా వస్తూ బంధువులకు, స్నేహితులకు బహుమతులు తెచ్చే వాళ్లు. మరీ ఎక్కువగా సంపాదిస్తే, ఊర్లో మంచి నీళ్ల ఫెసిలిటీకో, టాయిలెట్ల నిర్మాణాలకో తమ తల్లితండ్రుల పేర్ల మీద సహాయం చేసేవాళ్లు. 'ఎలక్షన్ల సీజన్లో వచ్చి ఏ పార్టీ టికెట్ దొరుకుతుంది..' అని పార్టీ ఆఫీసుల చుట్టూ తిరిగి లాటరీ వేసి చూసుకునేవాళ్ళు. అలాంటి అతని ఊహలు మొదటిసారి పటాపంచలయ్యాయి..

ఎన్నారైలంటే కువైట్‌లో నిర్మాణ పనుల్లో కూలీలు అనీ, అబూదాబీలో షేక్ ఇంట్లో పని చేసే పనిమనుషులు అనీ అతనికి ఆ రోజే తెలిసింది. దుబాయ్‌లో కార్పెంటర్లు, షార్జాలో ప్లంబర్లు, ఇరాక్ ఆయిల్ కంపెనీల్లో వర్కర్లు, ఎన్నో దేశాల్లో నర్సులు.. అందరూ ఎన్నారైలే.

ఊరిలో జనాలతో మాట్లాడాక అతనికి ఆ ఊరి పరిస్థితి అర్థమయింది. ఆ ఊరిలో ప్రస్తుతం రైతులెవరూ మిగలలేదు. అందరూ రైతు కూలీలే. భూమి ఉన్న వారికి వ్యవసాయం చేయడానికి వానలు లేవు. చేసిన అప్పులు తీర్చడానికి దారి లేదు. వారి పరిస్థితే ఇలా ఉంటే ఇక కూలీనాలీ చేసుకునే మనుషుల పరిస్థితి ఎలా ఉంటుంది? ముందు దేశంలోనే వేరే నగరాలకి వెళ్లారు. ఇప్పుడు అక్కడ కూడా బాగా పోటీ ఏర్పడింది. అందుకే విదేశాలకు వెళ్తున్నారు.

బ్యాంకు క్లర్కు రామారావు చెప్పిన మాటలు అబద్ధాలు కావని వారం రోజుల్లో తెలిసింది. అకౌంట్లలోకి డబ్బులు వచ్చాయో లేదో, మొదటిసారి బ్యాంకు కళకళలాడడం మొదలు పెట్టింది. రెండు మూడు గంటల్లో వారి పని ముగించి పంపేశాడు విహారి.

అందరూ వెళ్లిపోయాక కూడా బిత్తర చూపులు చూస్తున్న ఒక పిల్ల మిగిలిపోయింది. ఆ అమ్మాయి చేతిలో ఒక పాస్‌బుక్ ఉంది.

'ఏంటి పాప? ఏమైంది? ఎందుకలా ఉన్నావ్?' అని పలుకరించాడు విహారి. అంతే జలజల ఆ పిల్ల కంట్లో నుండి నీటి చుక్కలు జాలు వారాయి.

'అరెరే! ఏడవకు. ఇలా రా' అంటూ దగ్గరకు పిలిచాడు విహారి. పదేళ్లుంటాయేమో ఆ అమ్మాయికి. నూనె రాయక బిరుసెక్కిన జుట్టుని గట్టిగా బిగించి రెండు జడలు వేసుకుంది. వేసుకున్న గౌను రెండు చోట్ల చిరిగి ఉంది. మొహమాటంగా అతని దగ్గరకు వచ్చి చేతిలోని పాస్‌బుక్ చాపింది.

'ఈ పాస్‌బుక్ ఎవరిది?'

'బేబక్కది..' అని ఏదో గుర్తుకు వచ్చినట్లు తల అడ్డంగా ఊపి, 'సత్యవతిది' అంది.

పాస్‌బుక్ మీద పేరు చూశాడు విహారి. సత్యవతి అని ఉంది. 'మరి బేబక్క అని ఎందుకు చెప్పావ్' నవ్వుతూ అన్నాడు.

'అందరూ అలానే అంటారు..'

'ఓ.. ముద్దుపేరు అన్న మాట. ఇంతకీ బేబక్క నీకేమవుతుంది?' బేబక్క అనే పేరును బట్టి ఆమె ఈ అమ్మాయికి అక్క అయి ఉంటుందని ఊహించాడు విహారి. అయినా ఆ అమ్మాయిని మాట్లాడించడం కోసం అడిగాడు.

'అమ్మ'

'అమ్మా?' ఆశ్చర్యంగా అన్నాడు విహారి. మాట్లాడుతూనే కంప్యూటర్‌లో ఆ ఆకౌంట్ వివరాలు ఫీడ్ చేస్తూ అన్నాడు. 'మీ అమ్మ ఎక్కడ ఉంది? ఏం చేస్తుంది?'

బిక్క మొహం పెట్టింది ఆ అమ్మాయి.

'వాళ్లకవన్నీ తెలియవు సార్. ఎవరు ఎక్కడికి వెళ్లినా గల్ఫుకెళ్లారని చెప్తారు' కల్పించుకుని చెప్పాడు రామారావు.

'సరే! నీకు ఏంకావాలి అడిగాడు' కంప్యూటర్‌లో ఆ అకౌంట్ వివరాలు తెరిచిన విహారి.

అది కూడా తెలియదా? అన్నట్లు ఒక చూపు చూసిన పిల్ల, 'డబ్బులు' అంది.

'కానీ, ఇందులో డబ్బులు లేవు' బ్యాలెన్స్ లేని అకౌంట్ వివరాలు చూస్తూ అన్నాడతను.

'మూడు నెలల నుంచి ఇదే గోల సార్. అకౌంట్లో డబ్బులు ఉంటే కదా మనం ఇచ్చేది. అర్థం చేసుకోదు. మనమేదో అప్పున్నట్లు ఇక్కడకొచ్చి ఏడిస్తే మనమేమి చేస్తాం?' అన్నాడు రామారావు.

అతని మాటలు పట్టించుకోకుండా అకౌంట్‌లో పాత వివరాలు చూడసాగాడు విహారి. మూడు నెలల క్రితం వరకు రెగ్యులర్‌గా నెలకి అయిదు వేలు వస్తున్నాయి. అందులో నుంచి సగం డబ్బులు బ్యాంకులో తీసుకున్న లోనుకు వెళ్తున్నాయి. ఎంత లోను తీసుకున్నారో

చూశాడు. రెండు లక్షలు లోను తీసుకుంది సత్యవతి. ప్రస్తుతం డబ్బులు రాకపోవడంతో లోనులో కూడా బకాయిలు పేరుకుపోయాయి

'ఇప్పుడు మీ బేబక్క డబ్బు పంపడం లేదమ్మా. ఆమె ఎక్కడ ఉందో, ఎందుకు పంపడం లేదో.. మీకు కబురు లేదా?'

తల అడ్డంగా ఊపింది ఆ అమ్మాయి.

'అడ్రస్ కానీ, ఫోన్ నెంబర్ కానీ లేదా?'

'ఎవరో ఒకరిద్దరి దగ్గర తప్ప, అవేవీ ఉండవు సార్' విహారి అమాయకత్వాన్ని బద్దలు చేయడానికి కంకణం కట్టుకున్న రామారావు చెప్పాడు.

'డబ్బులు రాగానే నేనే నీకు కబురు చేస్తాలే' అన్నాడు విహారి ఆ అమ్మాయితో, ఇంకేం చెప్పాలో తెలియక.

'రేపు ఫీజు కట్టకపోతే అన్నని పరీచ్చ రాయనివ్వరంట' మళ్లీ కళ్లలో నీళ్లు తిరుగుతుంటే అంది ఆ అమ్మాయి.

'ఏం పరీక్ష?'

'అయ్యేటీ పరీక్ష'

ఆ అమ్మాయి చెప్పింది అర్థం కాక, రామారావు వైపు చూశాడు విహారి.

'ఐటీఐ సార్. టెన్త్ తర్వాత ఏ ప్లంబర్ కోర్సో చదివితే గల్ఫుకు వెళ్ళవచ్చని ఎక్కువమంది అలాంటివి చదువుతారు'

'మరి మీ నాన్న ఏం చేస్తాడు?' ఆ పిల్ల వేపు తిరిగి అడిగాడు విహారి.

'చెక్క పని చేసేవాడు. ఇప్పుడు జబ్బు చేసి ఇంట్లోనే ఉంటున్నాడు'

ఆ పిల్లవాడికి ఒక సంవత్సరం వృథా అయితే ఆ కుటుంబ పరిస్థితి ఏమిటో తలుచుకుంటే కడుపులో దేవినట్లయింది అతనికి. ఒక నిర్ణయానికి వచ్చాడు. 'ఫీజు ఎంత కట్టాలి?' అని అడిగాడు.

'అయిదు వేలు'

తన అకౌంట్లో నుండి డ్రా చేసి ఆ అమ్మాయికి ఇచ్చాడు విహారి.

ఆ పిల్ల కళ్లలో ఒక్కసారిగా వెలుగు. అయిదు వేలు చేతిలో పుచ్చుకుని ఒక్క పరుగు తీసింది. 'ఇలా అయితే మీరు ఇక్కడ పని చేయడం కష్టం సార్. ఇక్కడ ప్రతి ఒక్కరు ఏదో ఒక కథ చెప్తారు. ఎన్ని కథలకని డబ్బులివ్వగలరు?' అన్నాడు రామారావు విహారి వైపు నిరసనగా చూస్తూ.

విహారి ఏం మాట్లాడలేదు. ఆ పిల్ల వయసే ఉన్న తన చెల్లెలు అతనికి గుర్తుకు వచ్చింది.

రోజుకొకసారయినా తన వారితో మాట్లాడక పోతే ఎలా ఉంటుందో తెలిసిన అతనికి సంవత్సరాలుగా తల్లితో మాట్లాడని ఆ అమ్మాయి పరిస్థితి తలచుకుంటే జాలి వేసింది. ఎలా అయినా బేబక్క ఎక్కడ ఉందో కనుక్కుని ఆమె కుటుంబంతో మాట్లాడించాలని అనిపించింది అతనికి. అది జరగాలంటే ముందు బేబక్క వివరాలు తెలియాలి.

ఆ సాయంత్రం పోస్ట్‌మాస్టర్ కనిపించినపుడు జరిగింది చెప్పి బేబక్క సంగతులు అడిగాడు విహారి.

పోస్ట్‌మాస్టర్ ఆ ఊర్లోనే పుట్టి పెరిగినవాడు. అతనికి అక్కడి మనుషుల సంగతులు మొత్తం తెలుసు. బేబక్క మాట వినడంతోనే గట్టిగా నిట్టూర్చి అదొక విషాద కథ' అన్నాడతను క్లుప్తంగా.

'రహస్యం కాకపోతే చెప్పవచ్చుగా' అన్నాడు విహారి.

'ఈ ఊర్లో రహస్యాలేం ఉండవు. అందరి జీవితాలు ఓపెన్ గానే ఉంటాయి. కొన్నాళ్ల క్రితం ఊర్లో ఒక ఆర్ఎంపీ డాక్టర్ ప్రాక్టీస్ పెట్టాడు. అతనికి చిన్న చిన్న పనుల్లో సహాయం చేయడానికి ఒక మనిషి సహాయం కావలసి వచ్చింది. యాక్టివ్‌గా ఉండే బేబక్క ఆ పని చేయడానికి ముందుకొచ్చింది. ఇంజెక్షన్లు చేయడం, గాయాలకి బ్యాండేజీలు కట్టడం, సెలైన్ పెట్టడం నెమ్మదిగా నేర్చుకుంది. చిన్న చిన్న జబ్బులకి ఏ మందులివ్వాలో కూడా తెలుసుకుంది. కొన్నాళ్లకి ఆర్ఎంపీ ఇక్కడ నుండి వెళ్లిపోయాడు. అతడు లేని ఊర్లో బేబక్క అనఫీషియల్ ఆర్ఎంపీ అయింది. ఊరిలో ఎవరికి ఏం అవసరం వచ్చినా బేబక్కే వారికి దిక్కయింది. బేబక్క మొగుడు కార్పెంటర్ పని చేసేవాడు. వారికి ఇద్దరు పిల్లలు పుట్టారు. టౌనులో కార్పెంటర్ పనికి బానే డిమాండ్ ఉండేది. మధ్య మధ్యలో సిటీకి కూడా తీసుకెళ్లి పనిచేయించుకునే వారు. ఇంతలో అతనికి టి.బి. వచ్చింది. ఖరీదయిన మందులు, తిండి అవసరమయ్యాయి. మరోవైపు అతను పని చేయలేని స్థితికి చేరుకున్నాడు. బేబక్క మీద పూర్తి కుటుంబ బాధ్యత పడింది. మొగుడిని ఇలానే వదిలేస్తే అతను చావడం ఖాయం అని బేబక్కకి తెలుసు. అందుకే తను గల్ఫుకి వెళ్లే నిర్ణయం తీసుకుంది. ఏజెంటు అక్కడ నర్సులకి బాగా డిమాండ్ ఉందని చెప్పాడు. మీ బ్యాంకులో రెండు లక్షలు అప్పు చేసి వాడికి ఇచ్చింది. వాడే దగ్గరుండి తీసుకెళ్లాడు. ఆ తరువాత ఆమె ఎక్కడ ఉందో, ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. ఎప్పుడన్నా ఆ ఏజెంటును అడిగితే.. 'మనుషులను గల్ఫుకు పంపడం వరకు చేయగలను కానీ, వాళ్లు అక్కడ నుండి ఉత్తరం రాయకపోతే నేనేం చేయగలను' అని తప్పించుకుంటున్నాడు. 'ఏది ఎలా ఉన్నా నెల నెలా డబ్బులయితే వస్తున్నాయి కదా' అని ఇంట్లో వాళ్లు కూడా పట్టించుకోలేదు. గత మూడు నెలలుగా డబ్బులు రావడం కూడా ఆగిపోయింది. ఏం జరిగిందో తెలియదు. ఎలా కనుక్కోవాలో అసలే తెలియదు' అంటూ ముగించాడు పోస్ట్‌మాస్టర్. 'ఇది ఒక్క బేబక్క కథ కాదు. ఎందరి కథలో ఇలానే అంతమవుతున్నాయి' అంటూ ముక్తాయించాడు.

విహారి మరుసటి రోజు బ్యాంకుకు వెళ్లాక బేబక్క అకౌంట్ ఓపెనింగ్ ఫారాలు తెప్పించుకుని చూశాడు. ఎన్నారై అకౌంటుకు పాస్‌పోర్ట్ జత చేయడం తప్పనిసరి కాబట్టి దాని కాపీ దొరికింది.

విహారితో పాటు బ్యాంకులో చేరిన అతని స్నేహితుడు ఫారిన్ ఎక్స్ఛేంజ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. అతనికి ఫోన్ చేసి, బేబక్క అకౌంటు వివరాలు చెప్పి అందులో వస్తున్న డబ్బులు ఏ దేశం నుండి వస్తున్నాయో, ఎవరి ద్వారా వస్తున్నాయో కనుక్కోమని అడిగాడు.

మరుసటి రోజు అతని నుండి వివరాలు వచ్చాయి. ఆ డబ్బులు సౌదీ నుండి వచ్చాయి.

ఆ వివరాల ప్రకారం సౌదీలోని ఎక్స్ఛేంజ్ కంపెనీకి ఫోన్ చేసి ఆ డబ్బులు ఎవరు పంపుతున్నారో తెలియజేయమని అడిగాడు.

వాళ్లు ఇరాక్‌లోని ఒక కంపెనీ పేరు చెప్పారు.

'నాకు కావలసింది కంపెనీ పేరు కాదు. అక్కడ కాంటాక్ట్ చేయడానికి ఎవరయినా ఒక మనిషి నెంబర్ ఇవ్వండి' అని అడిగాడు.

మొదట వాళ్లు ఒప్పుకోలేదు.

ఎంతో సముదాయించిన తరువాత ఎట్టకేలకు వాళ్లు ఒక నెంబర్ ఇచ్చారు.

విహారి పట్టువదలకుండా ఆ నెంబర్‌కు కాంటాక్ట్ చేశాడు. అవతల మనిషి హిందీలో మాట్లాడుతున్నాడు. తనకి కావలసిన సత్యవతి వివరాలు చెప్పాడు విహారి.

'ఎవరూ?' అడిగాడు అవతల వ్యక్తి.

'అసలు పేరు సత్యవతి. అందరూ బేబక్క అంటారు. పాస్‌పోర్టు నెంబర్...'

'అక్కర్లేదు. తను నాకు తెలుసు. ఇక్కడే ఉంది' అన్నాడు అవతల వ్యక్తి.

'ఆమె ఫోన్ నెంబర్ ఇవ్వగలరా? ఇంట్లో వాళ్లు ఒక్కసారి మాట్లాడాలని ఎంతగానో ఎదురు చూస్తున్నారు' అడిగాడు విహారి.

'ఆమె దగ్గర ఫోన్ ఉందో, లేదో నాకు తెలియదు, నీ నెంబర్ చెప్తే ఆమె చేత ఫోన్ చేయిస్తాను' అన్నాడతను.

విహారి అతనికి తన నెంబర్ ఇచ్చాడు.

* * *

ఇరాక్‌లో కిర్కుక్‌ని ఆయిల్ సిటీ అంటారు. దానికి దక్షిణాన ఉంది ఖుర్మాతు పట్టణం. అక్కడ ఉన్న అనేక ఆయిల్ కంపెనీలలో భారతీయ వర్కర్లు అత్యంత దయనీయ పరిస్థితుల్లో పనిచేస్తున్నారు.

వీరు అక్కడ ఉన్న సంగతి వారి కుటుంబసభ్యులకే కాదు, భారత ప్రభుత్వానికి కూడా అధికారికంగా తెలియదు.

భారతదేశం నుంచి ఉద్యోగాలు వెతుక్కుంటూ గల్ఫ్‌కు వెళ్తున్న వంద మందిలో ఎనభై

మందిని ఇక్కడి ఏజెంట్లు టూరిస్టు వీసా మీద పంపుతారు.

గల్ఫ్ చట్టాల ప్రకారం టూరిస్టు వీసా మీద వచ్చిన వారికి పని చేసుకునే అధికారం ఉండదు. ఇండియా నుండి కూలీలను పంపిన ఏజెంటుకు అక్కడ మరో ఏజెంట్ సంబంధాలు ఉంటాయి. ఆ ఏజెంటు వీరిని రెండు రోజులు అటుఇటు తిప్పి ప్రస్తుతం వారికి గల్ఫ్‌లో ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని తేలుస్తాడు. వారు ఇప్పటిదాకా పెట్టిన పెట్టుబడి వృథా అనీ, తిరిగి ఇండియా వెళ్లడం తప్ప మరో మార్గం లేదనీ వారిని మానసికంగా కుంగదీస్తాడు. అప్పటికే అన్ని రకాలుగా జీవితంలో ఓడిపోయి అక్కడకి చేరిన వారికి వెనక్కి ఇండియా వెళ్లే ధైర్యం ఉండదు. చివరికి ఏదో మార్గం చూడమని ఆ ఏజెంటును వీరు బతిమాలుకునేలా పరిస్థితులు కల్పిస్తారు.

'పోనీ గల్ఫ్‌లో కాదు కానీ... ఇరాక్ వెళ్తారా? అక్కడ ఉద్యోగాలు ఉన్నాయి' అని అడుగుతాడు ఆ ఏజెంట్.

'కానీ.. ఇక్కడ నుండి అక్కడకు చేరాలంటే డబ్బులు?'

'ప్రస్తుతం మీకు నేను పెట్టుబడి పెడతాను. మీకు వచ్చే డబ్బుల నుండి నెలకింతని కట్టుకుంటాను' అని చెప్తాడు ఆ ఏజెంట్. హామీగా వారి పాస్‌పోర్టులు తీసేసుకుంటాడు.

వీరు ఒప్పుకున్న తర్వాత అనధికారికంగా నౌకల అడుగున దాచి వీరిని గల్ఫ్ నుండి స్మగుల్ చేసి ఇరాక్ పంపుతారు. 48 డిగ్రీల వేడిలో రోజుకు పన్నెండు నుంచి పదిహేను గంటలు పనిచేస్తూ వారు ఒక్కసారిగా కాకుండా వాయిదాల పద్ధతిలో చచ్చిపోతారు. వారి దగ్గర ఏ విధమైన పత్రాలు ఉండవు. అసలు వారు భారతీయులని నిరూపించే ఆధారాలు ఉండవు. వారి దగ్గర ఎలాంటి ఫోనులూ ఉండవు. వారిని ఉత్తరాలు రాసుకోవడానికి కూడా అనుమతించరు. వారి తరుపున ఏజెంట్లే ఎంతో కొంత డబ్బు ఇండియాలో వారి అకౌంటుకు పంపుతుంటారు.

బేబక్క కూడా అలా ఇరాక్ చేరింది.

* * *

తన వివరాల కోసం ఎవరో ప్రయత్నిస్తున్నారని కూడా తెలియని బేబక్క ఖుర్మాతు పట్టణంలోని మార్కెట్ దగ్గరకు చేరుకుంది.

మార్కెట్ విపరీతమైన రద్దీగా ఉంది.

ఆమె లోపలకు నడవబోతుంటే ఆమెను అక్కడకి తెచ్చిన ఏజెంట్ కనిపించాడు. 'బేబక్కా! ఎప్పుడు వచ్చావ్? మూడు నెలలయింది నిన్ను చూసి. నువ్వు కనిపిస్తావేమో అని రోజూ చూస్తున్నాను' అన్నాడతను.

'ఎందుకు?' నిరాసక్తంగా అంది బేబక్క.

'ఇటు రా..' అంటూ అంతగా జనసంచారం లేని ఒక పక్కకి తీసుకెళ్లాడు ఏజెంట్. 'మీ ఊరి నుంచి బ్యాంకు మేనేజర్ ఫోన్ చేశాడు. మీ వాళ్ళు నీతో ఒకసారి మాట్లాడాలనుకుంటున్నారని

చెప్పాడు. నీ నెంబర్ అడిగాడు. నీ దగ్గర ఫోనే లేదన్న విషయం అతనికి చెప్పలేదు. అతని ఫోన్ నెంబర్ తీసుకున్నాను. కావాలంటే నువ్వు అతని ద్వారా మీ వాళ్లతో మాట్లాడవచ్చు'

అనుమానంగా చూసింది బేబక్క. మామూలుగా ఎవరినీ ఫోను మాట్లాడుకోనివ్వరు. అందుకే అనుమానంగా 'ఎవరినీ ఫోన్ మాట్లాడుకోనివ్వరుగా?' అంది.

'రహస్యం. ఇది నీ ఒక్కదానికే ఇస్తున్న చాన్సు. ఎవరికీ చెప్పకు. ఉపయోగించుకో దలచుకుంటే చెప్పు, ఇప్పుడే నా ఫోన్ ఇస్తాను'

మరింత అనుమానంగా అతని వైపు చూసింది బేబక్క.

'ఎందుకంత అనుమానం. దీనికి బదులు ఏమి అడుగుతాననా? నువ్వు ఇవ్వలేనిది ఏమీ అడగనులే, రాత్రికి ఒకసారి నీ గదికి వస్తాను. ఒక్కసారికి ఒప్పుకుంటే చాలు' వెకిలిగా నవ్వుతూ అన్నాడతను.

అక్కడకి వెళ్లిన ఆడవాళ్లకి ఇదో అదనపు భారం. కనిపించిన ప్రతివాడి కామపు చూపుల నుండి తప్పించుకోవడం అంటే రోజూ అగ్నిపరీక్షలో నిలిచి గెలిచినట్లే.

ఇప్పటికి ఎన్నోసార్లు బేబక్క అతని ఆఫర్ తిరగ్గొట్టింది. ఇప్పుడు కూడా అదే జరుగుతుంది అనుకున్నాడతను.

అయితే బేబక్క ఫోన్ ఇవ్వమన్నట్లు చెయ్యి చాపింది.

'ఒప్పుకున్నట్లేనా?' ఆనందంగా అడిగాడతను కన్ఫర్మ్ చేసుకోవటానికన్నట్లు.

బేబక్క ఏమీ మాట్లాడలేదు. చేయి అలా చాపే ఉంచింది.

అతను ఫోన్ రింగ్ చేసి ఇచ్చాడు. అవతల విహారి ఫోన్ ఎత్తాక బేబక్కకి ఇచ్చాడు.

ఫోన్లో మాట్లాడుతున్నది బేబక్కని తెలిశాక 'మీరు ఎలా ఉన్నారు? మీ విషయం తెలియక, మూడు నెలల నుంచి మీ దగ్గర నుంచి వచ్చే డబ్బులు కూడా రాకపోవడంతో మీ వాళ్లు కంగారు పడుతున్నారు' అన్నాడు విహారి.

'మా వాళ్లు ఎలా ఉన్నారు?' అని అడిగింది బేబక్క. ఎంత ఆపుకొందామనుకున్నా కన్నీళ్లు రాకుండా ఆగలేదు బేబక్కకి ఆ మాట అడుగుతుంటే.

'బానే ఉన్నారు. మీ గురించే గాభరా పడుతున్నారు. మీ ఆరోగ్యానికి ఏం ఇబ్బంది లేదుగా?' అడిగాడతను.

'మూడు నెలల క్రితం నన్ను మరో పది మంది మగవాళ్లతో కలిపి ఐసిస్ ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు' తెలుగులో చెప్పింది బేబక్క. పక్కన ఉన్న ఏజెంటుకు తెలుగు రాదు కాబట్టి అతనికి ఆమె మాటలు అర్థమయ్యే అవకాశం లేదు.

'మైగాడ్. ఎందుకు?'

నవ్వింది బేబక్క. 'మనిషికి ఒకరినొకరు చంపుకోవడానికి ఎన్ని కారణాలు లేవు. కిడ్నాప్ చేసిన మగవారిని అక్కడికక్కడే చంపేశారు. నేను ఆడదాన్ని కదా.. నేను ఉపయోగపడ్డా పడకపోయినా, నా శరీరం ఉపయోగపడుతుంది. అందుకే మూడు నెలలు నన్ను చంపకుండా ఆగారు'

'మీరు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు?' అనుమానంగా అడిగాడు విహారి. ఉగ్రవాదుల చెరలో ఉంటే ఆమె తనతో ఎలా మాట్లాడుతుందో అర్థంకాక.

'ఇప్పుడు నేను వారి చెరలో లేను. ప్రస్తుతం ఈ శరీరం మీద వారి ఇంట్రెస్ట్ అయిపోయింది. మా మధ్య ఒక ఒప్పందం కుదిరింది. నేను ఒక పని చేస్తే నాకు పాతిక లక్షలు ఇస్తామన్నారు. ఆ పని చేయడానికే నన్ను విడుదల చేశారు. నిజానికి నా అకౌంట్లో డబ్బు వేసేశామన్నారు. వచ్చిందా?'

అప్పటికప్పుడు ఆమె అకౌంట్లో చూసిన విహారి నిజంగానే పాతిక లక్షలు కనిపించాయి. నిన్నటిదాకా పాతిక రూపాయలు లేని అకౌంట్లోకి పాతిక లక్షలు రావడం అతన్ని ఎప్పుడూ లేనంత ఆశ్చర్య పరిచింది. 'వచ్చింది. అంతా డబ్బు ఇస్తున్నారంటే మీరు ఏం చేయాలి?' అడిగాడు విహారి.

'దాని సంగతి తరువాత. ఆ డబ్బు ఇంట్లో వాళ్లకి జాగ్రత్తగా చేర్చండి. ఇక ఎప్పటికీ ఆ అకౌంట్లోకి డబ్బులు రావు. నా గురించి ఎవరూ వెతకొద్దు. మీ సమయం వృథా చేసుకోవద్దు. ఆ విషయం మా ఇంట్లో వాళ్లకి అర్థమయ్యేలా చెప్పండి' అని ఫోన్ ఆపి, ఎదుటి వ్యక్తి చెప్పేది వినకుండా, ఫోన్ ఆఫ్ చేసి ఏజెంట్‌కు ఇచ్చేసింది బేబక్క.

ఏమీ మాట్లాడకుండా రద్దీగా ఉన్న మార్కెట్ మధ్యకి వచ్చింది బేబక్క. మార్కెట్ మధ్యలో నిలబడి వీలయినంత ఎక్కువమంది చనిపోయేలా తనను తాను పేల్చుకునేందుకు ఐసిస్ కట్టిన వెల పాతిక లక్షలు. జీవితం మీదే విరక్తి కలిగిన బేబక్కకి తను చనిపోవడం ఇబ్బంది కలిగించడం లేదు. తన వల్ల ఇంత మంది మనుషులు చనిపోబోతున్నారంటేనే బాధగా ఉంది.

'రాత్రికి వస్తున్నాను..' అన్నాడు ఆమెనే అనుసరిస్తున్న ఆ ఏజెంట్ చిలిపిగా చూస్తూ.

మొదటిసారి నవ్వింది బేబక్క.

'ఎందుకు నవ్వుతున్నావ్?' అర్థంకాక అడిగాడతను.

'రాత్రి దాకా ఆగలేకపోతున్నావా?' అంది బేబక్క.

అవునన్నట్లు తల ఊపాడతను.

'సరే పద..' అంది బేబక్క.

లాటరీ కొట్టినంత ఆనందించాడు అతను.

ఇద్దరు అక్కడ నుండి కొద్ది దూరం నడిచారు.

అతని పక్కన నడుస్తూ అతన్ని చూస్తే, తన లాంటి వేలాది మంది బాధలకు ప్రతీకగా కనిపిస్తున్నాడు ఆ ఏజెంటు. డబ్బులు కూడా తన అకౌంటుకు చేరిపోయాయి. ఇక తను ఏం చేసినా ఐసిస్ ఏమీ చేయలేదు.

ఆ మాట అనుకోగానే ఆమె చేయి పొట్ట మీదకి వెళ్లింది. అక్కడ బెల్టు బాంబు తగిలింది. ఆమె చుట్టూ చూసింది. ఇక్కడ పేల్చుకుంటే తాము తప్ప ఎవరూ చనిపోరు.

ఆ మాట అనుకున్న తరువాత ఆమె ఆలస్యం చేయలేదు.

మరుక్షణం అక్కడ ఒక పెద్ద విస్ఫోటనం సంభవించింది. తనను తాను పేల్చుకున్న బేబక్కతో పాటు ఏజెంటు కూడా అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.

* * *

'అమ్మ అంత డబ్బు పంపిందా?' అడిగింది బేబక్క కూతురు ఆనందంగా.

'అవును..' తను కూడా ఆనందంగా అన్నాడు విహారి. బేబక్క ఫోన్ పెట్టేయగానే ఆమె ఇంట్లో వాళ్ళని పిలిపించి, డబ్బు విషయం చెప్పాడు విహారి. అయితే ఆమె ఇక కనిపించదన్న విషయం మాత్రం ఎలా చెప్పాలో అర్థంకాక చెప్పలేదు.

'అందులో ఒక ఐదు వేలు ఇవ్వండి' అడిగింది ఎప్పుడూ వచ్చే చిన్నపిల్ల.

విహారి ఇచ్చిన డబ్బును తిరిగి అతని చేతిలో పెడుతూ, 'అమ్మకి ఎవరి దగ్గరా అప్పు చేయడం ఇష్టం ఉండదు' అంది.

ఆ అమ్మాయి సంస్కారానికి ఆశ్చర్యపోతూ డబ్బు తీసుకున్నాడు విహారి.

'ఈ విషయం ఇప్పుడే నాన్నకి చెప్తాను' అంటూ ఇంటికి పరుగు తీసింది ఆ అమ్మాయి.

* * *

రెండు రోజుల తరువాత ఎప్పటిలానే బ్యాంకు నిర్మానుష్యంగా ఉంది.

ఏం చేయాలో అర్థంకాక ఎదురుగా ఉన్న పేపర్‌లో తల దూర్చాడు విహారి.

ఇరాక్‌లో ఏదో ఒక పట్టణంలో నోరు తిరగని ఒక ఊర్లోని మార్కెట్లో జరిగిన ఆత్మాహుతి ప్రయత్నం, కొద్దిగా ముందు పేలడంతో త్రుటిలో తప్పిందని ఏడో పేజీలో ఒక మూల చిన్న అక్షరాలతో ఒక వార్త వచ్చింది.


విహారి ఆ వార్త చదివాడు. అతనికి బేబక్క మాటల అర్థం అప్పుడు బోధపడింది.



# అమ్మ పండుగ

ఎగుర్ల గణేష్

**తృతీయ బహుమతి రూ. 10,000 పొందిన కథ**



ఎగుర్ల గణేశ్‌ది జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడురు. తల్లిదండ్రులు మల్లయ్య, రాజవ్వ. అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో ఎంబీఏ చేసిన గణేశ్ ఐహెచ్ఎస్ మార్కెట్ కంపెనీలో సీనియర్ అనలిస్ట్‌గా పని చేస్తున్నారు. చిన్నప్పటి నుంచీ కళలు.. సాహిత్యం అంటే ఆయనకు చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే జీజే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లఘు చిత్రాలు నిర్మిస్తున్నారు. నమస్తే తెలంగాణ కథల పోటీల్లో విజేతగా నిలిచిన 'అమ్మ పండుగ' ఆయన రాసిన మొదటి కథ కావడం విశేషం.

**'నాని మంచిగున్నవారా!?'** ఫోన్లో అవ్వ.

'ఆ.. మంచిగున్న, నువ్వు మంచిగున్నవాయే?'

'మంచిగున్న గాని పండక్కు ఎప్పుడత్తున్నవ్ రా?'

'ఏవోనే నాకు సెలవు దొరికేతట్టు లేదు, అత్తనో రానో, బతుకమ్మ పండుక్కి రాను గని, అత్తే దసరకత్త'

'ఏం నౌకర్రా నీది నీ నౌకరి సల్లగుండ. నౌకరద్దు ఎవద్దు. సప్పిడెంట బంజేయ్. సేసుకుంటే మనకి యవుసం లేదా'

'అబ్బ అట్ల గాదే, కొత్త కొత్తగ గదా ఇప్పుడే సెలవడుగుతే ఏవంటరో. అయిన మనకి పండగ లేదు గదనే, అచ్చి ఎం జెయ్యలే' ఈ మధ్యనే మా పాలోల్లు ఒకలు చనిపోయిర్రు. మాకు పండుగుండది అదే అడిగా అవ్వని.

'అమ్మమ్మ ఫోన్ జేసింది పండుడక్కి రమ్మని, మనవడు నేను అత్తం తియ్యి అన్న'

'సరే నేను ఎట్నో జేసి అత్త తియ్యి'

'సరే, తిన్నావా మరే!?'

'ఆ తిన్న, ఇగ ఉండే. నాకు పని ఉంది, రెడీ అయ్యి మల్ల ఆఫీస్‌కి పోవాలే'

మాది కరీంనగర్ దగ్గర చిన్న ఊరు. హైదరాబాద్లో ఇంజినీరింగ్ చేసి ఇక్కడే ఈ మధ్య జాబ్‌లో జాయిన్ అయ్యాను. కార్పొరేట్ జాబ్, దసరాకి తప్ప మిగతా రోజులకి సెలవులు ఇవ్వరు. జాబులో జాయినయినప్పటి నుండి దసరా సెలవుల గురించే నా ఆలోచన. మిగతా

పండగలు ఎలా ఉన్నా, ఇది పెద్ద పండగ ఆయే, చివరికి ఎలాగో మా మేనేజర్ అయిదు రోజులు సెలవు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు.

రాత్రి 12.00కి ఎక్కితే మబ్బుల 5.30 వరకు ఇంటి దగ్గర ఉన్న. ఇంటికి వెళ్ళే సరికి అవ్వ అలుకు జల్లుతుంది. నన్ను చూసిందో లేదో చేతులు దబదబా కడుక్కొని వచ్చి గట్టిగా అలుముకుంది. అవ్వ నన్ను ఎంత మిస్ అవుతుందో ఆ కౌగిలిలో తెలుస్తుంది.

'ఎన్నింటికి ఎక్కినవురా బస్సు'

'రాత్రి పన్నెండున్నర అయింది గావచ్చే'

నిద్రుందో లేదో, పోయి కొంచం సేపు పండుకపో, నేను లేపుత గని'

'సరే, లేపు పండుకుంట' అని పోయి పండుకున్న.

నేను లేచే సరికి అవ్వ తయారయ్యింది. పట్టుగుచ్చు పువ్వు, బంతి పువ్వు, గున్క పువ్వు, పోకబంతి పువ్వు సంచుల్లో సర్దుతుంది. అవ్వ మొఖం వెలుగుతుంది. తన పుట్టింటికి పోవాలని ఎంత తొందరో. మా బాపునకు, మా ఇద్దరి మేనమామలకి ఏదో చిన్నప్పటి గొడవ. వాళ్ళ ఇంటికి ఎక్కువగా పంపించెటోడు కాదు. ఇంట్లో ఏవైనా చిన్న చిన్న పండుగలకి అప్పుడప్పుడు అవ్వ పోయేది. కానీ, నేను ఎప్పుడో చిన్నప్పుడు పోయిన. దసరా, సంక్రాంతి అసొంటి పండగలకి ఎప్పుడు పోలే. ఒక ఇరవయి సంవత్సరాల తర్వాతనేమో అవ్వ బతుకుమ్మ పండగ తన పుట్టింట్లో చేసుకునుడు.

'పండగ రెండ్రోజులుంది కదనే, ఇయ్యాల్ల పోయి ఏంజేత్తం, ఇవన్ని సర్దుతున్నవ్. ఎల్లుండి పోదం తియ్యి' సరదాకి అన్న అవ్వతో.

'నువ్వు గూడ మీ అయ్య లెక్కనే జేత్తవ్ ఏందిరా, ఆడిదానికి పుట్టింటికి పోవలని పాణం ఎట్ల గోట్టుకుంటదో మీకేం తెలుసు. నువ్వు పుట్టినెరుకల పోయిన అంటే మల్ల పోలే బతుకమ్మ పండుక్కి' అవ్వకి గుడ్లల్ల నీళ్ళు తిరిగినయ్.

'ఉత్తగన్న తియ్యే, ఇయ్యాల్లనే పోదం, మా దోస్తులది ఎవల్దన్న బండి అడుక్కత్త, అచ్చినంక పోదం' అట్ల అనంగనే అవ్వ ఖుషి అయింది.

మా దోస్తుగాని బండి తీసుకొని పొలం దగ్గరికి వెళ్లి అక్కడే స్నానం చేసా. తర్వాత ఇంటికచ్చే సరికి అవ్వ అన్ని సర్దిపెట్టింది. మా బాపుకోమాట చెప్పి బయల్దేరినం.

'ఈ నాలుగైదు రోజులు ఎట్ల అన్డుకొని తింటడో మనిషి' అంటూ బండి ఎక్కుతూ అంది అవ్వ. పుట్టింటికి వెళ్ళాలని ఉన్నా మా నాన్న ఎలా తింటాడో అని మా అవ్వ బాధ.

ఊరికి పోయే సరికి మా అమ్మమ్మ ఆకిట్ల కూసోని ఎవల్తోనో ముచ్చట్లు పెడుతుంది. మమ్మల్ని చూసి దగ్గరికచ్చి అలుముకుంది. మా అవ్వని చూసి మా అమ్మమ్మకి, అమ్మమ్మని చూసి మా అవ్వకి గుడ్లల్ల నీళ్ళు తిరిగినయి. అట్లనే కొంచం సేపు ఉండిపోయిన్రు.

మా పెద్దమామ అప్పుడే అచ్చినట్లున్నడు, 'చెల్లే ఇప్పుడే అత్తున్నవా?' అన్నడు.

'ఆ, ఇప్పుడే అత్తున్న అన్న' అంది అవ్వ.

'ఆకిట్ల ఎంత సేపు ఉంటరు గని ఇంట్లకు వోర్రి' అన్నడు. లోపలి నుండి మా పెద్దత్తమ్మ, నీళ్ళు తెచ్చిస్తే అవ్వ నేను కాళ్ళు కడుక్కొని లోపలి పోయినం.

'తమ్ముడు ఎటుపోయిండే, కనవడతలే' అంది అవ్వ.

'ఎడ్లకు నీళ్ళు పెట్టత్తా' అని పోయిండు, నేను ఇదివరదాకా ఆన్నే ఉన్న' అని నా వైపు తిరిగి 'అల్లుడు, నౌకరి అయిదంట, ఏపాటి దొరుకుతున్నయి' అన్నడు మామ.

'ఇప్పుడిప్పుడే గద అన్న, ఓ ఇరవయి వెయిల దాక అత్తున్నయ్. మెల్ల మెల్లగ పెర్గుతయంట' అంది అవ్వ.

మా ఇద్దరు మామలకి మగ పిల్లలు లేరు. ఇద్దరికి ఇద్దరు ఆడపిల్లలే. మా అవ్వ ఎప్పుడు అడుగుతుండేది 'మా పెద్దన్న బిడ్డని సేసుకోరా' అని. 'నువ్వు ఎవ్వలని సేసుకొమ్మంటే ఆల్లనే సేసుకుంట' అనేవాన్ని.

అందరు మరదళ్ళు ఒకటే దగ్గర కూసున్నరు. ఇద్దరు మరదళ్ళు గున్క పువ్వు మరత పెడుతుంటే ఇంకిద్దరు మరదళ్ళు బంతి పువ్వులు గుచ్చుతున్నారు. ఇంతమంది మరదళ్లలో నన్ను ఏ మరదల్ని చేసుకోమ్మంది? బంతి పువ్వులు కుచ్చే మరదళ్ళు చిన్న మరదళ్ళు అని అర్థం అవుతుంది. ఇంకిద్దరి మరదళ్లలో ఎవలో.

మా అవ్వ అచ్చిందని తెలిసి సూసుటనికి ఎవలో ముసలామే అచ్చింది. 'రాజేశ్వరి అచ్చిందట ఏది' అని మా అమ్మమ్మని అడిగింది.

'ఇప్పుడే ఇంట్లకు వోయింది. అట్ల కూసో' అని నా దిక్కు సుసుకుంట 'మనవడు' అంది అమ్మమ్మ.

'ఏందీ..!? రాజేశ్వరి కొడుకా, ఇంత పెద్దగైండా, మీసాలచ్చినయి పిలగానికి', 'మన్వడా నన్ను గుర్తువట్టినవా?, చిన్నప్పుడు నన్ను ఎద్దులెక్క అంబాడువని దున్ను.. దున్ను.. అనుకుంట ముడ్డెనుక ముళ్ళు గటె పట్టి పోడిచినవు' అంది.

ఆ అమ్మ అట్ల మొహమాట పడకుంట అంటుంటే నాకు సిగ్గయింది. ఒక మరదలు పిసుక్కుమని నవ్వినట్లు ఇనచ్చి ఆ సిగ్గు కొంచెం ఎక్కువైంది.

'మరే, నలుగురు మరదళ్లల్ల ఏ మరదల్ని సేసుకుంటవోయ్' అంది.

ఏం మాట్లాడాలో అర్థం కాలే, నలుగురు మరదళ్ల దిక్కు చూసా. ఒక మరదలు మాత్రం బాగా సిగ్గు పడుతుంది. బాహుశా పెద్ద మరదలు ఆమెనే అయుంటది. 'ఒక్కల్నెందుకు, సేసుకుంటడు. నల్గురిని సేసుకుంటడు. అందరి పొత్తుల ఒక్కడే బావాయే' అంది అప్పుడే లోపలికి వస్తూ ఇంకో ముసలమ్మ.

'నా కోడల్లేమో గానీ, మీరే సేసుకునే తట్టున్నారు గద నా కొడుకుని' లోపల నుండి బయటికత్తు అంది అవ్వ. 'ఆల్లు అట్నే కారడ్డం ఆడ్తరు, నీకు నానమ్మలైతరు' అంది అవ్వ నా

దిక్కు తిరిగి.

అవ్వని సూడక చాలా రోజులైందని సూసుటనికి అచ్చిరంట. అవ్వ ఆల్లతో పరేష్కాలు ఆడుతూ మాట్లాడుతూవుంటే చాల బాగా అన్పించింది. అవ్వని ఇంత ఖుషీగా ఎప్పుడు జూల్లే. ఆళ్ళతో మాట్లాడుతూ తన చిన్నప్పటి రోజుల్ని గుర్తు తెచ్చుకుంటుంది. అవ్వ వాళ్లతో మాట్లాడుతుంటే ఇంకో ఇద్దరు అవ్వ వయసు ఉండేవాళ్ళు అచ్చిర్రు. ఆళ్ళతో మాట్లాడుతుంటే అవ్వ సిన్నప్పటి దోస్తులని అర్థం అయింది. అవ్వ ఎవరినేవరినో కలవాలని ఆళ్ళతో అంటుంది. అవ్వ కలవాలనుకునే వాళ్ళు కొందరు వాళ్ళ అత్తగారి ఇంటిదగ్గరే ఉన్నారని తెలిసి బాధపడింది.

'ఇప్పటి ఆడోల్లు బతుకమ్మలు ఆడరుల్ల, ఏవైనా డీజేలు పెట్టుకోవాలి ఎగరాలే, ఓ పాట లేదు పద్యం లేదు' అంది మొదట పరేష్కం ఆడిన అమ్మ.

'అవును పెద్దవ్వ, గంట సేపటి కోసం చీరలు గొనాలే, నగలు కొనాలే. ఆడేది అద్దగంట అయితే, గంటలు గంటలు దుకాన్ల పొంటి తిరగాలే' మా చిన్నమామ ఇంట్లకి వస్తూనే అన్నాడు. మా అవ్వని సూసి 'ఎప్పుడచ్చినవ్ అక్క?' అన్నడు.

'ఇప్పుడే అచ్చిన, మరదలేదిరా?' అంది.

'బంతి పువ్వులు అమ్ముకరాను అంగట్లకు వోయింది' అని నా దిక్కు తిరిగి 'అల్లుడు గూడ వచ్చినట్లుండు, తిన్నారా' అన్నడు.

నేను తిన్న అన్నట్లు సైగ చేసా, మా మామ లోపలికి పోయిండు. మా చిన్నమామ పెద్ద మామలాగా గంభీరంగా ఏంలేడు. కొంచం సరదాగానే ఉండేలాగానే ఉన్నాడు.

'చిన్నప్పుడు రాజేశ్వరి ఎట్ల పాడేది. దీని పాట కోసం ఈ వాడకట్టు ఆ వాడకట్టు అని లేకుండా అందరు పిల్సుకపోయేటోళ్ళు' అంది రెండో ముసలమ్మ.

'చిన్నప్పుడు, అది ఇంటికాడ ఏడుండేది. రెండు మూడు సార్ల పక్కూరోల్లు గూడా తీసుకపోయేటోల్లు. ఒకసారి దొరగారింటికాడ పాట పాడే దానికి శీర గూడ ఇచ్చిన్రు' గర్వంగా చెప్పుకుంది మా అమ్మమ్మ.

అందరి నోటు నుండి మా అవ్వ చిన్నతనం గురించి తెలుసుకుంటూ ఉంటే ఏదో తెలియని ఆనందం కలుగుతుంది. అవ్వ చిన్నతన్నాన్ని నేను చూడకపోవచ్చు గాని వాళ్ళ మాటల ద్వారా తెలుసుకున్నా. సిన్నప్పటి రోజులు గుర్తస్తే ఎవలకీ ఆనందంగ ఉండదు?, మా అవ్వ బాల్యం అంత ఇక్కడే తన పుట్టింట్లో, పుట్టిన ఊళ్ళో ఉంది. పుట్టిల్లంటే అమ్మ నాన్నలే కాదు బాల్యం. పాపం ఎంత మిస్ అయిందో మా అవ్వ ఇన్నేండ్లు.

రాత్రి అందరు ఒక సొట కుసుండి ముచ్చట్లు పెట్టుకుంటున్నం. నాకు నా పెద్ద మరదలెవరో తెలిసిపోయింది. అప్పుడప్పుడు నా వైపు తొంగి చూస్తున్నట్లు నా అనుమానం. కానీ, నా చూపులకి దొరకట్లేదు. మా మామలిద్దరు లోపలకి పోయి పండుకున్నరు. మా అత్తమ్మలు, అవ్వ, అమ్మమ్మ, మరదళ్ళు ఒక దగ్గర సేరి ముచ్చట్లు పెడున్నరు. అందరి ఆడవాళ్ళ మధ్య నేను ఒక్కన్నే ఉన్న. ఇక్కడ ఫ్రెండ్స్ ఇంక బామ్మరుదులు ఎవరు లేకపోయే సరికి అవ్వ కొంగు పట్టుకొని

తిరగాల్సి వస్తుంది. మరదళ్లతో టైం స్పెండ్ చేద్దాం అంటే వాళ్ళకు సిగ్గే, నాకు సిగ్గే. ఇప్పుడు కూడా అవ్వ వొళ్ళో పడుకొని వాళ్ళ మాటలు వింటున్న.

'అత్తమ్మ నువ్వు పాటలు మంచిగ పాడుతవంట కదా, ఒక పాట పాడవా?' అని మా చిన్న మరదలు అడిగింది.

'ఇప్పుడు ఏడ గుర్తున్నయి బిడ్డ అన్ని మర్చిపోయిన'

'అబ్బ పాడత్తమ్మ! ప్లీజ్' బతిలాడే సరికి అవ్వ కాదనలేక పోయింది.

'చిన్నన్న శ్రీకృష్ణా నీ బిడ్డానడుగస్తి..' అనుకుంటూ ఒక పాట పాడింది అవ్వ. అవ్వ ఇంత మంచిగ పాడుతుందని ఎప్పుడు తెలవది. ఒక ఆడబిడ్డ నీ బిడ్డని నా కొడుక్కి సేసుకుంట అని తన అన్నని అడిగితే, మీకు ఆస్థి గిట్ల ఏం లేదు నేను ఇవ్వను పొమ్మంటు సాగుతుంది ఈ పాట.

తర్వాత ఇంకో పాట పాడింది, 'పాలిచ్చి పండబెట్టి బాలానాగామ్మో.. నీల్లకంటా పోతినే బిడ్డ బాలా నాగమ్మ'. ఒక తల్లి తన కూతురిని వాళ్ళ ఆరండ్లు చంపి.. అన్నం వండే కుండలో పెడితే, అది తెలియని ఆ తల్లి ఆ కుండలోనే అన్నం వండుతుంది. అన్నం కలిపేటప్పుడు తన బిడ్డ శరీర భాగాలు చూసి వర్ణిస్తూ ఏడ్చుకుంటూ పాడే పాట.

అవ్వ పాడే ప్రతి పాటలో ఒక కథ ఉంది, మంచి అర్థం ఉంది. చిన్నప్పుడు ఎక్కడికి పోయినా అందరు అవ్వని పాటలు పాడుమనేటోల్లంట. మంగళారతి పాటలు, పెండ్లిలల్ల, సేన్లల్ల నాట్లేసేటప్పుడు కూడా పాడేదంట.

చిన్నప్పుడు 'నా బిడ్డని నువ్వు నాట్లేయ్యకపోయినా ఏంగాదు గానీ పాట పాడుదువుదా' అని కైకిలికి తీసుకుపోయేటోళ్ళు, నా బిడ్డని' అంది అమ్మమ్మ. 'నువ్వు పెద్దదానివి అయినప్పుడు కూడా మంగళారతి పాట మీ అత్తనే కదనే పాడింది' అంది మా పెద్ద మరదలు దిక్కు చూసుకుంటు.

తను సిగ్గుతో కూడిన కోపంతో మా అమ్మమ్మ తొడ మీద కొట్టింది.

'గిట్ల కొడెత నా మనువడు నిన్ను సేసుకోడు' అంది అమ్మమ్మ.

ఆడకట్టోళ్ళు అందరచ్చి అవ్వను తీసుకుపోయిర్రు. 'కోలలు ఆడుదం పాటలు పాడుదువుదా' అని. అవ్వ చిన్నప్పుడు రాత్రి ఎక్కవగా కోలలు ఆడెటోల్లంట. రేపు పెద్ద బతుకమ్మ పండుగ. కోలలు ఆడిన తర్వాత అత్తమ్మలు, అవ్వ సత్తి పిండి చేస్తే మరదళ్ళు గున్క పువ్వు కట్టలకు కలర్లు అద్దిర్రు.

అవ్వ అత్తమ్మలు కలిసి బతుకమ్మ పేర్చిరు. చిన్నమామ బతుకమ్మని తీసుకెళ్ళి అనుమండ్ల గుండి దగ్గర పెట్టిండు. ప్రతి సంవత్సరం ఇక్కడే బతుకమ్మ ఆడుతారంట. అవ్వని చూసి చాల మంది పలకరించిర్రు. కనబడిన చాలామందికి 'నా కొడుకు' అంటూ నన్ను చూపించింది. చాలా మంది అవ్వనే పాడమన్నరు. అవ్వ పాడే పాట వినాలని అనిపించినా అంతమందిలో సరిగ్గా వినిపించలే. తర్వాత మైక్ పెట్టిన్చిర్రు. అవ్వ పాడేది వినుకుంటూ కూర్చున్నాను. రాత్రి అయిన తర్వాత అందరు ఊరి చెరువు దగ్గరికి తీసుకెళ్ళి బతుకమ్మల్ని నిమర్జనం చేసిర్రు. బతుకమ్మలు నిమ్మర్జనం చేసి వచ్చిన తర్వాత సత్తి పిండితో 'అచ్చుకో ఆయినం, పుచ్చుకో ఆయినం.. నాది

కొత్త సిబ్బి నీది పాత సిబ్బి' అంటూ ఆడుకున్నారు. సద్దులల్ల తెచ్చుకున్న సత్తుపిండి ఒకరికొకరు పంచుకొని తిన్నరు. బతకమ్మల మీది పసుపుతో చేసిన గౌరమ్మని సెంపలకి అద్దుకున్నరు. మా అత్తమ్మలు అవ్వకి వదిన మరదళ్ల వర్సయినోల్లు అమ్మకి సెంపల నిండా పసుపు పూసిఁరు. అవ్వ వాళ్లతో చిన్నపిల్లలా ఆడుతుంటే చూడటానికి ముచ్చటేసింది.

ఇంటికచ్చినంక అవ్వతో 'అవ్వ, నిన్నొకటి అడగన్నాయే' అన్న.

'ఏందిరా, అడుగు' అంది.

'నువ్వు గింత మంచిగ పాటలు పాడున్నవు కదా, మన ఇంటి దగ్గర ఎప్పుడు పాడలే'

'ఎందుకు పాడలేదుర. పాడిన, కాని బతుకమ్మ పండక్కు పాడేదాన్ని. అప్పుడు నీ ఆట నీదేనాయే నా పాటలు ఇన్నవా? గిట్ల ఇంట్లకూసున్నప్పుడైతే ఉత్తగ ఎప్పుడు పాడలే'

'అయితే నువ్వు పాడే పాటలన్నీ అబ్సర్వ్ చేసినా, పాటలన్నీ ఎవరో కష్టాలు పడినట్లే ఉన్నయి. సీతమ్మ కష్టాలో, ఎల్లమ్మ దేవి లేదా ఎవరైనా ఒక రాణి కష్టాలో. ఇట్ల అన్ని కష్టాల చుట్టే తిరుగుతున్నాయి ఎందుకు?'

అవ్వ కొంచం సేపు సమాధానం ఇవ్వలే. ఏదో ఆలోచించింది. 'నువ్వు సిన్నప్పుడు నాకు మీ బల్లె సారు చెప్పిండని ఒక కథ సేప్పినవ్ ఆదికుందా?'

'ఏం కథ?!'

'ఒక చిన్న పిలగాడు ఆల్ల బాపు సెప్పులు కొనివ్వలేదని ఏడ్సుకుంట ఇంట్ల నుండి పోతడు . అవతల కాళ్ళు లేని మనిషిని సూసి అయ్యో నాకు చెప్పులు లేవని ఎడ్డున్న, ఇతనికి కళ్ళే లేవని బుద్దచ్చి ఇంటికి పోతడు' అవ్వ తన మాటల్లో చెప్పింది. చిన్నప్పుడు మా తెలుగు టీచర్ చెప్పిన కథ సారాంశం అది.

ఆ కథకి అవ్వను నేను అడిగిన దానికి ఏం సంబంధమో అర్థం కాక చూసిన.

'బతుకమ్మ ఆడేది అందరు ఆడోల్లె, ఒక్కొక్కలకి ఒక్కో కట్టం ఉంటది. ఒక్కో పాటల ఒక్కో దేవుని కట్టం ఉంటది. కట్టంయే కాదు ఉత్త పాటలు కూడ ఉంటయి. ఈ కట్టం ఉండే పాటలల్ల ఒక్కో దేవునికి ఒక్కో రాజుకు ఒక్కో కట్టం ఉంటది. ఆ పాటలు ఇనే ఆడోల్లకు అన్పియ్యదా ఆ దేవాన దేవతుల్లకి, రాజాకరాజులకే కట్టాలు తప్పలే, మనమెంత అని' అంది.


అవ్వ ఇంత లోతుగా ఆలోచిస్తుందని ఎప్పుడూ అనుకోలే. మొదటి సారి అవ్వ ఒక ఫిలాసఫర్‌లాగ కనబడింది.



# సిద్ధయ్య మఠం

## ప్రొఫెసర్ రామా చంద్రమౌళి

**తృతీయ బహుమతి రూ. 10,000 పొందిన కథ**



ప్రొఫెసర్ రామా చంద్రమౌళి కవి, కథకులు, నవలాకారులు, విమర్శకులు. 1950లో జన్మించారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీజీ చేశారు. ప్రస్తుతం వరంగల్‌లోని గణపతి ఇంజినీరింగ్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ప్రవృత్తి సాహిత్య రంగం. ఇప్పటి వరకూ ఆయన 53 గ్రంథాలు, 32 నవలలు, 356 కథలు, 12 కవిత్వ సంపుటాలు, 3 నాటకాలు, 4 విమర్శాగ్రంథాలను ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ సాహిత్య సదస్సుల్లో పాల్గొన్నారు. ఆయన సేవలకు గాను తెలుగు విశ్వవిద్యాలయం కవితా పుస్కారం, సినారే కవిత్వ పురస్కారంతో పాటు ఎన్నో పురస్కారాలు అందాయి.

**ఎర్రగా తెల్లారింది.**

మైసమ్మగండి ఊరు ఊరంతా ఇక ప్రేలబోతున్న అగ్నిపర్వతంలా నిశ్శబ్దంగా, గంభీరంగా, కుతకుత ఉడుకుతున్న లావాలా ఉంది.

ఊరి జనాభా రెండు వేలమందిలో ఏ ముసలీముతకనో విడిచిపెడ్తే.. ఆడా, మగా.. పిల్లాపాపతో సహా అందరూ మైసమ్మ గుట్ట చుట్టూ వరుసగా నిలబడి ఒక చుట్టు చుట్టి.. పాల సముద్రంలో మందరపర్వతం చుట్టూ తాడులా వాసుకి చుట్టుకున్నట్టు గుట్టను అలుముకుని నిలబడ్డరు.. ఎర్రటి ఎండలో.. రెండు గంటలనుండి.

'ఎవడస్తడో రానీ.. వానింట్ల పీనుగెల్ల.. మా గుట్టే దొరికినాది వానికి. మైసమ్మ తల్లి వాన్ని నెత్తురు కక్కించి పిడాత పానం తీత్తది' అని ఎనభై ఏండ్ల ముత్తక్క శాపనార్థాలు పెడ్తోంది.

ఎండాకాలం. మే నెల. పొద్దెక్కి గంటయిందో లేదో. వడగాలి మనుషులను కుమ్ములో పెట్టిన కందగడ్డోలె ఉడికిస్తాంది.

ఊరి బాయిలల్ల నీళ్ళు నెలరోజుల కిందటే ఎండిపోయి.. నేలలన్నీ నెర్రెలుబాసినై.

డెబ్బైరెండు సంవత్సరాల స్వతంత్ర భారతదేశం.. ఊళ్ళల్ల తాగడానికి నీళ్ళు లేవు.

ఈ పరిస్థితిని ముందే ఊహించిన ఆ ఊరి జనం సిద్ధయ్య నేతృత్వంలో స్వయంగా చెక్ డ్యాంలను నిర్మించుకోవడం, ఇంకుడు గుంటలను ఏర్పాటుచేసుకోవడం, ఊరి పోతురాజు చెరువు పూడికను తీసుకోవడం.. ఇట్లా ఎన్నో జాగ్రత్తలను తీసుకుంటూనే ఉంది. కానీ, గత మూడు సంవత్సరాలుగా మామూలు వర్షాలు కూడా లేవు. ఎటూ తోచని గడ్డు పరిస్థితి.

ప్రకృతి వికటిస్తే మనిషి ఎంత గొప్పవాడైనా ఎట్లా నిస్సహాయుడౌతాడో అనుభవపూర్వకంగా తెలుస్తోంది ఆ ఊరిలోని ప్రతి ఒక్కరికీ.

ఇప్పుడు.. రెండు సమస్యలు.

ఒకటి.. ఊరికి 'అమ్మ ' యాభై రెండేండ్ల జానకి హఠాత్తుగా చచ్చిపోయింది నిన్న.

ఊరు ఊరంతా అనాథ ఐపోయినట్టు.. ప్రతి ఒక్కరిలోనూ దుఃఖం గూడు కట్టుకుంది. ఆ ఊరి ప్రతి కుటుంబంలోని బాలబాలికనూ జానకమ్మే స్వయంగా బాధ్యత వహించి తల్లికంటే ఎక్కువగా వాత్సల్యిస్తూ.. సిద్ధయ్య మఠం నేతృత్వంలో ఒక్కొక్కరిని డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, వివిధ భిన్నమైన రంగాల్లో ప్రముఖ పాత్రికేయులుగా, సామాజిక కార్యకర్తలుగా, రచయితలుగా, పారిశ్రామిక వేత్తలుగా, ఉద్యోగాలు చేసేవాళ్ళుగా కాకుండా ఉద్యోగాలను సృష్టించి ఉపాధి కల్పించే ఔత్సాహికులుగా రూపొందిస్తూ.. మైసమ్మ గండి అంటే ఒక ఆదర్శ గ్రామం.. ఒక సమసమాజ నిర్మాణ లక్ష్యంతో రూపొందుతూ చుట్టూ వందల గ్రామాలకు ఒక 'మోడల్' గ్రామంగా వర్ధిల్లుతున్న ఊరుగా ముద్ర.

జానకి ఎప్పుడూ చెప్పేది.. 'మైసమ్మ గండి అంటే.. తొణికిసలాడే నిత్యనూతన చైతన్యం..

మైసమ్మ గండి అంటే బిగించిన పిడికిలివంటి.. ఒక ఐక్యత. ఒక కట్టు. ఒక అవిభాజ్య శక్తి.

బయట ఒక ముద్ర ఏర్పడింది 'మైసమ్మ గండి అంటే.. అందరిదీ ఒక్కటే మాట.. అందరిదీ ఒకటే బాట' అని.

రెండవది.. రాత్రి సిద్ధయ్య మఠంలో జరిగిన గ్రామపెద్దల సమావేశంలో తెలిసిన సంగతి. ఊరి సర్పంచ్‌తో సహా ఏడుగురు వార్డ్ సభ్యులు.. ఇతర ముఖ్యులూ సిద్ధయ్యతో చర్చించి కార్యాచరణను రూపొందించుకుని వచ్చి ఎవరికివారు వారివారి ఇండ్లలో అందరికీ సమాచారమందించి.. మొత్తం ఊరి జనాన్ని సంసిద్ధులను చేయడం.

సమాచారం వేసవికాలం మంట అంటుకున్న గడ్డివాములా వ్యాపించింది.

ఊరికి ఉత్తరాన యుగయుగాలుగా గ్రామరక్షగా ఉంటున్న 'మైసమ్మ గుట్ట'ను ఎవరో కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం పదేండ్ల మైనింగ్ కోసం లీజ్‌కిచ్చిందట. ఈ వార్త ఊరి గుండెల్లో బాంబులా పేలింది. ఉలిక్కిపడింది పిల్లాపాపా, పడుచూముసలీ, పశువూపక్షీ.

రాత్రి సిద్ధయ్య దాదాపు యాభై మంది ఊరి పెద్దలతో జరిపిన సమావేశంలో చెప్పిండు.. 'మైనింగ్' అంటే ఏమి జరుగబోతోందో, పదేండ్లలో మైసమ్మ గుట్ట కల్లాస్ అని అర్థమైంది అందరికీ.

'మన తెలంగాణలో కరీంనగర్‌ను చూసిండ్రా.. ఆంధ్రాలో తమిళనాడుకు దగ్గర్లోనే ఉండే కుప్పం గురించి విన్నరా.. దాదాపు వందల గుట్టలను మైనింగ్ పేర ప్రభుత్వాలతో కుమ్మక్కై గ్రానైట్ మాఫియాలు కోట్లకొద్ది రూపాయలను దండుకుంటూ బహిరంగంగానే ప్రకృతి సంపదను హరిస్తున్నాయి. ఒక్క కరీంనగర్‌లోనే గత పదేండ్లలో వందల గుట్టలు మాయమై గుట్ట ఉన్నచోట లోపలిదాకా రాయిని తొలుచుకుపోయిన భూమి లోపలి కుడుకను గీక్కున్న కొబ్బరి చిప్పల్లా చెరువులై మిగిలిపోయినై. ఊళ్ళకు ఊళ్ళు ప్రజలందరూ నిస్సహాయులై చూస్తూండగానే ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రత్యేక రైలు పెట్టెవంటి ఇరవై చక్రాల ఓపెన్ టాప్ లారీలు పదుల టన్నులకంటే ఎక్కువగా ఉన్న గ్రానైట్ బ్లాక్‌లను మోసుకుంటూ గర్భిణి వలె రొప్పుతూ వరంగల్, తొర్రూర్, ఖమ్మంల మీదుగా చెన్నై, కృష్ణపట్నం ఓడరేవులకు చేరుకుం టుంటై. అక్కడి నుండి ఓడల్లో లోడై.. చైనాకు, జపాన్‌కు..తదితర దేశాలకు ఎగుమతి ఔతున్నై. వాళ్ళు ఈ ఉత్తమమైన మన గ్రానైట్‌ను సన్నని పలకలుగా కట్ చేసి, పాలిష్ చేసి మళ్ళీ ఎక్కువ ధరకు మనకే అమ్ముతూ.. ప్రపంచ మార్కెట్‌ను విపరీతమైన లాభాలతో మోనోపలీగా ఏలుతున్నారు. ఎన్నో మానవవనరులు, సాంకేతిక పరిజ్ఞానం ఉండి కూడా దివాళాకోరు రాజకీయ నాయకుల వల్ల ఇక్కడి ప్రభుత్వాలు ఈ రకమైన ప్రకృతి సంపదను నాశనం చేస్తూ వాతావరణ సమతుల్యతను ధ్వంసం చేస్తూ ఇక్కడి భావితరాల నోళ్లలో మట్టి కొడ్తోంది. ఈ గ్రానైట్ రాకెట్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు.. ఎమ్మెల్యేలు, ఎంపీలు.. స్థానిక జిల్లా నాయకత్వాలు, రాష్ట్ర కేంద్ర మంత్రులు అందరూ తమతమ పార్టీలకతీతంగా అందరూ ఒక్కటై ఈ పరిపూర్ణ పర్యావరణ దోపిడీకి పాల్పడుతున్నరు. మన్నుతిన్న పాముల్లా సెల్‌ఫోన్లకూ, ఇంటర్నెట్ భోగాలకూ, బూతు సినిమాల మోజుల్లో కూరుకుపోయిన మన వృద్ధ యువతా, నిస్సహాయ గ్రామ ప్రజలూ విధిలేక బిక్కచచ్చి చూస్తూ ఊర్కుంటున్నరు. ఎక్కడో ఎవరో ఒకరు

ఈ మాఫియాను ప్రతిఘటిస్తూ ప్రశ్నించి తిరుగబడ్తే.. వాడంతే.. ఏ రాతిగుట్ట బ్లాస్టింగ్‌లోనో హతమైపోతున్నడు. ఈ రాకెట్‌లో లారీలను పర్మిట్ చేస్తున్న రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లు, నియమితమైన లోడ్‌ను మాత్రమే మోయగలిగి.. బరువు అధికమైతే చితికిపోయే రోడ్లపై ప్రయాణానికి అర్హంకాని ఈ రాతి లోడ్ లారీలను అనుమతిస్తున్న ఆర్ అండ్ బి అధికారులు, పోలీస్, మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు.. సీ పోర్ట్‌లలో నిబంధనలను ఉల్లంఘిస్తూ సత్వర ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్న పోర్ట్ అధికారులు, ప్రకృతి వనరుల పరిరక్షణకు బాధ్యత వహించవలసిన జియాలజీ శాఖ.. ఇంతమంది కుమ్మక్కై ప్రకృతిమాతను హత్య చేస్తున్నారు నిర్దాక్షిణ్యంగా.

ఈ సామాజిక దోపిడీని కొనసాగిస్తున్నవాళ్ళు నిరక్షరాస్యులా.. ఈ విధ్వంసాన్ని తెలియక చేస్తున్నారా.. అంటే అదికాదు. అందరూ బాగా చదువుకున్నవారు.. ఉన్నత విద్యావంతులు. మంచీ చెడూ అన్నీ తెలిసినవాళ్లే. ఈ దేశానికి ఎప్పటినుండో ఈ ఉన్నత విద్యావంతులతోనే ప్రమాదం ముంచుకొస్తోంది. వాళ్ళే దేశద్రోహులు.

సహజంగా ఒక్క రాయి తయారు కావాలంటే.. కొన్ని లక్షల సంవత్సరాల కాలం కావాలె. వీళ్ళు హరిస్తున్న ఈ గుట్టలకు గుట్టల శిలలు మళ్ళీ సృష్టించబడాలంటే.. ఈ ప్రకృతి ఎన్ని యుగాల కాలం ప్రసూతి నొప్పులు పడాలో ఆలోచించండి. కొన్ని యుగాలపూర్వం సూర్యశకలంగా విడివడి కోట్ల సంవత్సరాల తర్వాత 'మాగ్మా' అని వ్యవహరించబడే ద్రవశిల శీతలీకరణ చెందుతూ ముప్పై కిలోమీటర్ల లోతుగల భూమిపై పొరగా ఏర్పడి.. లిథిఫికేషన్ చెంది.. ఈ అందమైన పర్వతాలు.. సరస్సులు, అడవులు, నదులు, కొండలు.. సెలయేర్లు.. ఏర్పడ్తే.. ఈ మానవ దుర్మార్గులు.. తల్లి శరీరంపైబడి ఒంటిని పీక్కుతింటున్న రాబందుల్లా.. ఒకడు గుట్టలను, ఒకడు ఇసుకను, ఒకడు ఇనుప, అల్యూమినియం ఖనిజాలను, మరొకడు బైరైట్ గనులను, ఇంకొకడు అడవులను, చందనపు చెట్లను.. ఇక ప్రభుత్వాలు ఏకంగా భూమిని తొలుస్తూ దశాబ్దాల పర్యంతం బొగ్గు గనుల పేరుతో ఓపెన్‌కాస్ట్ మైనింగ్ రూపంలో ఊళ్లకు ఊళ్లను కబళిస్తూ.. ఒక నిరంతర హత్యాసదృశ విధ్వంసం ఇది.

మన దేశం నుండి ఈ గ్రానైట్‌ను కొంటున్న చైనాగానీ, జపాన్‌గానీ, ఇతర ఏ దేశమైనాగానీ.. వాళ్ల దగ్గరి గుట్టల జోలికి మాత్రం పోరు. వాళ్ళ ప్రకృతి వనరులను జాగ్రత్తగా పదిలపర్చుకుని దాచుకుంటరు వాళ్ళ భావి తరాలకోసం. మనకు ఈ ఇంగిత జ్ఞానం లేదు. మనవాళ్ళు.. ప్రధానంగా రాజకీయ నాయకులు తమకు లాభం వస్తోందంటే ఈ దేశాన్ని కూడా ఎవరికైనా కుదువబెట్టి అవసరమైతే అమ్ముకుంటరు.

గ్రామమంతా చింతాక్రాంతులై వింటూండగా.. సిద్ధయ్య మొబైల్ ఫోన్ మోగింది.

'హలో.. మోహన్. ఎక్కడినుండి.. అమెరికా నుండి హైదరాబాద్‌కు చేరుకున్నవా. అనేక ప్రాంతాల్లో సెటిలైన మన ఊరి యువకులందరూ ఒకరి తర్వాత ఒకరు దుఃఖపూరితంగా స్పందిస్తున్నారు. జానకమ్మ హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక్కడ కూడా ఊరూఉరంతా శోకసముద్రంలో మునిగి ఉంది. ఇప్పటికే భారతదేశంలో ఉండే మనోళ్ళు ఇరవైమంది దాకా వచ్చిండ్లు. ఈ రోజే సాయంత్రం శవ యాత్ర జరుగుతుంది. అంత్యక్రియలు కూడా' సిద్ధయ్య గొంతు గద్గదమై కూరుకుపోయింది.

కాస్సేపు నిశ్శబ్దంగా 'ఊ ఊ' అని 'నువ్వొచ్చేయ్ త్వరగా.. మనూరికి ఇంకో సమస్య కూడా వచ్చింది.. మైసమ్మ గుట్టని భుజించే రాక్షసుడొకడు రాబోతున్నాడిక్కడికి. వానితో యుద్ధానికి మేమంతా సిద్ధపడ్తున్నాము' అని ఫోన్ కట్ చేశాడు.

'అయ్యా.. ఇప్పటికే వచ్చిన పదిపదిహేను మంది మన పిల్లలను మన ఊరి గెస్ట్‌హౌజ్‌లో ఉంచినం..'

సిద్ధయ్య టైం చూచుకున్నడు. పదీ నలభై. 'రామచంద్రం.. ఇట్రా..' అని పిలిచాడు ఓ నలభై ఏండ్లు నిండిన తన అనుచరుణ్ణి. అతను దగ్గరికి రాగానే చెవిలో చెప్పాడు ఏదో. అతను వెంటనే ఆవేశంగా అడుగులో అడుగు వేసుకుంటూ అక్కడి నుండి మైసమ్మ గుట్ట దిక్కు వెళ్ళిపోయాడు.

సిద్ధయ్య మఠం మైసమ్మగండి ఊరి చివర గుట్ట దగ్గర్లోని రెండెకరాల తోటలో ఉంది గత నలభై ఏళ్ళుగా. చుట్టూ దట్టమైన చెట్ల మధ్య పర్ణశాలలా విశాలంగా మట్టితో కట్టిన ఇల్లు అది. జాజుతో అలికిన గోడలు.. వాటిపై తెల్లని సున్నపు గీతలతో ముగ్గులు.. విశాలమైన అరుగులు.. బయట వాకిట్లో వెదురు బుట్టలతో చేసిన ప్రత్యేక గూళ్ళలో కువకువమంటూ పావురాల గుంపులు.. ఎత్తుగా దేవదారు వృక్షాలు.. తోట పక్కనుండి సన్నగా పారే సెలయేరు పైనుండి వీస్తూ వచ్చే చల్లని గాలి.. గాలిలో ఎగిరే పిచ్చుకలు, గోరింకలు, చిలకలు.

అదంతా ఒక స్వప్నలోకం. సిద్ధయ్య దాదాపు అరవై ఏళ్ల క్రితం చిన్న పిల్లవానిగా ఆ ఊరికి ఎక్కడి నుండో వచ్చి.. ఆ ఊరి శివుని గుడిలో.. ఊరవతలి మైసమ్మ గుట్టమీద.. బ్రహ్మచెరువు గట్టు మీది శంకర అవధూత గుహలో అతనితో కొన్నాళ్ళు.. ఇట్లా ఎవరెవరితోనో.. గడుపుతూ.. చటుక్కున మాయమై.. ఎక్కడెక్కడో పెద్ద పెద్ద చదువులు చదివి.. ఉన్నత విద్యావంతునిగా తిరిగొచ్చి.. ఇక ఊరిని ఒక జ్ఞానమఠంగా మార్చేందుకు.. జానకమ్మతో కలిసి.

జానకమ్మ బాగా చదువుకుని హైదరాబాద్ నుండి వచ్చేనాటికి ఆమె తండ్రి.. ఊరి దొర.. రాఘవరెడ్డి.. ఆయన భార్య సీతమ్మ.. ఒక భావన ఉంది.. ఊరి దొరలైన రెడ్డి కులం వాళ్ళందరూ దోపిడీదారులూ, బడుగు కులాలవాళ్ళందరినీ అణచివేసే దుర్మార్గులూ అని. కాని రాఘవరెడ్డి అది తప్పుడు అభిప్రాయమని ఆ ఊరి యావత్ జనాన్ని ప్రేమించడం, సహాయం చేయడం ద్వారా ఋజువు చేశాడు.

కానీ.. పీపుల్స్‌వార్ గ్రూప్ నక్సలైట్లు ఉత్తర తెలంగాణాలో పాగా వేస్తున్న క్రమంలో 'భయం' ద్వారా ప్రజల్లో పాతుకుపోవాలని అవలంభించిన పంథాలో భాగంగా.. 'ప్రజా కంఠకుడు భూస్వామి రాఘవరెడ్డి పటేల్‌ను ప్రజాకోర్ట్‌లో శిక్షిస్తున్నాం' అని ఒక రాత్రి భార్యాభర్తలిద్దరినీ అతి కిరాతకంగా చంపేసిన తర్వాత.. ఇక ఆ గడీలో మిగిలింది.. ఒక్క జానకే. ఒంటరి జానకి.. దిక్కుతోచని జానకి.. విప్లవాలకు పెడ నిర్వచనాలతో ప్రజలను దూరం చేసుకునే సూడో సంఘాల ప్రవర్తన అర్థంకాని జానకి.. అప్పటికే ఒక యోగిలా దర్శనమిచ్చిన సిద్ధయ్యతో పరిచయం పెంచుకుందామె. 'జానకీ.. ఈ మనుషులను గెలువ గలిగే మహత్తర ఆయుధం .. ప్రేమ ఒక్కటే.. మనుషులను బ్లాక్‌మెయిల్ చేస్తూ శాసించగలిగే అస్త్రం 'భయం' ఒక్కటే. ఐతే ప్రేమ శాశ్వతం. భయం.. గాలి బుడగ' అన్నాడు సిద్ధయ్య ఒక సారాంశ వాక్యాన్ని బోధిస్తూ ఒక రోజు.

ఆ ఒక్క మాటతో మనుషులను.. ముఖ్యంగా ఊరి పిల్లలను ప్రేమిస్తూ ఆనందించడం నేర్చుకున్న జానకి మొత్తం మానవజాతినే ప్రేమించడంలోని సార్థక్యాన్ని తెలుసుకుంది. అప్పుడామె ఆ ఊరికి క్రమంగా ఒక 'తల్లి' గా మారింది. ఊరి జనమంతా అమె పిల్లలే.

సిద్ధయ్య ఆ ఊరి ప్రతి బాలునికీ, బాలికకూ పాఠం చెప్పిండు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథమ్యాటిక్స్.. ఆయన పాఠం చెప్పిన ప్రతి విద్యార్థీ.. ఐఐటీల్లో, ఆర్ఇసీల్లో.. గాంధీ మెడికల్ కాలేజ్ వంటి ఉన్నత స్థాయి వ్యవస్థల్లో చేరి.. చదివి.. ఉన్నతులై.. ఎక్కడెక్కడో.. దేశ దేశాల్లో ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి.,

'ప్రతి విద్యావంతుడూ ఒక జ్యోతి. జ్యోతి ఎప్పుడూ మరో జ్యోతిని వెలిగించేందుకు మాత్రమే ఉపయోగపడాలి' అని సిద్ధయ్య చెప్పిన మాటను ఆయన శిష్యులందరూ వేదవాక్కుగా పాటిస్తూ.,

మైసమ్మగండి ఊరునిండా ఎప్పుడూ విద్యాపరిమళమే. సిద్ధయ్య సింహంలా నడుస్తూ.. జానకి గడీని చేరుకున్నాడు. అతని వెనుక వందలమంది అనుచరులు.. అప్పటికే ఇంకా ఇంకా చేరుతున్న శిష్య పరంపర. ప్రజలందరూ మైసమ్మ గుట్ట దగ్గరికి పరుగెత్తడంతో ఊరు ఊరంతా ఖాళీగా ఉంది. ఒక్క శివాలయం అర్చకుడు శేషగిరి మాత్రం సిద్ధయ్య సూచనపై జానకి పార్థివ శరీరం దగ్గరే నిలబడి.. విషణ్ణ వదనంతో.. రాత్రినుండి. సిద్ధయ్య గడీ వాకిట్లోకి ప్రవేశించి.. జానకి శిరోభాగం దగ్గర ప్రజ్వలిస్తున్న ఆముదపు దీపపు వత్తిని ఎగదోసి.. ఒక్క క్షణం నిశ్శబ్దం పాటించి.. అప్పుడే నిద్రలోకి జారుకున్నట్టున్న జానకి ప్రసన్న వదనాన్ని తదేకంగా వీక్షించి., 'శేషగిరి గారూ.. ఇప్పుడు ఈ ఊళ్ళోనుండి ఒక తార దివికేగింది.. మరోవైపు ధర్మసంరక్షణార్థం.. ఒక దుష్ట సంహారం జరుగబోతోంది.. ఈ పవిత్ర ముహూర్తాన్ని జ్ఞాపకముంచుకోండి' అని అడుగులను సంధిస్తూనే, 'ఈ వచ్చిన మన ఊరి పూర్వ విద్యార్థుల సారథ్యంలో మీరు జానకి శవయాత్రకు సన్నాహాలు ప్రారంభించండి. నేను వచ్చి ఊరేగింపు మధ్యలో కలుస్తా' అని అపర వీరభద్రునిలా వెళ్లిపోయాడు పెద్ద పెద్ద అంగలతో. అతని వెంట అతని సైన్యం .. ఓ యాభై అరవై మంది కదిలిండ్లు ప్రవాహంలా. సిద్ధయ్య మైసమ్మ గుట్ట దగ్గరికి చేరేసరికే అతను ఊహించినట్టే ఒక యుద్ధ వాతావరణం ఉంది మహోగ్రంగా. గుట్ట చుట్టూ చుట్టుముట్టి నిలబడ్డ ఊరి ప్రజలు భూమిలో నుండి మొలిచిన శూలాల్లా ఉన్నారు. ఎదురుగా తన ప్రైవేట్ గూండా సైన్యంతో.. బుల్డోజర్స్, క్రేన్స్, ఎర్త్ మూవర్స్.. టిప్పర్స్‌తో.. మోహరించి.. ఎమ్మెల్యే శివానందం. శివానందం.. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనుండి గెలిచాడు. అంతకుముందు అతను సిపిఎం. ఆ పార్టీ మారి నానా గడ్డి కరిచి కాంగ్రెస్ టికెట్ సంపాదించి.. గెలిచిండు విపరీతంగా డబ్బు పంచి. మొన్న అధికారంలోకి బి.జె.పి రావడానికి తోడ్పడ్తూ.. లోపాయికారిగా 'మంత్రి' పదవిని గ్యారంటీగా పొందే ఒప్పందంపై.. మొన్ననే బి.జె.పి తీర్థం. పార్టీ మార్పిడి. ఈ గోడ దూకుడుకు లంచం కింద 'మైసమ్మ గుట్ట' కానుక.. మైనింగ్ కాంట్రాక్ట్.. పదేళ్ళ పాటు. ఈ పవిత్ర పుణ్యభూమిపై రాజకీయాలు పూర్తిగా భ్రష్టు పట్టి నీతి నియమాలు, నైతిక విలువలు, న్యాయధర్మాలు సకలమూ భూస్థాపితమైపోతున్నాయి. ఎక్కడో ఒకచోట ఈ దుష్ట రాజకీయుల విచ్చలవిడితనాన్ని నిర్మూలించి ప్రజలంటే ఏమిటో.. రుచి చూపించాలి. 'పక్కకు తప్పుకోండి.. లేకుంటే ఈ బుల్డోజర్లు మిమ్ముల్ని తొక్కుకుంటూ ఈ మైసమ్మ గుట్టమీదికి పోతై బిడ్డా' అని

అరుస్తున్నాడు శివానందం. ముత్తక్క అనే ముసలమ్మ ముందట నిలబడి అరుస్తూ.. కోపంతో ఊగిపోతూ 'ఎవడౌరా నువ్వు మా గుట్టను ముట్టుకునేటానికి. నీ అయ్యదా ఇది.. ఏదీ రారా' అని ముత్తక్క కొంగును నడుంచుట్టు బిగిస్తోంది. అప్పుడు ప్రవేశించిండు సిద్ధయ్య. నిలకడగా.. స్థిరంగా.. శాంతంగా 'ఏమిటి శివానందం.. ఈ గుట్ట నీదా.. ఊరికి ఆభరణంగా ప్రకృతి ప్రసాదించిన వరం ఈ గుట్ట. దీన్ని లీజ్‌కు గీజ్‌కు ఇవ్వడానికి ఏ ప్రభుత్వాలకూ అధికారం లేదు. ఇక్కడి నుండి ఒక్క రాయి ముక్కను కూడా తీసుకుపోనివ్వం. చెప్పుకోపో మీ ప్రభుత్వాలకు. ప్రజల మాటను వినాలె ప్రభుత్వాలు. అంతేగానీ నీవంటి లోఫర్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాల మాటను ప్రజలు వినరు తమ సహజవనరులను ఫణంగా పెడ్తూ.. ఐనా.. నువ్వు మూడు నెలల్లో మూడు పార్టీలను మార్చుతూ ఏం చేస్తానౌరా బ్రూట్. ప్రజాస్వామ్యమంటే మజాక్ చేస్తానవా. ఒక నియోజకవర్గ ప్రజలచేత ఎన్నుకోబడి వాళ్ళ అనుమతి లేకుండానే నిన్ను నువ్వు అమ్ముకుని గోడలు దూకి పార్టీలను మారుస్తవా. మరి.. నిన్నెన్నుకున్న ప్రజల సంగతేమిటి.. నీ ప్రజాద్రోహాన్ని చూస్తూ ఊర్కోడానికి ప్రజలు దద్దమ్మలు కారు గుర్తుంచుకో. నిన్ను ఈ క్షణం ఈ మైసమ్మ గండి ఊరి ప్రజాదర్బార్‌లో బహిరంగంగా శిక్షిస్తున్నాం.. నీకు ప్రజలు వేస్తున్న ఈ శిక్ష నీ వంటి గోడదూకుడు గాళ్లకు సింహస్వప్నం కావాలె. గెట్ రెడీ.. నీకు ఊళ్ళళ్ళ ఉన్న గుట్టలకు గుట్టలే కావాల్నా బిడ్డా..

సిద్ధయ్య వెనుక నుండి ఎవరో చటుక్కున పేల్చిన పిస్టల్ గుండు లిప్తకాలంలో శివానందం గుండెలో నుండి దూసుకుపోయింది. ఎర్రగా రక్తం చిమ్ముతూండగా.. 'అమ్మామ్మామ్మా' అన్న ఎమ్మెల్యే శివానందం కేక మైసమ్మ గుట్టల్లో ప్రతిధ్వనించింది. 'ఒక పార్టీ అభ్యర్థిగా ప్రజలచేత ఎన్నుకోబడి.. తర్వాత ఆ ఎన్నుకున్న ప్రజల అనుమతి లేకుండా అమ్ముడుపోతూ పార్టీలు మార్చే ప్రతి వెధవా ఈ ఘటనతో వణికిపోవాలె. భవిష్యత్తుకీ ఘటన ఒక మార్గదర్శకం కావాలె' అని సిద్ధయ్య శివానందం మృత శరీరంపైనుండి నడచి అడుగులు వేస్తూండగా.. వెనుక ఊరి జనమంతా ఉప్పెనలా కదిలింది అతని వెంట.,

* * *

అప్పుడే మైసమ్మ గుట్ట దగ్గరికి జానకి శవయాత్ర చేరువౌతూండగా.. సూర్యాస్తమౌతోంది.

అప్పటిదాకా కాలభైరవునిలా ఊగిపోతున్న సిద్ధయ్య.. వందలమందితో తరలివస్తున్న ఊరేగింపును చేరుకుని.. పూనకంతో ఊగిపోతూ అందుకున్నాడు ఒకమిత్రుని చేతిలోని మాదిగ డప్పును. ఆ క్షణం అతని చేతిలోని వెదురు పుల్లలు మెరుపు కడ్డీల్లా మోగినై. దద్దరిల్లింది ప్రకృతి. శివుడై నర్తిస్తూ తాండవిస్తున్నాడు సిద్ధయ్య.

జనంలోకి ప్రేమ నిండిన మహాదావేశం ఏదో నిప్పుల ప్రవాహంలా ప్రవహిస్తోంది.

'వధ.. సంహారం.. రెండూ ఒకటి కావు'

యథా యథాహి ధర్మస్య..,


సిద్ధయ్య డప్పును వాయిస్తూ మహోగ్రంగా నర్తిస్తున్నాడు ప్రళయకాల రుద్రుడై.



# ఖుర్బాని

సయ్యద్ గఫార్

కన్సొలేషన్ బహుమతి రూ. 5,000 పొందిన కథ



సయ్యద్ గఫార్.. 25 ఏండ్ల నుంచి జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. నల్లగొండ జిల్లా వాడపల్లి మండలం వాడపల్లి ఊర్లో జన్మించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. 35 యేండ్లుగా సాహితీ ప్రయాణంలో ఉన్నారు. ఈయన రాసిన జీవన ధ్వని కవిత సంపుటి ముద్రితమైంది. మౌనధ్వని నాటిక ముద్రణా ప్రక్రియలో ఉంది.

**మబ్బుల లేసి.. పొద్దుపొడుపుకంటే ముందుగాల** సద్వాల్సిన 'ఫజర్ నమాజ్' సదువుకున్నడు బిలాల్. రెండు చేతుల దోసిల్లు ఎత్తిపట్టి అల్లాను ప్రార్థించుకున్నడు. లేసి ఇంట్లకెల్లి బయటి వాకిట్లకొచ్చిండు. యింకామసక వెలుతురుగానే ఉంది.

రేపు బక్రీద్ పండుగ.

ఖుర్బాని కోసం తెచ్చిన యాటపోతుకెల్లి చూసిండు. అది బిలాల్‌ను చూసి లేసి నిలబడింది మేతకోసం. జువ్వాకు మండలు నాలుగు దాని ముంగటేసిండు. అది ఆబగా పరపరా నమలబట్టింది. దానీపు నిమిరి అక్కడికెళ్లి కదిలిండు బిలాల్. సరిగ్గా అప్పుడే..

పెద్దర్వాజ తలుపులు తోసుకొని హసీనా బయటికెళ్లి ఇంట్లెకొచ్చింది.

ఏం సమజ్‌గాలే బిలాల్‌కు. కొద్దిసేపు మానులా నిలబడిండు. హసీనా గీ చీకట్ల యాడికిబోయింది? ఎందుకుబోయింది?

ఇంట్లకు బోయి ఆమెను అదేమాటడిగిండు.

ఆమె కళ్లు తుడ్సుకొని 'రాములమ్మొదిన బిడ్డ.. జయమ్మకు...' యింకా ఏదోమాట చెప్పబోతుండగానే..

'ఆ.. జయమ్మకు.. ఏమైంది?' గాభరాగా అడిగిండు బిలాల్.

'అదే చెప్తున్న. జయమ్మకు ఏంబాగలేదు. తొల్సూరు కాన్పు తల్లిగారింట్లనే చెయ్యాలని, నిన్న ఆటోల జయమ్మను ఇంట్ల దింపి పోయిండు ఆ పిల్ల పెనిమిటి. రాత్రి పదకొండు గంటలప్పుడు పిల్లకు నొప్పులు మొదలయ్యినయ్యంట. గంగన్న మంత్రసాని సాయమ్మను పిల్సుకొచ్చిండంట. ఆమె ఆఫతిపడ్తున్న పిల్లను చూసి 'కడ్పుల బిడ్డ అడ్డం తిరిగింది. నా వల్ల కాదు. పెద్దాసుపత్రికి తీస్కపోవాల. లేకపోతే పెద్ద పాణానికే ముప్పు రావచ్చు' అనిందట. కూలీ బతుకులాయె. ఇంట్ల చిల్లి గవ్వ లేదు. గంగన్న రాత్రిల్లే ఊర్లె శానామంది ఇండ్లల్లకు బోయి అప్పు అడిగిండట. ఎక్కడా ఏకానా అప్పు పుట్టలే. బిడ్డ పడ్తున్న ఆపతి సూస్తూ ఏం చేయలేక రాములమ్మొదిన గంగన్న ఏడ్వబట్టిండ్రు. ఆల్ల ఏడ్పులిన్న సుట్టుపక్కలోల్లందరొచ్చింరు. ఆల్లయి గూడ సాయం చేసే తాహతులేని కూలీ బతుకులేనాయే. నాకు నిద్దట్ల ఏడ్పులు ఇపిస్తుంటే కలల్నే అనుకున్న లేసి సూస్తే.. ఏడ్పులు రాములమ్మొదిన ఇంటి నుంచి. నిన్ను లేపుదామనుకున్న. మంచి నిద్రలో ఉన్నవ్. ఆనక్క లేపొచ్చులే అనుకొని, రాములమ్మొదినింటికి పోయిన. సూద్దునుగదా ఇదీ సంగ' అన్జెప్పి ముక్కు చీది పైటకొంగుతో తుడ్సుకుంది హసీనా.

'మరి ఇప్పుడెట్లుంది జయమ్మకు?' అడిగిండు బిలాల్.

'అట్టనే ఉంది పాపం పిల్ల.. ఎంత యాతన పడ్తుందో ఏందో.. తల్సుకుంటెనే.. కాళ్లు చేతులాడ్తలేవు నాకు. మనమేమన్నా సాయం చేయగలమేమో.. జర సొచాయించరాదు' అంది భర్తతో హసీనా.

భార్య చెప్పింది విన్నంక, ఆపతి పడ్తున్న జయమ్మ కళ్లల్ల తిరిగింది బిలాల్‌కు. రాములక్క ఇల్లు, తమ ఇల్లు పక్కపక్క గలమలే. నడుమ గోడే అడ్డం. కష్టమొచ్చినా, కార్యమొచ్చినా తోడుగా పంచుకుంటూ, కలిసికట్టుగా బతుకుతున్న కుటుంబాలు తమవి. జయమ్మ యాడాదిన్నర పాపగా ఉన్నప్పుడు ఇంట్లోనే ఎక్కువ ఉండేది. తన ముద్దు ముద్దు మాటల్తో 'పిలాల్ మామ.. పిలాల్ మామ! నన్నెత్తుతోవా?' అంటూ తన భుజాలెక్కి తిరిగాడుకున్న పిల్ల. ఇప్పుడెంత బాధపడ్తుందో? అట్టా ఆలోచిస్తున్న బిలాల్‌కు మనసులో చాలా బాధనిపించింది. ఏం చేయాలనే ఆలోచనలో పడిండు.

బిలాల్ కూడా ధనవంతుడేం కాదు. తాత తండ్రుల నుంచి వచ్చిన పొలముంది. ఏడాదికి సరిపడా తిండి గింజలొస్తయి. తన ఆటో నడుపుతడు. భార్య హసీనా భర్తకు చేదోడుగా కుట్టుపని చేస్తది. ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో బక్రీద్ పండుగకు ఖుర్బాని ఇచ్చేంత ఆర్థిక తాహతు మాత్రమే ఉంది. నిన్ననే తన దగ్గరున్న డబ్బుల్తో యాటపోతును కొనుక్కొచ్చిండు. ఇంక ఇంట్ల పండుగ ఖర్చులకని ఉంచిన డబ్బులు మాత్రమే ఉన్నయి. జయమ్మనెట్లా ఆస్పత్రికి తీస్కపోవాలే? ఆలోచిస్తుండు బిలాల్..

ఈగలు ముసిరినట్లున్నయి. ఖుర్బాని కోసం తెచ్చిన యాటపోతు చెవులు టపటపలాడించింది.

బిలాల్ చూపులు దానికెళ్లి మళ్లినయి. ఒక ఆలోచన తట్టింది. యాటపోతును తిరిగిచ్చి

డబ్బులు వాపస్ తెచ్చుకుంటే జయమ్మను ఆస్పత్రికి తీస్కపోవచ్చు. అదే ఆలోచన భార్యకు చెప్పిండు. ఆమె కూడా ఒప్పుకుంది.

'నువ్వు రాములక్క ఇంటికిబోయి, జయమ్మను ఆస్పత్రికి తీస్కపోనీకి డబ్బులు నేను తెస్తున్ననని చెప్పు. మనింట్ల పిల్లలకు జాగ్రత్తగా ఉండమని చెప్పి, నువ్వు కూడా ఆస్పత్రికి రావడానికి తయారవ్వు. వాళ్లకు తోడుగుంటవు. అట్లనే ఇంట్ల పండుగ ఖర్చులకుంచిన డబ్బులు పట్కరా.. అన్జెప్పి ఒక్క సెకను ఆల్యసం చేయకుండా, గుంజకు కట్టేసిన యాటను విప్పి ఎత్తుక పోయి దాన్ని ఆటోల కుదేసి కట్టి, ఐదు నిమిషాల్ల ఆటోను మల్లయ్య ఇంటి గేటు ముందు ఆపిండు. ఆటో దిగి గేటు లోపలికి సూసిండు. మల్లయ్య కూకొని చాయ్ తాగుతుండు.

మల్లయ్య ఇల్లు అరెకరం జాగల ఉంటది. అరవై ఏళ్లపైన ఉంటయ్ మల్లయ్యకు. బుర్ర మీసాలు, ఎత్తుగుంటడు, ఎత్తుకు తగ్గ లావుంటడు. పదిహేనెకరాల పొలం, ట్రాక్టర్, ఐదు వందల జీవాలకు ఆసామి మల్లయ్య. బక్రీద్ పండుగ వచ్చిందంటే మల్లయ్య ఇల్లే ఒక సంత. మారు బేరగాళ్లు పట్నంకెళ్లి వచ్చి యాటపోతుల్ని కొనుక్కపోతరు. ఎంత గిరాకీ ఉన్న ధర పెంచకుండా అగ్గువ ధరలకే యాటలమ్ముతడని మంచి పేరుంది మల్లయ్యకు. నిన్న బిలాల్ ఇక్కన్నే యాటపోతు కొనుక్కపోయిండు.

ఆటోల యాటపోతును కట్టేసిన తాడు ఇప్పి, పోతును దింపి, తాడు పట్టి లాక్కుంట గేటు దాటి మల్లయ్య కూకున్న కాడికొచ్చి.. 'నమస్తే కాకయ్య!' అన్నడు బిలాల్. 'నమస్తే బేటా ఏందిరా పాపం దాన్నట్టా లాక్కొస్తుంటివి' అన్నడు మల్లయ్య. మీసాలకంటిన చాయ్ తుడ్సుకొని చాయ్ కప్పు కింద పెడ్తూ..

'కాకయ్యా.. మా అక్క బిడ్డకు కాన్పు కష్టమైతాంది. అర్జెంటుగ పెద్దాస్పత్రికి తీస్కపోవాల. డబ్బులు గావాలె కాకయ్య! గీయాట పోతును వాసప్ తీస్కొని డబ్బులియ్యి' అన్నడు బిలాల్.

బిలాల్ గురించి తెల్సిన మల్లయ్య 'అట్టనా బేటా! సరే ఇస్తా! పట్కపో!' అన్జెప్పి, భార్య సూరమ్మను పిల్సి, 'ఇంట్ల చెక్కపెట్టెలకెల్లి ఎనిమిది వేలు తెచ్చియ్యి' అని చెప్పిండు. ఆమె ఇంట్లకు బోయి డబ్బులు తెచ్చి మల్లయ్య చేతికిచ్చి, తిరిగి ఇంట్లకు బోయింది. అయి లెక్కపెట్టి బిలాల్ చేతికిస్తూ.. 'బేటా బిలాల్! యాటపోతుకు కట్టిన డబ్బులు కూడా తీస్కపో! యాటను కూడా పట్కపో! పండుగ ఎల్లినంక ఇయ్యి డబ్బులు' అన్నడు.

'అట్ల కుదురదు కాకయ్య..! అప్పుచేసి ఖుర్బాని ఇయ్యడం చెల్లదు. సొంత కష్టార్జితం డబ్బుల్తోనే ఖుర్బాని ఇయ్యాలె! అది పద్ధతి' అన్నడు బిలాల్.

'అట్టయితే ఇప్పుడు నేనిచ్చిన డబ్బులు అప్పు అనుకొని తర్వాత ఇయ్యి' అన్నడు మల్లయ్య.

'వద్దు కాకయ్య.. పిల్లలకు ఫీజులు కట్టాలి. మల్ల నీకు టైంకు ఇయ్యకపోతే మాట పోద్ది. నా మీద నీకున్న భరోసాకి యాటపోతును వాపస్ తీస్కొని డబ్బులిచ్చినందుకు షుక్రియా కాకయ్యా! ఎల్తున్న' అన్జెప్పి యాటపోతును అక్కడొదిలేసి, గేటు బయటకొచ్చి ఆటోలో కూకొని స్టార్ట్

చేసిండు. ఐదు నిమిషాల్ల రాములమ్మ ఇంటి ముందాపిండు ఆటోని.

హసీనా గబగబా ఆటోకాడికొచ్చి 'పని అయ్యిందా?' అడిగింది.

'ఆ అయ్యింది! నువ్వు రాములక్క ఇంట్లకు బొయ్యి జయమ్మను త్వరగా తీస్కరమ్మని చెప్పు వెళ్లు' అన్నడు.

హసీనా పరుగున రాములమ్మ ఇంట్లకు బోయింది. మరికొద్దిసేపట్లనే జయమ్మను నలుగురు ఆడోళ్లు పట్టుకొచ్చి, ఆటోల పడుకోబెట్టిన్రు. రాములమ్మ, హసీనా జయమ్మను పట్టుకొని ఆటోల కూకున్రు. గంగయ్య బిలాలల్ పక్కన కూకుండు.

బిలాల్ ఆటోను ముందుకు పోనిచ్చిండు. జయమ్మకు ఏ మాత్రం ఇబ్బంది కల్గకుండా జాగ్రత్తగా, గంటసేపట్ల మిర్యాలగూడల ప్రసూతి ఆస్పత్రి ముంగట ఆపిండు. వెంటనే ఆటో దిగి ఆస్పత్రిలకు బోయిండు. కంపౌండర్ వీల్ చైర్ ఆటో కాడికి తీస్కొచ్చిండు. ఇద్దరు నర్సులు కల్సి జయమ్మను ఆటోలంగ దించి వీల్ చైర్‌లో కూకోబెట్కొని ఆపరేషన్ థియేటర్లకు తీస్కపోయిన్రు.అప్పటికీ డాక్టరమ్మతో మాట్లాడి డబ్బులు డిపాజిట్ చేసిండు బిలాల్. డాక్టరమ్మ ఆపరేషన్ థియేటర్లకు బోయింది.

పావుగంట తర్వాత ఆపరేషన్ థియేటర్లకెళ్లి నర్సు బయటికొచ్చి 'పేషెంట్‌కు బ్లీడింగ్ శానా అయిందని, అర్జెంటుగా 'ఓ నెగెటివ్' రక్తం కావాలని గాభరా పడుతూ చెప్పింది. హసీనా బ్లడ్ గ్రూప్ అదే కావడంతో రక్తమిచ్చింది. రెండు గంటలు గడిచినంక నర్సు బయటికొచ్చి ఆపరేషన్ సక్సెస్ అయిందని, మగబిడ్డ అని, తల్లీబిడ్డలు బాగున్నారని చెప్పి, తిరిగిలోనికి వెళ్లింది.

అందరూ గండం గట్టెక్కిందని ఊపిరి పీల్చుకున్నారు.

ఇంకో నర్సు హసీనాను పట్టుకొచ్చి బయట హాల్లో కూకోబెట్టిపోయింది. మరో గంట గడిచినంక తల్లినీ బిడ్డను ఏరే గదిలోకి మార్చినట్లు చెప్పింది నర్సు. అందరూ నర్సు చెప్పిన గదిలకు పోయిండ్రు.

జయమ్మ నీరసంగా కళ్లు తెరిచి అందరొంక చూసి తిరిగి కళ్లు మూసుకొని పడుకుంది. పిలగాడు తల్లిపక్కల హాయిగా నిద్రపోతుండు.

అందాక పచ్చి మంచినీళ్లు ముట్టలేదెవ్వలు. అప్పుడు జర ఆకలి అన్పించింది అందరికీ. బిలాల్ హోటల్‌కు బోయి అన్నాలు, రొట్టెలు, పాలు, పండ్లు పట్టుకొచ్చిండు. అందరూ కాస్త ఎంగిలి పడ్డరు. గప్పుడు పగలు మూడు గంటలయితంది.

అంతా మంచిగనే జరిగింది కాబట్కి, హసీనా బిలాల్‌లు ఇంటికి పోదామనుకున్రు. అదే సంగతి రాములమ్మకు చెప్పి, హసీనాను డబ్బులడిగి తీస్కొని, అందులంగా పదిహేనొందలు తీసి చేతి ఖర్చులకు ఉండనీమని రాములమ్మకిచ్చిండు. తన సెల్ నెంబర్ కాయితంల రాసిచ్చిండు. అవసరమైతే ఫోన్ చేయమని చెప్పిండు.

రాములమ్మ గాడబ్బులు తీసుకుంటూ, బిలాల్ రెండు చేతులు పట్టుకొని 'తమ్మి బిలాల్.. నువ్వు, నీ భార్య హసీనమ్మ ఉండబట్కే నాబిడ్డ జయమ్మ దానికొడుకు బతికిన్రు. తల్లీబిడ్డల్ని బతికిచ్చిన మీరు, మా పాలిట దేవుళ్లయ్యా! మీ రుణం ఈ జన్మల తీర్సుకుంటనో లేదో?' అంటూ కంట నీరుబెట్టింది.

బిలాల్ రాములమ్మను ఓదారుస్తూ 'ఊర్కో అక్కా ఏడ్వకు! మమ్ముల్ని దేవుళ్లతో పోల్చమాకు. చిన్నప్పటికెళ్లి నేను అక్క అంటూ నువ్వు తమ్మీ అంటూ నోరారా పిల్సుకుంటూ, సొంతోళ్లకంటే ఎక్కువ ప్రేమగా కల్సిమెల్సి ఆడుకుంట పెరిగి పెద్దయ్యినోళ్లం మనం. అస్వంటి అక్క బిడ్డకు ఆపతి వస్తే ఆదుకోవడం తమ్ముడి బాధ్యతే అక్కా! అంతే నేను చేసింది. ఊర్కో ఏడ్వమాకు!' అన్నడు బిలాల్.

బిలాల్ అన్న ఆ ఆత్మీయ మాట విన్న రాములమ్మ కళ్లల్ల మరిన్ని కన్నీళ్లు ఉబికినయి.

'ఏడ్వకు వదిన! మేము మీకు అప్పిచ్చి కాయితం రాయించుకోలే! మేం ఖర్చు పెట్టిన డబ్బులు రుణం అన్న సంగతి మతిలంగ తీసెయ్యి! ఊకో వదిన' అంటూ తన చేతుల్తో రాములమ్మ కంట నీరు తుడ్సింది హసీనా.

'గంగయ్య బావో! మనవడిని మంచిగ సూస్కో! లేకపోతే పెద్దయ్యినంక దుడ్డు కర్రతోని నీ ఈపు పగులగొడ్తడు' అన్నడు బిలాల్ నవ్వుతూ. ఆ మాటలకు రాములమ్మ గంగయ్య నవ్వుతుంటే.. 'యింక మేం ఎల్తున్నం' అన్జెప్పి ఆస్పత్రిలంగ బయట ఆటో దగ్గరికొచ్చిన్రు. హసీనా.. జయమ్మకు రక్తం ఇచ్చింది కాబట్టి నీరసంగా ఉంటే.. హసీనా చెయ్యిపట్టి ఆటోల కూకోబెట్టిండు బిలాల్. 'పిల్లల కోసం పండ్లు తెస్త' అని హసీనాకు చెప్పి పండ్ల బండైపు పోబోతుంటే.. మల్లయ్య ఎదురైండు.

'ఏం కాకయ్యా! ఇటెంకొచ్చినవ్?' అడిగిండు బిలాల్. 'ఒరేయ్ బేటా ఇంత అన్యాయమారా? ఒక్క మాట చెప్పవైతివి?' అన్నడు మల్లయ్య.

బిలాల్‌కు ఏం అర్థం కాలే 'ఏం మాట కాకయ్యా!' అడిగిండు 'ఏం తెల్వనట్టె అడుగుతున్నవేందిరా? అక్కబిడ్డకు ఆపతి అని చెప్పి యాటపోతు వాపసు తీస్కోని డబ్బులిస్తి. అక్క బిడ్డకని నువ్వు చెప్తె నీ సొంత అక్క బిడ్డకేమో అనుకున్న. ఒక్క మాట రాములక్క బిడ్డ జయమ్మ ఆపత్ల ఉందని చెప్పవైతివి. రాములమ్మ ఎవరనుకున్నవ్? సొంత నా అన్న బిడ్డ. జయమ్మ పరేశాన్లుంటే సూస్తు కూకున్నవని, నాకు శాపనార్థాలు పెట్టరారా? ఒక్క మాట నాతో అంటే నీ సొమ్మేం పోయింది చెప్పు! నువ్వు ఆటోల జయమ్మను తీస్కోని ఊరు దాటినంక ఎర్కయింది బేటా! యింక ఊర్లె ఉండబుద్దికాలే అందుకే వచ్చిన' అన్నడు మల్లయ్య.

'అది కాదు కాక! మీకు మీకు మాటల్లేవు కదా.. అందుకని' నసిగిండు బిలాల్.

'అవున్నిజమే! మాట మీనమాటొచ్చి మాట్లాడడం బంద్జేస్కున్నం గని పొడ్సుకున్నమా, సంపుకున్నమా? అయినోళ్లు కష్టాల్లో ఉంటే సూస్తూ కూకుంటమా? అట్టాకూకుంటే మనకీ

మూగజీవాలకీ తేడా ఏముంటది చెప్పు?' అన్నడు మల్లయ్య.

'ఏమో కాకయ్య! తప్పయితే మాఫ్‌జెయ్యి!' అన్నడు బిలాల్.

'నువ్వు తప్పు జేసినవ్ అంటలేను బేటా! నాకు మనసుల బాధన్పించి నీకు చెప్పిన అంతే! సరే గీ ముచ్చట పోనీగనీ ఇప్పుడు జయమ్మకెట్లుంది? ఏ ఆ ఆస్పత్రిల జేర్పిచ్చిండ్రు?' అనడిగిండు మల్లయ్య.

జయమ్మకు పెద్దాపరేషన్ అయ్యిందని, మగబిడ్డ అని తల్లీ బిడ్డ బాగున్నరిని చెప్పి, ఆస్పత్రి చూపించిండు బిలాల్. మల్లయ్య ఆస్పత్రొంక పోతాపోతా ఆగి వెనక్కి తిరిగి 'ఇంటికి ఎప్పుడు పోతున్రు బేటా' అడిగిండు.. 'పిల్లలకు పండ్లు కొనుక్కొచ్చుకొని ఇంటికి బోవుడే కాకయ్యా' అన్నడు బిలాల్. 'జర ఆగుండ్రి బేటా! నేనూ మీతో వస్త. జయమ్మను, దాని కొడుకుని చూసి, మా రాములమ్మను కల్సి, జర ధైర్యం జెప్పి వస్త. కల్సి పోదాం ఇంటికి. మీ కాకమ్మ కూడా ఒక్కత్తే ఉంది. ఇంటికాడ' అని జెప్పి మల్లయ్య ఆస్పత్రిలకు బోయిండు.

బిలాల్ పండ్లు తీస్కొచ్చి ఆటోల కూకున్న భార్య చేతికిచ్చి మల్లయ్య కోసం ఎదురు చూస్తూ నిలబడ్డడు. అంతల్నే మల్లయ్య వచ్చిండు. 'పోదామా కాకయ్యా' అనడింగిండు బిలాల్.. 'పోదాం గనీ.. తలదిమ్ముగుంది బేటా గుక్కెడు వేడి వేడి కాఫీ తాగిపోదాం' అన్నడు మల్లయ్య. ఇద్దరూ హోటళ్లకు బోయి కూకొని చెరొక కాఫీ తాగిన్రు. కాఫీ బిల్లుతో పాటు హోటల్ బోయ్‌కు పదిరూపాయల 'టిప్' ఇచ్చిండు మల్లయ్య. హోటల్ బోయ్ సంతోషంగా నమస్తే పెట్టి, మరో టేబుల్ కాడికిబోయిండు. ఇద్దరు హోటళ్లకెల్లి లేసి బయటికొచ్చిండ్రు. ఆటోకాడికి వస్తూ దారిలో మల్లయ్య అడిగిండు 'బేలా బిలాల్! నాకెర్కలేక అడుగుతున్న మనం హోటళ్ల పిల్లగాన్కి టిప్ ఇచ్చినం గదా! గా డబ్బులు వాడి కష్టార్జితమేనంటవా?' 'అవునన్నట్లే కదా! కాకయ్య! వాడు మనకు చేసిన సర్వీస్‌కు మనం తృప్తి పడి 'టిప్' ఇచ్చినం. అంటే అయి వాడి కష్టార్జితమన్నటగ్లే కదా!' అన్నడు బిలాల్. 'అవ్ నిజమే బేటా' అన్నడు మల్లయ్య. ఇద్దరూ మట్లాడుకుంట ఆటోకాడికొచ్చిన్రు. మల్లయ్య ఆటో ఎక్కి కూకుంటూ.. 'ఊరి బయట రామయ్య గుడి కాక జరసేపు ఆటో ఆపు బేటా! రామయ్య సామికి దండం పెట్టుకొనొస్త!' అన్నడు.

'సరే కాకయ్య' ఆటో స్టార్ట్ చేసి పదినిమిషాల్లో ఊరిబయట గుడికాడ ఆటో ఆపిండు బిలాల్. మల్లయ్య ఆటో దిగి గుళ్లెకు పోయి పది నిమిషాల తర్వాత తిరిగొచ్చి ఆటో ఎక్కి 'చల్ పా బేటా' అన్నడు మల్లయ్య. బిలాల్ ఆటో స్టార్ట్ చేసి ముందుకు పోనిస్తూ 'రామయ్య సామికి జయమ్మను, జయమ్మ కొడుకును సల్లంగ సూడమని, కోరుకున్నవా కాకయ్య' అడిగిండు.

'లేదు బేటా' అన్నడు మల్లయ్య భార్య భర్తలిద్దరూ ఆశ్చర్యంగా ఒకరి ముఖాలొకరు చూస్తున్నరు. అనుమానం తీర్చుకోవడానికి 'మరేం కోరుకున్నవ్' అనడిగిండు బిలాల్. 'ఇంటింటికి బిలాల్‌లాంటి మంచి మనసుకున్న కొడుకునీ, హసీనాలాంటి సహృదయమున్న బిడ్డనీ ప్రసాదించు స్వామి అని కోరుకున్న. యింకా నా దేశంల, ఒకే తోటల పూసిన రంగు రంగుల పువ్వుల్లా బతికే మాపైన ఏ దుష్ట చూపు సోకకుండా సల్లంగ సూడు సామి! అని

కోరుకున్న' అన్నడు మల్లయ్య!

ఆ మాటవిన్న బిలాల్‌కు ఇంకేం మాట్లాడాలో తోచలే. ఆటో తోల్తా ఉండిపోయిండు. కొద్దిసేపట్ల ఊర్లెకొచ్చింది ఆటో. మల్లయ్య ఇంటి గేటు కాడ ఆటో ఆపిండు బిలాల్. మల్లయ్య ఆటో దిగి జేబులంగ ఇరువై రూపాయలు తీసి బిలాల్‌కు ఇస్తూ 'కిరాయి డబ్బులు తీస్కో బేటా' అన్నడు. 'వద్దు! ఉండనీ కాకయ్య! ఇయాల నేను ప్యాసింజర్ ఆటోనడ్పలే! సొంత పనికి నడిపిన!' అన్నడు బిలాల్.

'బేటా బిలాల్! నువ్వు నాకాడ డబ్బులిచ్చియాట పోతున్ను కొనుక్కపోతవ్.. నేనేమో నీ ఆటోల పుకట్‌కే తిరగాలా? అట్లా కుదరదు బేటా.. ఇగో తీస్కో డబ్బులు' అన్నడు మల్లయ్య.

ఎదురు చెప్పలేక డబ్బులు తీసుకున్నడు బిలాల్. యింకో జేబులంగ డబ్బులు తీసి 'ఇగో బేటా బిలాల్ నువ్వు నన్ను క్షేమంగా ఇంట్ల దింపినందుకు, నేను సంతోషంగా పదివేలు 'టిప్' ఇస్తున్న తీస్కో.. అన్నడు మల్లయ్య. డబ్బులు సూసి కంగారుపడి 'వద్దు వద్దు కాకయ్య' అన్నడు బిలాల్.

'బేటా బిలాల్! ఈ డబ్బులు అప్పుగ ఇయ్యట్లేను! టిప్‌గా ఇస్తున్నా. బేటా! చిన్నోనివైనా, నువ్వెంత గొప్పపనిచేసినవో నీకెర్కేనా? రాములమ్మ నాకు అన్ని సంగతులు చెప్పింది బేటా! బిడ్డను ఆస్పత్రికి తీసుకపోవడానికి, ఎక్కడ ఏకానా పుట్టక, ఆపతి పడ్తున్న బిడ్డను చూసి ఏం చేయలేక ఏడుస్తూ కూకుంటే అయినోనివి కావు, కులపోనినవి కావు, మతపోనివి కావు. మరుసటిరోజు బక్రీద్ పండుగ ఖుర్బానికి తెచ్చిన యాటపోతును వాపసిచ్చి, ఖుర్బాని కార్యాన్ని మానుకొని, అడుగకముందే స్వయంగా ముందుకొచ్చి జయమ్మని, దాని బిడ్డను కాపాడినవ్ బేటా! నీ అంత గొప్ప మనసు నాకుంది అని నేననుకోవడం లేదు. కానీ, బేటా ఈ కాకయ్య లోపల నియ్యతున్న చిన్న మంచి మనిషి ఉన్నడు బేటా! నువ్వు రాములమ్మకు చేసిన సాయం ముందు నేనిచ్చే ఈ పదివేల టిప్ ఏపాటిది? నువ్వుగింజతో సమానం బేటా! డబ్బులు వద్దు అనమాకు. పొద్దున యాటపోతును కూడా తీస్కపో బేటా అంటే నువ్వేమన్నవ్? కష్టార్జితం డబ్బుల్తోనే ఖుర్జాని ఇయ్యాలన్నవ్ గుర్తుందా? నేను సంతోషంగా ఇస్తున్న ఈ టిప్ డబ్బులు నీ కష్టార్జితమే. ఈ డబ్బుల్తో యాట పోతును కొనుక్కపోయి రేపు ఖుర్బాని ఇయ్యి' అని డబ్బులు బిలాల్ చేతిలో పెట్టిండు.

భార్య సూరమ్మను పిల్సి – పొద్దున్న బిలాల్ పట్టుకొచ్చిన యాటపోతును తెమ్మన్నడు. ఆమె యాట పోతును తెచ్చింది. బిలాల్ మల్లయ్య ఇచ్చిన డబ్బుల్లోంచి యాటపోతు డబ్బులు ఆమెకిచ్చిండు. ఆమె డబ్బులు తీస్కొని ఇంట్లకుబోయింది. హసీనా ఇద్దర్నీ గమనిస్తూ ఉన్నది. ఒకరిని మించిన మంచితనం మరొకరిది అనుకున్నది మనసుల. మల్లయ్య యాటపోతును ఆటోల ఎక్కించి 'బిడ్డా హసీనా! బిలాల్ రేపు ఖుర్బాని పనిలో పడి నన్ను మర్చిపోతడేమో! ఈ పేదోనికూడా నాలుకు ఖుర్బానీ ముక్కలు పంపమని యాది చెయ్యి!' అన్నడు హసీనా నవ్వి 'యాది చేసి పంపిస్తాలే మామ!' అంది. మల్లయ్య చూపించిన మంచితనంతో బిలాల్ కళ్లు

సంతోషంతో చెమర్చినయి. బయటికి కనబడకుండా తుడ్సుకొని 'ఎల్లొస్తం కాకయ్య' అన్నడు. 'పోయి పండుగ మంచిగ చెయ్యుంబ్రి బేటా!' అన్నడు మల్లయ్య.

'యా అల్లా ఇది నా దేశ సంస్కృతి. ఇట్లాగే కాపాడు.. మా మధ్య ఉన్న ప్రేమ ఆత్మీయతల్ని ఇలాగే కొనసాగనీ.. తేనెలూరే ఊటబావుల్లాంటి మా ఊర్లపై ఏ చెడు దృష్టిపడకుండా కాపాడు!' అని మనసులో అల్లాను ప్రార్థించుకొని, ఆటో స్టార్ట్ చేసి తమ ఇంటి బాటకు మల్లించిండు బిలాల్.


Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 85



# అంటరాని బతుకమ్మ?

డా॥ సిద్దెంకి యాదగిరి

కన్సొలేషన్ బహుమతి రూ. 5,000 పొందిన కథ



డా. సిద్దెంకి యాదగిరి వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయులు. సిద్దిపేట జిల్లా వేములఘట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పుట్టింది సిద్దిపేటలో. సాహిత్య రచన వీరి ప్రవృత్తి. 'తెలంగాణ పాటల్లో సామాజిక చిత్రణ' అంశంపై రాసిన సిద్ధాంత వ్యాసానికి 2017లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 'మాతొవ్వ', 'బతుకు పాఠం' పేరుతో కవిత్వ సంకలనాలు చేశారు. గోర్ణం, రేవరేవునాలు, నిగురన్, ఎత కథలు వీరి ముఖ్య రచనలు. సాహిత్యరంగంలో వీరి కృషికి 2017లో వేముగంటి నరసింహాచార్యుల స్మారక పురస్కారం లభించింది.

**మస్కూరి మల్లయ్య చెప్పిన కబురుకు ఎప్పటిలాగానే** ఆ రోజు మూడు దిక్కులకు ఉన్న వాడకట్టుల మొత్తం బెల్లమ్మీద ఈగలు వాలినట్లు కమ్యూనిటీ హాల్ వద్ద గుమికూడింండ్రు. సమిష్టి నిర్ణయానికి అది వేదిక. వచ్చినోల్లు వొచ్చినట్లు ముచ్చట్లలో మునిగిపోయారు. కొంత మంది యువకులు అరచేయిలోని స్మార్ట్‌ఫోన్ వాట్సప్‌లలో ఆలోచనలు ముంచి ఆత్మీయతలు దేవుతు న్నారు. పక్కవారిని పలకరించలేక ముఖపుస్తకసభ్యులు మరుపురాని మధుర చిత్రాలు అతికి స్తున్నారు. వాట్సాప్ మెసేజ్‌లు చూసి వచ్చినవారూ ఉన్నారు.

'ఓ.. నారాయన! వొచ్చిన ముచ్చట ఎల్లగక్కురి. ఎందుకు పిల్సింండ్రు. పెద్దోలు ముచ్చట్లు పెట్టుకుంటండ్రు. పోరగాల్లు సెల్లు పట్టుకోని సెంగలిత్తండ్రు. జెప్ప జెప్ప ఒడగొట్టుండ్రి' అని పోచయ్య పురమాయింపు.

'అందరు రాలేదని ఆగుతున్నమే. లేపోతే సురువు గాకపోవునా?' నారాయన జవాబు.

'అందరు వచ్చిండ్రు. కానియ్యి కానియ్యిండ్రి' అని పోచయ్య అంటుండంగా మాట ముచ్చట సురువైంది.

'నా దగ్గరకి మహేష్, రాజు, ఇంకొంతమంది మన పిల్లలు వచ్చిండ్రు. వచ్చి రాకడనే బతుకమ్మ పేర్చుకుందామన్నరు. కులంల మాట్లాడుదామని మస్కూరిని పిలిపించుమన్న' అని నారాయణ చెప్పిండు.

'ఎనుకటెవడో కత్తి ఆరే లేకున్నా, ఏడూల్ల మాయితనం పట్టిండట. ఈ పోరగండ్లు ఉండెతాడ ఉండక బతుకమ్మ బతుకమ్మ అని ఒకటి ఎత్తుకున్నారు? కడుపు నిండేదా? కాలు నిండేదా?' అని పోచయ్య అన్నడు.

'జర సైసు పోచన్నా! రాజును, మహేష్‌ని అడుగుదాం. పిల్లలూ చెప్పుండ్రా' అని ఐలయ్య

అన్నడు. మహేష్ చెప్పుదామని లేసిండు. ఏం చెప్పుతడో అని అందరు ఎదురు చూస్తుంద్రు. గడబిడ సురువైంది.

శాతనైన కాడికి దమ్ము బీర్సి గుప్పగుప్ప రైలు పొగను గాల్లోకి ఉఫ్మని ఊది సుట్టని సేతుల పట్టుకొని ‘నీ యక్క ఆగుద్రసా! ఆల్లకేమెరుక? పెండ్లిలు సేసింద్రా? ప్యారంటాలు సేసింద్రా? పొద్దంత కొలిస్తే జానెడు లేరు. నిన్న మొన్న పుట్టినోల్లు చెప్పితే యినాల్నా? పాలు మర్సినోడు చెప్పు.. మర్వనోడు చెప్పుడే. నేంబుట్టి ఏ అరువై ఏండ్లయితందో ఏమో? ఎన్నడన్నా గీ బతుకుమ్మ ముచ్చటున్నదా? ఎవలు అట్లే. ఇల్లే? ఇదేం పొయేకాలం? ఇయ్యాల్ల ఈ ముచ్చటెందుకు వొచ్చెరా ఓరి ఎల్లిగా?’ అని మైసయ్య అగ్గిమీద గుగ్గిలమైతండు.

‘నేనొగ ముచ్చట చెప్పుతన్న’ ఆగుంద్రాగుంద్రి అని లేసి ఎల్లయ్య ముచ్చటందుకున్నడు. ‘మైసన్నా! శిన్నప్పుడు బతుకమ్మ లేదని మావ్వను అడిగితే నాకో ముచ్చట చెప్పింది. ఎనకట మన తరాలకింది తాతమ్మ అందరు చేత్తంద్రనీ బతుకమ్మ చేసిందట. బొడ్డెమ్మకు బదులు కాల్సిన దొబ్బను పెట్టుకపొయిందట. పోంగపోంగ కాకి వచ్చి దొబ్బను ఎత్తుకపోయిందట. గాకాన్నుంచి మనకు బతకమ్మ లేకుంటైందట. మైసన్న! ఇంకోటి గు..ల దమ్ములేనోడు పొద్దాక పొయి రాళ్లు పెట్టిండట. ఇది అయేదా? పొయేదా?’ అని ఎల్లయ్య కూసున్నడు.

‘బతుకమ్మంటే ఏమనుకుంటుంద్రు? ఇవ్వేమన్న ఎల్లయ్య, మల్లయ్య మాటలా? పిలగాండ్ల పరాసికాల? భక్తి నిలుపకపోతే బతుకాగమైతది. బతుకమ్మంటే పమానం. పలారమే దప్పుల అడుక్కుంటం. బతుకమ్మను, బొడ్డెమ్మను ముట్టుకుంటాం? లేంది లెంకులాడుడు ఎందుకు? నడుమంత్రాన నాలుగెంటుకలు వొచ్చినవ్వ ఎగేసి ఏడు కొప్పులు పెట్టినట్లుంది ముచ్చట’ ఎర్ర బాలయ్య చెప్పుకుంట పోతుంటే ఆగాగు అడ్డుపడి...

‘ఔ! ఔ! ఎల్లమ్మగుడికి ముగ్గువోసిన గౌడ్ ఏడాది దిరుగకుంటనే గుటుక్కుమన్నడు. ఉన్నంతల కాల్లు సాపుకొని బతుకాలే. బతుకమ్మొద్దు. బాదలోద్దు, ఏదొద్దు’ అని సాయితాతన్నడు.

సాయితాత చెప్పే సంఘటన గుర్తుకొచ్చి నువ్వొద్దనే అని లోలోపల అనుకుంటంద్రు.

ఒక సగం అవునంటే మరో సగం కాదంటరు.

‘గదంత కాదు. అంబేద్కర్ ఏం చెప్పిందో ఎర్కేనా? పుట్టినగని హిందు మతంల సావ అన్నడు. అంబేద్కర్ దేవున్ని జంగమయ్య మర్రి కాడ నిలుపుకొన్నం. ఇప్పుడది అంబేడ్కర్ చౌరస్తా అయ్యింది. మల్ల గివ్వెందుకు? ఇవ్వి వద్దే వద్దు’ అని రాములు అన్నడు.

రాములుకు వంత పాడుతూ అవతలి సగంలోని కాంగ్రెస్ లీడరు ‘వొద్దొద్దు. ఇది అధికారం చేస్తున్న కుట్ర. ఇన్నొద్దులు లేంది ఇప్పుడెందుకు?’ అన్నడు.

ఒకప్పటి అన్నల సానుభూతిపరుడు చిన్రాజయ్య కాంగ్రెస్ పార్టీ లీడర్ దిక్కుసూసి ‘ఒర్రకురా! ఆరాటం గల్ల అప్ప తౌర్ర. ఎప్పుడొచ్చిన చిప్పతౌర్ర అని ఎక్కిరిచ్చి. పార్టీల ముచ్చటొద్దు. అంబేద్కర్ని మొక్కుడే. మనకు బతుకమ్మ పండుగ లేదంటే తొక్కుడే. నలుగుట్ల నారాయన గుంపులో గోవింద అన్నట్లు ఇప్పుడు చెప్పవోయేది చెప్పనీయుంద్రి’ అన్నడు.

ఇది ఎటేటో పోతుందని లొల్లి బందువెట్టాలె అనుకొని 'పెద్దలూ! నా మాట ఇనుండ్రి. ఎద్దు ఎగురంగనే గంట ఎగురది. ఇప్పట్దాక మన మాటలు వాల్లు ఇన్నరు. ఇప్పుడు మనం వాళ్లూ ఏం చెప్పుతరో ఇందాం. ఆ తర్వాత ఆలోచన చేద్దాం. ముందుగాల లొల్లి బందు గావాలే. మహేష్, రాజు ఎవరు చెప్పుతరు తమ్మీ' అని ఆ ఇద్దరి దిక్కు సూసిండ్రు.

అంబేద్కర్ ఎత్తిన చూపుడు వేలులా మహేష్ చక్కగా నిలవడ్డడు. అంతట మాదిగి మాట నీళ్ల మూట అంటరు. మీ వల్ల గోనెపల్లి మాదిగలు బూమ్మీద కాదు మాట నిలవడుతరు అని పేరుతెచ్చిండ్రు. అంబేద్కరిని నిలిపిండ్రు. సంతోషం. ఐక్యత మారుపేరైన మనం. విడిపోయి పల్సపడ్డం. యువకులు ఆది జాంబవయూత్ పెట్టినం. అంబేద్కర్ పున్యాన కొలువు చేస్తున్న మన అన్నలు చేసే ఆర్థిక సాయం. మాకు తోచినంతల జాండ వందనం. అంబేద్కర్ జయంతి, వర్ధంతులు నిర్వహిస్తున్నం.

ఇగ ఇయ్యాల్టి ముచ్చట. నేను, మల్లేశం, రాజు, ముని. అదే మా ఏజే యూత్ వాళ్లం బతుకమ్మ ఎయ్యాలనుకున్నం. మేమంతా మీ కాల్లల్ల సేతుల్ల పెరిగినం కాదంటలేం. కాలం మారింది. కాలంతో మనమూ మారుతున్నం. మీరు సదువలే. మమ్ముల సదివిస్తుండ్రు. మీకు తెలువందికాదు. మాయితనం పోయింది. సచ్చిన బక్కాట్ని తినుడు లేదు. ఆ మాటకొస్తే మన కూర మనం తినుడు చాలా తక్కువైంది. పెద్ద పెద్ద హెూటల్ల కల్యాని బిర్యాని అందరు తింటండ్రు. మనకెందకీ అలసత్వం?

ఆకలి తీరక ముడుసులు ఉడుకవెట్టుకొని రోటిమీద కొట్టుకొని జుర్రుకుతిన్న బతుకు మనది. గంజి, గట్క, పరం, నూకలు, రేషన్ బియ్యం నుంచి నిన్నీయ్యాల్ల సన్నబియ్యానికి రావాలనుకుంటున్నం. మారుతున్నం.

దొబ్బ ఎత్తుక పోయిన కాకి ఉత్త ముచ్చట. మనం పని చేయకపోతే వాళ్లకు బతుకమ్మ జరుగది. నల్ల ఎంటికల్ని పాపితే తెల్ల ఎంటికను ఊడబీకినట్లు మనల్ని పక్కకు జరుపడానికి అదో కుట్ర.

నిజమే. భక్తి అంటే పమానమే. గుడికి ముగ్గుపోసినోల్లు గుడికట్టినోల్లు అందరు చనిపోరు. దానికి వేరే కారణాలుండొచ్చు. మనం ఒకప్పటి లెక్క అడుక్కునుడు లేదు. ఇన్నొద్దులు బతుకమ్మ మనకు అంటరానిది అని మనమనుకుంటున్నం. మనం లేంది బతకమ్మ నీళ్లపడడానికి చెర్లకువోదు. మనము ముట్టరాకుంట ఎట్లయితది?

వాళ్లెవరో ఆడుతుంటే మనం ఇంకా చూద్దామా? గ్రామ పంచాయితి ఆడెటోల్లను చూసి మనోల్లు పక్కకు ఆడుతరు. ఎందుకు? మనవాడకట్టుకు ఆడరు గనుక. అక్కడ ఉట్టిగ ఆడుతరు. బతుకమ్మలు సూడటానికి కొత్త బట్టలు కట్టుకొని మనం, మనోల్లం పోతున్నం. మనమే ఆడుకుంటే బాగుంటది కదా! ఇప్పుడు మనం వేములవాడ, కొమురవెల్లి గుడిలోకి పోతున్నం. బతుకమ్మ ఎందుకాడొద్దో ఆలోచించండి.

మా అన్న బిడ్డ అంత ఏడేండ్లు లేదు. మనం బతుకమ్మ ఎందుకు ఆడం బాబాయి అని అడిగితే ఏం చెప్పాలో అర్థం కాలేదు. మనం కూడా ఆడుతం అని తర్వాత చెప్పిన. ఆడకపోతే చదువుతున్న పసిపిల్లల్లో ఒక రకమైన ఆత్మనూన్యతభావం ఏర్పడుతది. కాబట్టి మనమూ

జరుపుకుందాం' అని మహేష్ అన్నడు..

'తలుపు పెట్టి చెప్పితే కొలుపు పెట్టి ఇంటండట నీ అసొంటోడు' అని నడిమింటి ఎల్లయ్య అన్నడు.

'సరే! తాతా అంటే అంటివితియ్యి. నా తాత. తండ్రి సదువలే. నేను సదువుతున్న. ఏర్పడకుంటనే మారుతున్నం. పరాయి ఊర్లల్ల ఆడుతుండ్రు. మనం ఆడుదాం. అలిమిలేదు. బలిమిలేదు. ఇయ్యాలనుకునేటోల్లు ఇంటికో వంద రూపాలు ఇస్తే కర్సులకు ఎల్లుతయి. బొడ్డెమ్మలు చేయించాలి. పూజ సామగ్రి కర్సు. పంతులు కర్సు మొదలైనవి భరించాలి' అని రాజు అన్నడు.

'ఎట్లెట్ల జరుపుకోవాల్నో పంతుల్ని అడిగిండ్రా? పంతులు ఏమన్నడు' అని బాకి బాలమల్లు అన్నడు.

'అప్పుడు ఎందుకో జరుపుకోలేదు. ఇప్పుడు జరుపుకోవచ్చు. గంగనీళ్లు దెచ్చి గౌరమ్మ చెయ్యాలే. పోషమ్మకాడ బతుకమ్మ ఎయ్యాలే. దాని ప్రకారం చేద్దాం' ఆ పద్ధతులు చెప్పిండు గణేష్.

కొంతమంది 'సరే!' అన్నరు. మరికొంత మంది 'మనతో ఐతదా? కాదు. ఐతే సూద్దాం ఎంత దాకా అయితదో?' అనుకున్నరు. 'కాని పోనిదానికి కంటు అవడం దేనికి?' కొంతమంది ఊరుకున్నరు. అమావాస్యనాడు సురువు అని చెప్పిండ్రు.

రాజు, మహేష్ ఇద్దరు టూవీలర్ మీద వందకు మీద కిలోమీటర్ల దూరమున్న ధర్మపురికి పోయిండ్రు. ఒక్కొక్క అడుగేస్తూ గోదారిలోకి దిగుతుంటే ఆనాడు మహనీయుడు మహద్ చెరువులోకి ఉద్యమ అనుభూతి కల్గుతుంది. మహేష్, రాజులు ఇద్దరు కళ్లు మూసుకొని తన్మయత్వంతో 'జై భీం! జై భీం!!' అంటున్నారు. ఒక్కొక్క అనుభవం మనసు పొరలపై ముద్రితమవుతుంటే పారుతున్న గంగల మూడు మునుగులు మునిగిండ్రు. తడిబట్టలతో గుల్లోకి పోయి దండం పెట్టుకొన్నరు. గంగ (గోదావరి) నీళ్లు క్యాన్లో నింపుకొని బయలు దేరిండ్రు.

మహేష్, రాజు బైక్ సవారి నీళ్ల క్యాన్తో రాజీవ్ రహదారి మీద ఎర్త్ రాకెట్లా దూసుకెళుతుంది. ఎంతవరకు వచ్చిండ్రు. మేం పోషమ్మకాడికి బయలు దేరినం. మధ్య మధ్యలో ఫోన్ సంభాషణలు. మెల్లగ మెల్లగ రాండ్రి అంటూ సూచనలు అందజేస్తున్నారు.

మంథని అడవుల్ని దాటి రామగుండం దాటి కరీంనగర్ గుండా సిద్దిపేట శివారులో ప్రవేశించింది. ఇబ్రహింనగర్లో ప్రవేశించింది. గోనెపల్లి శివారులో ప్రవేశిస్తారని ముందే డప్పులతో గంగనీళ్లకు పోషమ్మగుడి వద్దకు ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభించారు. మధ్య మధ్య బుకగుల్లాలు చల్లుతూ సంతోష తాండవంతో సాగి పోషమ్మ గుడిలోకి చేరుకున్నారు.

డప్పుల ర్యాలీతో పోషమ్మ వద్దకి ఆట పాటలతో చేరుకున్నారు. పంతులు సూచిస్తున్నాడు. పోషమ్మ వద్ద శాస్త్రబద్ధంగా పూజ జరుగుతున్నది. తెచ్చిన గంగ నీళ్లు పూజలో కూర్చున్న వాల్లందరికి అందరికీ అందజేశారు. పంతులు చెప్పినట్లు అందరు నెత్తి మీదుగ కొంగు వేసుకొని గంగ నీళ్లల్ల పువ్వులు ముంచి నెత్తిమీద, కుటుంబసభ్యుల మీద చల్లుకున్నరు. ఆ గంగ నీళ్లతో

పసుపును కలిపి గౌరమ్మను చేశారు. అక్షంతలు చల్లారు. గౌరమ్మను భక్తితో కళ్లకద్దుకున్నారు. భక్తి పాటల సురాగాల పరవశంతో బతుకమ్మ ఆడారు. పూజ అనంతరం డప్పు యాత్రతో ఇంటికి వచ్చారు. ఇల్లు నిండారు.

పుట్టబంగారం తెచ్చినట్లు మొత్తం డప్పు సప్పుళ్లతో సంటి పిల్లలనుంచి పెద్దల వరకు గంపలు తీసుకొని వెళ్లారు. పూజచేసి పుట్ట సుట్టు తిరుగుతున్నపుడు మనసులు ఆనంద డోలికల్లో తేలిపోతున్నయి. పుట్ట మట్టి తవ్వి పోస్తుంటే బంగారి గని దొరికినంత ఆనందం కలుగుతుంది. గంపలకు తవ్విపోసి సర్వగంప ఎత్తుకున్నట్లు ముని పుట్టమన్ను ఎత్తుకున్నడు. పాదయాత్ర కదులుతూ పుట్టమన్ను తెచ్చి కమ్యూనిటీ హాల్ కాడ రాసిపోసింద్రు. పంతులు మంత్రాలు సదివి పూజ చేసిండు. ఇంటికింత పుట్టమన్ను పంచింద్రు. ఒక్కొక్కరు తెచ్చిన పుట్టమన్ను కళ్లకు అద్దుకొని తీసుకవెళుతున్నారు.

అమావాస్య రోజు ఎంగిలి పూలు వేసుకున్నరు. పుట్టమన్ను పంచుకొన్న బొడ్డెమ్మ పేర్చుకుని ఆడపిల్లలు ఆడుతుంటే సీతాకోక చిలుకలు ఆడుతున్నట్లే అనిపిస్తుంది. స్తబ్దంగా ఉన్న మనసులు మారుతున్నాయి. పంతులుగారి సాయంతో బతుకమ్మ ఆటలో పాలు పంచుకున్నారు. నిర్బంధంలో 'బావయ్యో ఒక్కసారి వొచ్చిపోవా' అనే పాటలు. అంబేడ్కర్ మీద పాడిన పాటలూ ఉన్నాయి. ఇప్పుడు 'ఒక్కొక్క పువ్వేసి సందమామ.. ఒక్కజాములాయే సందమామ' లాంటి రకరకాల పాటల పరిమళ భరితంగా ఎక్కడికో వినపడుతుంది.

స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏళ్లు గడిచినా కాని మాదిగలకు ఆధ్యాత్మిక సమానత్వం ఇప్పటితో వచ్చింది. ప్రభుత్వం పదుల సంఖ్యలో కోట్ల రూపాయలు కర్చ పెట్టాల్సింది ఆడని అంటరానివాడలకు ప్రోత్సామిస్తే బతుకమ్మ పండుగ సార్థకమవుతుంది. బతుకమ్మ పండుగ మొదటిరోజు పొద్దుపొద్దుగాల లేసి పువ్వుకు అడవికి పోయింద్రు. పువ్వుల తేనెటీగలు మకరందాన్ని సేకరించినట్లు పువ్వును తెంపుతున్నారు.

పువ్వు తెంపుకుంటూ ఎల్లవ్వ 'బుచ్చక్కా! ఇన్నొద్దులు ఎక్కువోల్లకోసం పువ్వు తెంపినం. ఇప్పుడు మనకోసం తెంపుతున్నం. ఇప్పటికైన పోరగండ్లు మంచి పనిచేసింద్రు, మనకోసం మనం ఆడాలేగని ఎన్నొదులు ఆడేటోల్లను శాతకానట్లు సేతులు ముంగట పెట్టుకొని సూస్తం?'

'నువ్వొద్దేనే!' ఎల్లక్కన్నది.

మొదటి రోజన ఎంగిలి పూల బతుకమ్మ, మధ్యాహ్నం నుంచి ఇళ్లన్ని తీరొక్క పువ్వుతో బతుకమ్మను పేర్చుతున్నారు. పంతులు చెప్పినట్లు మొదటి రోజు ముత్తైదువలు అందరున్నారు. పంతులు సూచనలు పాటిస్తున్నారు. మాదిగిండ్లల్ల ఉన్న సమిష్టి ఎల్లవ్వ తల్లి గుల్లె పెట్టి ఆట సురువు చేసింద్రు. మూడు బజార్లకాడ బతుకమ్మలు కొలువు దీరాయి. వాడకట్టు పండుగ సందడి కాంతులీనుతుంది. దేదీప్యమైన విద్యుత్ బల్బులు అవసరంలేదా అనిపిస్తుంది. ఎందుకంటే ఆడుతున్న అందరి ముఖాలు వెయ్యి వోల్టుల ఎల్ఈడి బల్బుల్లా ప్రకాశమానంగా వెలుగుతున్నాయి. సాయంత్రం కాగానే ఆడపిల్లలు బతుకమ్మ ఆడుతున్నారు.

చెరువులేని కారణంగా పారెవాగులకు డప్పు యాత్రతో నిమజ్జనం కోసం వెళ్తున్నారు.

నువ్వులు, నూకల ఫలహారం పంచుకున్నారు.రెండవ రోజు అటుకుల బతుకమ్మ, మూడవ రోజు తడిబియ్యం, పాలు, బెల్లం ఫలహారం.. ఏ రోజు కా రోజు తీరైన ఫలహారంతో బతుకమ్మ ఆడుతున్నారు. పంతులు చెప్పిన ప్రకారం రోజు రోజు ఫలహారం చేస్తున్నారు. ఇగ సద్దుల బతుకమ్మ రోజుకు అలంకరణ చేసుకున్న కన్నియలా వాడకట్టు ముస్తాబు అవుతుంది. నీళ్లు నిండిన చెర్ల కప్పలు చేరినట్లు ఆడపడుచులు తండోపతండలుగా చేరుకుంటున్నారు. ఎంతోమంది చుట్టాలు గోనెపల్లిల బతుకమ్మ ఆట చూద్దామని వచ్చింద్రు. మధ్యాహ్నం మూడు గంటలకు ఇంట్ల ధూపదీపాలతో గౌరమ్మ బతుకమ్మను ఎత్తుకొని ఆడపడుచులు దేవతల్లా కదిలివస్తున్నారు.

'రాగాలు ఎత్తి పాడుతుంటే కోయిలలు మూగవోతయా' అన్నట్లు శ్రావ్యంగా పాడుతున్నారు. జాండకాడ్కి ఊరు బతుకమ్మలు వచ్చినట్లే ఈ సారి మాద్గుల బతుకమ్మలు వచ్చినయి. బతుకమ్మలు ఒక వేదికమీద ఉన్నయి. చుట్టు తిరుక్కుంటూ పాట పాడుకుంటూ ఆడుతున్నారు. అంటరాని బతుకమ్మ అన్ని బతుకమ్మలకు హత్తుకుంది. కొద్ది సేపైన సమానత్వం తొణికిసలాడినందుకు మాద్గుల సంబూరం అంబరాన్ని తాకింది. నిమజ్జనానికి కదులుతున్న బతుకమ్మలను చూసి పోచయ్య 'చెయ్యక చెడిపోయినం. చేసి బాగుపడాలే. తొవ్వ దూగుడే కట్టం. ఒక్కడు తొవ్వదీస్తే పదిమంది నడుస్తరు. బుద్ధి పుట్టిచ్చిన బతుకమ్మ సల్లగ సూస్తది' అని మైసయ్యతో అంటుండు.

'దొబ్బ ఎత్తుక పోలే. దోర్నం ఎత్తుక పోలే. కతలు ఇనీ ఇనీ ఆలోచన తక్కువైంది. మనదేందో మనం చేసుకుంటూనే ఉండాలే. ఇన్నొద్దులకు పోరగండ్లు తెలివికల్ల పని చేసింద్రు' అని ముచ్చట పెట్టుకుంటుంద్రు.

మల్లెపూవ్వుల్లాంటి తెల్లటి బట్టలతో పరుగు పరుగున కలసిపోతున్న మహిని రాజును పిలిసి సేతుల చెయ్యేసి అలుముకున్నడు మైసయ్య. 'బుద్ధికి ఎవడైన పెద్ద మనిషే' అని కండ్లద్దాలు తీసి కళ్లను ఒత్తుకుంటూ అన్నడు.

'తాతా! మీరనక పోతే ఎవరంటరే.. వాగులకు పాంద్రి. ఇన్నొద్దులు ఫలాహారం అడుక్కున్నం. ఇయ్యాల్ల వొయినాలు పంచుకుందాం పాంద్రి' అన్నడు.

'సరే! ఒత్తున్నం. ఒత్తున్నం' అని అన్నరు.

పంచుకునేటివి ఫలహారాలు కావు. ఒకరికి ఒకరు చెక్కరి కుడ్కలు పోసుకున్నట్లు వొయినాలు తినిపించుకుంటున్నారు. నోట్లోంచి ఒకరు తీసుకుని తింటున్నారు. తినిపిస్తున్నారు.

చరిత్ర శిథిలాల మీద నిట్టాడు ఆనందపు శకలాల జ్ఞాపకాలను పేర్చుతున్నారు. సెల్ఫీలు దిగుతున్నరు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లు, యూట్యూబ్‌లలో నింపుతున్నారు. ఒకరొనొకరు అభినందించుకున్నారు. మొగుల్లల్ల నీళ్లు తెచ్చినట్లు.




# అమ్మలగాజులు!

డా॥ ప్రభాకర్ జైనీ

కన్సొలేషన్ బహుమతి రూ. 5,000 పొందిన కథ

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 94



డాక్టర్ ప్రభాకర్ జైనీ ప్రముఖ సాహితీకారుడు. సినీ దర్శకుడు. ఆయన 1955లో వరంగల్‌లో జన్మించారు. వాణిజ్య పన్నుల శాఖలో సీటీవోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. చిన్నతనంలో ప్రభాకర్ చూసిన సంఘటనలు.. చవి చూసిన అనుభవాలే ఆయనను రచయితగా.. దర్శకుడిగా మారడానికి ప్రేరేపించాయి. 1981లో మొదటి కథగా 'ఎదను ధర్మం' రాశారు. 1989లో 'కాలవాహిని అలల వాలున' నవల రాశారు. ఐఏఎస్‌కు ఎంపికైన ఓ పేద విద్యార్థి నేపథ్యాన్ని ఇందులో చిత్రీకరించారు. తర్వాత కాలంలో.. రజాకార్ల ఉద్యమ నేపథ్యంతో 'గమ్యం'.. షేర్‌మార్కెట్ నేపథ్యంతో 'చోర్ బజార్'.. నకిలీ కరెన్సీ నేపథ్యంతో 'రూపాయలొస్తున్నాయ్ జాగ్రత్త' వంటి నవలల ద్వారా మంచి పేరు సంపాదించుకున్నారు. 'రూపాయలొస్తున్నాయ్ జాగ్రత్త' నవల కన్నడంలోకి సైతం అనువాదమై ధారావాహికలుగా ప్రచురితమైంది. 2014లో సినిమాకు సంబంధించి 24 కళలను దర్శకుని కోణం నుంచి తెలిపేలా 'నా సినిమా సెన్సారైపోయిందోచ్' నవల రాశారు. దీనికి నంది అవార్డు లభించింది. ఇదే నవల ఆంగ్లంలో 'ఐ గాట్ యూ' పేరుతో ప్రచురితమైంది. 2015లో జీవితం-ఓటమి-గెలుపేనా? సినీ పరిశ్రమలో ఉండే ఇబ్బందులు.. బాధలను నేపథ్యంగా 'సినీవాలీ' నవల రాశారు. లాకర్ నంబర్ 369.. బాబా బాబా బ్లాక్‌షీప్ నవలలు విశేష ఆదరణ పొందాయి. తన బాల్యంలో కోటీశ్వరుడిగా బతికిన వ్యక్తి జీవిత చరమాంకంలో దీనస్థితిని నేపథ్యంగా చేసుకొని 2016లో 'మీల్స్ టికెట్' కథను రాశారు. తాను రాసిన 'కుట్ర' నవలకు 2019లో తెలంగాణ సాహిత్య అకాడమీ నుంచి బహుమతి అందుకున్నారు. ప్రస్తుతం 'హీరో' నవల రాస్తున్నారు. తన తండ్రి లక్ష్మీనారాయణ పేరిట జైనీ నేషనల్ లిటరసీ అవార్డులతో సాహిత్యంలో రాణిస్తున్నవారికి అవార్డులు ఇస్తున్నారు. జైనీ 2019లో ఇండియన్ అచీవర్స్ అవార్డు తీసుకున్నారు.

**'ధనుంజయ నాయక్, ఐఏయస్, ములుగు జిల్లా కలెక్టరు గారికి స్వాగతం'** అన్న బ్యానర్ చూసి నవ్వుకుంట కారు దిగంగనే మా రెవెన్యూ స్టాపు నాకు బొకేలు ఇచ్చి స్వాగతం పలికిన్రు. మీడియా మిత్రులు, ప్రెస్ మిత్రులు కూడా ఆహ్వానం పలికిన్రు.

2020 జనవరి నెలాఖరున జరిగె జాతర పనులు పర్యవేక్షించేందుకు వచ్చిన నాకు మేడారం జాతరకొత్తదేంకాదు. ఆరోజంత అక్కడ అధికారులతోటి సమీక్షలు జరిపినతర్వాత సాయంత్రం పూట ఒకసారి అమ్మవార్లు వొచ్చేటి గద్దెల దగ్గరకు పోయి చూద్దమని అనుకుంట అటువైపు నడుస్తాంటె, నా వెంబడే వస్తున్న మా సిబ్బందిని రావద్దని చెప్పి, నేనొక్కన్నే అటువైపు నడిచిన.

అక్కడున్న అరుగు మీద కూర్చున్న. మనసులో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నయి.

మేడారం జాతర చరిత్రను గమనిస్తే అద్భుతమనిపిస్తది. ఇది గిరిజనుల రామాయణం లెక్క అనిపిస్తది. అడవికి వేటకు పోయిన గిరిజన పెద్దకు, నోట్లో నుండి వెలుతురులు విరజిమ్ముకుంట పులుల తోటి ఆడుకుంటున్న సమ్మక్క దొరుకుతది. తరువాత ఆమెనే ఆ గిరిజనుల సామ్రాజ్యానికి నాయకురాలైతది. కాకతీయ రాజులకు సామంతరాజుగా ఉన్న పగిడిద్దరాజును పెండ్లి చేసుకుంటది. కనీ, ఈ గడ్డలనే తిరుగుబాటు తత్వమున్నది. అన్యాయాన్ని ప్రశ్నించే ధిక్కార స్వరమున్నది. గందుకె చక్రవర్తితోనే యుద్ధానికి దిగుతది. గా యుద్ధంల సమ్మక్క,

సారక్కలు వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోతరు. కని, జనం గుండెల్లో చిరకాలం బతికే ఉన్నరు. సమ్మక్క కొడుకు జంపన్న గాయాలతోటి సంపంగి వాగులపడి మరణిస్తడు. జంపన్న నెత్తుటి తోటి సంపంగి వాగు కొన్ని మైళ్ళదాక, కొన్నిరోజులదాక ఎర్రగా మారిందంట. గందుకె, గప్పటి నుంచి సంపంగి వాగును జంపన్నవాగు అని పిలుస్తాను. గా స్థలంలనే ఇప్పుడు మేడారం సమ్మక్క సారక్క జాతర జరుగుతాంది. ఈ జాతరల విగ్రహాలుండవు. సమ్మక్క వారసులు గిరిజన పూజారులు అడవిలోని చిలుకలగుట్ట నుండి దేవతను కుంకుమ భరిణె రూపంల తీసుకొస్తరు. అమ్మవార్లు గద్దెల మీద కొలువయ్యే సమయంల జిల్లా అధికారులు పది రౌండ్లు తుపాకీ కాల్పులు జరుపుతరు. భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించిన తర్వాత దేవతలు తిరిగి వనప్రవేశం చేస్తరు.

గీ కథలల్ల ఎంత నిజమున్నదో గని, కొన్ని శతాబ్దాలుగ ప్రజలను, ముఖ్యంగ గిరిజన ప్రజలను అన్యాయానికి ఎదురు నిలబడమని సమాయత్తపరిచే శక్తి మాత్రం ఉన్నది.

గందుకె గింత గొప్ప శక్తిస్వరూపులైన సమ్మక్క సారక్కలను గిరిపుత్రులు నేటికీ కొలుస్తరు. అమ్మలకు నిలువెత్తు బంగారాన్ని అంటె తమ బరువుతోటి సమానంగ బెల్లాన్ని సమర్పించి మొక్కు తీర్చుకుంటరు. గీ పండుగ దినాలల్ల చుట్టుపక్కల ఐదారు జిల్లాలల్ల జనజీవనం స్థంభించిపోతది. అన్ని మార్గాలూ మేడారం దిక్కుకే, గిరిజన కుంభమేళా దిక్కుకె దారితీస్తయి. గందుకె, 2020 జనవరిల జరిగే, కోట్లమంది ప్రజలు దర్శించుకునే, గీ జాతర ఏర్పాట్లు ఏడెనిమిది నెలల ముందు నుండే ప్రారంభమయితయి. గందుకె, గీ జిల్లా కలెక్టరుగ నా మీద చాన బాధ్యత ఉంటది.

అసలు ఈ జిల్లాకు నాకు పోస్టింగు వొచ్చినప్పటి నుంచే ఒకరకమైన ఉద్వేగానికి గురయిన. తెలంగాణా రాష్ట్రంల జిల్లాల పునర్విభజన జరిగి పది జిల్లాలు ముప్పై రెండు జిల్లాలయినంక కన్ఫర్డ్ ఐఏయస్‌లకు కూడ జిల్లా కలెక్టర్లుగ పనిచేసే అవకాశం రావడం వల్లనే, కన్ఫర్డ్ ఐఏయస్ అయిన నాకు ఈ జిల్లా కలెక్టరుగ పనిచేసే అదృష్టం కలిగింది.

అసలు మాది పూర్వవరంగల్ జిల్లాల మహబూబాబాదు దగ్గరున్న ఒక తండా. జిల్లాల విభజన జరగకపోతే వరంగల్ జిల్లాలనే నానేటివ్ జిల్లా అయితది కాబట్టి ఇక్కడ పనిచేసే అవకాశం నాకు రాకపోతుండె. ఇప్పుడు మా తండా మహబూబాబాద్ జిల్లాల ఉన్నది కాబట్టి అదే నా నేటివ్ జిల్లా. గందుకె ఇప్పుడు ములుగు జిల్లా కలెక్టరుగ పోస్టింగ్ వచ్చింది.

గద్దెలు దూరంగ కనిపిస్తున్నయి గని నా చూపు వాటి మీద లేదు.

నా చెవులల్ల ఒక మధురమైన పిలుపు వినిపిస్తాంది. దూరం నుండి ఒక పన్నెండేళ్ళ వయసున్న ఒక బాలుడు ఉరుక్కుంట, ఏదో అనుకుంట వస్తున్న సుందర దృశ్యం కండ్ల ముందు మెదులుతాంది.

నా ముఖంల సంతోష వీచికలు వ్యాపించినయి. ఎందుకంటె ఆ బాలుణ్ణి నేనే. వీనుల విందుగ 'బలిఁయా! బలిఁయా!' అని నా చెవులల్ల మారుమోగుతున్నవి నా పిలుపులే.

మనసు బాల్యపు వీధులల్ల పరుగులు పెట్టింది.

* * *

పూర్వ వరంగల్ జిల్లాల మానుకోట దగ్గర మా తండ. మాక్కొంచెం పొలమున్నది. కని నీటి సదుపాయం లేక తిండికెల్లేదే కష్టంగ ఉండేటిది. మా బాపూ, అమ్మ మస్తు కష్టపడెటోల్లు. అయిన గని మా నలుగురు పిల్లల్ని సాదడం కష్టమయ్యేటిది. మా అమ్మైతే పొద్దున్నె లేస్తే పొద్దుగూకే దాక నడుము లేవకుండా కాయకష్టం చేసేటిది. కని రాత్రికి మా గుడిసె ముందు కూసోబెట్టుకుని అన్నం కలిపి ముద్దలు పెడ్తాంటె, మాకు చాన సంబరంగ ఉండేటిది. మా అమ్మ ముఖం చందమామ లెక్క అందంగ కనిపించేటిది మాకు. కని గా సుఖం మాకు ఎక్కువ రోజులు దక్కలె. 'గింత మందిని సాదడం, చదివించడం తన వల్లగాదని, తండలనె ఉంటె చదువులు చట్టుబండలు లేక పాడయితరని' చెప్పి మా నాయిన మా ముగ్గురు అన్నదమ్ములను హన్మకొండల

యస్టీ హాస్టల్ల చేర్పిచ్చిండు. మేమందరం పేటకు (వరంగల్లుకు) వొస్తాన్న రోజున మా అమ్మ దుఃఖానికి అంతేలేదు. రాత్రంత ఏడ్చింది. పొద్దున్న బస్సు దగ్గర కూడ ఏడ్చింది. మాకైతే ఏడ్పే ఆగుతలేదు. చూస్తుండంగనే అమ్మకండ్ల ముందు నుండి కనుమరుగయింది.

మా బాపు రెండ్రోజులు వరంగల్లుల ఉండి, బస్సు కండక్టరుగ పనిచేస్తున్న మా చిన్నాయిన సలహాతోటి మమ్మల్ని కిషన్పురల ఉన్న యస్టీ హాస్టల్ల, హన్మకొండ చౌరాస్తాకు పోయేటి దారిల ఉన్న మర్కజీ హైస్కూల్ల చేర్పిచ్చిండు.

ఇంగ తండాకు బయల్దేరుదామనుకున్న రోజున కాజీపేట ప్యాసింజర్ రైలు ఎక్కేటందుకు వరంగల్ స్టేషనుకు పోకుంట మా నాయ్న నన్ను కూడ తన తోటి రమ్మన్నడు. ముందుగాల లోకల్ బసెసక్కి పాపయ్యపేట చమను స్టాపుల దిగి కొంచెం దూరం ముందుకు నడిచి ఒక దుక్నం దగ్గర ఆగినం. అది లంబాడీ గాజులు తయారు చేసెటి కార్ఖానా. అక్కడ మా అమ్మ కోసం బలింయా (లంబాడీ గాజులు) కొన్నం.

అక్కడ బంలియా మిషిన్ మీద పెట్టి గాజులు కోస్తాంటె నాకైతే గమ్మత్తుగనిపించింది. 'బలింయా మాన్కియా' అంటే లంబాడీ గాజులు అమ్మే సేటు తోటి మా నాయినకు మంచి దోస్తీ ఉన్నట్టున్నది. మాకు ఛాయ్ ఇప్పించిండు. వాళ్ళిద్దరు మా బాసల, లంబాడీ బాసల మాట్లాడుకుంటాంటే నాకు గమ్మత్తుగనిపించింది. మా బాపు మా అమ్మ కోసమే కాకుండ తండల అమ్మేటందుకు కొన్ని లంబాడీ గాజులు కొన్నడు. అవన్నింటిని గోపురం లెక్క నిలబెట్టి దారంతోటి కట్టిన పది సెట్లు కొన్నడు. కని వాటికి పైసలిచ్చెటప్పుడు మాత్రం ఇద్దరు గీసిగీసి బేరమాడిన్రు. ఎన్నో ఏండ్ల నుంచి తెలిసినోల్లమని అనుకుంటనే బేరం దగ్గర పంచాయితీ పెట్టుకున్నరు. లెక్క దగ్గర ఒకచోట తప్పయితె నేను సరిగ్గ కూడిక చేసి చెప్పిన.

గప్పుడు, మా బాపు నన్ను గర్వంగ చూసిండు. మాన్కియాతోటి నేను చదువుట్ల అవ్వల్ (ఫస్టు) అని చెప్పిండు. మొత్తానికి లెక్క తెగింది. మల్ల ఇద్దరు దోస్తుల్లెక్క రాసుకుంట పూసుకుంట

మాట్లాడుకున్నరు. గా పది జతల బంలియా అమ్ముకుంటె, కొంచెం లాభమొస్తది. మా అమ్మకు కొన్న బంలియా ఖర్చు, ఆరు రూపాయలు, అండ్ల ఎల్లిపోతది.

అయితె, పోతపోత మా బాపు నన్ను గా మన్కియాకు చూపించి ఆయనతోటి, 'మావోనికి ఏదన్న పనుంటె చూడరాదుండి మాన్కియా! నీకాల్మొక్త. చదువుకుంటనే రాత్రిపూట పనిచేస్తడు. పోరడు లెక్కలల్ల మస్తు ఉషారు. మీరే చూసిన్రు కద! మీ చేతికింద ఉంచుకోన్రి. ఏదైన నెలకింతని ఇప్పిస్తె వానికి, వాని తమ్ముల్ల చదువుకు ఆసరైతది. ఊర్లె చానా తక్లీఫుగున్నది (కష్టంగఉన్నది)!' అన్నడు.

మాన్కియా చానా సేపు ఆలోచించి, వాల్ల కొడుకులతోటి గూడ సంప్రదించి సరే నన్నడు. నాకు రోజుకు రూపాయి కూలీ ఇస్తనన్నడు. గాన్నుంచి నుంచి మొదలయి, రెండు పక్షాల వాండ్లు, గిరిగీసి బేరమాడి నెలకు వంద రూపాయల జీతం, బస్సుపాసు, సెలవులల్ల పని చేస్తే రోజుకు ఐదు రూపాయలు, భోజనం పెట్టాలని ఖరారునామా (ఒప్పందం) చేసుకున్నరు. మా బాపు మస్తు ఖుషయిండు. ఏదో సాధించినట్టు ముఖంల నవ్వు మొలక మొలిసింది.

మా బాపు తోటి నేను కూడ వరంగల్ స్టేషన్ల రైలు కోసం ఎదురుచూస్కుంట నిలబడ్డ.

గప్పుడు, మా బాపు నన్ను దగ్గరకు తీస్కోని,

'నాయక్! బాగ సదువుకోవాలె బిడ్డా! నువ్వు సదువుకుంట నీ తమ్ముల్లను కూడ ప్రయోజకులను చెయ్యాలె. సేటు దగ్గర నమ్మకంగ పనిచేస్కో. వాల్లేం చెప్తే అది చెయ్యి. పైకి భయపెట్టడు గని మాన్కియా మంచోడు. పైసలు దుబార చెయ్యకు. సిన్మలు గిన్మలు అని పుజూల్గ ఖర్చుపెట్టకు. మంచిగ చదువుకుంటె మనకు రిజర్వేషన్ ఉన్నది కాబట్టి మంచి కొలువొస్తది. మన కష్టాలన్ని తీర్తయి. చిన్నపిల్లగాన్ని చేసి వొదిలిపెట్టి పోతున్ననని గుబులు పడకు. అప్పడప్పుడు చిన్నాయన కలుస్తడు. నేను గూడ వొచ్చిపోతనే ఉంట. నువ్వు బాగ సదువుకోని మంచి కొలువు సంపాదిస్తె, నాయక్ అన్న నీ పేరు నిలబెట్టుకుంటె, మీ అమ్మ మస్తు ఖుషయితది!' అని కండ్ల నీళ్ళు పెట్టుకున్నడు. నాక్కూడ బాగ ఏడుపొచ్చింది.

మా లంబాడీలకు చుట్టాలు కలిసినప్పుడు, విడిపోయినప్పుడు కూడ దుఃఖం ముంచుకొస్తది. గట్ల పబ్లిగ్గ, కావలించుకుని ఏడుస్తున్న మమ్మల్ని చూసి నవ్వెటోల్లున్న గూడ మేం పట్టించుకోం. మాకు బంధుత్వాలె ముఖ్యం.

రైలు వొచ్చినంక, గాజుల మూటను పదిలంగ పట్టుకుని, మా బాపు సంతోషంగ తండకు బయల్దేరిండు.

నేను లోకల్ బస్సెక్కి హన్మకొండ పెట్రోలు బంకు స్టాపుల దిగి హాస్టలు దిక్కు నడిచిన.

గట్ల, హన్మకొండ, కిషన్‌పురలో ఉన్న యస్టీ హాస్టల్ల ఉండుకుంటనె అక్కడ హైస్కూల్ల చదువుకుంటనే, ఊర్లె ఉన్న అమ్మా, నాయినా, చెల్లెండ్లకు కొంచెం ఆసరయితదని, బడి అయిపోయిన తర్వాత పాపయ్యపేట చమన్ దాటినంక పెద్ద మోరికి దగ్గర్ల ఉన్న ఎల్లమ్మ బజారుకు పోయే సందు బాజు పంటి ఉన్న లంబాడీ గాజులు తయారు చేసేతోటోల్లింట్ల పార్ట్‌టైం

ఉద్యోగంల చేరి నా చదువులు కొనసాగించిన.

మా సేటు యింట్ల ఎప్పటికి ఓ పదిమంది వర్కర్లు ఉండెటోల్లు. నేను వాల్లందరిల బాగనే కలిసిపోయి అన్నిరకాల పనులు నేర్చుకున్న. మా సేటుకు, నా వల్ల మస్తు సౌలత్ అయింది.

మా సేటు కార్ఖానా, ఇల్లూ ఒకటే కాబట్టి షావుకారమ్మలు కూడ నా తోటి మంచిగనె ఉండెటోల్లు. అప్పుడప్పుడు పెద్ద మాల్కిన్ (సేటమ్మ) నన్ను పిలిచి వాండ్లు చేసుకున్న సర్వపిండి, ఉప్పుడు పిండి, పబ్బియ్యం పెట్టేది. ఆమెను చూస్తే మహాలక్ష్మి లెక్క ఉండేటిది. మా అమ్మకన్న వయసుల పెద్దదే గని, గామెను చూస్తె మా అమ్మనె యాదికొచ్చేటిది. గప్పుడు నేను కండ్ల నీల్లు పెట్టుకుంటె, సేటమ్మ మంచిమాటలు చెప్పి ఓదార్చేటిది.

హోలీ పండుగకు మా తండకు పోతనంటే, సేటు జీతం పైసలూ, సేటమ్మ మా అమ్మకు, చెల్లెకు మంచి తెల్లటి గాజుల మూట యిచ్చింది.

నా సంచిల అమ్మకు తీసుకపోతాన్న గాజులు గలగలమంటాంటె నాకెంత సంబరంగ ఉండెనో! తండకు పోయినంక, మా అమ్మకు చెల్లెకు నా చేతులతోనే, బలిఁయాతొడిగిన. అమ్మ ముకంల, పండగ రాకముందే, హోలీ రంగులు పూసినయి. కన్నతల్లికి గాజులిచ్చే అదృష్టం ఎంతమంది కొడుకులకుంటది?

తెలంగాణాల తరతరాలుగ జాతరలు చానా బా గజరిగేటియి. ఒక విధంగ అదొక పెద్దమార్కెటు. అంతేకాకుండ ఏడాది పొడుగూత పనిచేసిన రైతులకు, కార్మికులకు, శ్రామికులకు ఒక ఆటవిడుపు లెక్క ఉండేటిది.

మాసేటువాండ్లు, ఎక్కడజాతర అయితె అక్కడ దుకానం పెట్టెటోల్లు. పేటకొచ్చి (వరంగలుకు వచ్చి) కొనుక్కోలేని లంబాడీ స్త్రీలు, వాండ్ల ఊర్ల దగ్గర జరిగేటి జాతరల గాజులు కొనుక్కునెటోల్లు. కొత్తకొండ, మరిపెడ, గార్ల జాతరలకు చానా మంది లంబాడీ స్త్రీలు బలిఁయా కోసమే వొచ్చెటోల్లు. గిరాకి బాగ జరిగేటిది. జాతర కోసం, మేం మూడు నెల్ల ముందు నుంచే సరుకు సిద్ధం చేసుకునెటోల్లం.

మా సేటు తన చేతులతోటి స్వయంగ గాజులు తొడిగితె మంచి జరుగుతదని వాండ్లకు ఒక నమ్మకం.

అందుకె, నేను మా దుకానం ముందు నిలబడి, లంబాడీ స్త్రీలు పోతాంటే, 'బలిఁయా, బలిఁయా! వర, వర! (గాజులు, గాజులు, రండి, రండి)' అని పిల్చుకుంట వాల్లతోని మా బాసల మాట్లాడెటోన్ని. గా వయసుల నేను ముద్దుగ ఉండెటోన్ని. మల్ల తండాల లెక్క కాయకష్టంలేక, పేటల (వరంగల్లుల) ఉండి చదువుకుంటాన్న కాబట్టి కొంచెం నాజూకుగయిన. నన్ను చూసి ముచ్చటపడి చాలామంది లంబాడీ స్త్రీలు, మా దుకానంలకె వచ్చెటోల్లు.

'బలిఁయా, బలిఁయా!'అని దినమంత మొత్తుకునేటి సరికి, నిద్రలగూడ, 'బలిఁయా' అనే కలవరించెటోన్నట. తెల్లారి మా మన్కియా చెప్పెటోడు.

జాతర ఆఖరి దినంనాడు మా సేటూ, నేనూ అమ్మలను దర్శించుకోని, ఇద్దదరమ్మలకు చెరొక గాజుల జత సమర్పించుకుని దండం పెట్టుకునెటోల్లం.

* * *

ఇప్పుడు కూడ 'బలీయా' అన్న అదే పిలుపు నా చెవులల్ల మధురగానం లెక్క వినిపిస్తాంది.

మా బాపు చెప్పినట్టు నేనూ మా తమ్ముల్లూ బాగ చదువుకున్నం. నేను డీయస్సీ రాసి టీచరుగ పనిచేసిన. తర్వాత గ్రూప్ టూల, తెలుగు లిటరేచర్ఆప్షనలుగ తీస్కోని, గా పరీక్షల యమ్మార్వోగ సెలెక్టయిన. మల్ల గ్రూప్ వన్ రాసి డిప్యూటీ కలెక్టరయి, పదేండ్ల తర్వాత ఐఏఎస్‌కు కన్ఫరు అయి ములుగు జిల్లాకు కలెక్టరయి, జాతరప నులు పర్యవేక్షించడానికి మేడారానికి వచ్చిన.

ఇప్పుడు, ఇక్కడ మా మన్కియా పెట్టిన దుకానం ఆనవాలే లేదు గని గా మధురస్మృతి నా మనోమంజూషల, టీచరుగ నేను తీసుకున్న మొట్టమొదటి జీతంతోటి మా అమ్మకు నేను కొన్న పట్టుచీరె మడతలల్ల మా అమ్మదాచిపెట్టిన గంధపుపొట్లం సువాసనలెక్క, ఇంకా నిత్యనూతనంగనే ఉన్నది అని అనుకుంట, గా సువాసనల బాల్యపు మధురిమలను పీల్చుకుంట వెనుదిరిగిన.

ఇప్పుడు మా వాండ్లు కూడ బలీయాలు వేసుకుంటలేరు. ఏదో మా అమ్మలాంటి సంప్రదాయ స్త్రీలు, బలీయా అంటె మంగళసూత్రంతోటి సమానంగా భావించెటోల్లు, శుభకార్యాలల్ల వేసుకునెటోల్లు తప్ప, ఎవ్వరు వేసుకుంటలేరు.

దానిక్కూడా చానా కారణాలున్నాయి. బలీయా వేసుకుంటే మేం తక్కువ స్థాయికి చెందినవారమనె ఒకరకమైన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతోటి; మేం సమాజంల సమాన భాగస్వాములం కాదన్నట్టుగ భావిస్తారేమోనని; అట్లనే ఆధునిక వస్త్రధారణ; మారిన మహిళల జీవనవిధానం; అంత బరువు మోయలేని సౌకుమార్యం వల్ల కూడ ఆధునిక మహిళలు బలీయాలు ధరించడంలేదు.

మా మన్కియా కూడ ఇప్పుడు లేడు. వాళ్ళ కొడుకులు కూడా క్షీణించిపోతున్న ఈ వ్యాపారాన్నే నమ్ముకోకుండ వేరే వ్యాపకాలల్ల స్థిరపడ్డరు.


ఇప్పుడు 'బలీయా' నాకొక మధురస్మృతి మాత్రమే.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 101

# రేణుక

## పర్కపెల్లి యాదగిరి

**కన్సొలేషన్ బహుమతి రూ. 5,000 పొందిన కథ**



పర్కపెల్లి యాదగిరి వృత్తిరీత్య చిత్రకళాకారుడు. తల్లిదండ్రులు లక్ష్మి - నర్సయ్య. సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామంలో జన్మించిన యాదగిరి వరంగల్‌లో చదువుకున్నారు. ప్రస్తుతం సిద్దిపేటలో ఉంటున్నారు. కథలు, కవిత్వాల్లో అనుభవాజ్ఞులు. 60కి పైగా కథలు, 200లకు పైగా కవితలు రాశారు. 'శికారి' ఈయన కథా సంపుటి. విశాలాక్షి సాహిత్య మాసపత్రిక ఆధ్వర్యంలో 'పాతాళ గరిగె' కథ, ప్రథమ బహుమతి అందుకుంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ నిర్వహించిన పోటీల్లో 'గూడు' కథ, 'నవతెలంగాణ' నిర్వహించిన పోటీల్లో 'పాముల కథ' తృతీయ బహుమతి, పొలిమేర దాటేవేళ ప్రత్యేక బహుమతి, 'పిట్టలు' ప్రథమ బహుమతి వివిధ సందర్భాల్లో అందుకున్నాయి.

**మంచు దుప్పట్లో ఊరుని మూటగట్టి ఈటెలతో** పొడుస్తోంది చలి. కీచురాళ్ల రొదలో వణుకు ధ్వనిస్తోంది. ప్రకృతమ్మలోని చలనాలు గడ్డకట్టి అంగాంగాలు వంకర్లు పోతూ ఉన్నాయి. చల్లదనాన్ని తాళలేని చంద్రుడు పడమటి గుట్టలమాటున చేరి ఆ దృశ్యాన్ని చూస్తూ ఉన్నాడు. వాకిట్లో గల కోళ్ల గూడు మీద తట్ట పరచి ఉంది. ఒక కుక్క పరుగెత్తుకుంటూ వచ్చి దాని మీదకు ఎక్కి కాళ్ళతో గీకింది. చెవులు టపటపా కొట్టింది. ముందటి కాళ్ళు నిటారుగా ఉంచి వెనుక కాళ్ళు మడిచి కూర్చుంది. తల గాల్లోకి చాచి శోకరాగం ఆలపిస్తోంది. ఆ శబ్దం చిక్కటి చలిలోంచి సాగలేక మృత్యు బీభత్స జీరతో వినిపిస్తోంది.

ఇంట్లో పడుకున్న నర్సిమ్ములు 'ఓ .. రేణా కుక్కేడ్తాంటె ఇనవడ్తలేదానే, కుక్కని సాదొద్దే ముండా.. అంటే ఇనకపోతివీ' అసహనం కోపం కలగలపి అరిచాడు.

'ముండకొడ్కా.. నువ్వే లేసి ఎల్లగొట్కపో' అంది రేణుక.

'నీ తల్లి! లేవొత్తలేదూ.. మెసులొత్తలేదూ.. బోక్కలు ఒక్కతీర్గ గుంస్తానయీ.. పెయ్కాక సుతం ఒచ్చిందే..'

'అంతగనం ఆ మంది ఉచ్చ ఎందుకు తాగినవ్. బజాట్ల ఎందుకు పడ్డవ్, కంతకు పొక్కవడే. మొకం, మోకాళ్లు, మోసేతులు ఆకం పగిలి నెత్తుర్లు శిమ్మిచ్చే.. అట్ల సుతం సోయి సొక్కు లేకుంట పంటివీ.. తెల్లన్దన్క నీకు పసుపులు పెట్టుకుంట, నీకు సల్లలు పోసి తినిపిచ్చుకుంట, నీల్లు తాపిచ్చుకుంట ఇదివర్దాక నీతోనే ఉంటీ. పొద్దుందాక మాగి ఎండిన పెయ్యంత బగ్గుమనంగ సేసి సేసుంటి. జెరంత గిప్పుడే కన్నంటుకున్నది. నీ కంట్లో నిప్పులు పోసుకుంటివీ'

కుక్క గొంతుపెంచి సాగదీసుకుంటూ ఏడుస్తోంది.

'నీ తల్లి.. దాన్ని ముందుగల్ల ఏల్లగొట్టు పోయే.. బజ్జాత్దానా'

'ఈ కుక్క నాశడం గానో' అంటూ లేచింది, తలుపు పక్కనే నిలబెట్టి ఉన్న ఊడుగు కఱ్ఱ తీసి రెండు దెబ్బలు కుక్కని గట్టిగా కొట్టింది.

'క్కుఓ.. క్కువ్వో.. క్కువ్వో .. క్కువ్వో' అరుస్తూ రోడ్డు మీదకు పరుగెత్తి వెనక్కి తిరిగి రేణుకను చూసుకుంటూ నిష్టూరంగా మనిషిలాగే మూలిగింది కుక్క.

'అడ్డమైన కుక్క! ఒక్కొక్కలు నా పానానికి దాపరమైనారూ' అంది రేణుక.

'ఓరెక్క! కుక్కను సంపుతవానే.. పాపంల పడిపోతవే లం...ముండ' అన్నాడు నర్సిమ్ములు.

'ఏందిర బాడుకావ్.. పాపంల పడిపోతాన్ర నేనూ' ఛాతిపై కొట్టుకుంటూ 'ఏందిరా.. నేను పాపంల పడిపోతాన్రా.. నువ్వురా పాపంల పడి పురుగులవడి, రేషే దిక్కులేక, నవిశినవిశి కుక్కసావు సత్తవూ.. పంచాతోల్లొచ్చి గుంజేత్తరు. ముండకొడ్కా.. టాట్టర్ తోలవడ్తవీ.. వొచ్చినకాడికి నీ టిపిన్లకు, నీ షాయలకు, నీ శికిలేట్లకు, నీ గుట్కలకు, నీ తాగుడుకు, నీ బొందకు పెట్టుకోవడ్తివీ. ఒక్కనాడన్న నీ పాపిష్టి షేత్తోని ఇగవటని ఒక్క మూన్నూర్లు రొంన్నూర్లు, ఒక్కనూరు రూపాలు ఇచ్చినావురా. ముప్పై నలుపై ఇత్తె ఏ మూలకైతయీ. ఆడదాని రెక్కల కట్టం, బాడుగూడు తినవడ్తివీ. కాలీసు బందుంటె బుడ్డపోరి సుతం అడ్వి పనికి పోవట్టే. అది పన్నెండు సద్వవట్టే, కన్న పాపానికి ఒగయ్య షేతుల వెట్టి రుడం తీస్కుకోవాలనే నెనరున్నాదిరా నీకూ.. ఇంత పాపం జెయ్యవడ్తివీ. నువ్వే పాపంల పడి పోతవురా రండా.. నా పోరి ఉచ్చల మూతివెట్టుకోని నీ అయ్య మాగబోయిండుగనీ.. నా అయ్యంబెడి వడి తాగిచ్చి, తినిపిచ్చి బొంకిచ్చి బొర్లిచ్చి నాకు దాపురం చేసే. అదెపాయెతీ ముండకొడుకు అనుకుంటి. షెరో కట్టం జేస్కోని బట్టకు పొట్టకు మా బత్తం అనుకుంటిని. నన్నెంత మాటంటివిరా.. నీకు నోరెట్లొచ్చిందిరా. నేను పాపంల పడిపోతాన్ర' ఏడ్వడం మొదలుపెట్టింది.

'అమ్మా.. ఏందే.. నీ రపరప.. బాపు గియ్యాల్నే తాగిండానే, ఎన్కటి సంది తాగ్తలేడా.. పడ్తలేడా.. ఎటువడితె అటు మాటలంట లేడా. ఏమో గియ్యాల బహు బద్దియ్యవడ్తివీ. పక్కకే మా దోస్తులున్నరూ.. పొద్దుగల ఏం మొకం బెట్టుకోని తిరుగాల్నే' నిద్ర గొంతుతో అంది పూజ.

'ఈడు జెయ్యవట్టి.. మనకు ఇంక మొకాలున్నాయి బిడ్డా.. ఇంతేదన్న ఇస్సం బుచ్చుకోని సచ్చింది నయం బిడ్డా..'

తెల్లారింది. నర్సిమ్ములు జ్వరం గాయాలతో తల్లడిల్లిపోతున్నాడు. రేణుక ఫోన్‌జేసి ఆరెంపి డాక్టర్ అంకుషావలిని పిలిచింది.

'ఏహే.. బావా నీకు దేవుడు షిగ్గుపెట్టలేదెహూ.. అయ్యో... గీ తీర్గ తాగి, గీ తీర్గ దెబ్బలు తాకించుకుంటావు. ఆయిమన్నకాడ తాకి ఆయింత గూత్తెట్లనోయ్. ఉన్నొక్క పొల్ల లగ్గానికున్నది. గాయింత సోయిలేదానే' అన్నాడు.

'అదీ శిగ్గుశెరం లేని పిండమే అన్నా.. ఎట్ల పుట్టిండో.. ఇప్పకు తొర్రబుట్టినట్టు. గంత సోయింటు మంచిగనే ఉండు. పొల్లకోసం ఒక్క బుడ్డపైషె సుతం ఎన్కేసింది లేదు.

'ఏహే.. నీ వాయీ.. జెర్రంత ఎక్కువైంది వాయీ.. ఆ రోడంత తొవ్విన్రు

ముండకొడుకులూ. జెరంత మిట్టకు కాలేసిన.. ఆయింత జరున ఒంపులకు జారిన. అదొక్కటే సోయున్నది నాకు. అటెంక ఏమయ్యిందో సోయిలేదు నాకు' అన్నాడు నర్సిమ్ములు.

'హే.. తీ.. మాగజెప్పినవుతీ.. కిందా మీదా మూసుకో అసే. తాగితాగి లివరు కరాబైతె ఏం జేత్తవు బావ'

'అంకుషన్నా.. ఈ సర్కారూ రాషెన బియ్యం ఏలువెడ్తే ఎట్లిత్తండ్లో.. గట్లనే ఒక్కనికి ఒక్కదినం ఒక్కటే కోటరు ఇట్టేటట్టు సేసుగద మంచిగుండు. మత్తు సంసారాలు బాగుపడు' అంది రేణుక.

* * *

'అంకుషన్నా.. పుండ్లు మానినయిగనీ.. ఐద్దినాలైనా.. జెరం కమ్మైతలేదూ.. ఆ మొకం సుతం ఉబ్బరం దిగ్తలేదేందే' అన్నది రేణుక.

'ఇంద్రారెడ్డి తాడికి తోల్క పోండ్లక్కా మరీ..'

'మందులూ పరీచ్చలు బాగా రాత్తడూ.. ఇప్పుడే తకిలీవున్నది తిండికీ.. మల్ల మత్తు జనముంటరూ. ఒక్క దినము కూలిపోతదీ. తెల్లన్‌దన్క పొద్దుందన్క సూత్తనే ఉంటడు'

'ఏం జేతాం మరీ.. ఆపతి మనది' అన్నాడు అంకుషావలి.

నర్సిమ్ముల్ని హాస్పిటల్‌కు తీసుకెళ్లింది. టెస్టులూ అయి రిపోర్టులు వచ్చేసరికి రాత్రి పదకొండు దాటింది.

'అమ్మా.. నేను వేరే హాస్పిటల్‌కు రాస్తున్నా.. ఒక్క డెబ్బైవెయిలు దగ్గరుంచుకోండి. అర్జెంటుగ ఇప్పుడే తీసుకెళ్లండి' అన్నాడు డాక్టరు.

రేణుక కంగారుగా డాక్టరు ముఖంలోకి చూస్తూ ఉంటే.. 'రా అమ్మా.. నేను చెప్తా' అంటూ చిట్టీలు పట్టుకొని బయటకు వచ్చాడు కంపౌండర్.

రేణుక కళ్ళలోంచి నీళ్లు ధారలుగా కారుతూ ఉన్నాయి.

'సర్కారు దావుకాండ్ల పట్టరా సారూ.. ఆయ్నకేమయ్యింది సారూ'

'ఏమోనమ్మా.. నీ ఇష్టం, సారైతే పట్నం తీసుకెళ్లమని చెప్పిండూ. కొంచెం తల్కాయల ఇన్‌ఫెక్షన్ అయ్యింది. బుగులు పడే పనేం లేదూ.. మందులతో తగ్గపోద్ది' అన్నాడు.

తుఫాను ప్రభావం వల్ల ఈదురు గాలులు వీస్తూ.. తుంపర మొదలయ్యింది.

రేణుక తన తమ్ముడు కిష్టయ్యకు ఫోన్ చేసింది.

'తమ్మీ.. బావకు తల్కాయల ఏమో అయ్యిందట్రా. పట్నం రాసిండు ఇందిరరెడ్డి. డెబ్బైవేయిలు పట్టుకొని పొమ్మన్నడూ.. నాతడ బుడ్డపైషె సుతం లేదురా.. ఈ రాత్రి ఏ తిప్పలన్న పడు జెర నీ పత్యార మీదనే మల్ల. మీది నెల షిట్టి ల్యావట్టిత్తనూ.. బావని బతికిచ్చుకుందాంరా..' అంటూ ఏడ్చింది.

గంటసేపట్లో కిష్టయ్య ఆటో డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చాడు. పూజ ఆటోలోంచి దిగింది.

'ఊ.. బాపుకేమయ్యిందమ్మా..' అంటూ రేణుకని వాటేసుకుంది. ఇద్దరూ ఏడుస్తూ ఉన్నారు.

'ఏహే.. ఊకొండ్లి ఏం కాదూ.. నాలుగు దినాలు మందులాడితే అదే కమ్మైతదీ. ఇప్పుడే రోగానికైనా మందులున్నయీ.. బాగా దొబ్బ నేర్సిండ్లు డాక్టర్లు. మీ హైబత్ సూసి బావ గుండెవలుగ జిక్కనూ.. బావ యాడున్నడే.. జప్పున పోదాం' అన్నాడు కిష్టయ్య. అతని ముఖంలో బాధ కనవడుతోంది.

'ఎట్ల పోదాం తమ్మీ.. ఈ అద్దుమ రాత్రి' అంది రేణుక.

'ఎట్లేంది మన ఆటోలనే పోదాం.. కారంటె మత్తు పైసలు అడుగుతరు. సుట్టు కాయిదం గడ్త.. ఎచ్చంగుంటది'

నర్సిమ్ములు ఆటో దగ్గరికి వస్తూ.. 'యాడికిరా గీ రాత్రి డాక్టరేమన్నడు' అంటూ మూలిగాడు.

'ఏం లేదు బావా.. పట్నం రాసిండు డాక్టరూ.. ఆడికి పోతనే జప్పన కమ్మైతదట'

కిష్టయ్య ఆటో చుట్టూ ప్లాస్టిక్ టార్పాలిన్ కట్టాడు. తను మంకీ క్యాప్ పెట్టుకొని చెద్దరు కప్పుకున్నాడు.దిగులూ విషాదం దుఃఖాన్నీ మోసుకుంటూ హైవే మీదకు చేరింది ఆటో. వెనుక నుండీ ముందు నుండీ సంధించిన బాణాల్లాగా వాహనాలు దూసుకుపోతూ ఉన్నాయి. గాలీవానా ఉధృతి పెరిగింది. నక్షత్రాలు గాలీవానకు రాలిపడి నెత్తురోడుతున్నట్లుగా రేడియం గుర్తులు ఎర్రగా మెరుస్తూ ఉన్నాయి. రేణుక ఒడిలో తలా, పూజ ఒడిలో కాళ్లు పెట్టుకొని నర్సిమ్ములు పడుకున్నాడు. ఆమె కాళ్లు పిసుకుతోంది. రేణుక తలపై పైట కప్పుకొని పంటి బిగువున అంచు పట్టుకుంది. పూజ తలపై చున్నీ వేసుకొని గువ్వపిల్లలాగా కూర్చుంది. ఆటో కుదుపులకీ చలిధాటికి తుఫానులోని తెరచాపలవలె కదులుతూ ఉన్నారు. ఆసుపత్రికి ఆటో చేరుకునే సరికి తెల్లవారు ఝాము మూడుగంటలు దాటింది. భవనం పర్వతం వలె ఉన్నది. ప్రాంగణమంతా ఎల్ఈడీ కాంతులతో పగలులాగా ఉంది. అప్పుడే అంబులెన్స్ కూతలు పెడుతూ క్యాసువాలిటీ ముందు ఆగింది. పదునైన మృత్యువు అంచుల మీద రాలిపడే ప్రాణాలను కాపాడే దేవతల్లాగా నలుగురు వచ్చారు. రోగిని స్ట్రెచర్ మీద వేసుకున్నారు. గ్లూకోసు బాటిల్‌ని ఎత్తిపట్టుకొని వేగంగా వెళ్లిపోయారు. ఇదంతా లిప్తపాటులో జరిగిపోయింది. స్మోక్‌గ్రే కలర్ సఫారీల్లో కొందరు బౌన్సర్లు అక్కడక్కడా నిలబడి ఉన్నారు. పరిసరాలు రోగులు, బంధువులూ, ఉద్యోగులతో పోటెత్తుతూ ఉన్న సాగరంలాగా ఉంది.నర్సిమ్ములు పేరు రిజిస్ట్రేషన్, లక్ష రూపాయలు అడిగితె యాబయి వేలు చెల్లించడం, ఐసీయూలో చేర్చడం టకటకా జరిగిపోయాయి.

'అమ్మా.. ఆయన వెంట మేం ఉండాలెగదా.. ఆయ్నకు గిన్నని పాలబొట్లు, గింతంత డబల్‌రొట్టె ఇయ్యాలే. ఐద్దినాల సంది మెతుకు నోట్ల పెడుతలేడు' కన్నీళ్లు ఉబికి వస్తుండగా అంది రేణుక.

'అవన్నీ మేం చూసుకుంటాం.. మీరు లోపలికి రావొద్దు. ఫోన్ చేస్తారూ, అందుబాటులో ఉండండి' అంది నర్సు.

ముసురు తగ్గుముఖం పట్టింది. చలి నగరాన్ని డేగలాగా పీక్కుతింటోంది. ఏమీ ఎరుగనట్టే తూరుపు ఆకాశం నారింజరంగుని పులుముకుంటోంది. చెట్లమీద పక్షులు అరుస్తూ పొద్దును నిద్రలేపుతూ ఉన్నాయి. పలుదిక్కులు గుంపులు గుంపులు సాగుతూ చీకటి తెరల్ని ఊడ్చేస్తూ ఉన్నాయి. రేణుక వెయిటింగ్ హాల్లో మూలకు ఒదిగి కూర్చున్నది. ఆమె కళ్లు ఉబ్బి ఉన్నాయి. చెంపల మీద అశ్రునదులు ఇంకిపోయిన చారలున్నాయి. గత వర్తమానాల దుఃఖాన్ని ప్రోది చేసుకొని ముఖమంతా పులుముకొని నేలవైపు చూస్తోంది. పూజ ఆమె తొడపై తలపెట్టుకొని పడుకున్నది. కిష్టయ్య చేతులు వెనక్కి కట్టుకొని దిక్కులు చూస్తూ ఉన్నాడు.

'కిట్టయ్యా.. లచ్చ కట్టుమంటే యాబయి కడితిమీ.. తతిమ్మయి ఎట్ల జేతాం తమ్మీ.. బావ దక్కుతడంటవా తమ్మీ' కొంగుతో ముక్కు తుడుచుకున్నది.

'పైసలు సంగతి ఎట్లనో సూతాంతీ.. ఆయ్నకు ఏంగాదక్కా నువ్వేం పికర్ పెట్టుకోకు, బాగైతడూ. తాగుడు మాన్తడూ, బుద్ధికచ్చి మంచిగైతడూ'

'గదే తమ్మీ.. ఆయ్నకోసం నేనెంత గోసపడీ.. ఎంత పైషవెట్టి బతికిచ్చుకున్నో ఆయ్నకు తెలిసొచ్చి ఇగనన్న తొవ్వకు రావాలె తమ్మీ'

'అంత మంచిగనే అయితది గనీ జెరన్న నీల్లు మొకం మీన సల్లుకోని ఏమన్న తిందువు పా'

'నాకు ఆకలేం లేదు తమ్మీ.. మీరు తినిరాపోండ్రి.. అప్పటి వరకు సూత్త'

కిష్టయ్య ఫోన్ రింగైయ్యింది.

'అక్కా.. ఉంక లక్ష యాబైవెయిలు అర్జెంటుగా కట్టుమంటాండ్లే దావుకాండ్ల'

'ఓష్ని.. ఏదీ అడుగుతాంపా.. సావుమర్నమే ఉన్నదిరో' అంది రేణుక.

రిసెప్షన్‌లోకి వెళ్లారు.

'అయ్యో.. ఇతకు ముందే యాబై వెయిలు కట్టినమ్ మేడమ్. మా ఊర్లె డాట్టరు యాబై వేయిలల్ల అయిపోద్దంటనే ఒచ్చినమ్' అన్నాడు కిష్టయ్య.

'మీ డాక్టరుగారు గదిలో ఉన్నారు. వెళ్లి మాట్లాడండి'

గదిలోకి వెళ్లగానే 'ఏమయ్యా.. మరో లక్షాయాబై వేలు కట్టేయండి. అతనికి ఊపిరితిత్తుల్లో సమస్య ఉంది. అర్జెంటుగా ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేయాలి' అన్నాడు డాక్టర్.

'పైషల్ లేవు సారూ' అంది రేణుక

'లేకుంటే గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లాల్సింది. అక్కడ ఫ్రీగా చేస్తారు. అతనికి సిగరెట్, గుట్కా తాగడం అలవాటుంది కదా.. ఇంకా కిడ్నీలూ, లివర్, గుండె, రిపోర్టులు వస్తాయి. మెదడుకు ఇన్‌ఫెక్షన్ చాలా ఉందమ్మా డబ్బులు కట్టేయండి.. వెళ్లండి' అంటూ లోపలికి వెళ్లిపోయాడు.

'ఎట్ల తమ్మీ.. పైషలూ. ఎట్లన్నజేసి బావని గడ్డకు పడేయాలె తమ్మీ'

'జెరాగూ.. ఏదీ.. ఆరోగ్యశ్రీల అడిగొత్త' వెళ్లాడు కిష్టయ్య.

'ఎట్లనే అమ్మ.. ఎట్ల జేత్తామే..' అంది పూజ.

కిష్టయ్య వస్తూనే 'దీనికి ఆరోగ్యశ్రీ ఇయ్యరంటనే.. తూటు పొడుద్దామంటే యాడసుతం సందులేదూ' అన్నాడు.

'ఏదీ.. ఇంటిపక్క బూమలింగంకు పోన్‌జేయి తమ్మీ.. ఇంటి కాయిదాలు పెట్టుకొని రొండు లచ్చలిత్తడేమో.. బావకు పురాంగ పానం బాగలేదని చెప్పు'

కిష్టయ్య ఫోన్ చేసి మాట్లాడాడు.

'ఇప్పుడో అప్పుడో ఇల్లు కూలెటట్టున్నదీ.. అన్ని మట్టి గోడలేనాయే.. తెగనమ్ముతనంటే కాలి జాగకు పెద్ద మనుసులు ఎట్ల జెప్తె గట్లనే.. పైసలు ఇయ్యల్లనే ముట్టజెప్తడట'

'ముండకొడుకులు ఆయం సూసి గాయంల పొడ్తరూ.. బావకంటే ఎక్కువనా.. ఆల్ల నాయ్న సంపాంచిన ఇల్లు.. అమ్మి ఆయ్నకే పెడ్త' అంటూ డాక్టరు వద్దకు వెళ్లింది. వంగి రెండు చేతులు అతడి కాళ్లపై పెట్టింది. 'సారూ ఇప్పుడు ఇర్వై వేయిల పైష కడ్త. మా ఊరికి పోయి ఇల్లు అమ్ముకత్త. నీ పైషలు శీకటి పడేటలకు తేర్పుత. జెరంత షర్దవట్టి నా మొగన్ని బతికిృయి'

'అమ్మా.. ఇట్లా చేయడం వల్ల పనవదమ్మా.. బాగుండదమ్మా. డబ్బు లేంది ఇక్కడ వైద్యం జరుగదమ్మా. సరే సాయంకాలం వరకూ కట్టేయమ్మా' అన్నాడు డాక్టరు. రేణుక ఊళ్లో బస్ దిగి భూమలింగం ఇంటికి వెళ్లింది.

'నర్సిమ్మ పానం ఎట్టున్నది బిడ్డ' అన్నాడు భూమలింగం.

'ఇప్పుడేం జెప్పేటట్టు లేదు సేటూ.. నువ్ దయతలిత్తే గడ్డకు వడ్తడు'

'రేణవ్వా.. నువ్ ఆపతిల ఉన్నవూ.. నీ సొమ్ముదింటే నాకు జయం కలుగది బిడ్డా.. ఇప్పుడూ నేను నీ ఇంటి జాగనీ కొనే అక్కర నాకేమున్నదీ. నర్సిమ్ములు గాడూ నా కండ్ల ముంగట పుట్టి పెరిగినోడూ.. ఆనికి అట్లయ్యిందంటే నా మన్సు దస్సుమన్నది బిడ్డా. ఎన్కటి సంది మీ అత్తమామలు మేము రెక్కల్ల బొక్కల్ల పెరిగినమ్. ఇంగో మీ కులం పెద్దమన్సుల పిల్సిన ఇదివర్దన్క ఇస్సారించినమ్. మీ పెద్దమన్సులు ఎట్ల జెప్తె నేను అట్లనే ఇంట. నువ్ సుతం ఇనాలే. ఆల్ల ఖదర్ నిలబెట్టాలే. ఆల్లనే సెప్పమను'

'ఏమియిమంటవవ్వా' అన్నాడు పెద్దమనిషి.

'మీకు ఎర్కలేంది ఏమున్నదే పెద్దనాయిన'

'అవ్వా.. ఇంటికి లెక్కలేదూ. కాలిజాగకే లెక్క. రొండు లచ్చలియ్యిమన్నమూ.. లచ్చయాబయికంటె ముందుగు దూగనన్నడు. బతిలాడంగ, బతిలాడంగ కాల్లు కడుపులు పట్టుకోంగ ఉంకో పది వెయిలు కలుపుతనన్నడు. ఉంగ నీ ఇట్టం బిడ్డా. ఒద్దంటే నీ ఇల్లు నీతాడ.. సేటు పైష సేటు తాడుంటదీ. నువ్ ఆపతి మీనున్నవ్. నర్సిగాడు గడ్డకు వడాలే. కాల్జేత ఆడవిల్లున్నది లగ్గానికి' అన్నాడు పెద్దమనిషి. డబ్బులు తీసుకొని రేణుక ఆసుపత్రికి చేరుకొని

లక్షాముప్పైవేలు చెల్లించింది. పూజని బిగ్గరగా వాటేసుకొని ఏడ్వడం మొదలుపెట్టింది.

'అవ్వో.. నీ బతుకు తెర్లు జేసినం బిడ్డా. నీకు అండ్యాలం చేసినమ్. నీకు దీము లేకుంట సేష్నం బిడ్డా.. ఇల్లు సూపిచ్చి ఒగయ్య షేతులవెట్టి కండ్లు ముయ్యాలనుకున్నాం బిడ్డా.. ఎంత పనాయెనే అవ్వో..' తలా ఛాతీ కొట్టుకుంటూ కుమిలి కుమిలి ఏడుస్తూ ఉన్నది. పూజ కూడా ఏడుస్తోంది.

'అక్కా.. నీకేమన్న పిచ్చి పట్టినాదే. బావ మంచిగైనంక రొండు మూడేండ్లల్ల ఆ పాటి ఇల్లు మా కొంటరు. ఏడ్సి ఏడ్సి నీకేమన్నైతెట్లనే. దైర్నంగుండాలే గానీ. నీకే వచ్చినాదే ఈ కట్టం. ఈన్నే నూర్ల మందున్నరు. మన అసంటోల్లు. ఒక్కొక్కలకు ఒక్కొక్క దుక్కమున్నది' అన్నాడు కిష్టయ్య.

'తమ్మీ.. బొచ్చెల అగుల్లు బుగల్లైతన్నయీ కండ్లకు శీకటొత్తాందీ. షేతుల ముప్పైవేయిలే ఉన్నయీ. మల్ల పైషలు అడుగుతెట్లనని బుగులైతందిరా'

'అక్కా.. రోట్ల తల్కాయ పెట్టనమ్. రోకటి పోటుకు జెడ్తె నడ్వదీ. ఎట్లనో అయితది. నిన్నటి వట్టి తిండి నిద్ర లేపాయే. బుక్కెడంత ఏమన్నదిని జెరసేపు కండ్లుమూసుకొ'

వెళ్లి భోజనం చేశారు. ఆసుపత్రి వాళ్లిచ్చిన డ్రెస్ వేసుకొని నర్సిమ్ములు ఉన్న గదికి వెళ్లింది. గ్లూకోస్ ఎక్కతోంది. అతడి శరీరానికి పైపులూ వైర్లూ ఉన్నాయి. అతణ్ణి చూస్తూ నిలబడింది. పెదవులు బిగపట్టి ఏడ్పును ఆపుకొంటూ కంపించింది రేణుక.

'ఏడ్వకూడదమ్మా ఇక్కడా' అంది నర్సు.

'మేడమ్! ఎప్పుడు కండ్లు తెరుత్తడు మాట్లాడ్తడూ'

'ట్రీట్‌మెంట్ జరుగుతున్నదమ్మా.. టైం పడుతుందీ'

రాత్రి ఒంటిగంటయ్యింది. చలి పెరిగింది. కిష్టయ్య పూజ నిద్రపోతున్నారు. రేణుక లేచి కూర్చొని బాటిల్ మూత తెరిచి నీళ్లు గటగటా తాగింది.

'అక్కా.. నిదురపోవే. నిదురలేకుంటె పరిశానైతవూ'

'గుండెల దడదడ అంటాందిరా. చాతిల బరువు బరువు అనిపిత్తాంది. కాల్జేతులు ఒన్కుతున్నయీ. ఈ సలిల సుతం సల్ల సెమటలు పెడ్తానయీ'

'ఏమన్న ఆలోచిత్తానవానే'

'ఇండ్లకెల్లి ఎట్ల గడ్డకు పడ్తమూ. ఎంత కర్సైతదో. యాడ్నుంచి తేవాలే ఉన్న ఆదరువు అమ్ముకుంటిమీ. ఇంకేమన్న అమ్ముకొని పెట్టుకుందామంటే పుస్తెలు సుతం లేకుంటాయే. బావ ఎట్లుంటడు'

'గంత దూరం ఆలోషన ఎందుకు జేత్తానవూ.. బావనేమో గట్లున్నడూ. నువ్ మనాది వెట్టుకొని ఆగమైతంటే పొల్ల ఆయింత గుండె వల్గదా.. ఎట్లయ్యేది గట్లైతది. ఒక్క సిత్తం జేసుకోవాలి. సప్పుడుజేక పండుకో' అన్నాడు కిష్టయ్య.

మూడు రోజులుగా నర్సిమ్ములు ఐసీయూలోనే ఉన్నాడు. రోజుకు మూడుసార్లు చూసి వస్తూ ఉన్నారు.

మిట్ట మధ్యాహ్నం రిసిప్షన్ నుంచి కిష్టయ్యకు ఫోన్ చేసి డాక్టర్ని కలవమని చెప్పారు.

డాక్టర్ గదిలోకి వెళ్లారు.

'అమ్మా మీ ఆయనకు కిడ్నీలు పని చేయడం లేదమ్మా. డయాలసిస్ చేయాలి. ఇన్ఫెక్షన్ చాలా ఉంది. లక్ష రూపాయలు కట్టేయండి. అన్నాడు.

రేణుక కళ్లలో నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. 'సారూ నీ దండం బెడ్త. నా తాడ పైషల్లేవూ. ఉన్న ఇల్లు అమ్ముకోని ఒచ్చినకాడికి మీకే కట్టినా. మీరు మనిషిని ఇచ్చిన కొంటపోత. పీనుగ నిచ్చినా కొంటవోత. నన్ను పండవెట్టి పోట్‌మటం జేసినా పైష దొర్కదీ' దండం పెడుతూ అంది.

'మీరు ఇట్లా మాట్లాడితే ఏం చేయలేము. అతడు ఐసీయూలో ఉన్నాడు. మీ ఇష్టం.. డబ్బులేదంటే ట్రీట్‌మెంట్ ఎట్లా చేస్తారు. డబ్బు కట్టాల్సిందే. కండీషన్ సీరియస్‌గా ఉంది. బాడీ మొత్తం పాయిజన్ అయిపోద్ది' విసుగ్గా అన్నాడు డాక్టర్.

బయటకు వచ్చారు.

'తమ్మీ.. ఊ్రలె నీ పత్యార మీద ఒగ లచ్చరూపాలు పుట్టియిరా. ఇదివర్దన్క మత్తు పైష పెట్టినమ్. ఇల్లు సుతం బోయింది. బావకేమన్నైతే నేను బత్క తమ్మీ..' ఏడుస్తూ గడ్డం పట్టుకున్నది.

'నీకెర్కలేని పత్యార యాడున్నదే. నీ మరుదలు మీద నాలుగు తులాల గొల్సున్నది.. అడుగుతె మాగిత్తది. పైనాన్సుల వెట్టి తెత్త' అంటూ ఊరికి వెళ్లి పోయాడు.

'అమ్మా.. ముండకొడుకులు లచ్చలు లచ్చలు గుంజవట్టిరి. ఇంకా కావాల్నంటే యాడ్నుంచి తెత్తం. పైషల్లేకుంటే కొనాకు బాపునేం జేత్తరో' అంటూ ఏడ్చింది పూజ.

'గట్లెందుకైతది బిడ్డా. మనింటి దేవత ఎల్లవ్వ తల్లికి మొక్కిన. బాపు మంచిగ కావాలే. తాగుడు మాని తొవ్వకు రావాలే. అట్లైతనే మల్లొచ్చేటికి యాట పిల్లని తెచ్చి చేత్త. తల్లి మనకు దోహం జెయ్యది బిడ్డా. బుగులు పట్టొద్దు. పన్నెండు సద్వుతానవు' అంటూ ముఖం పక్కకు తిప్పుకొని కళ్లు తుడుచుకున్నది. రాత్రి పదిగంటయ్యింది. కిష్టయ్య లక్ష రూపాయలు రిసిప్షన్ల చెల్లించాడు.

'నీ పోను సప్పుడయ్యిందంటే చాతిల నొప్పితోని ఒచ్చేపోయ్యే పానాలైతానయీ. ముండకొడుకులు పైషలడిగితె నాకు ఉరివెట్టుకునుడే ఉంటదీ' అంది రేణుక.

'అక్కా మల్లగిట్లనేవే. నేనే నీ బొండగ పిష్కి సంపుత. ఆ ముండకొడ్కు ఇట్లగానీకి నువ్వే కార్నం. ఒక్కనాడు వాడ్ని షీపిరందుకొని కొట్టకపోతివి. వాని బట్టలు అవతల పారేసి.. పోరా బాడ్కావ్ అనపోతివి. తాగితాగి ఇప్పుడు దావుకాండ్ల సాపుకొని పండే. ఏందే ఈ తిప్పలు పద్దినాలసంది. ఓపాన సత్తి తండ్లాడినవ్. బత్తె బత్తెడు సత్తె సత్తడూ. వాడేం పొడుగు జెయ్యడు

మంచిగైనంక. గయ్యే తొవ్వలు తొక్కుతడు' అన్నాడు కోపంగ కిష్టయ్య.

'నీకు సుతం యాట్టకొత్తాంది తీ తమ్మీ. లంగో దొంగో ఆడు నా మొగడు. నా రాత గిట్లున్నది. దునియా మీద నా అసొంటి ఆడోల్లుండుట్ల సంసారాలు నడ్తన్నయా. లేకుంటె ఈ తాగుబోతుల తోటి నడ్సునా' అంటూ ముక్కు చీదింది. కళ్లు తుడుచుకున్నది.

తెల్లవారింది రోజుటిలాగే.. ముగ్గురు టిఫిన్లు తిన్నారు. నర్సిమ్ములును చూసి వచ్చారు. రిసిప్షన్ నుంచి ఫోన్ వచ్చింది. 'అక్కా నువ్ ఈడనే ఉండు. నేను పోయొత్త' అంటూ వెళ్తూ ఉంటె రేణుక కూడా వెళ్తూ.. 'ఈ నరకం పాడుగానో పెట్రోల్ పోసుకొని తలుగబెట్టుకుందామనిపిత్తాంది' నుదురు కొట్టుకుంది. రిసిప్షన్‌లోకి వెళ్లారు.

'అతనిది లివర్ దెబ్బతిన్నది. మీరు చాలా లేట్‌గా తీసుకొచ్చారు హాస్పిటల్‌కి. చాలా పవర్‌ఫుల్ యాంటిబయాటిక్స్ ఇవ్వాలి. ఖర్చు నాలుగు లక్షల వరకు అవ్వొచ్చు' అంది.

రేణుక నరికిన చెట్టులాగా కూలిపోయింది. శరీరం అంతా చెమటలతో తడిచిపోయింది. వేగంగా శ్వాస తీసుకుంటోంది.

'అమ్మా.. అమ్మా..' అంటూ పూజ ఛాతి కొట్టుకుంటూ ఏడుస్తోంది. రేణుక ముఖంపై నీళ్లు చల్లారు. బయటకు తీసుకువచ్చి బేంచీ మీద పడుకోబెట్టారు. అర్ధగంటలో ఆమె తేరుకున్నది.

'ఇంగ పైషలాడియి తమ్మీ మనతాడ. ఇంటికి కొంటబోతాం పా. నా నశివ మంచిగుండి బతుకుతె సంసారం జేత్త. సత్తె సందం జేత్త' అంది రేణుక.

రెసిప్షన్‌లోని ఉద్యోగి వచ్చింది.

'మీ మంత్రిని కలవండి. విషయం చెప్పండి. వైద్యం కోసం ఈ నాలుగు లక్షలు సాంక్షన్ చేస్తాడు. బహుశః ట్రై చేయండి. ఇట్లాంటి పనుల కోసం ఆయన పీఏ అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు. నేను మీ కష్టం చూడలేక ఈ విషయం చెప్పాను. నేను చెప్పినట్టుగా ఎవరికీ చెప్పకండి' అంటూ వెళ్లిపోయింది.

కిష్టయ్య ఆలోచనలో పడ్డాడు.

'కిట్టయ్యా.. మన మంత్రి దేవునసంటోడు తమ్మి. మనకు ఆయనేడ దొరుకాలే. పోన్‌జేసి మన సర్పంచి షెవులయితే ఎయి తమ్మి' అంది రేణుక.

కిష్టయ్య సర్పంచికి ఫోన్ చేసి విషయం చెప్పాడు.

'అక్కా బావది ఆదారు కారట్ రాషెను కారటు రొండు పట్టుకొని రమ్మన్నడు. మంత్రి తాడికి తోల్కపోతనన్నడు. నిముషాల మీద మంత్రి పియ్యేకు పోన్ జేత్తడట. నేను పొయొత్త' అంటూ వెళ్లిపోయాడు కిష్టయ్య.

రాత్రి పదిగంటలకు అవుతూ ఉంటే కిష్టయ్య ఫోన్ చేశాడు. పూజ మాట్లాడింది.

'అమ్మ.. మంత్రి కలిసిండంట. పియ్యేకు ఫోన్ చేసిడంట' మామ రేపు తెల్లారెటలకు వత్తడంట'

'ఒక్కటా రొండా బిడ్డా. నాలుగు లచ్చలు. ఇత్తడని నాకైతే నమ్మంలేదవ్వా. కొన్నిచ్చి తత్తిమ్మయి మనల పెట్టుకోమంటడేమో. నయాపైస లేదు. మీ బాబు మనండ్ల కలిసేదాన్క నాకు ఈ గుండె దడ పోదు బిడ్డా. ఛాతిలంత బరువూ తిమ్మిరి. మెడకాంచి ఎడమచేతి దాన్క ఒక్కటే నవుల్తాంది..'

'డాక్టరుకు సూపిచ్చుకోవే అమ్మా..'

'సావనైన సత్తగని.. దావుకానకంటే కాల్జేతులు ఒనుకుతున్నయి. పోను బిడ్డో'

రాత్రి మూడు గంటలు కావస్తోంది. పూజ నిద్రపోతోంది.

రేణుక లేచి నీళ్లు తాగింది. ఛాతి మధ్యలో వేళ్లతో నొక్కి పట్టుకుంది. వెంట్రుకల నుంచి చెమటలు జారి ముఖం పైనుంచి, మెడల నుంచి కాలువల్లాగా పారుతున్నాయి. తలకింది తువ్వాలు తీసి ముద్దలాగా చేసుకొని ఛాతి మధ్యలో పెట్టుకొని బోర్లా పడుకుంది.

తెల్లవారింది. స్వీపర్ 'లేవండి! లేవండి!' అంటూ అరుస్తోంది.

పూజ నిద్రలేచి 'అమ్మా.. అమ్మా..' పిలుస్తూ కదిపింది. 'మా అమ్మ లేస్తలేదు. మా అమ్మ లేస్తలేదు.' ఏడుస్తూ ఉంటే జనం గుంపుకూడారు.

స్టెత్ మెడలో వేసుకున్న వ్యక్తి నాడీ పరీక్షించాడు. 'నీవెంట పెద్దవాళ్లెవరూ లేరా అమ్మాయి.. త్వరగా పిలిపించు' అన్నాడు.

'మా మామ బయలెల్లిండు ఊర్లెనుండి' అంది పూజ.

'సారూ.. ఉన్నదా పోయిందా' అంది స్వీపరూ.

'పోయిందమ్మా.. బాడీ తీసేయండమ్మా.. త్వరగా.. బాగోదు' అంటూ వెళ్లిపోయాడు.

'అమ్మా.. .' గట్టిగా అరుస్తూ ఏడుస్తూ ఉంటే..

'ఏ అమ్మాయి.. ఇక్కడ ఏడ్వద్దూ..' అంటూ ఎవరో గద్దించారు.

* * *

రేణుక చనిపోయి మూడు రోజులైంది. స్మశానంలో పిట్టకు పెడుతూ ఉన్నారు. కిష్టయ్య ఫోన్ రింగయ్యింది. మాట్లాడాడు. ఛాతి కొట్టుకుంటూ కింద కూలబడి రెండు కాళ్లు చాచి తలకొట్టుకుంటూ ఏడుస్తూ ఉన్నాడు. 'అరే.. అరే.. ఏమయ్యిందయ్యా.. ఏమయ్యిందయ్యా' కిష్టయ్య భార్య ఏడుస్తోంది.

'బావ డిచార్జ్ అయిండట. తోల్కత్తండ్లూ.. అక్కా.. బావొత్తండటనే.. మీ అక్కేది అంటే ఏమని చెప్పాలే. నా మొకం అయ్నకు ఎట్ల జూపాలే' అంటూ కిందపడి దొర్లుతున్నాడు. కాళ్లూ చేతులు కొట్టుకుంటున్నాడు కిష్టయ్య.



# ఒడిబియ్యం

గంగుల నరసింహారెడ్డి

కన్సొలేషన్ బహుమతి రూ. 5,000 పొందిన కథ



గంగుల నర్సింహారెడ్డి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి విశ్రాంత ఉద్యోగి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని వెదిరేపల్లి ఈయన గ్రామం. హైదరాబాద్‌లో చదువుకున్నారు. ఎస్‌బీఐలో క్లర్క్‌గా చేరి ఆఫీసర్ స్థాయి ఉద్యోగిగా రిటైర్డ్ అయ్యారు. అభిరుచిగా రాస్తూ ఉంటారు. ఇప్పటి వరకూ కథలు, నవలలు రాశారు. ఈయన రాసిన 20 కథలు వివిధ పోటీల్లో బహుమతులు అందుకున్నాయి. మూడు నవలలకు 'స్వాతి' మాసపత్రిక ప్రథమ బహుమతి ఇచ్చింది.

**రాత్రి ఏడుగంటల సమయానికే ఊరు ఊరంతా** దాదాపు నిశ్శబ్దంగా మారిపోయింది. పది సంవత్సరాల క్రితం వరకయితే ఈ సమయానికే ఊరు సందడిగా, అల్లరల్లరిగా ఉండేది. ఇప్పుడు అందరూ టీవీ సీరియల్లు చూడడానికై పొలాల నుండి ఆరు గంటలకే వచ్చేసి టీవీలకు అతుక్కుపోతున్నారు.

ఆ ఊరిలోని తన ఇంట్లో యాదమ్మ ఒక్కతే కూర్చొని తను కూడా సీరియల్ చూస్తూందే కానీ మనసు మాత్రం జడ్చర్లకు వెళ్లిన భర్త సాంబశివుని రాకకోసం ఎదురుచూస్తోంది. సీరియల్‌లోని సంభాషణలు చెవికెక్కడం లేదు, అవి బస్సు వస్తోన్న శబ్దం వినడం కోసం అప్రమత్తంగా ఉన్నాయి.

మరో పదినిమిషాల తర్వాత ఆమె నిరీక్షణ ఫలించింది. బస్సు వచ్చి ఆగి మళ్లీ కదిలి వెళ్లిన శబ్దం వినిపించింది. లేచి ఇంటి బయటకు వచ్చింది. అప్పటికే ఇంటి సమీపానికి వచ్చేశాడు సాంబశివుడు.

మొహం వేలాడేసుకొని, నీరసంగా నడిచి వస్తూన్న భర్తని చూడగానే యాదమ్మ ప్రాణం ఊసూరుమంది. భర్త వెళ్లిన పని సఫలం కాలేదని అర్థమైపోయింది.

'పోయిన పని ఉత్తదైనట్లుందే' ఆత్రుతను చంపుకోలేక అడిగింది యాదమ్మ భర్త చేతిలోంచి సంచిని అందుకుంటూ.

అవునన్నట్లుగా తల ఊపుతూ జీవంలేని నవ్వొకటి నవ్వాడు సాంబశివుడు.

'పొద్దుగాలనంగ తిని పోయినవు, ఆకలయితుండొచ్చు, కాళ్లూ చేతులు కడుక్కొచ్చుకో పో, వడ్డిస్తా'

'అవునే పచ్చినీళ్లు కూడా ముట్టలే. మస్తు ఆకలయితాంది'.

'గా ఢిల్లీవాలా హోటల్ల పూరన్నా తిని రాగూడదా, అంత ఆకలితోని ఎందుకు మాడాలె'

'ఈ పనికి పగటంబలన్నట్లు, ఎల్లిన పనే కానప్పుడు ఇరవై రూపాయలు పెట్టి పూరెట్ల తినబద్దయితది' అంటూ పెరట్లోకి వెళ్లి మొహం కడుక్కొని వచ్చాడు.

పది నిమిషాల్లో భోజనం చేసి ఇద్దరు బయటకు వచ్చి అరుగు మీద కూర్చున్నారు. ఆకాశంలో అర్ధచంద్రుడు ఉండడం వల్ల చీకటి ప్రభావం అంత గాఢంగా లేదు. శ్రావణమాసం వచ్చి వారం దాటినా భారీవర్షాలు లేనందున వాతావరణం పొడిగానే ఉంది. పంటలు ఎండిపోతున్నాయనే ఆవేదన కంటే ప్రస్తుతానికి పదివేల రూపాయల అప్పు ఎవరిస్తారనే

ఆలోచనే ఇద్దరి మనసుల్లోనూ తొలుస్తోంది.

వారికి ఇద్దరు సంతానం. అమ్మాయి మల్లిక పెద్దది. ఆయిదేళ్ల క్రితం పెళ్లిచేసి అత్తారింటికి పంపించారు. రెండవ సంతానమైన అబ్బాయి మహబూబ్‌నగర్‌లో పాలిటెక్నిక్ చదువుతున్నాడు.

'పంతులు చెప్పిన మంచి రోజెప్పుడు.. మల్లికకు ఒడిబియ్య ం పోయ్యనీకే' ఓ పదిహేను రోజుల టైముందని తెలుసు కానీ ఖచ్చితమైన రోజు గురించి మర్చిపోయాడతను.

'ఇప్పుడొచ్చే అయితారంగాకుండా మళ్లొచ్చే అయితారం'

'ఇయ్యాల బుధవారం, అంటే పదిహేను రోజులు కూడా లేదన్న మాట. ఎంతలేదన్నా ఈ శనివారమో అయితారమో పోయి మల్లికకూ అల్లునికీ పైసలిచ్చిరావాలె'

'అట్లియ్యకపోతే బట్టలు తెచ్చుకొని కుట్టించుకోనికే టైం సరిపోదుకదా' అంది యాదమ్మ.

తెలంగాణ ప్రాంతంలో ఆడపడచులకు పుట్టింటి నుంచి లభించే అపురూపమైన గౌరవం 'ఒడిబియ్యం'. పెళ్లయిన ఒక సంవత్సరంలోపు ఈ ఒడిబియ్యం పెట్టిన తరువాత అయిదు, తొమ్మిది, పదకొండు సంవత్సరాలలోపు తప్పనిసరిగా పుట్టింటివారు ఈ ఒడిబియ్యం పెడుతారు.

సాంబశివుడు, యాదమ్మ దంపతుల కూతురయిన మల్లికకు కూడా ఈ 'అయిదేళ్లలోపు ఒడిబియ్యం'కు గడువు ఈ పదిహేను రోజుల్లో ముగిసిపోతుంది. అందుకే కొత్తబట్టలు పెట్టడం, దగ్గరి చుట్టాలకు భోజనాలు పెట్టడం లాంటి ఖర్చుల కోసం దాదాపు పదివేల రూపాయలు కావాలి. శ్రావణమాసంలో ఏ రైతు దగ్గరా అదనపు ఖర్చులకు డబ్బులుండవు. అలాగే సాంబశివుని దగ్గరా లేవు. ఆ డబ్బు అప్పుగా తెద్దామని తెలిసిన వారి దగ్గరా, జడ్చర్ల సేటు దగ్గరా నాలుగు రోజులుగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ. ఫలితం శూన్యం.

'ఏమన్నడు సేటు, రేపటెల్లుండయిన ఇస్తన్నడా?' తిరిగి యాదమ్మనే మాట్లాడింది, భర్త జడ్చర్ల వెళ్లిన సంగతి గురించి ఆరా తీస్తూ.

'కట్టెకొట్టినట్లు ఇయ్యనని చెప్పేసినాడే ఈడికే మన పాత బాకీ మిత్తితో శానా అయిందట. పదివేలు కాదు కదా అయిదు వేలు కూడా ఇయ్యనన్నాడు' బదులిచ్చాడు సాంబశివుడు.

'మనకు ఎరువు సంచులు, చేన్ల మందులు ఇచ్చే రాంబాబును కూడా అడిగి చూడరాదూ, ఎట్లయిన అయితారం వారంకల్లా పదివేల రూపాయలు కావాలి మరి'

'అవునే మంచి ఐడియానే ఇచ్చినవు. రేపు మళ్లపోత జడ్చర్లకు' అన్నాడు సాంబశివుడు.

అప్పుడే పక్కింటి గేటు తీసిన చప్పుడయితే ఇద్దరూ తల తిప్పి చూశారు. అది సాంబశివుడు తమ్ముడు నారాయణ ఇల్లు. నారాయణే గేటు తీసుకొని తన ఇంట్లోకి వెళ్తున్నాడు.

'ఏడికోయిండో మీ తమ్ముడు, ఇంత రాత్రప్పుడు వస్తున్నాడు' సాలోచనగా అంది యాదమ్మ.

'వాడు కూడా నాలాగనే పైసల కొరకు తిరుగుతున్నట్లున్నడే. నేను సేటు షాపు నుండి బయటకు వస్తుంటే వీడు లోపలికి పోతున్నాడప్పుడు'

'ఎందుకయుంటదీ' అంటూ ఓ అరనిమిషం పాటు ఆలోచించి 'వాళ్ల బిడ్డ సుమతికి కూడా ఒడిబియ్యం పోసే గడువు వచ్చిందనుకుంటా. ఎందుకంటే నిరుడు శావన మాసం ఎళ్లినంకనే

పెండ్లి అయింది కదా' అంది యాదమ్మ.

'సరిపోయింది' అంటూ నవ్వాడు సాంబశివుడు

సరిగ్గా ఆ సమయంలో పక్కింటిలో నారాయణ భార్య అంజలమ్మ భర్తను అడుగుతోంది 'సేటు పైసలిచ్చిండా' అని

లేదన్నట్లుగా నారాయణ తల అడ్డంగా ఊపి జీవంలేని నవ్వొకటి నవ్వి 'ఆకలయితాంది, అన్నం పెట్టు' అని పెరట్లోకి వెళ్లాడు.

* * *

ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్ వ్యాపారం చేసే రాంబాబు దుకాణం బిజినేపల్లిలో ఉంది. జడ్చర్లకయితే ఆ ఊరి నుండి డైరెక్టు బస్సు ఉంది, కానీ బిజినేపల్లికి లేదు. అందుకే తిమ్మాజిపేట దాకా షేర్ ఆటోలో వెళ్లి అక్కడి నుండి బిజినేపల్లికి వెళ్లాలి.

మరునాడుదయం సాంబశివుడు కడుపునిండా అన్నం తిని మనసులోనే దేవునికి మొక్కుకొని జిబినేపల్లికి బయలుదేరాడు. ఓ గంటన్నర తరువాత అక్కడికి చేరుకున్నాడు.

షాపు తెరిచే ఉంది. కానీ, రాంబాబు లేడు. ఓ కుర్రాడు కూర్చొని ఉన్నాడు. ఆ కుర్రాని మాటల ప్రకారం రాంబాబు మహబూబ్‌నగర్ వెళ్లాడట. మధ్యాహ్నం వరకు గాని రాడట.

ఈసురోమని షాపు ముందరే కూర్చుండి పోయాడు సాంబశివుడు. మధ్యాహ్నానికి వస్తాడని చెప్పిన రాంబాబు రావడమైతే వచ్చాడు గానీ షాపునకు రాకుండా ఇంటికి వెళ్లి భోంచేసి, హాయిగా నిద్రపోయి సాయంత్రం నాలుగు గంటల తరువాత షాపునకు వచ్చాడు.

సాంబశివుడు అవసరాన్ని వివరించి గంటసేపు ప్రాధేయపడినా రాంబాబు మనసు కరగలేదు. డబ్బు ఇవ్వలేనని ఖరాఖండిగా చెప్పేశాడు.

మళ్లీ మొహం వెళ్లాడేసుకొని కాళ్లీడ్చుకుంటూ బస్టాండుకు చేరుకున్నాడు. అతడు ఇల్లు చేరుకునేసరికి తన భార్య, తమ్ముని భార్యా తీవ్రంగా గొడవ పడుతుండడం కనిపించింది.

'శాతగాకున్నా బర్రెదూడని ఎందుకు పెంచుకోవాల్నో పెంచుకున్నోల్లు మంది చేన్లల్ల పడకుండా దగ్గరుండి మేపుకోవాలే' అరుస్తున్నట్లుగా అంటోంది యాదమ్మ.

'మా బర్రె దూడని చూసినప్పుడల్లా కండ్లల్ల నిప్పులు పోసుకుంటవు కద తల్లీ నీవు. ఎంత బస్తుదానవే. నా మొగడు ఊల్ల లేడు కాబట్టి తప్పిపోయి నీ చేన్ల రెండు మొక్కల్ని కొరికిందేమో. గాయింతదానికి నీ సొమ్మంత తిన్నట్లు అరుస్తున్నవేంది' తోడికోడలికన్నా ఎక్కువ గొంతుతో జవాబిస్తోంది నారాయణ భార్య అంజలమ్మ.

గొడవకి కారణం తెలిసిపోయింది సాంబశివునికి. తన తమ్ముడు నారాయణకున్న ఒక బర్రెదూడ తమ మొక్కజొన్న చేన్లో పడి కొన్ని మొక్కల్ని తినేసింది. అది చూసిన వాళ్లెవరో యాదమ్మ చెవిన ఊదేసి వెళ్లారు. ఇంకేముంది, అసలే తోడికోడళ్లిద్దరి మధ్యా పచ్చగడ్డేస్తే భగ్గుమంటుంది.

'రెండు మొక్కలు కాదంట తల్లీ, ఓ పెద్దమడంత సేను మేసిందంట'

'ఎవరో చెప్పిన మాటలు విని నోటికొచ్చినట్లు మాట్లాడకమ్మా..' అంటూ ఇంకా ఏదో అనబోయిన అంజలమ్మ బావ సాంబశివుని రాకను చూసి యుద్ధాన్ని మధ్యలోనే ఆపేసి

గబాలున లోపలికి వెళ్లిపోయింది.

తన భర్తకు తోటికోడలు ఆ మాత్రం గౌరవం ఇచ్చినందుకు యాదమ్మ మనసు కొంత శాంతించింది.

'చిన్న చిన్న విషయాలకు బజారుకెక్కుతరేందే మీరు' అని భార్యపైన విసుక్కుంటూ ఇంట్లోకి వెళ్లాడు సాంబశివుడు.

'తప్పు దాని దిక్కున పెట్టుకొని మాటకు మాట అంటున్నది చూడు. ఆ టెంపరుముండ' అంటూ భర్తను అనుసరించింది.

'ఆ రాంబాబు కూడా ఉత్తిచేయి చూయించిండే' భార్య అడగక ముందే తనే చెప్పాడు.

'అయ్యో భగవంతుడా మళ్లెట్టా' దిగులుగా అంది.

'నీవన్నట్లు ఆ దేవుడే దిక్కు ఇంక మనకు. ఇంక మూడు రోజుల టైముంది. అంతదాక ఏదయిన తొవ్వ చూపిస్తడేమో'

అప్పుడే పక్కింటి గేటు చప్పుడయింది.

నారాయణ కూడా నీరసంగానే ఇంట్లోకి ప్రవేశించాడు.

అంజలమ్మకు స్పష్టంగా తెలిసిపోయింది. ఈ రోజు కూడా భర్త వెళ్లిన పని సానుకూలం కాలేదని.

షాద్‌నగర్‌లో ఉండే నారాయణ బావమరిది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. తనెన్నడు అతన్ని చేయిచాచి అడగలేదు. కాబట్టి తనడిగిన డబ్బు తప్పక ఇస్తాడని ఎంతో ఆశతో వెళ్లాడు. కానీ, లాభం లేకపోయింది. ఏవో కారణాలు చెప్పి తప్పించుకున్నాడా బావమరిది.

'అయ్యోదేవుడా, ఏదయిన తొవ్వ చూపించు సామీ'

'అవునింక మనకు ఆ దేవుడే దిక్కు'

ఆ తరువాత తమ బర్రెదూడ వల్ల తోడికోడలుతో జరిగిన గొడవ గురించి చెప్పింది అంజలమ్మ భర్తతో.

'నేను పొద్దుగాల షాద్‌నగర్‌కు పోయేముందు గట్టిగనే గుంజకు కట్టేసి పోయిన, ఎట్ల ఇడుసుకున్నదో మరి. ఇయ్యాల జరిగిన దాంతోని ఈడికి మూడుసార్లాయే ఈ బర్రెదూడ వల్ల మా వదినతోని మాటలు పడడం'

'అవునవును' అంది అంజలమ్మ.

* * *

మరునాడు, శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో వంట చేస్తున్న యాదమ్మకు 'ఓ యాదక్కా' అనే పిలుపు వినబడడంతో బయటకు వచ్చింది. రెండు వీధుల అవతల ఉండే శాంతమ్మ నిలబడి ఉంది.

'ఏంది శాంతక్కా, ఇట్లొచ్చినవు?'

'గోవర్ధన్‌రెడ్డి పటేలు బిడ్డకు తొలిసారె పెడ్తున్నరు. నిన్ను మీ యారాల్ని భోజనానికి రమ్మని చెప్పమంది పటేలమ్మ'

గోవర్ధన్‌రెడ్డి పొలాన్ని శాంతమ్మ కుటుంబం కౌలుకు చేస్తున్నది.

'ఆల్ల బిడ్డకు పెండ్లయి అప్పుడే యాడాదాయనా?' అని ఆశ్చర్యం ప్రకటించి.. 'నేనయితే వస్తగానీ మా యారాలు సంగతి నన్నడగకు. దానికీ నాకూ మాటల్లేవు. విసురుగా అంది యాదమ్మ.

'నీవయితే పదకొండు గంటల వరకల్లా రా. అంజలమ్మకు నేను చెప్తలే' అంటూ పక్కింటికి వెళ్లిపోయింది శాంతమ్మ. భోంచేసి సాంబశివుడు మళ్లీ అప్పు వేటకు వెళ్లిపోయిన తరువాత గోవర్ధన్‌రెడ్డి ఇంటికి బయలుదేరింది యాదమ్మ.

ఆమె వెళ్లేసరికి చాలామంది ముత్తైదువలు వచ్చి కూర్చొని ఉన్నారు. అంజలమ్మ కూడా అప్పటికే వచ్చి ఉంది. కూర్చున్న వారి పాదాలకు ఒకామె పసుపు రాస్తోంది.

గోవర్ధన్‌రెడ్డి జడ్చర్లలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ బాగా సంపాదించాడు. కూతురి పెళ్లికి ముందే బ్రహ్మాండమయిన ఇల్లు కూడా కట్టుకున్నాడు.

పెళ్లి తరువాత కూతురికి పెడుతున్న ఒడిబియ్యం కాబట్టి అంగరంగ వైభవంగా చేస్తున్నాడు. అమ్మాయి అత్తగారింటి వాళ్లతో బాటు తన బంధువులను కూడా పిలుచుకున్నాడు కాబోలు ఇల్లు బంధుజనంతో కిటకిటలాడుతూ కళకళ్లాడుతోంది.

హాలులో చాపలు పరచి మధ్యలో రెండు పీటలు వేశారు. కూతురూ, అల్లుడూ కూర్చోవడానికి ఎదురుగా పసుపు కలిపిన బియ్యంతో పాటు అందంగా అలంకరించిన సారెపెట్టే, ఫలహారాల బుట్టలూ, శుభప్రదమైన పసుపు కుంకుమా, కొబ్బరి గిన్నెలూ తమలపాకుల లాంటి వన్నీ ఉన్నాయి.

గోవర్ధన్‌రెడ్డి దంపతులు మొదట కూతురూ అల్లుడికీ కొత్త బట్టలు పెట్టారు. నవదంపతులు కొత్తబట్టలు ధరించి రాగానే తొలుత గోవర్ధన్‌రెడ్డి భార్య కూతురికి ఒడిబియ్యం పోయడం ప్రారంభించింది. అందుకు అయిదు దోసిల్ల బియ్యం అమ్మాయి ఒడిలో పోయాలి. తొలి దోసిలి కొబ్బరి గిన్నెలు రెండు తమలపాకులు, వక్కలు కలిపిన బియ్యంతో పోసి, రెండవ దోసిలి ఒక రూపాయి నాణెంతో పోసింది. మూడవ దోసిలి దానిమ్మపండుతో పోస్తే నాలుగవ దోసిలి బియ్యం ఎండు ఖర్జూర పండుతో కలిపి పోసింది. అయిదో దోసిలి బియ్యం వెల్లుల్లిగడ్డతో పోసింది.

ఆమె తరువాత మరో నలుగురు ముత్తైదువలు అలాగే ఒడిబియ్యం పోశారు.

ఇదంతా యాదమ్మ కళ్లార్పకుండా చూస్తోంది. ముఖ్యంగా ఆ అమ్మాయి కట్టుకున్న చీర చూస్తుంటే యాదమ్మకే కాదు అక్కడున్న వాల్లందరికీ కళ్లు చెదిరాయి. 'పదివేలపైనే ఉంటుందీ చీర' అనుకుంటూ 'ఎంతయినా డబ్బున్న మా రాజులు' నిట్టూర్చింది.

తొలిసారె తరువాత ప్రతి అయిదేళ్లకోమారు ఒడిబియ్యం ఇంటి ఆడపడచుకు పెట్టడం తెలంగాణ సంస్కృతిలో భాగం. అదేగాక పుట్టింటి వారింట్లో పెళ్లిళ్లు అయినప్పుడు కూడా ఈ ఒడిబియ్యం ఇంటి ఆడపడచుకు పెడతారు. అలాగే అమ్మాయి నూతన గృహప్రవేశం చేస్తున్నప్పుడు కూడా పుట్టింటివారు ఒడిబియ్యం పోయడం అనేది ఆనవాయితీ. అ అయిదేళ్లలోపు లెక్క అనేది ఏ సందర్భంలో పెట్టినా, చివరిసారిగా పెట్టినప్పటి నుండే ప్రారంభమవుతుంది.

ఒడిబియ్యం పెట్టుకున్న అమ్మాయి అత్తారింటికి వెళ్లి మంచిరోజు చూసుకొని, అత్తారింటి వారు ఆ బియ్యాన్ని వండి అందరికి విందు భోజనం పెడతారు. ఓ ఆడపిల్ల పసుపు కుంకాలతో పిల్లా పాపలతో సంతోషంగా కాపురం చేయాలనే పుట్టింటి వారి ఆకాంక్షల వల్ల ఏర్పడింది ఈ ఆచారం.

గోవర్ధన్‌రెడ్డి ఇంట్లో కూతురికి ఒడిబియ్యం కార్యక్రమం పూర్తయింది. ముగింపుగా మంగళహారతి పాట పాడాలి. పాడడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. 'నీవు పాడు, నీవు పాడు' అని ప్రతి ఒక్కరూ పక్కవాళ్లతో అంటున్నారు.

ఒకామె ధైర్యం చేసి వచ్చి పాడింది. కానీ, ఆమె ఏమి పాడిందో పక్కనున్నామెకు కూడా వినిపించలేదు. మరొకామె కీచుగొంతుతో ఏదో పాడింది. కానీ, ఎవరికీ అర్థం కాలేదు ఆమె ఏమి పాడిందో.

'ఇంకా బాగా పాడే వాళ్లెవరూ లేరా?' అడిగారెవరో, యాదమ్మకు ఇక ఊరుకో బుద్ధికాలేదు. తల్లి దగ్గర తను చిన్నప్పుడు నేర్చుకున్న పాట జ్ఞాపకం వచ్చి ముందుకు వెళ్లింది.

'హారతి గైకొనుమా.. సీతమ్మ తల్లీ.. మంగళ హారతి గైకొనుమా.. సీతమ్మ తల్లీ.. ఒడినిండి నీకు వరాలు కురువంగా..'

ఆమెది శ్రావ్యమైన స్వరం కావడంతో అందరికీ పాట వినబడీ, అర్థమయీ మంత్రముగ్ధులైపోయారు. పాట పూర్తవగానే అందరూ అప్రయత్నంగా చప్పట్లు కొట్టి మెచ్చుకుంటుంటే నిజంగానే సిగ్గుపడింది యాదమ్మ.

విందు భోజనాలు పూర్తయి అందరూ వెళ్లిపోవడం ప్రారంభించారు. యాదమ్మ బయటకు వస్తుంటే సురెందర్‌గౌడ్ భార్య భాగ్యమ్మ వచ్చి కలిసింది. తను రావడమేగాకుండా 'రావే అంజలమ్మ నేను అంటువైపే వస్తున్నా, కలిసిపోదాం' అంటూ అంజలమ్మను కూడా కలుపుకొంది భాగ్యమ్మ.

'యాదమ్మా మంగళహారతి పాట భలేబాగా పాడినవురా' అంది భాగ్యమ్మ.

'ఏదో సిన్నప్పుడు నేర్చుకున్నది పాడినగాని అందరు ఇంత మెచ్చుకుంటరనుకోలే'

'రేపు మా కోడలు ఒడిబియ్యం పెట్టుకొస్తున్నది. ఎల్లుండి అయితారం వండుతున్నం. మీరిద్దరు యారాల్లు తప్పకుండా రావాలే' ఆహ్వానించింది భాగ్యమ్మ.

'వస్తంలే అక్కా' అని ఇద్దరూ ఒప్పుకున్నారు.

'భాగ్యక్కా నీ బిడ్డకు నిరుడు మా సుమతి పెళ్లికంటే ముందే పెళ్లి జేస్తివి. మరి తొలిసారె పెట్టినవా' అడిగింది అంజలమ్మ.

'పోయిన్నెలనే పెట్టేదుండే కానీ అప్పటికే నెల తప్పినట్లు తెలిసింది. అందుకే పెట్టలే. మల్లి కన్నంక ఏడాది లోపల ఒడిబియ్యం పోయ్యాలె'

'అయితే అమ్మాయి కడుపుతో ఉన్నప్పుడు ఒడిబియ్యం పోయగూడదా అక్కా' అడిగింది అంజలమ్మ.

'అవును, పోయగూడదు' అంటూ ఆగి 'నేనిట్ల పోత, మీరిద్దరూ ఎల్లుండి మధ్యాహ్నం మరచిపోకుండా రండి' అని మరోసారి ఆహ్వానించి పక్కకు మళ్లిపోయింది భాగ్యమ్మ.

తోటికోడళ్లిద్దరూ కలిసి ముందుకు నడక కొనసాగించారే గానీ ఇద్దరికీ ఇబ్బందిగానే ఉంది.

'నిజంగానే నీవు శాన బాగా పాడినవక్కా' నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ మెచ్చుకుంటూ మాట కలిపింది అంజలమ్మ.

'నీక్కూడా నా పాట నచ్చిందా, అయితే మీ సుమతికి రేపటెల్లుండి ఒడిబియ్యం పోస్తవు కద, నేనొచ్చి మంగలారతి పాట పాడ్తలే' నవ్వుతూ అంది యాదమ్మ. ఇన్ని రోజులుగా కొట్లాడుతూ ఎడమొగం పెడమొగంగా ఉన్న తోటికోడలు మాటలు కలిపేసరికి ఉప్పొంగిపోయి, నిండు మనసుతో మాట ఇచ్చేసింది.

'ఏమో అక్కా, సుమతికి ఈ పదిహేను రోజుల్లోనే ఒడిబియ్యం పొయ్యాలెగాని పైసలు లేవు. మీ మరిది 'రా గాడిదీ పో గాడిదీ' లాగ తిరుగుతున్నడు గానీ పైసలెవరిస్తలేరు. ఎట్లయితదో ఏమో' విచారంగా అంది అంజలమ్మ.

'మా మల్లికకు కూడా ఈ అయితారం గాకుండా మల్లొచ్చే అయితారం ఒడిబియ్యం పొయ్యాలని పంతులు సెప్పిండు. మీ బావ కూడా రోజూ ఈ ఊరికి ఆ ఊరికి తిరుగుతున్నడు గానీ ఉత్త చేతులూపుకంటునే వస్తున్నడు ఏం జేయాల్నో ఏమో' నిరాశానిస్పృహలు నిండిన స్వరంతో దిగులుగా అంది యాదమ్మ.

'ఫికరు చేయకక్కా, అన్నింటికి ఆ భగవంతుడే ఉన్నడు' తోటికోడలికి ధైర్యం చెప్పింది అంజలమ్మ.

తమ మధ్య మాటలు కలిసినవన్న ఆనందం ఆ ఇద్దరి మనసుల్ని తేలికపరచడంతో కించిత్తు ఆనందంతో తమ తమ ఇళ్లకు చేరుకున్నారు వారివురు.

* * *

ఆదివారం ఉదయం పదిగంటలవుతుండగా సాంబశివుడూ యాదమ్మా ఇంటి బయట అరుగుపై కూర్చొని ఉన్నారు. డబ్బు దొరక్కపోవడంతో మనసు బాగోలేక వంట కూడా చేయాలనిపిచడం లేదామెకు.

'ఉన్న రెండు తులాల బంగారం బ్యాంకుల పెడ్తిమి. ఇంక ఎక్కడి నుంచి తెస్తం పైసలు' విచారంగా అన్నది యాదమ్మ.

'అవునే అదే సమజయితలేదు' దిగులుగా ఆకాశం వంక చూస్తూ అన్నాడు సాంబశివుడు.

పరిష్కార మార్గమేదీ తోచక శూన్యంగా తయారయిన మనసులతో మౌనంగా ఆ దంపతులిద్దరూ అలానే కూర్చుండిపోయారు.

ఓ పదినిమిషాల తరువాత ఏదో అలికిడయితే ఇద్దరూ తలలు తిప్పి చూశారు. ఒక్క క్షణం పాటు ఆశ్చర్యచకితులయ్యారు. వస్తున్నది నారాయణా అంజలమ్మ దంపతులు!

తమ కూతురికి ఒడిబియ్యం పోస్తున్నామని చెప్పి ఆహ్వానించడానికి వస్తున్నారేమోననే ఆలోచన వీళ్లిద్దరిలోనే కలిగింది.

'రా, రా.. నారయణా' అంటూ తమ్ముని ఆహ్వానించాడు. తోటికోడల్ని చూసి యాదమ్మ కూడా మొహం మీదికి చిరునవ్వుని తెచ్చుకుంది. నారాయణయితే అన్న పక్కన కూర్చున్నాడు. కానీ, అంజలమ్మ మాత్రం బావ ముందు అరుగుపై కూర్చోవడానికి మొహమాటపడి యాదమ్మ

పక్కన నిలబడిపోయింది.

'మల్లికకు బియ్యం పోయడానికి పైసల కొరకు తిరుగుతున్నవంట, మీ మరదలు చెప్పింది. మరి దొరికినయా?' అడిగాడు నారాయణ అన్నను.

'లేదురా, దొరుకలే. అదే ఫికరు జేసుకుంట ఇట్లా కూసున్నం. ఏంజేయాల్నో సమజయితలేదు'

'ఇవిగో అన్నా, ఈ పన్నెండు వేలు తెచ్చిన తీసుకో' అంటూ నారాయణ తన జేబులోంచి డబ్బుతీసి అన్న చేతికి అందించాడు.

ఒక్క క్షణం అక్కడ కాలం స్థంభించి పోయినట్లుగా, అది కలా, నిజమా అన్నట్లుగా, ఎవరో దేవతలు తమ మీద పూలవాన కురిపిస్తున్నట్లుగా, జీవితంలో ఎన్నడూ చూడని ఏదో అద్భుత దృశ్యాన్ని చూస్తున్నట్లుగా, ఎన్నడూ వినని శ్రావ్యమైన సంగీతమేదో వినిపిస్తున్నట్లుగా సాంబశివుడు దంపతులు సంభ్రమాశ్చర్యాలకు లోనయి నిర్విణ్ణులయ్యారు.

ఓ నిమిషం తరువాత తేరుకొని 'నీవు కూడా నా లెక్కనే పైసల కొరకు తిరుగుతున్నవని మీ వదిన చెప్పింది. మరి నీకెవరు ఇచ్చినార్రా? ఆశ్చర్యంగా అడిగాడు సాంబశివుడు.

'మనలాంటోల్లకు ఎవరిస్తరన్నా, ఎవ్వరియ్యలే. అందుకే మా బర్రెదూడను నిన్న శనివారం కావురం పేట సంతకు తీస్కపోయి అమ్మిన'

ఈ మాటతో యాదమ్మయితే మరీ నిర్ఘాంతపోయింది. కించిత్తు సిగ్గుపడింది కూడా. తమ చేన్లో పడి మేసిందని ఆ బర్రెదూడ కోసం అంజలమ్మతో మూడు నాల్గుసార్లు జగడం చేసింది. అదే బర్రెదూడను అమ్మి వచ్చిన డబ్బును తమకు సహాయంగా ఇస్తున్న అంజలమ్మ దంపతుల ముందు తలెత్తుకోలేకపోతోంది యాదమ్మ.

'మరి మీ సుమతికి కూడా ఒడిబియ్యం పోయ్యాలంట కదా, బర్రెదూడకు అంత ఎక్కువ డబ్బు వచ్చి ఉండదు కదా'

'మా సుమతి నెల తప్పిందంట బావా. రాత్రి ఫోన్ చేసి చెప్పింది. కడుపుతో ఉన్నప్పుడు ఒడిబియ్యం పోయగూడదంట' అంది అంజలమ్మ

ఇక యాదమ్మ తట్టుకోలేకపోయింది. గబాలున లేచి అంజలమ్మను కౌగిలించుకొని 'ఎంత పెద్ద మనసు సెల్లా నీది, నేనే బస్టుముండను, నన్ను చమించు. నీ కాళ్లు మొక్కి నా కండ్లనీళ్లతో కడగాలనుంది. కానీ, నీవు నా కన్నా చిన్నదానివయినవు..' గొంతు గద్గదమయి ఆమెకు ఇక మాటలు పెగల్లేదు. కళ్లు మాత్రం వర్షిస్తున్నాయి.

అటువైపు సాంబశివుని పరిస్థితి కూడా దాదాపు తన భార్య పరిస్థితిలానే ఉంది. ఉబికి వస్తూన్న కన్నీటిని ఆపుకొంటూ తమ్ముని చేతులు తన చేతుల్లోకి తీసుకొని కృతజ్ఞతాపూర్వకంగా తన ఎదకేసి హత్తుకున్నాడు.


నారాయణా అంజలమ్మల దంపతులకు కూడా కళ్లు చెమ్మగిల్లాయి. సంతోషకరమైన సంతృప్తితో అంత వరకు ఆనుభవంలోకి రాని అనిర్వచనీయమైన ఆనందం కూడా వారికప్పుడు కలిగింది.



# గడి

చందు తులసి

**కన్సొలేషన్ బహుమతి రూ. 5,000 పొందిన కథ**



చందు తులసిగా పరిచితులైన ఇతని పేరు చంద్రశేఖర్. ఈయన రాసే కథలకు భార్య తులసి సహకారం ఉంటుంది కాబట్టి చందు తులసి పేరుతో కథలు రాస్తుంటారు. సూర్యాపేట జిల్లా బండమీద చందుపట్ల వీరి గ్రామం. చంద్రశేఖర్ కొన్నాళ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయునిగా హైదరాబాద్‌లో పని చేస్తున్నారు. మొదటి కథ ఊడలమర్రి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చింది. ఈ కథ 2015లో తెలంగాణ సాహిత్య అకాడమీ వెలువరించిన 'మూడు తరాల తెలంగాణ కథ' సంకలనానికి ఎంపికైంది. ఇటీవలె 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'పాలపిట్టల పాట' కథ నేషనల్ బుక్ ట్రస్ట్ యువ కథా సంకలనానికి ఎంపికైంది.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 125

**'పూలమ్మా.. నువ్వు కూడా పెండ్లి చేసుకోవచ్చు కదా..?** ఆడబాప బతుకు ఎంతకాలం బతుకుతవు. దొర గడీల నుంచి పారిపోయి ఎవరినన్న పెళ్లిచేసుకో రాదూ..? ఎందుకు చీకటి కొట్టం లాంటి ఈ గడీల మగ్గిపోతవు. కష్టమో, నష్టమో నీ బతుకు నువ్వు బతకొచ్చు కదా!' ముత్యాలు అడిగిన ఆ ప్రశ్న పూలమ్మకు పొద్దుటి నుంచీ మనసులో వడి పెడుతోంది.

'నిజమే..! తనకూ పెళ్లీడొచ్చింది. కానీ, తనకు పెళ్లెవరు చేస్తారు? తానొక ఆడబాప. అసలు ఆడబాపను ఎవరైనా పెళ్లి చేసుకుంటారా..? అందరికీ సక్కటి రాత రాసేటి దేవుడు.. తన నొసట్ను మాత్రం ఎందుకింత చెడు రాత రాసిండో..?' పూలమ్మ రాత్రంతా అదే ఆలోచిస్తోంది.

* * *

అది 1948 సంవత్సరం.

దేశానికంతటికీ సొతంత్రం వచ్చింది.. వొక్క నైజాం సంస్థానంలోని జనానికి తప్ప. గుప్పెడు ఊపిరి కోసం, పిడికెడు ముద్ద కోసం.. తెలంగాణ జనం పోరాడుతున్న కాలం అది. ఆ కాలంలోనే సూర్యాపేట దగ్గరున్న వొక ఊరు సందుపట్ల. ఆ ఊళ్లోనే ఉంది దొర గడి. ఆ గడి ఆ చుట్టు పట్టు పది ఊళ్లను కంటి సైగతో శాసిస్తుంది.

పూలమ్మ ఆ గడిలో ఆడబాప. ఆ రోజుల్లో దొరల ఇంటిలో పెళ్లి జరిగితే.. కట్నం కింద భూములు, ఎద్దులు, ఆవులే కాదు, ఆడపిల్లలను కూడా బానిస కింద ఇచ్చెటోళ్లు. ఆడబాప వొక్కసారి గడిల అడుగుపెడితే చచ్చేదాకా ఆ గడిలోనే బతకాలె. దొరకు ఉంపుడుగత్తె లెక్క బతకాలె. అట్ల పూలమ్మ కూడా దొరసానితో పాటే ఈ దొరగడికి వచ్చింది. చిన్నపుడు తల్లి చెప్పిన మాటలు పూలమ్మకు ఇంకా గుర్తున్నాయి. 'బిడ్డా.. నీకు తిండిపెట్టలేక ఈ దొరసానికి అమ్ముకుంటున్నాం. ఆకలికి చచ్చిపోయే కన్న.. దొరసాని కాళ్లకింద బతికితే నాలుకు మెతుకులన్న దొరుకుతయి..' అని వలవల ఏడ్సుకుంట చెప్పింది. అప్పటి నుంచి దొరసానే లోకంగా

బతుకుతోంది పూలమ్మ.

ముత్యాలు కూడా ఆ గడిలోనే పనిచేసే జీతగాడు. చాలా హుషారైన పోరగాడు. వయసు ఇరవయ్యేండ్లకు లోపే ఉంటది. ముత్యాలు తల్లి కూడా పూర్వం ఈ గడిలోనే ఆడబాప. ఆడబాపను దొరగడిల ఏ మగాడైనా తన సుఖానికి వాడుకోవచ్చు. అట్ల ఎవరికి పుట్టిండో తెలియని ముత్యాలు ఆ గడిలోనే బానిసగా పెరిగిండు. దొరకు మరో జీతగానిగా పనికొచ్చిండు.

ముత్యాలు తల్లి.. అతనికి ఊహ తెలియక ముందే గత్తర వచ్చి చనిపోయింది. అట్ల ముత్యాలు, పూలమ్మ వొక్క ఈడోళ్లు కావడంతో దోస్తానం కుదిరింది. చిన్నతనం నుంచీ పూలమ్మ, ముత్యాలునీ పోరగా అని పిలిచేది. ఇప్పటికీ అలాగే పిలుస్తుంది. 'మా అమ్మలాగా నువ్వు ఈ గడిలోనే దిక్కులేని చావు చావకూడదు.. అందుకనే నిన్ను ఎట్లనైన గడిలోంచి బయటకు పంపించే దాక నిదరబోను' అంటాడు ముత్యాలు.

* * *

ఆ యేడు పెద్ద కరువొచ్చింది. ఏ పంట కూడా సరిగ పండలేదు. ఐనా సరే. అప్పు చేసైనా దొరకు మాత్రం శిస్తు కట్టాల్సిందే. శిస్తులు దొర తమ్ముడు.. చిన్న దొర అని పిలిచే భాస్కర్ రావు దొర వసూలు చేస్తడు. చిన్న దొర పాములాంటోడు. పగ పట్టిండంటే.. తీరేదాకా నిద్రబోడు. ఆ ఊరిలో ఆడోళ్లు చిన్నదొర పేరు చెబితే ఉలిక్కి పడుతరు. ఎంతమందిని పాడు జేసిండో.. చిత్ర హింసలు పెట్టిండో లెక్కలేదు. ఇక పెద్ద దొర నరసింగరావు పటేలు అవకాశం చూసి దెబ్బ కొడుతడు. తమ్ముడు మానాలు దోచుకుంటే.. అన్న సర్వం గుంజుకుంటడు. దొర దెబ్బకు ఆ ఊర్లె ఇల్లు వాకిల్లు అమ్ముకోని పోయినోల్లు చాలామంది ఉన్నరు.

ఓ రోజు తెల్లవారకు ముందే ఆ ఊరి వాడే మల్లయ్యను శిస్తు కట్టనందుకు.. గడిలోకి తెచ్చి వేపచెట్టుకు తలకిందులుగా వేలాడ గట్టిన్రు. చర్నాకోలాతో ఇష్టం వచ్చినట్లు కొట్టిండు. మల్లయ్యకు వొల్లంతా వాతలు తేలినయి. దెబ్బలకు తట్టుకోలేక వణికిపోతుండు. చిన్నదొర ఇష్టమొచ్చినట్లు కొట్టినంక.. పెద్ద దొర వచ్చిండు. 'వీనికి బోడగుండు కొట్టించి సున్నం బొట్లు పెట్టి గాడిద మీద ఊరేగించండి. ఊళ్లే ఎవరన్నా శిస్తు కట్టకున్నా ఇదే గతి పడతదని చెప్పండి..' అని హుకూం జారి చేసిండు.

అటువంటి చిత్రహింసలు, దారుణాలు ఆ గడిలో ప్రతిదినం జరుగుతూనే ఉంటాయి. దొరల ఆగడాలు చూసి రక్తం కుతకుత ఉడుకేది ముత్యాలుకు. అతను ఉదయాన్నే లేవగానే.. మనసులో కోరుకునేది వొకటే. తన తల్లి జీవితాన్ని నాశనం చేసిన ఆ గడిని.. నామరూపాల్లేకుండా చేయాలని. దొరోళ్ల రాజ్యాన్ని అంతం చేయాలని.

ఓ రోజు పొద్దంతా పని చేసి అలిసిపోయి.. ఆకలితో వచ్చిండు ముత్యాలు. ఆవురావురంటూ తింటున్న అతన్ని చూస్తూ ఉండిపోయింది పూలమ్మ. అతని మాట తీరులోనే కాదు.. తినే పద్ధతిలో కూడా ఏదో ఆకర్షణ ఉంది. 'పూలమ్మా.. సంగపోళ్లు ఇయాల రాత్రికి మన ఊళ్లే సభ పెట్టినరు. అక్కడ చానా సంగతులు చెపుతరట. మాపటికి నేను కూడా పోతున్న..' గుసగుసగా చెప్పిండు ముత్యాలు.

'వద్దు పోరడా.. దొరకు తెలిస్తే చంపుతడు..' భయంగా అన్నది పూలమ్మ.

ముత్యాలు గబ గబ రెండు ముద్దలు తిని చేయి కడుక్కొని వెళ్లిపోయిండు.

పూలమ్మకు ముత్యాలంటే పావురమే కానీ... దొర మీద కోపం లేదు. తల్లి తనను దొరసానికి అప్పగించింది. కాబట్టి బతికినంత కాలం ఆ దొరసాని కాడనే చెడ్డపేరు తెచ్చుకోకుండా బతకాలె అనుకుంటది. కానీ, ఈ ముత్యాలు.. 'నీకూ ఓ జీవితం ఉంది. గడిలోంచి పారిపోమంటడు. ఎవరినైనా పెళ్లి చేసుకో అంటడు. కష్టమో, సుఖమో నీ బతుకు నువ్వు బతుకూ అంటడు. ఆడబాపకు ఎక్కడైనా పెళ్లవుతుందా..? తనను ఎవరు పెళ్లి చేసుకుంటారు..?' తేనెపట్టు చుట్టూ ముసిరిన తేనెటీగల్లాగా రకరకాల ఆలోచనలు మనసూ చుట్టూ తిరుగుతున్నాయి.

* * *

మరునాడు పగటిపూట పనయిపోయినంక జీతగాళ్లంతా గడిల చెట్టు కింద చేరినరు. కొమరయ్య తాత రాత్రి జరిగిన సభ గురించి ముత్యాలును ఆరా తీసిండు. సభ గురించి తాత అడగ్గానే.. వొళ్లు మరిచిపోయిండు ముత్యాలు. దొర గడీల ఉన్నానన్న సంగతే మరిచిపోయిండు. కొమురయ్య తాతా.. ఆడ చానా సంగతులు చెప్పిన్రు. బుర్రకథ చెప్పినరు. పాటలు కూడా పాడినరు. నా కైతే ఓ పాట బలె నచ్చింది.

**ఈ ఊరి మనదిరా. ఈ వాడ మనదిరా.**

**నడుమ దొర ఏందిరో, ఆడి పీకుడేందిరో..** అని పాడింద్రు అనుకుంటూ పకపకా నవ్విండు ముత్యాలు. పాట మైకంల ఉన్న జీతగాళ్లకు తమను చిన్న దొర గమనిస్తున్న సంగతి తెలియలేదు. ముత్యాలు పాట వింటూనే భాస్కర్ రావు దొర.. కోపంతోని ఊగిపోయిండు. ఫటేళ్ మని కొరడాతో ముత్యాలు వీపు మీద కొట్టాడు. ఆ సప్పుడుకు జీతగాళ్లు చెట్టుకొకడు, పుట్టకొకడు పారిపోయారు.

'ఏమన్నవ్రా? మా గడీల బతుక్కుంట.. సంగపోల్లు పెట్టిన సబకు పోతావ్? దొర ఏందిరో.. దొర పీకుడేందిరో' అన్నావు. 'పీకుత చూడూ..' అనుకుంట చర్నాకోలతో ఇష్టమొచ్చినట్లు కొట్టిండు. ముత్యాలు కేకలు విని పరిగెత్తుకొచ్చింది పూలమ్మ. 'దొర కాళ్లు పట్టుకుంది. ఆడు తిక్కలోడు దొరా. వదిలేయి దొరా..' అంటూ బతిమాలింది. పూలమ్మ కాళ్లు పట్టుకునే సరికి భాస్కర్ రావుకు కోపం వొక్క సారిగ తగ్గిపోయింది.

'ఇంకోసారి గడీల కనపడితే.. చమడాలు వలుస్త బిడ్డ, చల్ పో..' అని ముత్యాలుగాన్ని గడిల నుంచి వెళ్లగొట్టిండు. ఆరోజు నుంచి పూలమ్మను కల్సుకునే అవకాశమే లేకపోయింది ముత్యాలుకు.

* * *

**జం జజ్జనక జజ్జనక....జజ్జనక జజ్జనక...జజ్జనక**

**ఝుం.... జజ్జనక జజ్జనక జజ్జనక....ఝుం జజ్జనక జజ్జనక జజ్జనక**

గడి ముందు డప్పుల సప్పుడు జోరుగా వినిపిస్తోంది. గూడెంలో ఎవరిదో పెళ్లి ఊరేగింపు.

ఆ పెళ్లి డప్పుల చప్పుడుకు పూలమ్మ మనసు లోతుల్లో ఎక్కడో దాచుకున్న కోరిక కట్ట తెగిన చెరువులా బయటకు తన్నుకొచ్చింది.

**జం జజ్జనక జజ్జనక జజ్జనక..** తనకూ పెళ్లయితే ఇలాగే డప్పులు కొడతారు కదా...

**జం జజ్జనక జజ్జనక జజ్జనక..**

పెళ్లి కొడుకెవరూ..? ఇంకెవరూ..? **జంజజ్జనక.. జజ్జనక జజ్జనక**

కానీ, తాను ఆడబాప కదా.. ఆడబాపలకు ఎక్కడైనా పెళ్లవుతుందా.. బతికినంత కాలం దొరల కాళ్లకిందనే బతకాలి.

అంతేకానీ పెళ్లి గిళ్లీ అని ఆలోచించడం పాపం.. జజ్జనక జజ్జనక జజ్జనక జజ్జనం.

'పూలమ్మా.. యాడున్నావే..?' దొరసాని పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది పూలమ్మ. గడి బయట దొర, దొరసాని ఆశీస్సుల కోసం వచ్చి ఆగింది పెళ్లి గుంపు. ఆ ఊళ్లో ఎవరి పెళ్లయినా దొర దగ్గరకు వచ్చి ఆశీర్వాదం తీసుకోవడం ఆచారం. బియ్యం, చింతపండు, పప్పు.. కొంచెం డబ్బు ఇస్తాడు దొర. బొక్కాబోర్లా పడుకుని దొరకు, దొరసానికి.. దండం పెట్టి వెళ్లిపోయారు పెళ్లివాళ్లు. డప్పులు మోగుతున్నాయి. ఆ పెళ్లిడప్పులు పూలమ్మ గుండెల్లో ఇంకా మోగుతూనే ఉన్నాయి. ముత్యాలు ఎక్కడున్నాడో.. ఏం తింటున్నాడో అని ప్రతిక్షణం బాధపడుతూనే ఉంది.

* * *

గడిలోంచి వెళ్లగొట్టిన తర్వాత ముత్యాలు మాదిగ గూడెం చేరిండు. ఆ యేడు కరువు కదా. ఎక్కడా తినడానికి గుప్పెడు గింజలు దొరక లేదు. గూడెం మొత్తం ఆకలితో నకనకలాడుతోంది. పసి పోరగాళ్ల గోస చూడలేక ముత్యాలు వొక నిర్ణయానికి వచ్చిండు. దొర గడీల పుట్ల కొద్దీ ధాన్యం ఉంది. దాన్ని పందికొక్కులు, ఎలుకలు తింటున్నయి. ఇక్కడనేమో పోరగాళ్లు తిండికి లేక చస్తున్నరు. రాత్రికి దొంగతనం చేసైనా సరే వడ్లగింజలో, జొన్నలో ఎత్తుకొని రావాలి అనుకున్నడు. అనుకున్న ప్రకారమే రాత్రి అంతా పడుకున్నంక.. మెల్లగా గడి దగ్గరకి వచ్చిండు.

మర్రిచెట్టుకు వేలాడుతున్న గబ్బిలంలా గడి మౌనంగా ఉంది.

మెల్లగా గోడ దూకి గడి లోపలకు వచ్చిండు. వేపచెట్టు ఎక్కి.. గడి పైదాకా పాక్కుంట పోయిండు. ధాన్యం ఉన్న గది కిటికీ సువ్వలు వంచి లోపలకు దూకిండు. ఇంతలో కాలికి ఏదో తగిలి పెద్ద చప్పుడయ్యింది. అంతే..! 'ఎవలూ..?' అంటూ ఓ మనిషి గడి లోవలకు వచ్చినరు. ఉలిక్కిపడ్డడు ముత్యాలు. చీకటిలో అది ఎవరి మొఖమో కనపడడం లేదు. 'ఎవలు దొరనా. దొరసానా.? దొరకు గానీ దొరికిండంటే సంపండం ఖాయం' అని భయపడ్డడు.

ఆ చీకట్లోనే 'ముత్యాలూ..' అన్న పేరు గుసగుసగా వినిపించింది. హమ్మయ్య అక్కడకి వచ్చింది పూలమ్మ..! తలుపులు పెట్టి లోపల నుంచి గడియవేసింది. దీపం వెలుగులో పూలమ్మ మొఖం కనిపించింది. కొంపతీసి పూలమ్మ అరిచి దొరను పిలుస్తుందా.. దొరకు చెప్పి పట్టిస్తుందా..?

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 129

'పూలమ్మా..! గూడెంల పోరగాళ్లు మూడు రోజుల్నించి తిండి లేక అల్లాడుతున్నరు. ఈ గడీల ధాన్యం పందికొక్కులు తింటున్నయి. వొక్క బస్తా జొన్నలు తీసుకపోతున్న. గూడెం పోరలు గటకన్నా తాగుతరు. దొరకు తెలిస్తే చంపుతడని తెలుసు. ఐనా దొంగతనానికి వచ్చిన..' పూలమ్మ చేతులు పట్టుకుని ఏడుస్తూ బతిమాలిండు ముత్యాలు. అతని కళ్లల్లోంచి ధారలు కారుతున్నయి. పూలమ్మ ఏమీ మాట్లాడలేదు. ముత్యాలును గట్టిగ దగ్గరకు తీసుకుని గుండెలకత్తుకుంది. ముత్యాలుకు వొళ్లు ఝల్లుమంది. తనకు తెలియకుండానే పూలమ్మను అల్లుకుపోయాడు.

* * *

ముత్యాలు జొన్నల బస్తాతో రాగానే గూడెం జనం రాత్రికి రాత్రే.. జొన్నలు రోట్లో దంచి గటక వండినరు. మూడు రోజుల నుంచి తిండిలేక అల్లాడుతున్న వాళ్లు.. మొదట పసిపోరగాళ్లకు పెట్టినంక మిగిలిన గటకలో.. నీళ్లు పోసుకుని తాగి కుదుట పడ్డరు. ముత్యాలుకు ఈ పూట తెల్లారినందుకు సంతోషంగానే ఉన్నా.. ఆలోచనలో పడ్డడు. 'వొక్క రోజంటే దొంగతనం చేసినం. రోజూ గడీల దొంగతనం చేయలేం కదా? ఎట్లా?' అని ఆలోచనల పడ్డడు. అప్పుడే సంగపోల్లకు ముత్యాలు దొర గడిల నుంచి సాహసం చేసి జొన్నలు తెచ్చిన సంగతి తెలిసింది. అందుకని సంగపోల్లు ముత్యాలును పిలిచి.. గడి మీద దాడి చేయమని చెప్పినరు. అందుకోసం 'జనాన్ని, కత్తి, కొడవలి, కత్తిపీట ఏది దొరికితే అది ఆయుధాలు జమ చేయండి' అని చెప్పినరు. 'అందరు కలిసి తిరగబడితే దొర గడి వదిలి పారిపోవడం ఖాయం' అని చెప్పినరు. చుట్టుపట్టూ ఉన్న గడుల మీద సంగపోల్లు దాడులు చేస్తున్నట్లు పెద్దదొరకు వార్తలు వస్తున్నయి. తమ గడిమీద దాడి జరుగుతుందేమోనని అనుమానిస్తూనే ఉన్నడు. గడిమీద ముత్యాలు దాడి చేస్తాడన్న సంగతి తెలిసిపోయింది. వెంటనే దొర తన ఇంట్లో ఉన్న డబ్బు, దొరసాని నగలు అన్నీ మూట కట్టిండు. పట్నానికి గబగబ బండ్లు కట్టించిండు. పూలమ్మను గడికి కావలి ఉండమని చెప్పిండు. దొర బండ్లు పట్నం దారి పట్టినయి.

* * *

మెల్లగా చీకట్లు కమ్ముకుంటున్నయి. అంత పెద్ద గడిలో పూలమ్మ వొక్కతే చిన్న దీపం పెట్టుకుని ఎదురుచూస్తోంది. ఇంతకాలం జనాన్ని భయపెట్టిన గడిని.. మొదటిసారిగా భయం ఆవరించింది. ఆరోజు పున్నమి.

దళం వస్తుందని తెలిసిందేమో నిండు సందమామ కూడా ముందుగాలనే వచ్చి గడివైపు తొంగి చూస్తుండు. దొర పీడ వదిలిన సంబరంలో వెన్నెల కూడా విరగకాసింది. **జజ్జనక జజ్జనం.. జజ్జనక జజ్జనం..** మెల్లగా డప్పుల సప్పుడు మొదలైంది. ఆ చప్పుడుకు గడి బండరాతి గుండెలు దడదడలాడుతున్నయి.

పూలమ్మ గడి ముందు కూచొని ఉంది. ఊరి జనమంతా దళంతోని కలిసి అక్కడకు చేరుకున్నరు. వాళ్ల చేతుల్ల కాగడాలు వెలుగుతున్నయి. 'ఈ దొర ఆస్తి, డబ్బు, భూమి అంత

గూడ మన సొమ్ము, మన కష్టార్జితం. కాబట్టి ఇది మనకే చెందుతుంది. వెళ్లండి. తీసుకోండి' అని చెప్పిండు ముత్యాలు. గడి తలుపులు బద్దలు కొట్టిన్రు. పుట్ట పగిలిన ఉసిళ్ల మాదిరి.. జనం కోట లోపలకు ఉరికినరు. వడ్లు, జొన్నలు, ధాన్యమంతా ఎవనికి చేతనైనంత వాడు మూటకట్టుకుని పోతున్నరు. నిన్నటి దాకా.. గడి పేరు చెబితేనే భయపడ్డ జనానికి ఇంత ధైర్యం ఎక్కన్నుంచి వచ్చింది. 'ఆ ధైర్యం ముత్యాలు.. నా ముత్యాలు'అనుకున్నది పూలమ్మ.

ముత్యాలు పూలమ్మ దగ్గరికి వచ్చిండు. చేయి పట్టుకుని గబగబ మెట్ల మీద నుంచి గడి పైకి లాక్కని పోయిండు. ముత్యాలు చేయిపట్టుకోంగనే పూలమ్మకు నోట మాటరాలేదు. చిన్నపిల్లలా వెనకాలే మాట్లాడకుండ పోయింది. పైన సందమామ కళ్లు మరింత వెడల్పు చేసి వీళ్లనే చూస్తున్నాడు. కోట గోడల మీద చల్లగ గాలి కొత్త పాట పాడుతోంది. గడి పైనుంచి ఊరంతా కనపడుతోంది. దూరంగా వొక వాడలో దివిటీలు వెలుగుతున్నాయి. సంతోషంతో జనం చప్పట్లు కొట్టుకుంటూ పాడుతున్నారు. ఆ పాట తెరతెరలుగా వినపడుతోంది. ఆడోళ్లు బతకమ్మ ఆడుకుంటున్నారు.

'దొరల పీడపోయి ఎవని బతుకు వాడు బతికే రోజు వస్తదంటే నువ్వు నమ్మలేదు. ఇప్పుడు చెప్పు. ఈ గడీల దొర లేడు. ఆ జనాల్లో భయం లేదు. ఇప్పుడు ఈ గడికి నువ్వే దొరసానివి..' నవ్వుతూ చెప్పాడు ముత్యాలు.

పూలమ్మకు అంతా కలలాగా ఉన్నది. గోడకు ఆనుకొని కూలబడింది. మోకాళ్ల మధ్య తలపెట్టి చిన్నపిల్లలాగా పొగిలి పొగిలి ఏడుస్తోంది. సంతోషమో, దుఃఖమో.. రెండూ కానీ మరో అనుభూతో..! ముత్యాలు మెత్తగా నవ్వుకున్నాడు. పూలమ్మనే చూస్తూ అలాగే ఉండిపోయాడు.

గోరుకొయ్య చుక్కలు పడమటి వైపు ఇంకొంచెం కిందకు జారినయి.

అప్పటి వరకూ ఆనందంతో ఆడిపాడిన ఊరు పసిపిల్లాడిలా మెల్లగా నిద్రలోకి జారుకుంది. మోకాళ్ల మధ్య తలపెట్టి మౌనంగా ఉండిపోయిన పూలమ్మ దగ్గరకు పోయి మెల్లగా తల పైకి ఎత్తిండు ముత్యాలు. కన్నీళ్లు కడిగిన ఆ మొఖం ఏ భావం లేకుండా పసిపాపలా కనిపిస్తోంది. ముత్యాలు మొఖంలోనూ సందమామను మించిన అందమేదో కనిపిస్తోంది.

ఇంతకాలం అరాచకం.. అణచివేతలే చూసిన ఆ గడికి తొలిసారి.. పావురమంటే ఏమిటో తెలిసింది.

రేపు రావాల్సిన కొత్త పొద్దు గడిని ముందుగానే చేరింది. మునుపెన్నడూ ఎరగని వెలుగేదో ఆ గడినిండా మెరుస్తోంది.



# బొడ్రాతు

రావుల కిరణ్మయి

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



రావుల కిరణ్మయి తెలుగు ఉపాధ్యాయురాలు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ వీరి ప్రాంతం. ఎంఏ తెలుగు చదివారు. ఇప్పటి వరకూ యాభై కథలు, రెండు వందల కవితలు, ఐదు నాటికలు రాశారు.

**'సుఖమస్తే మొకం కడుగ తీరలేదు'** అన్నట్టు బతుకుదెరువుకు పట్నం బాట పట్టిన నాకు ఊరు మొకం జాడ తీరలేదు. తీరలేదు అనుడుకంటె పోను మనసురాలె. మనసుంటే మార్గముంటది కదా! ఇప్పుడు కూడా ఏదో ఆశించే ఊరి దారి వెతుక్కుంట మల్ల ముల్కనూర్ బస్టాండ్‌ల వంగర బస్ కోసం ఎదురు చూస్కుంట కూసున్న.

ఇంతలో హనుమకొండ నుంచి సిద్దిపేట బస్ వచ్చి ఆగింది. ముల్లెలతో ఒక ఐదారుగురు దిగింద్రు. దిగిన వారు వచ్చిన నా పక్కనే కూర్చుంటూ మాటల ముల్లెలు విప్పుకున్నరు.

నేను దింపుకోలేనంత దిగులు ముల్లెతో ఎరగని ఊర్లో మొరగని కుక్క లెక్క వాళ్ల ముచ్చట్లు ఇనుకుంట ఉన్న. వాళ్లంత బోనాల పండక్కు సామాన్లు కొని సుట్టాలకు ఎదురు కచ్చురాలు ఇచ్చి వత్తాంద్రని మాటలను బట్టి అర్థమైంది. నాకెవ్వరు ఎదురు కచ్చురాలు పంపలే. ఎత్తేసి మొత్తుకున్నట్టు నేనే ఊరుకు బయల్దేరిన. షాపులు అప్పుడప్పుడే తెరుస్తున్నరు. నాలో నేనే జ్ఞాపకాల పెట్టె తెరుచుకున్న.

ఈ దాపులల్లనే ఒకప్పుడు అడ్డా కూలీగ నిల్సున్న. ఎంత కష్టం జేసినా అయ్యగారి సంపాదన అమ్మగారి పసుపు కుంకుమలకు సాలదన్నట్టు ఒక్కోసారి ఇంట్ల తెడ్డు చూరుగూడెక్కేది. ఊర్లె ఉంటే వేరే పనుల్లేక గౌండ్లకత్తి తీరుగున్నదని తెగిన బొక్కెన లెక్క పట్నం బాట పట్టన. చూరు నీళ్ళ ఎనగర్రకు ఎక్కినట్టు తంతె బూరెల ముకుట్ల పడ్డట్టు ఒకప్పుడు ఊళ్లె ఇంట్లకు చెప్పేస్తే

కుండకు తగులదన్నట్టు ఉన్నోన్ని ఇయ్యాల అంతో ఇంతో నాలుగు రాళ్లు ఎన్కేసుకొని ఊళ్లకు అడుగు బెడ్తాన. నడుమంతరపు సిరి వస్తెత నన్నెత్తుకోమన్నదట అన్నట్టు డాబు దర్పం జూపెట్టుకుంట కార్ల వచ్చి నా ఓళ్లకు దూరం గావద్దని ఎట్లెల్లి పోయిన్నో అట్నే సాదాసీదాగా బైలెల్లిన. బస్ వచ్చిది. ఎక్కి కూసున్న. తెలిసినోళ్లు ఎవరన్న ఉన్నరాని ఎతుకుతాన. ఎవ్వరు కనపల్లె. కిటికీల కెళ్లి చూత్తాంటె ముత్యం లెక్కనే ఉన్నడు. రోడ్డు దాటుతాండు. అవును ఇటే వచ్చిండు. కండక్టర్‌కు ఏదో ఇచ్చి పోతాంటే 'ఒరేయ్! ముత్యం!' అని పిల్సిన. కొద్ది సేపు జూసి 'ఓరోరి ధనుజా! నువ్వారా. బాగున్నావ్ రా! ఊళ్లకేనా? నేన్గూడ మాపటీలి బస్‌కత్తానా. దిగరాదు. ఇద్దరం కల్సి పోదం' అన్నడు.

'వద్దురా! బోనాలు గద. ఊళ్లె ఇల్లు జిల్లెల్లు జిలుగు మొలలెక్క ఉండచ్చు. బాగు జెయ్యాలే. రేపు అవ్వ. చెల్లగిన పిలగాండ్లతోని వత్తనన్నది' అంటే 'సరే! రా, నీ ఇష్టం. ఊళ్లె కలుత్తతీ' అన్నడు.

బస్ కదిలింది. రత్నగిరి గుట్ట. కొండంత దేవుడు. లక్ష్మీ నరసింహుడు. వెలసిన గుట్ట పక్కనే కనబడ్తాంటే..

**ఉగ్రం వీరం మహావిష్ణు॥ జ్వలంతం సర్వతో ముఖమ్**

**నృసింహం భీషణం భద్రం॥ మృత్యుం మృత్యుం సమాన్యహం॥**

అనుకుంటా మనసులనే మొక్కకున్న. ఆ పెద్ద మర్రిచెట్టు అట్లనే ఉన్నది. ఆషాఢం, శ్రావణంల వంటలకు ఆడికే బొయ్యేది. నువ్విడిచి పెట్టిపోయిన బాల్యాన్ని భద్రంగా దాచిపెట్టిన అని చెప్పినట్టు అనిపించింది. చెట్టును చూడంగనే. ఒకరిద్దరు కూలీలు దిగింద్రు. రోడ్డుపక్కన హరితహారం కోసం అనుకుంట నర్సరీల మొక్కలు ప్రత్యేకంగా పెంచుతున్నరు. మొక్కలు గాలికి ఊగుతాంటే హాయ్ అని పలకరించినట్టు అనిపించి సంతోషమైంది. అటూ ఇటూ మోదుగు చెట్లు. పెద్ద పెద్ద ఆకులతోని సక్కగున్నయ్. మోదుగాకులు కూడా ఏరుకపోవుడు గుర్తుకు వచ్చి నవ్వచ్చింది. అప్పుడు లేక ఆకులల్ల తిన్న. ఆఖరికి ఆకులు ఏరుకొని విస్తళ్లు కుట్టి కూడా తిన్న. ఇప్పుడు ఉండి కూడా బైట తినుడు ఎక్కువై శుచీ శుభ్రత కోసం కాగితపు ప్లేట్లల్ల తింటాన. బస్ హాస్పిటల్ ముందటికని ఆగింది. ఈ మారుమూల పల్లెను దేశదేశాన మారు మోగింపజేసిన మహానుభావుడు పీవీగారి విగ్రహం అన్నే ఉన్నది. దండం బెట్టిన చేతులు జోడించి. అక్కడే అంగడి కూడా జరుగుతది కాబట్టి జనం బాగనే ఉన్నరు. కూరగాయలు మొదలు అన్నిరకాలు అమ్మకానికచ్చినయ్. దాదాపు అన్ని వృత్తుల ప్రతీకలతో అంగడి కొలువుదీరింది. కుమ్మరోళ్ల పనితనమంత బోనం కుండలే చెప్తానయ్. ముద్దుగ ఆఖర్న రంగు రంగుల గాజుల పిల్లర్లు నిలబెట్టినట్టు గాజుల గంపలు. ముత్యంగాడు పూసవేర్లోడే. వాళ్లత్తగూడ అమ్మేది. పాపం భర్త పెళ్లైనంక కొద్ది రోజులకే చచ్చిపోయిండు. విధవ దగ్గర గాజులు కొందమాని కొంతమంది ఎన్క ముందయ్యేటోళ్లు. అవ్వగవన్ని లెక్కజెయ్యక పోవు. మంచితనం జూడాలనేది. ముత్యం వాళ్లమ్మ పుట్టంగనే సచ్చిపోతె తమ్మునికి మల్ల పెండ్లి జేసి ముత్యంను కన్నకొడుకు లెక్క సాదింది. అక్కా, తమ్ముళ్ల బంధానికి ఆనవాలుగా నిల్చింది. బస్ ఊరు పొలిమేర జేరెవరకు 'బిచ్చగాడితోని సీత్లా

పండక్కు ఆడికచ్చుడు యాదికచ్చింది. సీత్లా పండుగ చాలా ఇచ్చంత్రంగా ఉండేది. పొలిమేరల ఏడు దేవతల రాళ్లతోని మధ్యలో సీత్లా తల్లిని పెట్టి ఎదురుగా బంటు అయిన లుంకిడియాను ఏర్పాటు చేసేది. వాంసిడో ప్రసాదాన్ని వండి పెట్టెటోల్లు. తర్వాత మేకను బలిచ్చి మేక పేగును లుంగిడియా విగ్రహం వరకు పరిచి పశువులను పేగు మీదుగా దాటిస్తూ సల్లగ జూడమని మొక్కే దాటుడు పండుగ కండ్లల్ల మెరిసింది. కాష్ఠం దాట్తాంటె సగం కాలిన బక్కయ్య శవం గుర్తుకచ్చింది. బక్కయ్య అనాథ. కోడి రోటికాడికి పోయినట్లు ఊళ్లొబిచ్చం, గుళ్లో నిద్రతోటి తిండికి బట్టకు అయిగనే బతికి సచ్చిపోయిండుగని చివరి కార్యక్రమాలకు దహనానికి దానమిచ్చిన కట్టెలు జాలక చితి పేరిస్తే సగమే కాలిండు. తెల్లారి నాయనే ముందటపడి దహనం జేయించి అన్నదానం పెట్టించిండు. అట్ల మానవతకు మరోపేరు మా ఊరు.

పోచమ్మ గుడికాడ బస్ ఆగింది.

పేద్ద రాళ్ల చెట్టు కింద కొలువైన సల్లని తల్లి. అమ్మను ప్రశాంతంగా జూస్తె నవ్వుతూ 'రా బిడ్డా!' అని పిల్సినట్టే ఉంటది. పిల్లల్లేనోళ్లు రాళ్ల చెట్టుకు ఊయల కట్టి పిల్లల్ని గని 'అమ్మ ప్రేమ'ను పొందుతరు. మహిమ గల్ల తల్లి. బోనాలని రంగులేస్తాంద్రు. గుడిని ముస్తాబు జేస్తాంద్రు. తరువాత స్టేజిలోనే నేను దిగాలని లేచి నిల్సున్న. కండక్టర్ మల్ల జూసి 'ధనుజయ్యగారా? మీరు?' అన్నడు.

అవునన్న.

'నువ్వెవలు? నేను గుర్తుపట్టలేదంటె, నేను మీ దోస్తు మంగళి కర్ణం రెండో కొడుకుని అన్నడు. 'నాయ్న బాగున్నడా?' అంటే.. 'ఆ.. ఆ..' అన్నడు. ఏమన్లే.. ఒకప్పుడు మా ఇల్లే ఊరు చివరుండేది. ఊరాకిలిగా బొడ్రౌతు గూడా అన్నే పెట్టింద్రు. తర్వాత్తర్వాత ఊరు పెరుగుట్ల బొడ్రౌతు ఊరు మధ్యలకైంది. బొడ్రౌతు పక్కన్నే లింగమయ్యను, భూలచ్చిమిని, మాలచ్చిమిని కూడా పెట్టింద్రు. ఇంటి పక్కన్నే బొడ్రౌతు ఉండుట్ల వాకిలి నున్నగున్నది. ముగ్గుల తోటి కలకలలాడ్తాంది. తూముకాడికి పొలం లెక్క ఇల్లు చుట్టుముట్టు గూడ శుభ్రంగనే ఉన్నది. బొడ్రౌతే నా ఇంటిని కాపాడ్తాందని దండం బెట్టుకున్న. తాళం తీసి ఇంట్లకు పోయిన. రెండర్రలు, సుట్టు ప్రహరీ. అవ్వోటివ్వోటి చెట్లు మొల్సినయ్. చైసుకుంటాంటె శాలోల్ల కమలమ్మత్తచ్చింది. 'ఎవలు? ధనుజా! నువ్వేనారా ఎన్ని రోజులకచ్చినవ్ బిడ్డా! అమ్మత్తాందా?' అన్నది.

'రేపు పొద్దటీల వత్తాంద్రే.. నేను ఇల్లు ఊడిపిచ్చి జర సాపు చేద్దమని ముందుగలచ్చిన'

'సరే! ఒక్కనితోనేమైతదిరా. మా పనోన్ని పంపుత. ముందగాల ఇంత బువ్వ తిని సల్లవడద్దువురా! అంటె బల్మీటికి వొయి తినచ్చిన. ఊరు గొడ్డుపోతే. వాళ్ల వీళ్ల వివరాలు ఎర్కజేస్కుంట ఇల్లు ఓ రేవుకు తెచ్చుకునె వరకు తలప్రాణం తోకకచ్చింది. నాక్కూడా ఊరు పట్టున్నందుకు పాణం తేటగైంది. అవ్వ ఉన్నప్పుడు గిట్ల లేకుండె. బొత్తిలకు దారి మరిశె వరకు ఇల్లు అంగడమైంది. ఇగ మల్లోసారి ఇట్ల కానియ్యద్దని గట్టిగనుకున్న.

తెల్లారే వత్తనన్నోల్లు ఇల్లు మొత్తం తేటగైనంక గూడ జాడలేరని ఫోన్జేసిన.

'ఏందే అవ్వా! రోజు ఇగత్తానం, అగత్తానం అంటాంౘ్రు. వత్తలేరు. పండుగ దగ్గరవడ్తాంటె ఎన్నడత్తరే?' అన్న.

నా బిడ్డ, కొడుకు గుడ వత్తమన్నరంట. వాళ్లను సుత తీసుకొని వత్తమని ఉన్నమని చెప్పంగనె నెత్తిన పిడుగువడ్డట్లైంది నాకు.

నా బాగోతం చూపించడానికే వత్తున్నట్టనిపించింది. నాకెంత నామోషీ. గుప్పిట వట్టుకొని ఏదో రెండు దినాలు సంబురంగ ఎల్లదీస్కోని పోదామనుకంటె వీళ్లచ్చుడవుసరమా? మూలిగే నక్కమీద తాటిపండు వడ్డట్టే ఉన్నది. ఎందు పొందనియ్యరు గద నన్ను అనుకున్న. ఎద్దడుగులో ఏడుగుణాలని, నా సోపతిగాండ్లు పిల్లల పట్ల ఎద్దును చూసి మేతేసినట్టు ఆచితూచి అడుగులేసుకుంట మాటరానీయకుండ మానం పోకుండ జీవితాలను చక్కబెట్టి బాధ్యతలు తీర్చుకొని ఒడ్డెక్కింౘ్రు. మరి నేనో, చదివినంత చదివియ్యాలని చదివిత్తే, చదివిత్తె ఉన్న మతి వోయినట్టు మంచి ఉద్యోగాలు సంపాయించుకున్నరు గని వాటితో పాటు వాళ్లకిష్టమైనోళ్లను కులం కానోళ్లను జోడీలుగ చూసుకున్నరు. పెండ్లిల్లు అయితే వాళ్లతోనే లేకుంటె గిట్లనే అని మెడమీద కత్తివెట్టింౘ్రు. మింగలేక కక్కలేక ఉగ్గవట్టుకొని ఉంటాన. నారాత గాకుంటేంది? నాకు పిల్లల పెంపకం రాలేదనిపిత్తాంది. ఇట్ల నేను సోచాయించుతాంటె ముత్తరాసి మైసయ్య, కొడుకును దోలిండు అక్కలకు, అత్తమ్మలకు ఒడిబియ్యం బోత్తానం. భోజనానికి బాపు రమ్మంటాండని తోల్కపోతే ఎప్పుడు? పప్పన్నమెప్పుడని? ఏదో దాటేసి కూసున్న. మైసయ్యకు ఐదుగురు చెల్లెండ్లు, ఇద్దరు బిడ్డలు. అదరికీ కలిపి ఒడిబియ్యం బోసి బట్టలు వెట్టి పెద్ద పండుగ జేసిండు.

వలసెల్లిపోయినా, గట్టుకూలి పోయినా తల్లి గారి బియ్యం తన్నుకు రావల్సిందే అయిదేండ్ల కోసారి సారె మళ్లాల్సిందే. పసుపు బువ్వ దావత్‌తో తాంబూరలియ్యాల్సిందేనని అవ్వగూడ నాయ్న ఉన్నన్ని రోజులు ముగ్గురు మేనత్తలకు ఐదు సేర్లు, ఐదు దోసిళ్లు, ఐదు పిడికిళ్లు, ఐదు చారల బియ్యం, ఐదు తమలపాకులు, ఐదు పోకలు, ఐదు పసుపుకొమ్ములు, ఐదు ఎల్లిగడ్డలు, ఐదు ఖర్జూరాలు, ఐదు దానిమ్మలు, ఐదు రూపాయి బిళ్లలు ఇట్ల పంచశీల ఒప్పందంలా పంచభూతాల కలయికలా ముత్తైదువులకు ఒడిబియ్యం బోసేది. నాయ్న, మామలు మాయమైంౘ్రు. ఒడిబియ్యం లేక పందిరి గుంజ వట్టుకొని పండ్లిగిలిచ్చుడైతాంది. ఏ వైభోగమైనా ఆడపిల్లలతోనే, అత్తలక్కూడా అందరు మగోళ్లే.

ఇగ నా ఒక్కనికే బిడ్డ. కొద్దిగ గావురం జేసెటాళ్లకు ఎల్లెలుకలవడ్డ. అన్ని సక్కగుంటె నేన్సుత బిడ్డకు ఒడిబియ్యం పండుగ జెయ్యపోదునా? అత్తలు బతుకమ్మ, సంక్రాంతి ఏ పండుగకైనా ఇటే వచ్చేది. ఈ రెండౘ్రల ఇంట్లనే ఉండేది. రాకరాక వచ్చింౘ్రని అమ్మగిన ముచ్చట్లు పెట్టుకుంట ఉంటాంటె మామలు బువ్వపెట్టుడున్నదా? ఎల్లమ్మ కొలుపేనా? అని పరాశికాలాడేది. ఎల్లయ్య మల్లయ్య చదువు చదవినా వాళ్లు కూడా పద్ధతిగ పిల్లల పెంచి తెంపి ముడేసుడు లేకుండ పిల్లల బాగు జేసింౘ్రు. కని నేను మూలం మరిచిన. నా పిల్లలకు నా మాట తెల్లకాగితం మీద నల్లగీత లెక్క చెయ్యలేకపోయి తెకాలువడ్డోని లెక్కయిన. ఊరిడిశి నేను ఏం బాగుపడ్డ. పైసలు

ఎనుకవడ్డయ్ గని, నలుగరిట్ల నవ్వుల పాలయ్యేటట్టే ఉన్నగద. ఒకటే బాధ. నిద్రవోనిత్తలేదు. మర్నాడు బిడ్డ, కొడుకు నా భార్య అవ్వగిన వచ్చింద్రు. అవ్వకు తీర్తలేదు. వాళ్లు వీళ్లు వచ్చి మందలిత్తాంటె దినాం పండుగ లెక్కల్నే గడుత్తాంది. నా భార్యాపిల్లలు గూడ పుర్సతుగనే ఉన్నరు. ఏ ఇల్లు జూసిన నిండుకుండోలే ఉన్నది. నాకే మనసొప్పుతలేదు. అవ్వకని పెట్టినట్టున్నది.

'ఏమిరా? కొడ్కా? ఏదో గుబులు పడ్తానవ్?' అన్నది ఓ యాల. నా బాధంత ఎల్లగక్కిన. నా పరువు పొయ్యేటట్టున్నదని ఏకబిగిన ఏడ్సిన. అయినోళ్ల మద్దెల ఊళె నామొకం నల్లమొకమయ్యేటట్టున్నదని కడుపు చించుకున్న. అవ్వ బిత్తరవోయింది.

గింత చిన్నదాన్కే బేజారైతానవేమిరా? జీవితమంత అందరికి వడ్డించిన విస్తరి గాదు. తొక్కుడు బండలెక్కలుండి సరిజేసుకోవాలె. ఎన్నడు ధైర్నం జెడద్దు. కొడుకా! నీ పిల్లలు బద్దిమంతులై ప్రయోజకులైంద్రు. వాళ్లకు నచ్చినోళ్లను జేసుకుంటమంట్రాండు. తప్పేమున్నది? కులం, మతం గాదు మనసులు ముఖ్యం అని చెప్పేటందుకే గద. నువ్వు యాది మర్శినావురా! కొడుకా! ఊళ్లె పీరీల పండుక్కు చిన్నప్పుడు పీరీ ఎత్తెటోనివి, ఇప్పటికి అన్నారం షరీఫ్‌కు కూడా పోతవు గద. నువ్వు గిట్ల సోచాయించుడు నాకు పరేషాననిపిత్తాంది. ఐదేళ్లు సమానం లెవ్వు. కని అన్ని కలిస్తెనే పిడికిలి బలం. మనుషుల మధ్య ఈ తేడాలు పోయినప్పుడేరా మనం బాగుపడేది. పెద్ద మనసుజేస్కోని ఇరువైపులా పెద్దోల్లు మాట్లాడుకొని ఏ సమస్యల్లేకుండ అందరి మధ్యల పెండ్లి జేత్తే పెద్దరికాలకు ఎంత విలువుంటది చెప్పు?

బిడ్డా! మా తాతలు నేతులు దాగింద్రడు నా మూతి వాసన జూడు అంటె కుదరదు. వర్షం పడి పాత నీరు ఒయి కొత్తనీరు వచ్చినట్లే ఆకులు రాలి మల్ల కొత్త చిగుర్లు వేసినట్టే మారుతున్న కాలానికి తగ్గట్టు అడుగెయ్యాలె.

తీరొక్క పువ్వులు తెచ్చి పేరిత్తెనే బతుకమ్మ అందంగుంటది. తీరొక్క జాతులు ఏకమై బతికితెనే ఊరు బాగుంటది. దాపెలెద్దోపిక గల్గినోనివి నమ్మలంగుండు అని అవ్వ జీగ్రపుల్ల నా చేతికిచ్చింది.

నిజమేనా? ఈ మాత్రం నాకెందుకు రాలే. అవ్వ అందుకే ఆరోగ్యంగ ఉన్నది. ఎలాంటి వాదాలకు పోదు. మొండి పట్టు పట్టది. తనకు తెల్సిందల్లా మంచి గుండుడు. దానికోసం ఎంతైనా పాకులాడ్తది. గందుకే కంటినిండ నిద్ర పోగలుగుతాంది అనుకున్న.

తెల్లారింది. అందరు బోనాల కుండలతోటి బయల్దరుతాంద్రు. నా భార్యాపిల్లలతో నేన్గూడ బైలెల్లిన, అంతకు ముందుగాల బొడ్రాడుకాడ కొబ్బరి కాయలు కొట్టి ముందుకు కదుల్తాంద్రు. అందరిక మొఖాలు ఆనందం తోటి తంగేడుపవ్వు లెక్క పవిత్రంగుండి గుమ్మడి పువ్వోలె విప్పారినయ్. నేన్గూడ పిల్లగాండ్ల పెళ్లిళ్లు నా చేతుల మీదనే పెద్దరికం తోటి జరిపిచ్చి ఊరుకు బొడ్రౌతు లెక్క వాళ్లను కాపాడుకోవాలని నిర్ణయించుకున్న. పోచమ్మ తల్లి ముందర అదే మొక్కి దీపం పెట్టి ఊదేసిన. అమ్మ ఎప్పటి లాగానే రా బిడ్డా అని దగ్గరికి దీస్కోని ఆశీర్వదిస్తున్నట్టు


ఆగువడ్డది. ఆ కొడుకు దగ్గర ఆర్నెళ్లు ఈ కొడుకు దగ్గర ఆర్నెళ్లు పట్నంల ఉండలేక అవస్థ పడుతున్న మంగలి కర్ణం లెక్కన అవ్వను జెయ్యద్దని ఎక్కడ పుట్టిన గడ్డి అక్కడే మాడిపోవలన్నట్టు అవ్వను జూస్కంట ఆన్నే ఉండాలని నిర్ణయించుకున్న. బొబ్రౌతు లెక్క. నా బాధ ముల్లె దింపుతున్న. పురాగ నిమ్మలవడ్డ.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 139

# అతడు మార్గదర్శి

కూతురు రాంరెడ్డి

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



కూతురు రాంరెడ్డి విశ్రాంత ఎక్సైజ్ సీఐ. 1950లో కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో జన్మించారు.బీకామ్ చదివారు. 2008లో ఉద్యోగ విరమణ చేశారు. మరోవైపు రచనా రంగంలో వీరి ప్రవృత్తిని కొనసాగించారు. ఇప్పటి వరకూ 120 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆరు పుస్తకాలు ముద్రించారు. కొత్త చివుళ్లు, జారుడు బండలు, కాలుతున్న కట్టెలు, గాలిలో తేలిపోతున్నాం, బతుకమ్మ, పంచతంత్ర పానీయం పుస్తకాలు ముద్రించారు.

**'యాడికి వోతున్నవక్కా పొద్దు పొద్దుగాల్నె..?'** దోసిట్లో పెండకడి వట్టుకొని ఎదురై ఆగి అడిగింది ఆత్రం లచ్చింబాయి.

చంకలోనున్న పిల్ల నీరసంగా తల్లి కుడిభుజం మీద తలవాల్చి కండ్లు మూసీ మూయనట్టున్నయి. బిడ్డ తలమీది నుండి జారిపోతున్న తువ్వాలను సదిరికప్పి– 'రాత్రికి రాత్రి బిడ్డకు జరంబట్టుకుందే లచ్చవ్వ.. కస్సకస్స దగ్గుడు. రాత్రంతా నిద్రవోతే ఒట్టు..' అంటూ దిగులుగా బిడ్డ మొహం చూసింది మేస్రం జంగుబాయి.

'మరి ఎక్కడికి తీస్కవోతాన్నవ్..?'

'ఉట్నూరు దవాకానకు..'

'మరి నడ్సుకుంటవోతాన్నవ్ ఎప్పుడు జేరుకుంటవ్..?'

'మరేంజెయ్యాలె..! గంటసేపు జూసిన.. మన బుడ్డగూడెంకు ఎప్పుడో ఒక్క ఆటో సుక్క తెగినట్టు వచ్చిపోతదాయె..! మోటర్ సైకిల్లున్న ఇద్దరు పిల్లగాండ్లు రాత్రి ఇండ్లల్లకు రానే లేదట. పక్కూరికి పోతాన్న, అక్కడ మస్తు ఆటోలు ఉంటయిగద.. బస్సులుగూడ నడస్తయి బాగానే..! దేంట్లనో వోదాంల్ల వడిపోతం. వత్తశెల్లె..' అనుకుంట ముందుకడుగేసింది జంగుబాయి.

ఆరేండ్ల బిడ్డ, బక్కగ లేదు. మరీ ఒల్లుపట్టిలేదు. బలహీనత కారణంగా అమ్మ చంకలో

కుదురుగా కూసోలేకపోతాంది. కిందికి జారుతున్న బిడ్డను చంకపైకి ఎగదోసుకుంట నడుస్తాంది.

తల్లిప్రేమ ఆయాసాన్ని మరిచి బిడ్డను అవలీలగా మోస్తుంది– తన గూడెం నుండి పంచాయితీ హోదా కలిగిన గ్రామం సుమారుగా రొండు కిలోమీటర్ల దూరం ఉంటది. తొవ్వ బండిబాట.. మధ్యన రొండు మట్టి దిబ్బలుంటయి.. బాటకిరువైపుల టేకు చెట్లు ఉన్న దగ్గర పెద్దపెద్ద ఆకులు ఎండి రాలిపోయి తొవ్వమీద పరుచుకుపోయినయి. అందులో నుండి నడుత్తుంటె ఆకుల గలగలకు బిడ్డ అసహనంగా కండ్లు తెరిచి నేలకేసి సూత్తాంది. సమయం ఉదయం కాబట్టి కిలకిలరాగాలు తీస్తున్న రకరకాల పక్షులు తిండి వేటకు బయలుదేరుతున్నయి.

ముప్పావు గంట నడిచేసరికి ఊరొచ్చింది. ఆటోలు వగైరా ఆగే గ్రామ పంచాయితి కూడలి దగ్గరికి చేరుకున్నది. ఆ ఊరికి బస్సులు కూడా బాగానే నడుస్తయి. కానీ, అప్పటికే రొండు బస్సులు నిండా జనాల్ని నింపుకొని ఎల్లిపోయినయట. మూడు ఆటోలు ఉన్నాయి. ఒకటి పూర్తిగా నిండి పోయింది. మరొకదాంట్ల నలుగురు ప్యాసింజర్లు కూసున్నరు.

జంగుబాయిని సూడగానే– 'కూసో అమ్మ పోదాం..' అన్నడు డ్రైవరు.

అప్పుడే బయలుదేరుతదని? ఆటో ఎక్కికూసున్నది– అందుల ఉన్నోల్లంతా ఆడవాళ్లే.

కాసేపయినా పండుకుంటుందేమోనని బిడ్డను తన తొడలపై పడుకోబెట్టి తువ్వాల కప్పింది.

అర్ధగంట గడిచింది. తలకొద్దిగా బయటికి వంచి డ్రైవరు కోసం చూసింది. ఎదురుగా ఉన్న హోటల్లో ఎవరితోనో మాట్లాడుకుంట చాయ తాగుతాండు.

ఒక ప్యాసింజరు కూరగాయల సంచి పట్టుకొని వచ్చేసరికి తాగిన గ్లాసును పక్కనబెట్టి బల్లలు తుడుస్తున్న అవ్వకు చాయపైసలిచ్చి ఆటో దగ్గరికి వచ్చి 'రామ్మా కూసోగని సామాన్లు ఎనుక వెట్టాలె' అంటూ ఆమె చేతిలోని మూటను తీసుకొని వెనుక మూలకు సర్దిపెట్టి 'ఇగగూసో..' అన్నడు డ్రైవరు.

'ఆటో ఇప్పుడు వోద్దామరి..! ఆలిశమయితే మార్కెట్ల నా సోటువోద్ది మరి..' అనడిగింది ఆమె.

'అయ్యో ఇప్పుడే వత్తివి.. ఇంక ఆటో ఎక్కనేలేదు.. గట్ల తొందరపడితే ఎట్ల.. కూసోకూసో.. ఇంక నలుగురెక్కితే బయలుదేరుడే..!'

మరో పావుగంటలో ఆటో నిండింది. ఎనుక, ముందు, మధ్యన కలిపి మొత్తం తొమ్మిదిమంది. అందులో ముగ్గురు మగోల్లు. ఇరవై ఐదు ముప్పై ఏళ్ళ మధ్య ఉన్న యువకుడు వచ్చి చివరికి కూసున్న జంగబాయి పక్కకు కూసున్నడు 'తమ్మీ నువ్వు కొద్దిగా ముందుకు జరిగి కూసుంటే ఆ అమ్మ వెనుకకు జరిగి కూసుంటది.. ఎందుకంటే పిల్లతల్లి గదా..' అంటూ అందర్ని సర్దికూసుండబెట్టిండు. ఇంకొక్కరయితే బాగుంటుందని అనుకుంటున్న సమయంలో అల్లంత దూరం నుండి బస్సు కనబడింది. వెంటనే ఆటోలోంచి తాడు తీసుకొని వెనుకకుపోయి ఇంజను స్టార్టు చేసిండు వచ్చి ఆటో ముందు సీట్లో కూసొని గేరు వేసిండు.

తారు రోడ్డుకాదు ఈ మధ్యనే గవర్నమెంటువాళ్ళు కొంతమేరకు కంకర పోశింర్రు. కానీ, రోడ్డు రోలరు ఇంకా తిరుగలేదు. దానికి తోడు రోడ్డుకు కుడి పక్కన మిషన్ భగీరథ పైపులైను వేస్తున్నరు.

కుదుపులతో సాగిపోతున్న ఆటోలో జంగుబాయి పక్కన కూసున్న వ్యక్తి అప్పుడే తాగివచ్చిండేమో అతని నోటి నుండి గుడుంబా వాసన గుప్పుమంటోంది. కుదుపులకు అతడు ముందు పట్టుకున్న రాడ్డు పట్టు తప్పుతున్నట్టు జంగుబాయి భుజంమీద తూలి పడుతున్నడు.

'తమ్మీ.. కొద్దిగ మంచిగ్గాసో రాదూ.. బిడ్డకు పానం బాగలేదు.. జరమొచ్చింది..' అంది.

అతడు ఆమె కళ్లలోకి నిర్లక్ష్యంగా చూసి చిన్నగా ఓ వెకిలి నవ్వు నవ్విండు.

వాడి వాలకం చూసి ఇంకేం మాట్లాడగూడదనుకున్నది.

ఉట్నూరు చేరుకునేసరికి వాడు చేసిన వెకిలి చేష్టలకు మిన్నకుండి 'నీ సంగతి జెప్పుతుండు బిడ్డ..' మనసులో అనుకుంట ఆక్రోశిస్తూ ఆటో దిగింది.

* * *

దవాఖానా ఆవరణలో రోగులు చాలా మందే ఉన్నరు. చిటీలు రాయించుకోవడానికి ఇరవై మంది వరకు లైన్లో ఉన్నరు. చద్దర్లు కప్పుకొని ఓ పదిమంది దాకా ముక్కుతూ మూల్గుతున్న ముసలోల్లు. చంటి బిడ్డల్ని ఎత్తుకున్నోల్లు మాత్రం ఇద్దరే ఇన్నారు.

జంగుబాయి పోయి లైన్లో చివర నిలుసున్నది. డాక్టర్లు, నర్సులు అందరూ లోపల్నే ఉన్నరు. ఒక కాంపౌండరు మాత్రం బయటికి లోపలికి తిరుగుతున్నడు. తెల్లటి బట్టల్తో హుషారుగున్నడు.

వరుస ముందున్న ఇద్దరి చంటిపిల్లల తల్లుల్ని లోపలికి పంపించి వారి పరీక్షలయి బయటకొచ్చినంక, క్యూ దగ్గర అటూఇటూ తిరిగి 'నువ్వు రామ్మా..' అంటూ జంగుబాయిని లోపలికి తీసుకపోయిండు.

డాక్టరు బిడ్డను పరీక్షలు చేసి 'జ్వరం అంతగా లేదు.. నార్మల్‌కంటే కొద్దిగా ఎక్కువగా ఉంది. బయపడాల్సిన పనిలేదు.. వర్షాలు పడుతున్నాయి కదా వైరల్ ఫీవర్.. సర్దీ, జ్వరాలు వస్తూనే ఉంటాయి. ఈ సీజన్లో ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి. వేడి చేసి చల్లార్చిన నీరు తాగండి. ఈగలను, దోమలను దరిజేరనీయకండి. వండిన పదార్థాల మీద మూతలుపెట్టి తాజాగా ఉన్నప్పుడే తినండి. ఈమాత్రం జాగ్రత్తలు తీసుకోకపోతే రోగం తిరగబెడుతుంది..' అంటూ నర్సమ్మను పురమాయించిండు. ఆమె బిడ్డకు ఒక ఇంజక్షన్ వేసి పదిహేను రోజులకు సరిపడా రెండు రకాల మందుగోలీలు ఇచ్చి ఎప్పుడెప్పుడు వేసుకోవాల్నో చెప్పింది.

జంగుబాయి డాక్టరుకు దండంబెట్టి 50 రూపాయల నోటు తీసి ఇవ్వబోయింది.

'అదేంటమ్మా..ఛ.. ఛ.. లంచమా? అది తీసుకోవడం నేరం, నీతి మాలిన పని.. ఇకముందు మాకేకాదు ఎవ్వరికీ లంచం ఇవ్వజూడకు.. నా వృత్తి ధర్మాన్ని నేను నిర్వహించాను. అంతేకానీ..

దానికి వెలకడతావా.. చూస్తే నువ్వు అమాయకురాలు లెక్క లేవు.. నీకీ ఆలోచన ఎందుకు, ఎలా వచ్చిందమ్మా..'

'అయ్యా...! పొరపాటయ్యింది క్షమించండి..!'

'సరే సరే..! ఇక నువ్వెళ్లు.. నీ బిడ్డ జ్వరం తగ్గుతుందిలే.. మళ్లీ రావలసిన అవసరం లేదు..'

'వస్తానయ్యా..' అంటూ బయటకొచ్చింది.

గంటసేపట్లోనే చమటపట్టి జ్వరం తగ్గింది బిడ్డకు. జంగుబాయికి దిగులు తగ్గింది.

బిడ్డకు ఆకలయితాంది అంటే హోటల్‌కు తీసుకపోయి పూరీ తినిపించి తాను తిన్నది.

వచ్చిన పని అయిపోయింది. సరుకులేమైనా కొందామంటే నాలుగు రోజుల క్రితమే పక్కూరి సంతకు వెళ్లి వారం రోజులకు సరిపడే సరుకులు కొనుక్కుపోయింది. బిడ్డకోసం ఒక బ్రెడ్డు కొన్ని అటుకులు, పుట్నాలు తీసుకొని బస్టాండుకొచ్చింది. తన గూడెపోల్లు ఇద్దరు, పక్క గూడెపోల్లు నలుగురు కలిస్తే మాట్లాడుకుంటూ కూసున్నది.

జంగుబాయి అంతగా చదువుకోలేదు. గూడెంలో బడిలేదు. పక్క ఊరికి పోయిన నాల్గవ తరగతి వరకే చదివింది. మనిషి చామనఛాయగా ఉండి బలంగా ఆరోగ్యంగా ఉంటది. పెద్ద కండ్లు, వాటిలో కరుణ, దయ తొనికిసలాడుతుంది. ఆమెకు లోకజ్ఞానం తెలుసు. ధైర్యవంతురాలు, ఎంతకైన తెగిస్తుంది. మాటకారి. ఎప్పుడూ చలాకీగా కనబడుతుంది. కష్టపడుతుంది. ప్రతిరోజు భర్తతో కలిసి అడవిని ఆనుకొని ఉన్న మూడెకురాల పోడు భూమిలో నీటి వసతి అంతగా లేకపోయినా అందుకు అనుగుణమైన పంట పచ్చజొన్న, సజ్జలు, రాగులు, కంది పంటలు పండిస్తాంది. అర్దెకరంలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తది. మార్కెట్టుకు పంపిస్తది. ఈ మధ్యనే పండిస్తున్న తైదలు, కొర్రలకు మార్కెట్టులో మంచి గిరాకీ ఉన్నందున పంట పెట్టుబడికి రెట్టింపు ఆదాయం వస్తుంది. రైతుబంధు పతకం కింది వస్తున్న డబ్బును సద్వినియోగం చేసుకోవాలని భూమిలో బోరు వేయించాలన్న ఆలోచనలో ఉన్నది. గూడెంలో జంగుబాయికి మంచి పేరు ఉంది. ఏ సమస్య వచ్చినా గూడెం పెద్దలు జంగుబాయిని సంప్రదించి సమస్యను పరిష్కరిస్తరు. పక్క ఊరి సర్పంచి దగ్గరకి గానీ, ఉట్నూరు పోలీసు స్టేషన్‌కుగానీ పంచాయితీకి పోకుండా చేస్తది.

బస్సొచ్చింది. ముల్లెలు, మూటలు పట్టుకొని జనాలంతా ఎక్కిండ్రు. జంగుబాయి బిడ్డను ఎత్తుకొని బస్సెక్కేసరికి సీట్లన్నీ నిండిపోయినయి. స్త్రీలు కూర్చుండే సీట్లలో ఉదయం తన పక్కన కూర్చోని వచ్చిన వ్యక్తి కూర్చొని జోగుతున్నడు. జంగుబాయి.. 'ఇది ఆడోళ్ళు కూసుండే సీటు. తమ్మీ లేస్తవా..' అంది మర్యాదగా. వాడు లేవకుండా తాగిన మైకంలో జంగుబాయితో గొడవపడ్డాడు. చివరికి కండక్టరు చీవాట్లు పెట్టడంతో వాడు సీట్లోంచి లేచి పక్కకు జరిగి నించున్నడు. బస్సు కదిలి పోతుండగా వాడు పట్టుతప్పి తాగిన మైకంలో జంగుబాయి పైకి తూలుతున్నడు. ఒకసారి, రెండు సార్లు ఓపిక పట్టింది. మూడోసారి ఇక తప్పని పరిస్థితిలో సీట్లోంచి లేచి వాడి చెంపపై చెల్లున కొట్టింది. ఆ దెబ్బతో వాడు బస్సులో అలాగే

కూలబడిపోయిండు.

బస్సు దిగినంక వాడు నాలుక కరుచుకుంట చొక్కంతా చింపుకుంట కొంతదూరం వెంబడించి జంగుబాయి వెంట ఉన్న నలుగురు ప్రతిఘటించడంతో వాడు కొరకొర చూసుకుంట అక్కడి నుండి వెళ్ళిపోయిండు.

బిడ్డ అనారోగ్యం, ఉదయం ఆటోలో సాయంత్రం బస్సులో జరిగిన సంఘటనలు.. రాత్రి పడుకున్నంక జంగుబాయికి కన్ను అంటుకోలేదు. మనసంతా వికలంగా ఉంది. కండ్లు మూసుకుంది. తమ్ముడు సూర్యంబాబు తనతో కలిసి సాగిన పదిరోజుల ప్రస్థానం కళ్లలో కదలాడింది..

* * *

ఆరోజు శుక్రవారం

జంగుబాయి పొద్దున్నే కుంకుడుకాయ రసంతో తలంటుకొని కాస్త మెరుగైన చీరకట్టుకున్నది. తన కిష్టమైన నాగోబా దేవతను పూజించి, పూలుచల్లి, చిన్న రూపాయి బిల్లంత ఎర్రటి కుంకుమబొట్టు నొసట పెట్టుకున్నది. బయటికి వచ్చి ఇంటినానుకొని ఉన్న మట్టిగద్దెమీద కూచున్నది. ఎదురుగా పడుతున్న బాలభానుని కిరణాలకు పొడుగ్గా ఉన్న తడిబారిన కురులును విడదీసింది. చట్‌చట్ మంటు చప్పుడురాగా కురుల కొసకు కారుతున్న నీటిని తువ్వాలతో కిందికి రాలగొడుతుంది.

ఇంతలో ఒక ఆటో వచ్చి ఇంటి ముందాగింది. అందులోంచి ఒక ఇరవైయ్యయిదు, ముప్పయ్యేళ్లున యువకుడు కుడి భుజానికి బరువైన బట్టసంచి, ఎడమ చేతిలో ఒక సూటుకేసు పట్టుకొని దిగిండు. ఖద్దరు లాల్చీ, పైజామా చిన్న గడ్డం, తలపై చిన్న వెంట్రుకలు. మనిషిని చూస్తే ఈ మధ్యనే రాజకీయాల్లోకి ప్రవేశించినట్టుంది. కొంపదీసి ఆ శాల్తి ప్రచారానికి రాలేదుగదా అనుకుంది. ఆటో దిగిన అతడ్ని ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది.

అతడు అలుకుజల్లిన వాకిలి మధ్యలోకి వచ్చి 'నమస్కారం. నాపేరు సూర్యనారాణమూర్తి.. అంతపేరు అనలేక అందరూ సూర్యం అని పిలుస్తుంటారు నన్ను..' అంటుండగా జంగుబాయి భర్త ఇంటిలోపలి నుండి కర్ర కుర్చీ తెచ్చివేసి కూర్చొమ్మన్నట్లు సైగచేసిండు.

'ఇక నా పరిచయానికి వస్తే.. కులం చెప్పలేను. మీలో ఒకడిగా మసిలేవాడ్ని. ఇదే ఆదిలాబాదు జిల్లాకు చెందినవాడిని. గిరిజనులు, గిరిజనేతరులకు గల సంబంధాలపై రెండు సంవత్సరాలు నిర్విరామంగా సుమారుగా వంద గ్రామాలు తిరిగి రీసెర్చి పూర్తి చేశాను. డాక్టరేటు కోసం థీసిస్ సమర్పించాను. దానితో నా పని పూర్తయింది. అయితే గ్రామాలలో ప్రజలతో ఉన్న అద్భుతమయిన సంబంధాలు, తీపిగుర్తులు, ఇంకా ఏదో శోధించాలన్న తపన నన్ను వీడడం లేదు. గాలివాటుగా తిరుగుతూ తిరుగుతూ ఈ ప్రాంతానికి వచ్చాను. నీ గురించి నీలో ఉన్న చైతన్యం, నీలో ఉన్న ధైర్య సాహసాలు తెలుసుకొని ఇక్కడికి వచ్చాను'

అతడు చెబుతున్న విషయాలేవీ జంగుబాయికి గానీ ఆమె భర్తకుగానీ బుర్రకెక్కలేదు. ఏవిటో

అయోమయంగా ఉందన్నట్టు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

'అన్నట్టు సామీ ఇక్కడికి మీరు ఎందుకచ్చినట్టు?' అంది.

'నేను నిన్ను చెల్లెమ్మా అంటా.. చెల్లె అంటా.. నువ్వు నన్ను తమ్ముడూ అను.. తమ్మీ అను..'

'అయితే అసలు సంగతి ఏంటి సామీ..!?'

'నేను ఒక వారం, పదిరోజులు ఈ ప్రాంతంలో పర్యటిస్తా. ఇక్కడికి దగ్గర ఉన్న సిటీలో వసతి చూసుకొని ఉంటా. రోజూ ఉదయం 7 గంటలకు వచ్చి సాయంత్రం వెళ్ళిపోతా.. మీరు పెట్టింది తింటా. నా కోసం ప్రత్యేకమైన వంటలేమీ చేయక్కరలేదు. మీ దినచర్యలకు, పొలం పనులకు ఆటంకం కలిగించను. ప్రతి పనిలోనూ మీతోపాటు శ్రమిస్తా. ఈ గూడెం కేంద్ర బిందువుగా చేసుకొని సమీప గూడాలు పల్లెలకు కూడా వెళ్తా..'

'దీంతో మీకొచ్చే లాబమేంటి సామీ..!?'

'నేనేమీ ప్రయోజనం ఆశించను. ప్రతీ గ్రామంలో నావల్ల ఓ పదిమంది యువతులు, ఇరవై మంది యువకులు చైతన్యవంతులు కావాలన్నదే నా ఉద్దేశం.

'ఎట్టెట్టా..!?' జంగుబాయి భర్త ప్రశ్న.

'గిరిజనుల మీద.. వారి ఆర్థిక సామాజిక స్థితిగతుల మీద చాలామంది రీసెర్చ్ చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం విదేశీయుడైన హెమెన్ డార్ఫ్ చాలాచాలా శ్రమించి, అష్టకష్టాలకోర్చి గిరిజనులపై సుదీర్ఘమైన, సునిషితమైన పరిశోధనలు చేసి పెద్ద గ్రంథమే రాశాడు. దాన్ని ఆధారంగా తీసుకుని గిరిజనులపై చాలామంది రీసెర్చ్ చేసి డాక్టరేటు పొందారు. అందులో భాగంగానే నా ప్రస్తుత యాత్ర, మజిలీ గిరిజనులే కాదు, కులమతాలకతీతంగా అందరినీ సమీకరించి ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో జరుగుతున్న అరాచకాలు, హత్యలు, ఆత్మహత్యలు.. వయోభేదం లేకుండా మద్యం, డ్రగ్స్, మనిషిని, సమాజాన్ని నిర్వీర్యం చేసేస్తున్నాయి. దుష్టచేష్టలకు మూలకారణం అవుతున్నాయి. వీటిని దూరం చేయాలనీ, సన్మార్గానికి మార్గదర్శకత్వం చేయాలని నా తపన. ఇప్పటికే చాలా గ్రామాల్లో యువత, స్త్రీశక్తి కొంతనయినా కొంత మార్పు వచ్చినట్లు నాకు రిపోర్టులు అందుతున్నాయి. అందుకే నా ముందడుగు.. షెడ్యూలులో అంటే దినచర్య కార్యక్రమాలేంటంటే.. మద్యం నియంత్రం, వయోజన విద్య, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణం, వనసంపదను పెంచడం, ఇంకా ఇంకా ఇలాంటివే సామాజిక పరమైన అంశాలు చాలా ఉన్నాయి. ఎలాగూ వచ్చాను గాబట్టి మీ గూడెం, ఇంకా పరిసర ప్రాంతాలు దర్శించుకుంటు వెళ్ళి రేపు ఉదయం వస్తా..!' అంటూ ఎలా వచ్చాడో అదే ఆటోలో వెళ్ళిపోయాడు సూర్యనారాయణమూర్తి.

మర్నాడు ఉదయమే వచ్చి జంగుబాయి ఇంట్లో చేసిన పప్పుకూరతో జొన్నరొట్టె తిన్నడు. ఛాయ తాగిండు. తర్వాత తన కార్యక్రమంలో భాగంగా జంగుబాయి ఆయన భర్తతో కలిసి ఊరంతా కలియ తిరిగిండు. చిన్నాపెద్దా అన్న తారతమ్యం లేకుండా అందర్ని పరిచయం చేసుకున్నడు. సూర్యమూర్తి గూడెం సెంటర్లో జనాన్ని పోగుచేసి పారిశుధ్యం, మరుగుదొడ్ల

అందరికీ చదువు, మద్యనిషేధం, ఆహార వ్యవహారాలు.. ఇత్యాది ప్రజా సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలపై మాట్లాడి ఇవేకాకుండా ముఖ్యంగా స్త్రీలపై, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగికవేధింపులు ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై సుదీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చింది. కరాటే, కర్రసాము నేర్పించిండు. పెద్దల స్పందన గూడెం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తుంటే వీడియో తీసుకున్నడు. ముఖ్యమైన విషయాలు డైరీలో రాసుకున్నడు.

ఇలాగే నిర్విరామంగా పదిరోజులు.. పది గ్రామాలు పర్యటించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే కార్యక్రమాలు నిర్వహించి అందరి ప్రేమాభిమానాలు పొందిండు. జంగుబాయిలాంటి చురుకైన స్త్రీలు ప్రతి గ్రామంలో ముందుకు వచ్చి ఏ విపత్కర పరిస్థితినినైనా ఎదుర్కొనే ధైర్యాన్ని నింపుకొన్నరు. అందరి తలలో నాలుకైపోయిండు సూర్యనారాయణమూర్తి. చివరి రోజు గ్రామాలన్నీ ఏకమై ఘనంగా అతనికి వీడ్కోలు పలికాయి.

హరితహారంలో భాగంగా జంగ్లాత్ వాళ్ళు ఒక జేసీబీ, ఒక ట్రాక్టరు, ఒక జీపులో అధికారులతో కలిసి 20 మదికి పైగా సిబ్బంది ఆ గూడానికి చేరుకున్నరు. అధికారులు గ్రామపెద్దల్ని కూడా పిలిస్తే వారితోపాటు జంగుబాయి కూడా వెళ్ళింది. ఉదయం ప్రారంభమైన కార్యక్రమం ఎలాంటి ఆటంకం లేకుండా చకచకా సుమారు 5 ఎకరాల్లో రకరకాల పండ్ల మొక్కలు నాటడం పూర్తయింది. తిరిగి ఇంటికి వస్తుండగా 'అవ్ పెద్దయ్యా మొన్న ఈ మధ్యన కాగజ్‌నగర్ దగ్గర జంగ్లాతోల్లు హరితహారం కార్యక్రమంలో పండ్ల మొక్కలు నాటడానికి బోయింద్రంట. అది గవర్నమెంటు గిరిజనులకు పట్టా చేసిన పోడు భూమే కావచ్చు. అది చాలా ఏండ్లుగా సాగుచేయకుండా బీడు భూమిగా ఉండిపోయింది. అది సారవంతమైన భూమికాదు. రాళ్ళు, రప్పలు, తుప్పలతో నిండి పోయింది. దాన్ని ట్రాక్టర్లతో దున్ని పండ్ల మొక్కలు నాటాలన్నది జంగ్లాత్ వాళ్ళ ఉద్దేశం. భూమిని దున్నుతుండగా ఊరి జనం అక్కడికి చేరుకొని అది వారి పట్టా భూమి అనీ వారిపై కర్రలతో దాడిచేసింద్రు. ఆడమనిషి అని చూడకుండా యూనిఫారంలో ఉన్న ఒక అధికారినిపై కర్రలతో కొడితే ఆమె చేతి వేళ్లు విరిగిపోయినయి. కొట్టకండని మొరపెట్టుకున్న కనికరం లేకుండా కర్రలతో ఆమెను, ట్రాక్టర్లను కూడా వదలకుండా కొట్టింద్రు. అది పట్టాభూమే కావచ్చు.. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో బీడుగా ఉన్న భూమిలో పండ్లమొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. ఆ వృక్ష సంపద పెరిగిన తర్వాత పట్టా హక్కును ఆధారంగా చూపుతూ లబ్దిదారు ఫలితం అనుభవించవచ్చు కదా, అనాలోచితంగా గట్లా దాడి చేయడం తప్పు కదా పెద్దయ్యా..'

'నువ్వన్నదిగూడ నిజమే జంగూ..' అంటూ మెచ్చుకోలుగా చూస్తూ 'ఆ సూర్యంబాబు నీకు బాగానే తెలివితేటలు నూరి పోసిండే జంగూ..' అంటుండగా అల్లంతదూరంలో గావుకేక వినబడింది.

ముందుకేస్తున్న జంగుబాయి, పెద్దయ్యా అడుగులు ఒక్కసారిగా ఆగిపోయినయి.

'అవ్వా.. అవ్వా.. అవ్వా..' అనే గావుకేకలు. అవి జంగుబాయి రెండు చెవుల్లోకి శూలాల్లా దూరిన తన బిడ్డ కేకలు. కట్టలు తెగిన ఆక్రోశంలో పరుగందుకుంది జంగుబాయి.

పొదల మాటులో వివస్త్ర కాబడుతున్న తన బిడ్డ.. ఒక మానవ మృగం ఆ పసిబిడ్డపై చేస్తున్న పైశాచిక దాడి.. వాడు ఆ తాగుబోతు..

'ఒరేయ్.. లం.. కొడుకా..' అంటూ వాడిపైకి లంకించింది జంగుబాయి.

వాడు నాగుబాములెక్క బుసలు కొడుతూ జంగుబాయి పైకి వచ్చి ఆమె వక్షస్థలంపై రెండు చేతులేసిండు. తన రెండు చేతులతో వాడి చేతులు విడిపించుకొనే ప్రయత్నం చేసింది. వాడు వెకిలిగా నవ్వుతూ ఆమె మెడచుట్టూ రెండు చేతులు బిగించిండు. విషం చిమ్ముతున్న కళ్లతో వాడు నోటితో బుసకొడుతున్నడు. అదే నాగదేవతను మనసులో తలచుకొని వాడి చేతులు విడదీసి కాళికావతారమెత్తి ఎగిరి వాడి పొట్టకింద కరాటే తన్ను తన్నింది. ఆ తన్నుతో వాడు 'అమ్మా' అంటూ పుర్సాలను చేతుల్తో పట్టుకొని కిందపడి గిలగిలా తన్నుకోసాగిండు.

'నా కొడకా.. నీకిదే శిక్ష! పసి గుడ్డని కూడా చూడకుండా రాక్షసంగా ప్రవర్తించిన నీకు సంసారానికి పనికిరాకుండా జీవితాంతం నీలో నీవే కుమిలి చచ్చేలా ఎక్కడ తన్నాలో అక్కడే తన్నిన..' అనుకుంటా మరో తన్ను తన్నుతుండగా పెద్దయ్య అక్కడికి వచ్చి అడ్డుపడ్డాడు.

మరి కొద్దిసేట్లోనే గూడెం జనాలంతా అక్కడికి చేరుకొని వాడిని చెట్టుకు కట్టేసి కొట్టిచంపాల్సిదేనని తీర్మానించారు.

'వద్దు చట్టాన్ని మన చేతుల్లోకి తీసుకోవద్దు. పోలీసులు ఆ పని చేసుకుంటరు' జీవితమంతా వాడు కుమిలి కుమిలి చచ్చే శిక్ష నేనే వేసిన' అంటూ వారిని శాంతపరించింది జంగుబాయి.

* * *

'రండి సీఐగారు.. మీరు వస్తరని నాకు తెలుసు! కేసు పెడతారని తెలుసు! అందుకు నేను సిద్ధంగా ఉన్న. ఆ రాక్షసుడు నా బిడ్డను చెరిచి నా ప్రాణం తీయాలని చూసిండు. మా ఇద్దరి ప్రాణరక్షణ కోసం వాడిపై నేను దాడి చేయక తప్పలేదు. వాడిని నేను చంపలేదు. కానీ గాయపరిచిన. ఆ గాయం ఎలాంటిదంటే జీవితాంతం అది మాననిది. వాడిని మానసిక వ్యధతో చంపేది. నా తమ్ముడు సూర్యం నేర్పిన విద్య వాడిపై ప్రయోగించాను. నన్ను అరెస్టు చేసి ఏ సెక్షన్లు పెట్టుకుంటారో పెట్టుకుని కోర్టుకు పంపండి. బెయిలు సంగతి, కోర్టు వ్యవహారాల సంగతి నా తమ్ముడు చూసుకుంటాడు. పదండి..' అంటుండగా..

అప్పటికే సూర్యోదయమై కిరణాలు బలపడుతుండగా సూటు, బూటు వేసుకొని నెమ్మదిగా అడుగులేసుకుంటూ వస్తున్న వ్యక్తి జంగుబాయి కంటపడ్డడు. అతనికి వెనుక వైపు పడుతున్న కిరణాల నీడలో వ్యక్తిని పోల్చుకోలేకపోయింది.

ఆ ఆకారం సమీపించే సరికి ఆనందం పట్టలేక 'తమ్మీ సూర్యం..! సూర్యనారాయణ..' అనుకుంట నమస్కారం ముద్రలో రెండు చేతులు పైకెత్తింది జంగుబాయి.


Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 149



# తులసమ్మ బతికింది..!

యు. రాజ లింగమూర్తి

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఉప్పల రాజలింగమూర్తి రచయితగా, కార్టూనిస్టుగా, నాటికా దర్శకునిగా ప్రాచుర్యం పొందారు. 1987 నుంచి రచనారంగంలో ఉన్నారు. ఈయన రాసిన నాటికలు వివిధ భారతి రేడియోలో ప్రసారమయ్యాయి. దూరదర్శన్‌తో పాటు, వివిధ చానళ్లలో స్క్రిప్ట్ రైటర్‌గా, ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేశారు. ఈయన రచన, దర్శకత్వంలో ‘ నీ ప్రేమ కోసం’ అనే సినిమా 2018లో విడుదలైంది.

**చావు.. ప్రతి మనిషి జీవితానికి ముగింపు** అయితే, ఈ కథకి ఇదే మొదలు..!

పుట్టిన ప్రతి మనిషికీ – తప్పని చివరి మజిలీ..!!

పుట్టిన క్షణం తొలిశ్వాస పీల్చుకోవడం నుంచి అనుక్షణం మృత్యువుతో పోరాడుతూనే ఉంటాం..!

అసలు బతకటం అంటేనే.. ప్రతి క్షణం మృత్యువుని ఓడించి, మనం గెలవడం..!

ఎంతటి ధీరుడైనా, వీరుడైనా, శూరుడైనా.. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో గెలుపొందిన వారైనా.. చివరికి మృత్యుకౌగిలిలో ఓడిపోక తప్పదు..!

మృత్యువు చేతిలో ఓడిపోయిన మరుక్షణం.. మనిషి జీవితానికి ముగింపు..!

అలాంటి ముగింపుతో మొదలవుతున్న ఈ కథ రేపటి తరానికి.. తరతరాలకి.. అంతం కాదు ఆరంభం..!

* * *

చుట్టూ కొండల మధ్య..

దాదాపు వెయ్యికి పైగా గడప ఉన్న ఆ తెలంగాణ పల్లెటూరిలో..

కోడి కూయకముందే.. తులసమ్మ నిద్ర లేచేది.

ఇంటి ముందు పేడతో కల్లాపి జల్లి, రంగురంగుల అందమైన ముగ్గులు పెట్టేది.

పెందలాడనే ముస్తాబైన ఆ ఇంటిని చూసి, అప్పుడే ఉదయించిన సూర్యుడు తన లేలేత కిరణాలతో రంగవల్లులను ముద్దాడుతుంటే, తులసమ్మ మనసు పరవశించిపోయేది.

ప్రత్యక్ష దైవంలా ప్రతి రోజూ దర్శనమిస్తున్న సూర్యభగవానుడంటే తులసమ్మకు అమితమైన భక్తి. అందుకే, ప్రతిరోజూ సూర్యుడుదయించక ముందే ఇంటిని తీర్చిదిద్దుకొని, సున్నుపిండి పెట్టుకొని స్నానం చేసి, మడి కట్టుకునేది.

ఇంటి ముందున్న తులసికోట చుట్టూ ప్రదక్షిణలు చేసి, సూర్యనారాయణునికి ఆర్ఘ్యపాదాలిచ్చి.. అప్పుడే పొడసూపుతున్న ఉదయభానుని తనవితీరా దర్శించుకొని నమస్కరించి.. తులసితీర్థం పుచ్చుకొని, భక్తిపారవశ్యంతో పరవశించిపోయేది.

అలాంటి తులసమ్మ..

ఆ రోజు ఇంటి ముందు కల్లాపి జల్లలేదు..!

ముగ్గులు పెట్టలేదు..!!

తెల్లవారితే తన 'బతుకు తెల్లారిపోతుంద'ని తెలియని తులసమ్మ.. ఆ రాత్రి నిద్రలోనే మెల్లిగా జారుకుంది ఈ లోకం నుంచి శాశ్వతంగా..!!

సుమారు ఎనిమిది పదుల వయసులో.. ఎన్ని వసంతాలను చవిచూసిందో.. ఎన్ని గ్రీష్మాలను తట్టుకుందో.. ఎన్ని హేమంతాలను శ్రీమంతంగా తన్మయత్వం చెందిందో.. కానీ, ఎవరిచేత సేవ చేయించుకోకుండా, ఎవరిని నొప్పించకుండా, ఏ సడీసప్పుడు లేకుండా.. నిద్రలోనే ప్రశాంతంగా 'శాశ్వతనిద్ర'లోకి జారుకుంది..!

చివరిసారి తులసితీర్థం పుచ్చుకోవడానికన్నట్లు.. తులసమ్మ నోరు తెరిచేవుంది..!

ఆ రాత్రి ఎప్పుడో, ఏ వేళనో.. తెరిచిన నోటి నుంచి 'జీవం' వెళ్లిపోయింది..!!

చీకటి తెరలను తొలగించుకుంటూ దినకరుడు మెలి.. మె.. ల్లి.. గా.. తులసమ్మ వాకిట్లోకి తొంగిచూశేడు. తాను ఉదయించ ముందే తన భక్తురాలు 'అస్తమించింద'ని తెలిసి, తట్టుకోలేని వేదనతో మబ్బుల చాటుకు వొరిగిపోయాడు..!

అందరికి తలలో నాలుకలా ఉంటూ.. ఆప్యాయంగా పలకరించే తులసమ్మ విగత జీవురాలయిందని తెలిసి, విలవిలలాడి పోయారు ఆ పల్లెజనం.

ఆ ఊరిలో ఒక్కొక్కరు నిద్ర నుంచి కళ్లు తెరిచే సరికి, తులసమ్మ 'కన్ను మూసింద'నే చేదువార్త చెవిన పడింది..!

కొద్దిసేపట్లోనే ఈ విషయం దావానలంలా.. ఊరూ, వాడా, దేశ విదేశాల్లో ఉన్న బంధుమిత్రులకు తెలిసిపోయింది..!

* * *

రాజధాని నగరంలో ఉంటున్న డాక్టర్ ఆదిత్య.. తన అమ్మమ్మ తులసమ్మ మరణవార్త విని, ఫ్యామిలీతో సహా హడావుడిగా కారులో బయలుదేరాడు.

తండ్రికి ఫోన్ చేసి, తాను బయలుదేరి వస్తున్నట్లు.. సమాచారమిచ్చాడు ఆదిత్య. వెంటవెంటనే ఇక్కడి అంత్యక్రియల ఏర్పాట్ల విషయాలు తెలుసుకుంటున్నాడు. ఈ హడావుడంతా గమనించిన అతని భార్య స్వాతి 'సెల్‌ఫోన్‌లో మాట్లాడడం తర్వాత.. ముందు డ్రైవింగ్ మీద దృష్టి పెట్టండి' అంది మందలింపుగా.

'నీకు తెలుసా..! మన పెళ్లికి నిన్ను ప్రపోజల్ చేసింది మా అమ్మమ్మనే. తను చెప్పకపోతే, ఈ సంబంధం కుదిరేది కాదు నీకు నేను దొరికేవాణ్ని కాదు..' అన్నాడు ఆదిత్య ఉడికిస్తున్నట్లుగా.

'మమ్మీని డాడీకి ఇంటర్‌డ్యూస్ చేసిన గ్రాండ్‌మా డెత్ అయిందా..? ఓ బ్యాడ్..' అన్నాడు చిన్నారి కౌస్తుభ్.

కొడుకు స్పందనకి ముగ్ధుడైన ఆదిత్య ముచ్చటపడుతూ లాలనగా కౌస్తుభ్ తల నిమిరాడు.

అది చూసి స్వాతి రుసరుసలాడుతూ 'మిమ్మల్ని నాకు అంటగట్టి, మహాపుణ్యమే చేసిందిలెండి. మీరు పెళ్లి చేసుకోకపోతే, బ్రహ్మచారిణిలా ఒంటిరిగా ఉండేదాన్ని కావచ్చు..' అంది ఎద్దేవాగా.

ఆ మాటతో చిన్నగా నవ్వుకున్నాడు ఆదిత్య. మళ్లీ అమ్మమ్మ జ్ఞాపకాల్లోకి వెళుతూ.. 'నాకు 'ఆదిత్య' అని మా అమ్మమ్మే పేరు పెట్టింది. అమ్మమ్మకిష్టమైన సూర్యభగవానుని పేరు. ప్రతిరోజూ 'ఆదిత్య హృదయం' చదువుకోవాలని ఆ శ్లోకాలన్నీ చిన్నప్పుడే కంఠస్థం చేయించింది' చెప్పాడు ఆదిత్య ఉద్వేగంగా.

'వాట్ డాడ్..! ఆదితియా హ్రుద్‌యమ్.. కంటస్‌తమ్..? వాట్ ద మీన్స్..??' అడిగేడు కౌస్తుభ్ ఆ పదాలకి అర్థం తెలియక.

నేటి ఇంగ్లీష్ మీడియం చదువుల పరిస్థితి తలచుకొని, చిన్నగా నవ్వుకుంటూ చెప్పేడు ఆదిత్య 'దట్ మీన్స్.. ఎర్లీ మార్నింగ్ సన్ ప్రేయర్..! కంఠస్థం అంటే బైహార్ట్..

'సరే.. సరే.. ముందు రోడ్ చూడండి..' అంటూ మందలించింది స్వాతి.

కారు శరవేగంతో దూసుకొస్తోంది.

* * *

ఇక్కడ అంత్యక్రియలకు కావల్సిన ఏర్పాట్లను చూసుకుంటున్నారు దగ్గరి బంధువులు.

ఇంతకాలం తమతో కలివిడిగా ఉన్న తులసమ్మ.. ఇప్పుడు కళ్ల ముందు అచేతనంగా పడివుండటం చూసి, భోరున విలపిస్తున్నారు. తులసమ్మ మరణవార్త తెలిసిన వెంటనే దిగులుపడుతూ ఆ ఇంటికి వచ్చిన వాళ్లు.. తులసమ్మతో తమకున్న అనుబంధాన్ని, ఆమె తాలూకు జ్ఞాపకాలను స్ఫురణకు తెచ్చుకుంటున్నారు.

ఆరుబయట గుంపులు గుంపులుగా ఉన్న జనం గుండెల్లో తులసమ్మ జ్ఞాపకాలు అలలై ఎగిసిపడుతుంటే, అక్కడి వారి కళ్లు శ్రావణమేఘాలయ్యాయి..! నోళ్లు గండిపడిన చెరువు లయ్యాయి..!!

ఒక్కొక్కరిది ఒక్కో అనుబంధం..

ఒక్కొక్కరిది ఒక్కో విధమైన అనుభవం..

'తులసక్క పేరుకు తగ్గట్టు పవిత్రమైన తులసిమొక్కే అనుకో..' అంది పెద్దవయసులో ఉన్న సీతారత్నమ్మ.

'నిజమేనమ్మా.. అందరి గురించి పట్టించుకునేది.. ఎదుటి మనిషి బాధని తన బాధగా అనుకుని, చేతనైనంత సాయం చేసేది. కులం, మతం అనే పట్టింపు లేకుండా ఆపదలో వున్నవాళ్లని ఆదుకునేది' అంది మరో పెద్దావిడ అనసూయమ్మ.

'ఇంటావిడ ఎసొంటిదో ఇల్లు చెపుతుందంటరు. సీకటి మస్కుల కోడి కూయకుండనే నిద్దర లేచేది. పొద్దు పొడేసేసరికల్లా వాకిట్ల కల్లాపు జల్లి, ముగ్గులేట్టేది..' చెప్పింది రాంబాయమ్మ.

'ఔ నిజంగనే.. రోజుకొక్క తరీక ముగ్గులేట్టేది. కొత్తకొత్త ముగ్గుల్ని జూసి, ఊర్లో ఉన్న ఆడపిల్లలందరూ నోటు పుత్తకాలల్ల రాసుకునేటోళ్లు..' అంది సావిత్రక్క గతాన్ని గుర్తు చేసుకుంటూ.

'ఓ రోజు.. పట్నంలో ఉండే మా పెద్ద మనవరాలొచ్చింది. తలంటు పోసుకోవడానికి కిరాణ షాపుకెళ్లి, షాంపులు కొనుక్కొని వస్తుంటే చూసి, వాటికంటె కుంకుడుకాయలు పెట్టుకుంటే మంచిదని పిడికెడు కుంకుడుకాయలు ఇచ్చిందట. ఈ కాలం పిల్లలకు ఇవేం తెలుసు. అవన్నీ తీసుకొచ్చి నాకిచ్చింది మా మనవరాలు. అప్పుడ్నేను తులసక్క చెప్పిందే.. కుంకుడుకాయలు వాడితే జుత్తు ఎలా నిగనిగలాడుతుందో చెప్పి, తలంటు చేయించాను. ఆ తరువాత మా మనవరాలు పట్నం వెళ్లినా.. ఇప్పటికీ కుంకుడుకాయలతోనే తలంటు పోసుకుంటుంది. మా మనవరాలు ఫోన్ చేసినప్పుడల్లా కుంకుడుకాయల అమ్మమ్మ బాగుందా..? అని అడుగుతుంటుంది పిచ్చిపిల్ల..' గుర్తు చేసుకుంది సీతారత్నమ్మ.

'గంతే కాదు వదినెమ్మ. గీ సబ్బులు, పౌడర్లు.. పెయ్యికి రుద్దుకోవద్దనేది.. సున్నుపిండన్నా, నలుగుపిండన్నా పెట్టుకుంటే.. మంచిగుంటదని చెప్పేది. తులసత్తమ్మ చెప్పిన కాన్నుంచీ.. నేనైతే ఇప్పటికీ సబ్బుముక్క ముట్టలేదమ్మా ఒట్టు..' తలపై చేయి పెట్టుకొని, ఒట్టేసి మరీ చెప్పింది సావిత్రక్క.

ఆ పక్కనే నిటారుగా నిలబడిపోయి, అంతవరకు దిగులుగా వింటున్న పూలమొక్కలు.. 'ఇక తమకి నీళ్లు పెట్టేవారే లేర'ని తలలు వాల్చేశాయి. 'పువ్వుగా వికసించి, పరిమళాలు వెదజల్లుతూ.. తులసమ్మ చేతుల మీదుగా దేవుడి అలకరణకు నోచుకునే భాగ్యం ఇకపై తమకి లేద'ని విప్పారిన పూలు బిక్కమొహంతో ముడుసుకున్నాయి.

'నేనైతే అన్నింటికీ పెద్దమ్మనే అడిగేదాన్ని. పండుగలకీ, పబ్బాలకీ, పూజలకి.. ఎప్పుడేం

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 155

చేయాలో అడిగి తెలుసుకునేదాన్ని. ఏ దేవునికి ఏ నైవేద్యం ఎలా పెట్టాలో, ఏ నూనెతో దీపం వెలిగించాలో.. అన్ని అన్నీ వివరంగా చెప్పేది. ఇతరులకు చెప్పడమే కాదు, తాను కూడా ప్రతిరోజూ పూజ చేసేది. మడిగా వంట వండేది. ప్రతిరోజూ పూజ కాకుండా పచ్చి గంగ కూడా ముట్టుకునేది కాదు. దేవుడంటే అంత భక్తి. గుడికి వెళ్లినా, ఫంక్షన్లకి వెళ్లినా.. తన నిష్ఠ తనదే' తులసమ్మతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంది సుశీల.

ఒకవైపు ఆడవాళ్లు ఇలా మాట్లాడుకుంటుంటే.. మగవాళ్లు కూడా తులసమ్మ జ్ఞాపకాలలో మునిగిపోయారు.

'నా సిన్నప్పుడు మా అవ్వకు పాల్లేకపోతే, డబ్బాపాలు పట్టిందంట. ఆ పాలుపడక నాకు వాంతులయ్యాయంట. అప్పుడు గీ పెద్దవ్వనే చనుపాలిచ్చి, ఆల్ల కొడుకు లెక్కనే నన్నుగూడా సూస్కుంది. ఆల్లకంటె తక్కువ కులపోణ్నని సిన్నచూపు చూడకుండ తల్లి లెక్క సాకింది' కన్నీరు మున్నీరయ్యాడు యాదగిరి.

'చంటిపొరగాళ్లకి తల్లిపాలే పట్టించాలని, గట్లయితే.. పెద్దగైనంక రోగాల్రావని సెప్తుండేది. గిప్పుడున్న ఆడోళ్లు అందంగుండాలని పిల్లగాల్లకి పాలియ్యకుంటే, లొల్లివెట్టి పాలిచ్చేదాన్క ఇడ్సిపెట్టేదిగాదు..' అన్నాడు కొండన్న.

'గదొక్కటేనా..? నడిత్తే పానం మంచిగుంటదని, బాలింతరాల్లని కూడా నడిపించింది. గట్లయితే, ఆపరేసన్ లేకుండా పొరగాల్లు పుడతరని సెప్పుకొచ్చేది' అన్నాడు యాదగిరి.

'ఔమల్ల.. రోజురోజు నడుసుకుంటనే ఊరంత తిర్గేది. అందర్ని పేరేట్టి పిలిచేది. కనపడినోళ్లనే గాదు.. ఆల్ల అత్తమామ బాగున్నరా.. అయ్యాఅవ్వా మంచిగున్నరా.. అని యాద్జేసేది. ఆల్లకేదన్న తక్లిబుంటే.. దయిర్నంసెప్పి, చాతనైనకాడికి సాయం సేసేది' చెప్పాడు ఎంకట్రాములు.

'మడిసిని మడిసిగా సూడాల. ఔస్రమైతే పానం పెట్టాల. మనందరం ఒక్కింటోళ్లమేనన్న తీరంగ కలిసుండాలె అని సెపుతుండేది' అన్నాడు కొండన్న.

'గట్ల మడిసిలెక్క ఆలోసిత్తదనే గా తల్లిని అందరు దేవత తీరంగ జూత్తరు. గంత దూరంల కనపడంగనే దండాలు పెడతరు. గసోంటి తల్లి పాయె.. గీ ఊరికే పెద్దదిక్కు పాయె..' బాధపడ్డాడు ఎంకట్రాములు.

'పెండ్లిడ్లయి అత్తాగారింటికోయినోళ్లకు.. సదుకోకపోయిన ఉత్తరమ్ముక్క రాయించేది. అక్కడెట్లున్నరు..? మాటిమాటికి లొల్లి పెట్టుకోకుండా సక్కంగుండుడ్రని చెప్పేది. ఉత్తరం ముట్టంగనే ఎంబటే ఉత్తరం రాయించ్రని సెప్పేది. ఆల్ల ఉత్తరాల కోస్రం ఎదురుసూసేది. ఉత్తరం రాంగనే చదువుకున్నోల్లని పిలిచి చదువించుకునేది. గాల్లింటి పిల్ల నాకుత్తరం రాసిందని సబ్బరపడి ఊళ్లున్నోల్లకి సెప్పుకునేది. ఉత్తరాలన్ని తీగెలకు గుచ్చి బద్రంగా దాచిపెట్టుకునేది' అన్నాడు సాంబయ్య.

ఇలా.. వింటూవుంటే ఒక్కొక్కరిది ఒక్కో జ్ఞాపకం..

చేదు మిగిల్చిన తీపిజ్ఞాపకాలు..!

చెదిరిపోని ఆకుపచ్చని జ్ఞాపకాలు..!!

పండుగలు, ఫంక్షన్‌లు వచ్చాయంటే.. తులసమ్మ ఇంట సందడే సందడి. ఏ కార్యక్రమమైనా చుట్టాలందర్ని పిలిచేది. వారి పుట్టినరోజులు, తిథివారాలు, జన్మనక్షత్రాలు గుర్తుపెట్టుకొని.. కానుకలు ఇచ్చేది. ఆడపిల్లల జుత్తుకు నూనె రాసి, జడలల్లి జడగంటలు కట్టేది. చేతికి గాజులు వేసి, కాళ్లకు పసుపు రాసేది. బర్త్‌డే నాడు క్యాండిల్స్ ఆర్పివేయకూడదని, గుడిలో దీపాలు వెలిగించాలని గుడికి తీసుకెళ్లేది. అర్చన చేయించేది. ఆషాఢమాసం వచ్చిందంటే.. ఆ ఊరంతా పండుగలా ఉండేది. చెట్టుతీర్థాలు, బోనాలు, పట్నాలు.. అంటూ ఆచారవ్యవహారాలతో నెలరోజులపాటు ఊరిలో వేడుకలు జరిగేవి.

అలా.. ఆ ఊరికే జేజమ్మలా అన్ని తానై చూసుకునే తులసమ్మ ఆ రోజు ఉదయం చనిపోయి, వారి జ్ఞాపకాలలో బతుకుతోంది..!

* * *

ఊరులోకి కారు ప్రవేశిస్తుంటే, విండోలోంచి రివ్వున వీచిన గాలితో ఏదో తెలియని ఆత్మీయపరిమళం మనసుకు తాకినట్టనిపించింది ఆదిత్యకు.

ఎంతో సందడిగా ఉండే ఆ పల్లెటూరి జనం.. మౌనంగా విచారవదనాలతో దిగులుగా మాట్లాడుకుంటున్నారు. తులసమ్మ మరణంతో పల్లె మొత్తం శోకసముద్రంలో మునిగి పోయింది..!

కారుకు ఎదురుగా వచ్చిన వ్యక్తి ఆదిత్యను గుర్తుపట్టి, పలకరింపుగా రెండు చేతులతో దండం పెడుతూ 'బాబూ.. అచ్చినవా..? నీకోస్రమే సూత్తున్నరయ్యా.. తులసమ్మగోరూ మనందర్ని ఇడ్సిపెట్టిపోయిందయ్యా..' అంటూ భోరున విలపించాడతను.

ఎగిసివస్తున్న దుఃఖాన్ని మునిపంట ఆపుకుంటూ, మెల్లిగా కారు డ్రైవ్ చేస్తున్నాడు ఆదిత్య.

ఆదిత్యను చూసి దూరం నుంచే పలకరింపుగా నమస్కరిస్తున్నారు కొందరు.

నేటి తరంవాళ్లలా.. మనుషులను వాడుకొని, వస్తువులతో గడిపేయకుండా.. తులసమ్మ మార్గదర్శకంలో.. వస్తువులను వాడుకొంటూ, మనుషులతో గడిపిన వాళ్లు మూగవోయి చూస్తున్నారు.

తులసమ్మతోపాటు పెరిగిన తరం అంటే మనుషులతో, మానవత్వంతో మెదిలిన తరం. సంతోషంగా, స్ఫూర్తిదాయకమైన జీవితం గడిపిన తరం. కల్లాకపటం ఎరుగని తరం. ఉన్నది ఉన్నట్లుగా నిర్మొహమాటంగా, ధైర్యంగా తెలియజెప్పిన తరం. ద్వేషం, మోసం, ఈర్ష్య, అసూయ తెలియని తరం. భయభక్తులతో గడిపిన తరం.

ఆ తరం అంటే మనందరికి మార్గదర్శకం.

ఆనాటి తరం నుండి వారసత్వంగా పెరుగుతున్న మనం.. ఆ తరం సంస్కృతీ సంప్రదాయా లను తు.చ. తప్పక పాటించాల్సి అవసరం ఎంతైనా ఉందనేది అనుక్షణం గుర్తుంచుకోవాల్సిన సత్యం.

ఈ నిన్నటి తరపు సత్యాన్ని రేపటి తరానికి అందివ్వడానికి నేటితరం నాయకుడిలా.. డా॥ ఆదిత్య కారు ఇంటిదగ్గరకొచ్చి ఆగింది. ఆ వెనకాలే వచ్చిన వ్యాన్ పక్కనే ఆగింది.

కన్నీటి బిందువులు జలజలా రాలుతుంటే ఆదిత్య.. గుండె దిటువు చేసుకొని, కారు దిగాడు. వెనకాలే.. స్వాతి, కౌస్తభ్ కారు దిగి, లోపలికి నడిచారు దిగులుగా.

ఆదిత్యను చూడగానే.. అంతవరకు మౌనంగా రోదిస్తున్న తులసమ్మ భర్త వీరభద్రయ్య గుండె కన్నీటితో ఉప్పొంగింది. అది గమనించి ఆతృతగా తాతయ్య దగ్గరకు పరుగున వచ్చాడు ఆదిత్య.

అక్షరాలకందని అశృవులు.. వాక్యాలకందని వేదన.. భావాలకందని బాధ.. ఉబ్బితబ్బిబ్బై గుండె గొంతుకలోకి ఎగిసివస్తుంటే.. 'ఏం మాట్లాడాలో తెలియని' అయోమయస్థితిలో.. ఉద్విగ్నతతో.. ఉద్వేగంతో.. నిస్తేజంతో.. ఒకరినొకరు గుండెలకు హత్తుకుపోయారు చాలాసేపు.

ఆ మౌన రోదన.. అంతర్గత వేదన.. ఆ రెండు గుండెలకే తెలుసు..!

తాతామనవళ్ల అనుబంధం ఎంత గొప్పదో.. ఆ క్షణం ఆదిత్య, వీరభద్రయ్యల గాఢ కౌగిలికే ఎరుక..!!

* * *

దాదాపుగా బంధుమిత్రులందరూ వచ్చి, తులసమ్మని కడసారిచూపు చూసుకున్నారని భావించిన పెద్దలు.. శవయాత్రకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెద్ద ముత్తయిదువలు మెల్లిగా తులసమ్మ శవాన్ని పైకి లేపి, కుర్చీలో కూర్చొబెట్టారు.

ప్రతిరోజూ రవిబింబంలా.. తులసమ్మ నుదుటిన వెలిగిన రూపాయిబిళ్లంత బొట్టును తుడిచేసింది పెద్దావిడ. అది చూసిన అక్కడి ఆడవాళ్లు ఒక్కసారిగా బిగ్గరగా ఏడవటం మొదలెట్టారు.

తులసమ్మ రెండు చేతులను పట్టుకొని, ఒకదానిపై ఒకటి కొడుతూ.. చేతి గాజులను పగులగొట్టారు.

మరుక్షణంలో ఆడవారి రోదనలు తారాస్థాయికి చేరుకున్నాయి..

చిన్నకొడుకు రవిబాబు తలారా స్నానం చేసి, కుండలో తెచ్చిన నీటితో.. తులసమ్మకి తలపైనుంచి నీళ్లు పోసి, స్నానం చేయించారు.

ఆడవాళ్లంతా చుట్టూ గుమిగూడి తడిసిన చీరె, బ్లౌజ్‌లను తీసేసి.. కొత్త చీరె, కొత్త బ్లౌజ్ కట్టారు. నిండు ముత్తయిదువగా మరణం పొందిందని.. కడసారి అలంకరణగా నుదుటిన కుంకుమబొట్టు, చేతికి కొత్త గాజులు, జడలో పూలు.. అలంకరించారు.

తులసమ్మకి ఎంతో ఇష్టమైనది తులసితీర్థం..!

కుటుంబసభ్యులు, బంధుమిత్రులు.. ఒక్కొక్కరుగా వచ్చి, తులసమ్మ నోట్లో తులసితీర్థం పోస్తున్నారు..

మొదట ఆమె భర్త వీరభద్రయ్య..

పెద్దకొడుకు సూర్యనారాయణ..

కూతురు.. ఆదిత్య తల్లి కిరణ్మయి..

చిన్నకొడుకు కర్మకాండ జరిపించే రవిబాబు..

కూతురు.. కోడళ్లు.. మనవలు.. మనవరాళ్లు... బంధువులు.. మిత్రులు...

ప్రతిరోజు ఇష్టంగా సేవించిన తులసితీర్థం.. చివరిసారిగా ఎంతమంది ఆత్మీయులు పోసినా.. మింగలేకపోయింది తులసమ్మ..!

తెరిచిన నోరు నిండిపోయి, తీర్థం కారిపోయింది..

ప్రాణం వెళ్లిపోయిన శరీరం శవంగా మారిపోయి, అంతిమయాత్రకు అడుగులు వేయబోతోంది..!

వాకిట్లో వెదురు బొంగులతో తయారుచేసిన పాడె దగ్గరకు తులసమ్మ శవాన్ని తీసుకెళ్లడానికి పైకెత్తారు.

అంతే..!

'నో్.. స్టాపిట్..! ఆపండీ..' బిగ్గరగా అరిచాడు ఆదిత్య..!!

అక్కడివారందరూ నిర్ఘాంతపోయి చూస్తుండిపోయారు చాలాసేపు..!!

మరుక్షణం అందరూ అలెర్ట్ అయ్యారు. ఏం జరుగుతుందోనని ఆతృతగా చూస్తున్నారు. ఆదిత్య ఎందుకలా అరిచాడో అర్థంకాక విప్పారిన కళ్లతో, రిక్కించిన చెవులతో.. తేరిపారా చూస్తున్నారు.

ఆదిత్య ఒక్క క్షణం.. తన ఉద్విగ్నతను అదిమిపట్టుకొని, చెప్పటం మొదలెట్టాడు.

'ప్లీజ్.. అర్థం చేసుకోండి. మా అమ్మమ్మ తులసమ్మంటే మీ అందరికీ.. ప్రేమ, గౌరవం, అభిమానం పుష్కలంగా ఉన్నాయి. అమ్మమ్మ చనిపోయిందనే వార్త మాతోపాటు మిమ్మల్నందర్నీ కలిచివేసిందని తెలుసు. మీరందరూ ఎంతగానో బాధపడుతున్నారు. మీ వేదనను అర్థం చేసుకోగలను. ఇదే సమయంలో.. మా అమ్మమ్మ కోరికను కూడా తీర్చాలి. అది మనందరి బాధ్యతగా ఫీలవ్వాలి. ప్లీజ్..' అని ఒక్క క్షణం ఆగాడు ఆదిత్య.

అందరూ శ్రద్ధగా వింటున్నారు.

తులసమ్మ కోరిక ఏమిటి..?

అందరి క్షేమం కోరే దేవతలాంటి తులసమ్మ కోరికను తప్పక తీర్చాలి..!

ఇంతకీ ఆ కోరిక ఏంటీ..??

'అందుకే.. మా అమ్మమ్మ కోరిక తీర్చడం కోసం.. ఈ అంత్యక్రియలు జరపడం లేదు..' అన్నాడు ఆదిత్య.

పక్కనే బాంబు పేలినట్టు.. ఉలిక్కిపడ్డారు..!

గుండెల్లో వేల డైనమెట్ల విస్ఫోటనం..!!

అందరూ నిర్ఘాంతపోయి చూస్తున్నారు..!!

'బతికున్నంత కాలం ఎలాంటి సాయం చేసిందో మీ అందరికీ తెలుసు. చనిపోయిన తర్వాత కూడా.. తన శరీరాన్ని డొనెట్ చేసి, మనతోపాటే బతికే ఉండాలనుకుంటుంది. మా అమ్మమ్మ కోరిక తీరుద్దాం. తన కళ్లను హైదరాబాద్‌లోని ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్సిట్యూట్‌కి, తన శరీరాన్ని కానీ, శరీరంలో ప్రతి అవయవాన్ని కానీ.. పరీక్షించుకోవచ్చని నిజాం మెడికల్ ల్యాబ్ వాళ్లకు దానం చేసింది. ఇదుగోండి ఆమె వేలిముద్ర వేసిన కాగితాలు..' వివరంగా చెప్పాడు ఆదిత్య.

'మీరు ఒప్పుకుంటే, తులసమ్మ కోరిక తీర్చడానికి రెడీగా ఉన్నాం..' అన్నారు అప్పటికే వ్యాన్‌లో వచ్చి ఉన్న డాక్టర్స్.

'అందరూ దయచేసి, అర్థంచేసుకొని.. సహకరించండి..! మీ అందరి మనసుల్లో గూడు కట్టుకున్న ప్రేమానురాగాల్ని చూసి, ఈ విషయం చెప్పలేక తాతయ్య, నాన్న.. ఇంతసేపు తటపటాయించారు. ప్లీజ్.. కోఆపరేట్ చేయండి..' అంటూ కన్నీటితో వేడుకున్నాడు ఆదిత్య.

అది విన్న ఆ ఊరిజనం కళ్లల్లో నీరు.. పెదిమలపై చిరునవ్వు..!!

ఏదో తెలియని అద్వితీయ భావన..! మాటలకందని మౌనరోదన..!

పరోపకారార్థయ మిదం శరీరమ్ అన్నారు. చదువుకోకపోయినా సంస్కారం కలిగిన వ్యక్తిగా.. మానవతామూర్తిగా.. బతికినంత కాలం ఊరంతా ఉమ్మడి కుటుంబంలా భావించి, అందరి యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఎవరికి ఏ ఇబ్బంది కలిగినా వెంటనే స్పందించి సహకరించే తులసమ్మ.. మరణించిన తరువాత కూడా తన నేత్రదానం, అవయవదానాలతో.. తిరిగి బతికింది..! అవును.. తులసమ్మ బతికింది..! మరికొందరికి బతుకునివ్వటం కోసం తులసమ్మ బతికింది. అనారోగాల బారినపడుతున్న వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలందించే మెడికల్ ల్యాబ్‌కు తన శరీరాన్నే దానం చేసి, తులసమ్మ బతికింది..!!

* * *

తులసమ్మ మరణించిన మూడో రోజు...

వీరభద్రయ్యకు గుండెల్లో నొప్పిగా ఉందనటంతో కంగారుపడిపోయారందరూ. హైదరాబాద్ లోని హాస్పిటల్‌కు తీసుకెళదామంటే.. వద్దని వారించాడు వీరభద్రయ్య.

'తాతయ్యా ఎట్లుంది..?' దగ్గరగా వచ్చి కూర్చొని, అడిగాడు ఆదిత్య.

'ఏ నిమిసెం ఎట్లుంటనో తెల్వదు.. ఇంతకాలం ఈడనే బతికినా.. గీ ఊరిడ్సి పెట్టి పోలేను..' అన్నాడు వీరభద్రయ్య.

'సరేలే తాతయ్యా.. అవన్నీ ఇప్పుడెందుకు ఆలోచిస్తావు..? ధైర్యంగా ఉండు..' అన్నాడు ఆదిత్య.

'నా తులసెల్లిపోయి.. నన్ను వొంటరోణ్ని సేసింది. ఇక ఉన్నా, పోయినా.. ఒకటే..! అది బతికినప్పుడు ఏంసేసినా.. పోన్లే అనుకున్నగనీ, గిట్ల.. గింతమంది గుండెల్లో బతికుంట దనుకోలే..! దానికోస్రమైనా.. ఏదోకటి సెయ్యాల.. నాత్రంతా సొంశాయించినా.. ఎదవ బుర్రకి ఏదీ తట్టలే..' ఆయాసంతో ఒక్కక్షణం ఆగాడు వీరభద్రయ్య.

ఏం చెప్పదలచుకున్నాడోనని అతృతగా చూస్తున్నాడు ఆదిత్య.

మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు వీరభద్రయ్య 'తెల్లారు జాముట్ల.. అదే కనిపించింది. ఒక పెద్ద దవఖాన కట్టిన్నంట.. దాంట్ల తులసీ.. అటుఇటు తిరుగుతోంది..'

తాతయ్యకు వచ్చిన కల అర్థమైంది ఆదిత్యకు.

'మనవడా.. నువ్ ఏంజేస్తవో నాక్తెల్వదు.. నాకున్న ఆరెకరాల జాగా రాసిస్తా. దాంట్ల పే..ద్ద.. దవఖాన కట్టించు' అన్నాడు వీరభద్రయ్య.

'అలాగే.. తాతయ్యా..' అంటూ వీరభద్రయ్య చేతిలో చేయ్యేసి, మాటిచ్చాడు ఆదిత్య.

ఆ క్షణం.. ఆదిత్య కళ్ల ముందు 'తులసి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' రూపుదిద్దు కుంటోంది..!

తాతయ్య చేయి పట్టుకొని ఉన్న ఆదిత్యకు ఆ క్షణం.. ఏదో తేడా కనిపించింది. చేయి చల్లబడడం గమనించాడు. కంగారుగా తాతయ్య చేయి కదిపి చూశాడు.. పిలిచాడు..

తాతయ్యలో ఉలుకు లేదు.. పలుకూ లేదు..!

పట్టణానికి దూరంగా.. కొండల నడుమ ఉన్న ఆ పల్లెటూరిలో అతిత్వరలో నిర్మించబోతున్న ఉచిత వైద్యశాలను చూడకుండానే, వీరభద్రయ్య 'కన్నుమూశాడు'..!

తులసమ్మ అందించే సహాయాన్ని, ఇంకా కొనసాగిస్తున్నానని.. అందుకు ఈ ఊరిలో హాస్పిటల్ కట్టిస్తున్నానని చెప్పడానికి తులసమ్మ దగ్గరకు వెళ్లిపోయాడు వీరభద్రయ్య..!!

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 161



# సుక్క బర్రె

మ్యాకం రవికుమార్

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



మ్యాకం రవికుమార్ జర్నలిస్టు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట గ్రామం. కాకతీయ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ చేశారు. తర్వాత పాత్రికేయ రంగంలోకి వచ్చారు. అప్పటి నుంచి కథారచన మొదలు పెట్టారు. **2011**లో 'యాపచెట్టు' కథ నమస్తే తెలంగాణలో ప్రచురితమయింది. ఇప్పటి వరకూ ఈయన రాసిన **11** కథలు ఆయా పత్రికల్లో అచ్చయ్యాయి.

**పొద్దు గూట్లె వడత్తంది. కైకిలి వేయినోళ్లు కాళ్లీడ్సుకుంట** ఇళ్లకు జేరుతున్నరు. 'బఱ్ఱచ్చే యాలైంది' అని అనుకుంట కుడితి కుండ దీస్కొని కొట్టం కాడికి పోయింది కనకలచ్చిమి. గోలెంల కుడితి పోసింది. నాలుగు దోసిళ్లంత తవుడేసి చేయితోటి కలవెట్టింది. గడ్డాం కాడికి పోయి ఇంత గుంజుకచ్చి పడేసింది. కొట్టంల జింకపిల్లోలె అటీటు చెంగలిత్తన్న దుడ్డెను దొరకవట్టి పాలుతాగకుంట మూతికి చిక్కం పెట్టి గుంజకు కట్టేసింది. మెల్లగా ఆడినుంచి ఇంటిముందటికి వచ్చి పానాదిపైకి వచ్చి చూసింది. దూరంగా ఊళ్లకే వత్తున్న బర్లమంద కనవడ్డది. మల్ల ఇంట్లకుపోవుడేందుకు అనుకుని అడనే గద్దె మీద కూసున్నది. బర్ల మంద మొత్తం ఇల్లు దాటిపోయింది. సుక్కబఱ్ఱె జాడ మాత్రం కానరాలె. 'రోజూ ఎదురంగ కళ్లబడంగనే అంతదూరం నుంచే సంటిపోరడు చేతులు సాపుకుంట సంబురంగ ఉరికచ్చినట్టుగా ముట్టెను పైకెత్తి ''అంబా.. అంబా'' అని ఒఱ్ఱుకుంటచ్చేది. ఇయ్యాల దాని జాడే కనిపిత్తలేదు' అని కనకలచ్చిమి మనసుల అనుకుంటనే ఆడనే పిట్టకు వెట్టినట్లు సూసుకుంట నిలవడ్డది. సూత్తటనే మొగులు మీద చుక్కలు పొడిసినయ్. ఒక్కసారిగా కొడుకు రాజేశ్ యాదికచ్చి 'అటేటు పోయిరమ్మందామంటే ఈ పోరన్ని ఏడ సావబోయిండో. బడి వదులంగనే సక్కగ ఇంటికిరారా అంటే వచ్చుడేలేదు. ఆడీడ ఆడి చీకటిపడే యాల్లకు వత్తుండు. ఎందుకనాలని ఊకుంటాంటే నెత్తికెక్కుతాండు. సెంటమన్నా మాటింటడ లేదు' అనుకుంటూ కోపంతో ఊగిపోత్తంది కనకలచ్చిమి. కొట్టంల దుడ్డేమో ఒకటే ఒఱ్ఱుడు. ఆ ఒఱ్ఱుడుకు కనకలచ్చిమి మనసు మెలివడతాంది. ఏం జేయాల్నో తెల్వకున్నది. ఇంకింత గుబులు పెరిగింది. ఇక మనసుండబట్టలేక ఇంటి తలుపులు దగ్గరికేసి బఱ్ఱెను

దేవులాడేందుకు తనే బైటికి నడిచింది. 'అయ్యో బర్రె ఏటు పాయె' అని మనసులోనే అనుకుంట మూడు బజార్ల కాడికి చేరింది. అన్నిబాటల దిక్కు ఓసారి తేరిపార జూసింది. ఏ మొఖానా బర్రె కనవడలె. ఏం జేయాలనో తెల్వక అట్లనే బెల్లంకొట్టిన రాయోలె నిలవడి పోయింది. 'లచ్చవ్వ.. ఓ లచ్చవ్వ. గీడేం జేత్తనవ్' అంటూ అన్న రాజయ్య పిలుపుతో ఉలిక్కిపడి 'ఏం లేదె మామ. బర్రె ఇంటికి రాలె. ఏడబోయిందో ఏమో. అటేమైనా కనవడ్డదా?' అని దు:ఖంతో పూడుకుపోయిన గొంతుతో అడిగింది కనకలచ్చిమి. 'నాకైతే కనిపియ్యలె. ఏడబోతది అదే ఇంటికత్తది' అని పోశయ్య అంటుండంగనే 'ఏమోనే మావ జర బర్ల పోశిగాని ఇంటికన్నా పోయత్త' అంటూ ఊరవతలి మాదిగవాడ మొఖాన కదిలింది.

వాడల అడుగు వెడుతుండగనే 'ఓ లచ్చవ్వ ఎన్నడూ లేంది మావాడకు అచ్చినవ్' అని అనుమానంగా.. ఆశ్చర్యంగా మొఖంపెడుతూ ఎదురొచ్చిండు బర్లుగాశె పోశయ్య. 'సుక్కబర్రె ఇంటికి రాలేదుకాదురా. ఏడవేయింది. ఏడవోయింది' అంటూ ఆర్తితోని అడిగింది కనక లచ్చిమి. 'ఆ.. రాకపోవుడేంది. పొద్దంతా మందలనే ఉన్నది. ఊరెన్కకు వచ్చేదాక సుత మందముంగటనే ఉండె. గప్పుడే ఎవడో టేపురికార్డరు పెద్దగ వెట్టుకుని ట్రాక్టర్ పట్టుకొని వచ్చిండు. డబ్బుల రాళ్లేసి ఊపినట్లుగా వచ్చిన ఆ సప్పుడు బెదిరి బర్లన్నీ అటీటు ఉరుకతగిలినయ్. వాటిని మర్లేసుకుని వచ్చేటాల్లకు నా తలపాణం తోకకచ్చింది. ఆ గడబిడ ఇగ ఏ బర్రె ఉన్నదో.. లేదో నేను సూడలెదవ్వ' అంటూ మొఖం చిన్నగ జేసుకుని బదులిచ్చిండు పోశయ్య. ఆ మాటలిన్నంక కనకలచ్చిమికి కొంత ధైర్నమొచ్చింది. 'బర్రె ఊరెన్కదాన్క వచ్చిందంటే ఆడనే ఏడన్న ఉన్నది గావచ్చు. లేకుంటే అటీటు తిరిగి ఈపాటికి ఇంటికి వచ్చే ఉంటది' అనుకుని ఆడ నుంచి టక్కున ఎన్కకు మర్లింది.

అప్పటికి రాత్రి ఎనిమిదిదాటింది. పెద్దపెద్ద జంగలు ఏసుకుంట.. ఉరికినట్లే నడుసుకుంట ఆశతోని ఇంటికి చేరింది. ఆకిట్ల నుంచే కొట్టం మొఖాన జూసింది. సుక్కబర్రె కనవడపోయే సరికి కనకలచ్చిమి మొఖం మల్లా చిన్నబోయింది. ఒర్రుతున్న దుడ్డెను జూసి పానం తల్లడిల్లుతాంది. మొట్టుకాడికి పోయి దుడ్డెను నిమిరి ఇంత గడ్డేసినా అది ఒర్రుడు ఆపలె. 'ఇప్పుడేడ పోవుదును. నిండు అమాస చీకటాయె. కన్నువోడుసుకున్న ఏదీ కనవడదాయె. ఎట్ల' అని ఏమీ చేయలేని నిస్సహాయతతో ఇంట్లకు నడిచింది. గలుమల అడుగువెట్టంగనే పదేండ్ల కొడుకు రాజేశ్ 'అమ్మ' అనుకుంట సంబురంగా దగ్గరికి ఉరికచ్చి నడుముచుట్టు చేతులేసి కనకలచ్చిమి గట్టిగా అలుముకున్నడు. అంతే వేగంగా నడుముచుట్టూ చేతులను దీసి ఇసిరికొట్టి 'నీకెన్ని మాట్ల జెప్పాలె. సీదా ఇంటికి రమ్మని. చెప్పుతే చెవు మీద పేనువారినట్లు సుత ఉంటలేదు. రోజురోజుకు బొత్తిలకు అధ్వనం తయారైతనవ్. నా గండాన పుట్టినవ్' అని తిట్టుకుంట కొడుకు చెంపలు చెల్లుమనిపించింది కనకలచ్చిమి. బర్రెకనిపియ్యని గుబులు.. బడి వదులంగనే కొడుకు ఇంటికి రాలేదన్న కోపం. మరోపక్క తన అసహాయతను కలగలిపి ఎల్లదీసింది. అవ్వకొట్టిన దెబ్బకు కంట్ల నుంచి మిరుగులు దుంకినయ్. మొఖం కందగడ్డ తీర్గ మారింది. సడీసప్పుడు జేయకుంట పిల్లికూనోలె ఓ మూలకు పోయి చిన్నగ ఏడుపు రాగమందుకున్నడు కొడుకు రాజేష్. అదేం పట్టించుకోకుంట అడుగు ముందుకేయబోయింది కనకలచ్చిమి. మంచాల పక్షవాతంతో పడున్న

పెనిమిటి కొమురయ్యను జూడంగనే గోలీలు ఏసేయాల్లయిందీ, ఇంకా కూరబువ్వ అండని సంగతీ మతికచ్చింది. జప్పున సాయబాన్లకు ఉరికింది. అరగంటల అక్కలుముక్కలు ఇంత అండింది. పెనిమిటి కొమురయ్యకు తినవెట్టి.. గోలీలు ఏసి మల్ల పండు కోవెట్టింది. అటేన్క ఇంకా మూలకే చిన్నగ ఏడుస్తున్న కొడుకు దగ్గరికి పోయింది. మల్ల కొడతదేమోనని రాజేశ్ దూరం జరగవోతుంటే దగ్గరికి దీసుకుని గుండెకద్దుకుంది. దు:ఖం పొంగుకచ్చి ఎంబటే తమాయించుకుని రాజేశ్‌ను ఒక ముద్దు పెట్టుకుంది. 'తప్పయింది బాంచెన్. ఇంగెప్పుడు కొట్ట. నువ్ సుత నేజెప్పిన మాటినాలె. రేపు ఉప్పుడువిండి జేత్త' అంటూ బుదరకించి బువ్వ తినిపించి పండుకోవెట్టింది.

అప్పటికి నాత్రి 9 తొమ్మిదయితాంది. బర్రెగిట్ల వచ్చిందేమోనని మల్లోతేప బైటికిపోయి జూసింది. కనిపియ్యలె. ఒర్రిఒర్రి నెరివడ్డట్టున్నది దుడ్డె సుత సప్పుడు లేకుంట కాళ్లు మల్సుకుని పన్నది. 'ఇగ పొద్దున్నే పోయి బర్రెను సూడాలె' అనుకుని ఇంట్లకచ్చింది కనకలచ్చిమి. తిందామని పల్లెంల ఇంత బువ్వేసుకుంది. రెండు ముద్దలు కలిపి నోట్లవెట్టిందో లేదో? మనసు సయించలె. లేచి చేయి కడుక్కున్నది. బువ్వను కుడితి కుండల పారేసింది. చేయికడుక్కుని మంచం దగ్గరికి పోయి కొడుకు పక్కపొంటి ఒరిగింది. కండ్లు మూతలు వడతలేవు. బలవంతంగా మూసుకున్నా సుక్కబర్రెనే కండ్లళ్ల మెరుత్తంది. పురుగు మెసిలినట్లు పక్కలనే అటీటు బొర్రుతాంది. కనకలచ్చిమికి ఒక్కొక్కటిగా ఏవేవో ఆలోచనలు ఏకధాటిగా వత్తున్నయ్.

బర్రెది ఎంత చక్కటి రూపం దానిది. సానవట్టిన నల్లరాయి లెక్కన మెరిసిటి పెయ్యి. దానిపై నిండా ఒత్తుగా వెంట్రుకలు. చిన్నక వంక దిరిగి మొనదేలిన కొమ్ములు. నుదురు మధ్యన బొట్టువెట్టినట్లుగా తెల్లటి సుక్క. మబ్బుల్లో చందమామలెక్క మందల ఏడున్నా బర్రె ఉత్తగనే కండ్లకు కొట్టచ్చేది. అంత సక్కగుంటది. దానితో బంధం ఈనాటిది కాదు. అది పుట్టినప్పటిసంది. అసలు అది పుట్టిందే కనకలచ్చిమి చేతుల్ల. ఆ రోజు తనకు ఇంకా యాదికున్నది. నిన్నమొన్న జరిగినట్లే ఉంటది. ఆ రోజు అధుమనాత్రి 'లచ్చిమి.. ఓ లచ్చిమి' అని తలుపులు దబదబ కొట్టిన సప్పుడిని ఉలిక్కిపడి లేచింది. ఆ గొంతు మామ రాయనర్సుదని గుర్తుపట్టి ఆదరబాదరగా వచ్చి తలుపుతీసింది. 'ఏంది మామ. ఏమైంది' అంటూ ఆదుర్తగా అడిగింది కనకలచ్చిమి. 'ఏం లేదుబిడ్డా. బర్రె ఈనేటట్టున్నది. కొన్ని వేడినీళ్లు వెట్టు' అంటూ చెప్పి సిడుగ్గున మల్ల కొట్టం మొఖాన పోయిండు రాయనర్సు. ఆ మాటలు పూర్తికాకుంటనే కనకలచ్చిమి సాయబాన్లకు ఉరికి సొప్పదంట్లతో పొయ్యిముట్టించి కొప్పెర్ల నీళ్లు వెట్టింది. బర్రె ఒర్రుడుకు కనకలచ్చిమి కడుపుల పేగు కదిలింది. సాయబాన్ల ఉండబుద్ధిగాక కొట్టం దగ్గరికి పోయింది. కనకలచ్చిమిని చూసి 'బర్రె రొండ్లు గుంజినయ్. తోకలావట్టి తినుకుతంది. పొడసత్రం జారుతంది. ఇంకెంత కొద్దిసేపట్ల ఈనుతది బిడ్డ' అంటూ జెప్పిండు రాయనర్సు. బర్రె పండుకుంట లేత్తంది. తల్లడిల్లుతాంది. పాణం పోతున్నట్టుగా.. ఊరుమీద ఊరువడ్డట్టుగా ఒర్రుతాంది. కనకలచ్చిమి పాణం అవిసిపోతాంది. గుడ్లళ్ల నీళ్లు తిరిగినయ్. బర్రె దగ్గరికి మీద చేయ్యేసి ప్రేమగా నిమిరింది. అంతట్లనే దుడ్డె తలకాయ బైటికెళ్లింది. కనకలచ్చిమి తొట్టమొదటి సూపు దుడ్డె నుదుటి తెల్లని మచ్చమీద పడ్డది. నిముషాలల్లనే పురంగా మాయిపొరతోనట్టుగా బైటికెళ్లి దుడ్డె బైటవడ్డది.

అప్పటిదాన్క పాణం అచ్చెపాయె అన్నట్టుగా.. ఒర్రి ఆగం పట్టించిన బర్రె ఎంబటే కిందపడ్డ తన బిడ్డ పెయ్యిని ఆప్యాయంగా నాకుతాంటే జూసి సిత్రమనిపించినా తల్లిప్రేమను కనులారా జూసి లోపలోపట్నే మురిసిపోయింది. బర్రె ఈనిన నాలుగురోజులకే పాముకర్సి బర్రె సచ్చిపేయింది. ఆ దినమంతా కనకలచ్చిమిది ఏడుపుగాదు. దుడ్డెను వట్టుకొని 'ఎంతపనైపాయరె దేవుడా' అనుకుంట మనిషిపోయినట్టుగనే వల్లించుకుంట వల్లించుకుంట కంటికిమంటికి ధారగా ఏడ్చింది. కనకలచ్చిమిని ఊకుంచ అటు పెనిమిటి కొమురయ్య, ఇటు మామ రాయనర్సు తరంగాలె. అప్పటి సంది దుడ్డె తన చేతుల్లనే మెదిలింది. కొంచెం పెద్దగయ్యేదాన్క రోజూ పొద్దుకు మూడు నాలుగుసార్లు గౌరవెట్టి ఇంకో బర్రె పాలను తాపించేది. బిడ్డలెక్కనే సాకింది. చిన్నవాన పడినా.. కొంచెం ఈదర ఎక్కువైనా.. రాత్రిళ్లు ఇంట్లనే కట్టేసుకునేది. కూలీకి పోయినా తనతోపాటుగా తోల్కపోయేది. రోజు సాయంత్రం దానికి మేత వేసినంకనే తను బువ్వతినేది. దాని పెయ్యికి ఇంత బురద అంటుకున్న.. దుమ్ము వారినా సయించకపోయేది. కొబ్బరి పీసేసి రాకి.. రాకి కడిగేది. సుక్కబర్రె 'అంబా.. అంబా' అన్నప్పుడల్లా తనను 'అమ్మ.. అమ్మ' అన్నట్లుగనే మురిసిపోయేది. ఇగ అది తొట్టతొలుత ఈనిన తర్వాతనైతే ఇంకింత పాయిరం పెరిగింది.

ఇగ ఈ ఐదేళ్లలోనైతే బర్రె లేకుంటే తన బతుకే లేకుంట పోయేది. ఎట్ల బతికేదో ఏమో. కామిండ్ల రోగంతోని మామ రాయనర్సు సచ్చిపేయిండు. ఏడాది తిర్గగముందే తాగితిగి పెనిమిటికి పచ్చవాతమచ్చి మంచాల వడ్డడు. పెరిగి కుప్పయిన అప్పులకు రెండెకరాల భూమి పోయింది. కూలికిపోదామంటే ఇంట్ల మొగుడ్ని సూసుకునే దిక్కులేదు. అప్పుడే సుక్కబర్రె ఈనింది. ఉన్న 20 గుంటల్ల తిండిగింజలు పండించుకుంట.. బర్రెపాలతోటి కాలుబైట వెట్టకుంట ఇల్లు ఎల్లదీసుకుంట అత్తంది. అట్ల రోజులు పెరిగినా కొద్దీ సుక్కబర్రెతో కనకలచ్చిమికి విడదీయలేని ప్రేమానుబంధం అల్లుకున్నది. 'బిడ్డచ్చిన వేళ.. గొడ్డచ్చినవేళ అన్నట్లు సుక్కబర్రె పుట్టినప్పటి సంది నీకు అన్ని కష్టాలు అచ్చిపడ్డయె తల్లి. బర్రెపాయె. మామ పాయె. అత్త సచ్చిపాయె. పెనిమిటికి అట్లాయె. భూమి పాయె. అది జెట్టది. అమ్మిపారేయ్' అని ఎవలన్నా అంటే సాలు తోక తొక్కిన తాచోలె కస్సున లేచేది. 'ఊకోండ్లి ఏం మాట్లాడుతున్రు. కామిండ్ల రోగమచ్చినా పత్తెం జేయమంటే జేయకుంట మా మవపోయిండు. ఆ మనాదితోటి మా అత్త వోయింది. నెత్తినోరు కొట్టుకుని జెప్పినా ఇనకుంట తాగితాగి అట్ల పాణం గుల్ల జేసుకుని పచ్చవాతాన పడ్డడు నా పెనిమిటి. కూసోని తింటే కొండలైనా కరుగుతయ్. మా రెండెకరాల భూమి ఓ లెక్కా. ఇంకా బాయిల వడి మా అత్త సచ్చినందుకు సుత అయినా ఆ సుక్కబర్రె ఒక్కటి లేకుంటే ఈంత ఇప్పుడు ఈ ఇల్లు. ఆ 20 గుంటల పొలం సుత దక్కకపోయేది. అదుండే పటికే ఇంట్ల కాలుబైట వెట్టకుంటనే పొట్టకు బట్టకు ఎల్లుతంది. ఇప్పుడైతే అన్నరు గని మల్లోతేప ఎప్పుడన్న అనేరు' అంటూ వాళ్లను నాలుగు జోపి ఇడ్సిపెట్టేది. కనకలచ్చిమికి సుక్కబర్రంటే ఎంత ప్రేమో అనుకుంటు అన్నోళ్లే కిక్కురుమనకుంట నోళ్లు మూసుకునేటోళ్లు.

సుక్కబర్రెకూ కనకలచ్చిమంటే అంతే ప్రేమ. కనవడితే చాలు ముట్టెను పైకెత్తి.. 'అంబా.. అంబా' అనుకుంట దగ్గరికి ఉరికేది. ముక్కుతోని మురక చూసుకుంట.. రాసుకుంట.. పూసుకుంట కనకలచ్చిమి చుట్టే తిరిగేది. ఎవలు కుడితి పెట్టినా తాగేటిది కాదు. కనకలచ్చిమి


చేతి స్పర్శను.. మాటనూ ఇట్టే గుర్తుపట్టేది. పొదుగుమీద వేరేటోళ్లు ఎవలన్నా చెయ్యేత్తే చాలు జాడిచ్చి తన్నేది. ఒక్క సుక్కగూడ పాలియ్యకపోయేది. అందుకే సుక్కబఱ్ఱె ఈనిన సంది కనకలచ్చిమి ఎటూ పోయిందీ లేదు. తప్పదనుకుని ప్రభోజనాలకు ఏ ఊరన్న పోయినా చీకటి పడేటాల్లకు ఎటుతిరిగి ఇల్లు జేరేది. ఉసిల్లు పుట్టినట్లుగా జ్ఞాపకాలు వస్తూనే ఉన్నయ్. అట్ట ఏ అధుమ రాత్రికో కనకలచ్చిమి నిద్రలోకి జారుకుంది.

'కొక్కొరొక్కో' అని కోడి కూత ఇనవడంగనే మెలకువచ్చింది కనకలచ్చిమికి. రాత్రిగిట్ల బఱ్ఱె వచ్చిందేమోనని ఎంబటే లేచి కొట్టంకాడికి పోయి జూసింది. సుక్కబఱ్ఱె కనవడలె. మొఖం చిన్నగ జేసుకుని చీపురందుకుని ఆటో దెబ్బ.. ఇటో దెబ్బ ఏసి ఆకిలి వడగొట్టింది. అలుకు సల్లింది. ఇంట్ల పనంతా జేసుకుంది. ఎంగిలి కంచాలను.. బోళ్లను సుత తోముకుంది. జప్పుజప్పున కూరబువ్వండి పారేసింది. కొడుకుని లేపి తయారుజేసి బడికి పంపింది. పెనిమిటికి ఇంత తినవెట్టింది. పనంతా ఓడగొట్టుకుని బఱ్ఱెజాడకు బైలుదేరింది. 'ఊరెన్కనే ఉన్నదో.. ఇంకేదిక్కన్న పోయిందో. అల్లువట్టించి పోదాం' అని మనసులనే అనుకుని భద్రమ్మ దగ్గరికి పోయింది. కనకలచ్చిమిని సూసుడుతోనే 'ఏమైందే కోడలా.. మొఖమంత ఈడ్సుకుపోయింది. పాణం మంచిగుంటలేదా' అని అడిగింది భద్రమ్మ. 'గదేం లేదత్త. సుక్కబఱ్ఱె ఇంటికి రాలె. జఱ్ర అల్లువట్టి జెప్పరాదు. దొరుకుతదా? దొరకదా? ఎటుదిక్కుపోయిందో?' అని బతిమిలాడింది కనకలచ్చిమి. 'గదేం భాగ్యమే. ఇంట్లకు రా' అంటూ లోపలికి తీసుకుపోయింది భద్రమ్మ. ముగ్గేసింది. నిండు నీళ్లచెంబును ముగ్గుమధ్యల కూసో పెట్టింది. బొట్లు పెట్టింది. కనకలచ్చిమిని చూసి 'మంచిగ మొక్కుకో బిడ్డా' అని భదమ్మ జెప్పంగనే చెంబును ముట్టుకుని 'తండ్రీ నీ బాంచెన్. బఱ్ఱె దొరకాలె. నీకు ముడుపు కడతా' అంటూ ఎములాడ రాయేసున్ని మనసులోనే మొక్కుకుంది కనకలచ్చిమి. అల్లువట్టుడు షురూజేసింది భద్రమ్మ. 'బఱ్ఱె దొరుకుతె చెంబు లేత్తది.. దొరకకుంటే చెంబు లెవ్వదు' అని జెప్పి 'బఱ్ఱె దొరుకతది.. బఱ్ఱె దొరుకుతది' అని నాలుగైదుసార్ల వల్లెవేసి చెంబును పైకెత్తమని చేయితోని కనకలచ్చిమికి సైగజేసింది. అట్లనే పైకి లావట్టంగనే చెంబు లేచింది. కనకలచ్చిమికి పానమచ్చింది. భద్రమ్మ మల్లా 'ఊరిదాపునుందా.. దూరంల ఉందా' అంటూ మొదలువెట్టింది. దాపునే ఉందన్నప్పుడు చెంబుపైకి లేచింది. 'పోశిగాడు నిజమే జెప్పిండు' అని మనసులనుకుని 'అత్త బఱ్ఱె ఊరెన్కనే ఉండవచ్చు చూసత్త' అంటూ కనకలచ్చిమి ఇంట్లకెల్లి బైటికి నడిచింది.

ఇండ్లన్నీ దాటింది. ఊరేన్కకు జేరింది. ఒళ్లంతా కళ్లుజేసుకుని చుట్టూ పరీచ్చగా జూత్తంది. కనకలచ్చిమికి ఏడా బఱ్ఱె జాడకనవడ్తలేదు. గుబులు పెరుగుతంది. నాలుగు అడుగులు ముందుకేసిందో లేదో చిన్నగా 'అంబా.. అంబా' అన్న అరుపులు ఇనవడ్డయ్. రివ్వున ఆ దిక్కుకు పోయింది. సగం పూడుకుపోయిన బాయిబొందల కూలవడి కనవడ్డది సుక్కబఱ్ఱె. నెత్తి మీద పిడుగు పడ్డట్లయింది కనకలచ్చిమికి. పెడబొబ్బలు పెట్టుకుంట బాటెంబడి చేన్లకు పోతున్నోళ్లను కేకేసి పిలిచింది. నిముషాల్లో మంది జమైన్రు. బాయిల బఱ్ఱె ఒఱ్ఱుతాంటే కనకలచ్చిమి గుండె తరుక్కుపోతాంది. మనసు కరిగి నీరైతంది. కంటిమంటికి ధారగా ఏడుసుకుంట బాయిగడ్డపై

అటీటు తిరుగుతాంది. క్షణాల్లో కొందరు తాళ్లు, గోనెసంచులు దీస్కచ్చిండ్రు. ఇద్దరు బాయిలకు దిగిన్రు. బర్రె బెదిరి లేవబోయి అట్లనే కూలవడ్డది. 'కాలుగిట్ల ఇరగవచ్చు. మెల్లగ' అంటూ పైనుంచి ఎవలో గట్టిగా కేకేసి చెపుతున్నరు. బాయిల దిగినోళ్లు మెల్లగా బర్రె దగ్గరికి పోయి బెదిరకుంట ఒక గోనెసంచిని దానికళ్లకు కట్టిండ్లు. ఇంకొన్ని గొనెసంచులను తాళ్లతో కట్టి బర్రె బొత్తకిందుగా తీసిండ్లు. ఓ ఎడ్లబండిని తీసుకొచ్చి తాళ్లను కట్టి పైకి ఇగ్గుడు మొదలు పెట్టిన్రు. పాణాలు అరచేతుల వెట్టుకుని.. 'అన్న మెల్లగ.. మెల్లగ.. దరి ఒర్సకపోతది' అని అందరినీ బతిలాడుతాంది. ఏమైతదో.. ఎట్లయితదోనని గుండెదడ పెరిగింది. సల్లచెమటలు బట్టినయ్. నిముషాల్లో బర్రెను బాయిగడ్డకు గుంజిన్రు. రెండు జంగలల్ల బర్రె దగ్గరకు జేరింది కనకలచ్చిమి. కాలును జూసింది. విరిగిందని గుర్తించింది. బర్రె పెయ్యినంత పునికి జూసింది. బాయిదరి గీరుకుపోయి అక్కడక్కడ తోలుకొట్టుకుపోయి నెత్తురు కారుతంది. కనకలచ్చిమి దు:ఖం ఆగలె. 'ఎంత గండం గడిచిందె' అనుకుంటూ అటీటూ జూసి బాయిగడ్డకే ఉన్న నల్లాలం ఆకుల్ని దూసుకచ్చి నలిచి పసరును దెబ్బలమీద పిండింది. ఆకుముద్దను అట్లనే దెబ్బలమీద అద్దింది. 'అయ్యా బాంచెన్. సచ్చి మీ కడుపున పుడతా. బర్రెను జర్ర బండ్ల ఇంటిదాన్క పడగొట్టుండ్రి' అంటూ కాళ్లవేళ్ల పడి బర్రెను ఇంటికి తీస్కకచ్చుకుంది. మొట్టమొదలూ నీళ్లుతాపించింది. వేడినీళ్లు పెటి బర్రెపెయ్యి మొత్తం కడిగింది. తోలు లేచిపోయిన కాడ పసుపు నూనె రాసింది. ఆగమాగంగా ఉరికిపోయి ఇంటెన్కనున్న గొల్ల మంకయ్యను దీస్కచ్చింది. మంకయ్య గుంటకల్జేరు, ఇంకా ఏవేవో ఆకులు దీస్కచ్చిండు. మెత్తగ దంచి మొదలు పసరును కాలుకు పూసి, ఆకుముద్దలను అదిమి కంకబద్దలను ఏసి గుడ్డపేగు చుట్టిండు. పురంగ కుత్యంకాకుంట.. ఇలు వదులుకాకుంట కట్టు కట్టిండు. కనకలచ్చిమి పాణం నిమ్మలమైంది. 'ఇగ జన్మల బర్రెను మందలకు తోలనే తోల' అని అనుకుంట కొట్టం నుంచి ఇంట్లకు నడిచింది కనకలచ్చిమి.


Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 169



# బూరుగు సందుగ

చెన్నూరి సుదర్శన్

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



**1950లో ములుగు జిల్లా కేంద్రం వీరి స్వస్థలం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. గణిత శాస్త్రంలో ఎంఎస్సీ, ఎంఫిల్ చేశారు. టెలిఫోన్ ఆపరేటర్‌గా జీవితాన్ని ప్రారంభించి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వరకూ ఎదిగారు. సిద్దిపేట జిల్లా నంగునూరు ప్రభుత్వ పాఠశాల నుంచి 2010లో ఉద్యోగ విరమణ పొందారు. దాదాపు 120 కథలు, 50 కార్టూన్‌లు, 80 కవితలు వీరి రికార్డుల్లో ఉన్నాయి. చిత్రలేఖనం, కార్టున్లూ, మైక్రోఆర్ట్, వాలీబాల్, కేరమ్స్, బ్యాడ్మింటన్‌లలో ఈయన పలు బహుమతులు అందుకున్నారు.**

**అయ్యాల్ల ఐతారం. పొద్దు పొద్దుగాల్నే రామాచారి** ఇంట్ల కెల్లి బూతుల పురానం ఇనత్తాంది.

'మన పక్కింటి మచ్చాలు సూడురా.. పది పాసైంది. నీకేం తక్కువ సేసినంరా..! ముప్పొద్దులు పంది లెక్క తింటానవ్. బడి ఇడువంగనే.. సోపతిగాండ్లను ఎంబడేసుకొని, అడ్డ గాడిద లెక్క ఊరు మీద పడి తిరుగుతానవ్. సదువు మీద రందెక్కడిది..! రవుసెక్కడిది?. లెవురా..లే..! బారెడు పొద్దెక్కింది. లేత్తవా లేవవా..!. సరూ.. సల్లటి నీళ్ళు తేరా పటువెడు.. వీని నెత్తి మీద పోత్త..' గరం గరంగ అన్కుంట సరోజను పిల్సిండు రామాచారి.

'నీయవ్వ లేత్తానాగు. పొద్దుగాల్నే పంచాంగం ఇప్పకు.. గా మచ్చాలు సంగతి నా దగ్గర ఎత్తకు. నా దమాక్ కరాబైతది' అని కైక్కుమన్నడు కైలాసం. ముకమంత చిట్లిచ్చుకొని ముసుగు తన్ని కప్పుకొన్న దుప్పటి తీసి లేసికూకున్నడు కైలాసం. అసలు పేరు కైలాసాచారి గాని అంతా కైలాసమనే పిలుత్తాంటరు.

'నీ మొకం సూత్తనే సర్వ పాపాలు సుట్టుకుంటయిర కొడుకా..! జరంత నవ్వుకుంట లేత్తె నీముల్లేం పోయిందిరా?. అయినా ఇప్పుడు నేనేమన్ననని? మచ్చాలు పది పాసైంది. నువ్వేమో.. పేలై కూకుంటివి. నువ్వు మల్ల పది పరీచ్చలు రాయాల్నాయే. మరి గిట్ల పండుకుంటె ఎట్లరా.. తెల్లారగట్ల లేసి సదువుకోవాల్నా వద్దా.. మచ్చాలు తెల్లరగట్ల నాలుగింటికే లేసి సదువుకుంటనే పాసైంది. మచ్చాలును సూసి బుద్ధి తెచ్చుకో.. '

'అగ్గొ మల్ల.. నోరు మూత్తవా.. మూయవా..! మచ్చాలట మచ్చాలు' అని పండ్లు పట, పట

కొరుక్కుంట పాయిఖానల సొచ్చిండు కైలాసం.

'నాయ్నా.. గా మచ్చాలు పేరింటనే అన్న తోక తొక్కిన కోతైతడు. ఆమె పేరు తాప, తాపకు తియ్యకు' అన్నది ఇంటి ముందల వాకిట్ల కెల్లి ముగ్గేసుకుంట సరోజన.

'నువ్వు ఇంట్ల సారగమంత సేసుకుంట అన్నిట్ల పాసవుకుంట వత్తలేవా..! మల్లో యాడాది పోతే నీదంటకే వత్తడు నీ అన్నగాడు. నువ్వు పాసైతవేమో.. గాని వాడు మల్ల ఎలగపెడ్తడనే నమ్మకం నాకు లేదు' అన్కుంట వాకిట్లకు పోయిండు. నోట్లె ఉన్న యాప్పుల్ల తీసి రెండు వక్కలు సేసి ఒక్కొక్క వక్క తోటి నాల్కె తీడుకుని ఎనుగులకిసిరేసిండు. వాకిట్ల సరోజ సుక్కల ముగ్గు సూసుకుంట ముచ్చట పడబట్టిండు.

'మచ్చాలు సుత వాని సోపతి రాలే కదరా.. కలిసి ఒక్క బల్లెనే సదివిరని ఆ పొల్ల పేరు తీత్తాన. అయితే సరే. వాడు పాసైతే పాసైండు లేకుంటే లేదు గాని మన కులవుర్తిలనన్నా మంచి పేరు తెచ్చుకుంటే నాకు తుర్తైతది. నేనంటే పురాన జమాన మనిసిని. ఇప్పుడు కొత్త, కొత్త కరంటు తోని నడిసే ఇసిరలచ్చినై. పనిల సౌలత్ పెరిగింది. పది పాసైతే వానికి బాంకుల లోనత్తదని నా ఆరాటం. పక్క పట్నంల అపార్టులత్తానై. కప్ బోర్డులకు మస్తు గిరాకున్నది. నా దోస్త్ కొడుకు నలుగురిని పెట్టుకొని ఇరాం లేకుంట పని చేత్తాండు. వాని చేతి కింద నాలుగు రోజులు పని నేర్సుకుంటే.. మున్ముందు వీడు సుత సంతంగ సేసుకోవచ్చని నా తండ్లాట' అంటాంటే రామాచారికి దుక్కమచ్చింది.. కండ్లల్ల నీల్లూరినై.

దబుక్కున ముగ్గు కొబ్బరి చిప్ప కింద పెట్టి రామాచారి దగ్గరికి ఉర్కచ్చింది సరోజన మొకంమీ్మదికి వచ్చిన నాలుగెంటుకలను ఎడంచేత్తోటి నెత్తి మీదకు దోపుకుంట 'నాయ్నా.. ఊకో. అవ్వ (తల్లి) లేకున్నా మమ్ముల్ను కండ్లల్ల పెట్టుకొని సాత్తానవ్. నేను అన్నకు సెప్తగని నువ్వు రంది పడకు' అని గదుమ పట్టుకొని బతిలాడబట్టింది సరోజన.

పాయఖాన్లకెల్లి బైటకచ్చిన కైలాసం వాకిట్ల జరిగే తతంగమంతా సూసిండు రామాచారి. భుజంమీ్మదున్న తువ్వాల తోటి కండ్లు ఒత్తుకుంట ఇంటెన్క చేద బాయి కాడికి పోయిండు.

కైలాసం హమాంఖానల సొచ్చిండు. తానం సేసుకుంట సోంచాయించబట్టిండు. నాత్రి తన ముగ్గురు జిగ్రీ దోస్తులు వాట్సాప్ల పంపిన ప్లాను దమాకుల మెదలబట్టింది. తనకు సుత అదే ప్లాను బగ్గ నచ్చింది. అది ఇయ్యాలనే.. ఇప్పుడే తానం సెయ్యంగనే మొదలు పెట్టాలనుకున్నడు. కబీరు దాసు అన్న దోహా యాదికి రాబట్టింది. 'కాల్ కరేసో ఆజ్ కర్, ఆజ్ కరైసో అబ్'. సిన్నంగ నవ్వుకుంట దబ్బ, దబ్బ తానం కానిచ్చిండు. ఉసారుగ ఈలేసుకుంట ఈవల కచ్చిండు.

వంటింట్లకు తొంగి సూసిండు సరోజ పొయ్యి మీద ఉప్పుడు పిండి సేత్తాంది. ఇంటెన్కకు సూసిండు. బాయి మీద రామాచారి నీళ్ళు చేదుకుంట తానం సేత్తాండు.

సరోజన పొద్దుగాల్నే గోలెంల నీళ్ళు చేది పోత్తది గాని అవి ఇగముంటయని రామాచారి తానానికి వాడడు.

ఇక తన పని మొదలుబెట్టాలనుకున్నడు కైలాసం. పైజామ, బనీను తొడుక్కొని

సాయబాన్లకు పోయిండు..

తవ్వాల సుట్టుకొని ఇంట్లకచ్చి దేవుని అర్రలకు పోయిండు రామాచారి. తిర్మన్ గౌర (బొట్టు పెట్టె) తీసిండు. అందులున్న సిన్న అద్దం తీస్కోని ఎడం సేతి ఏల్లల్ల ఇరికిచ్చుకున్నడు. కొంచెం సింధూరం అర సేతిల తీస్కోని అరగ దీసి సన్నని రాగి పుల్ల తోటి బొట్టు పట్టుకున్నడు. దేవునికి దీపం పెట్టి ఊదుబత్తి ముట్టిచ్చి మొక్కుకున్నడు. ఇంతల బాడిసె సప్పుడు ఇనచ్చేటాల్లకు అప్సోసై సాయబాన్ల కురికిండు. కొడుకు పనిల బడేటాల్లకు సూసుకుంట సంబుర పడ్డడు రామాచారి.

'ఏం సేత్తానవ్రా..' అని ముద్దుగ అడిగిండు.

'మా దోస్తు నాయ్న ఒక బూరుగు సందుగ కావాలన్నడు నాయ్నా.. సేత్తాన'

'సరే.. తాత్పరంగ మంచిగ సెయ్యి. ఏమన్న అనుమాలత్తే నన్నడుగు' అని తన కమ్రలకు పోయిండు.. తువ్వాలిప్పి ధోతి కట్టుకుందామని.

పొద్దుగూకేటాల్లకు ఒక మనిషి సౌలత్గ పట్టేటంత పెద్ద బూరుగు పెట్టె తయారుసేసిండు. తను అనుకున్నట్టు సందుగ తయారయ్యేటాల్లకు తెగ ముర్సిపోబట్టిండు కైలాసం. సందుగను మెల్లంగ, మెల్లంగ దొర్లిచ్చుకుంట పోయి తను పండుకునే అర్రల మంచం తలాపునకు పెట్టుకున్నడు.

తన కొడుకు పని తనాన్ని సూసి 'ఇట్లనే స్రద్ధ సదువుల పెట్టురా.. ఈ సారి పాసైతవ్ కైలాసం ఈపు నిమురుకుంట' అన్నడు రామాచారి.

'నాయ్నా.. అన్న మంచి పనిమంతుడని ఇప్పటికైనా నమ్ముతానవా.. లేదా..! నే నానాడే సెప్పిన. మా అన్న ఎప్పటికైనా పది మందిల మంచి పేరు తెచ్చుకుంటడని' అని నవ్వుకుంట అన్నది సరోజన.

సరోజనకు అన్నంటే శాన ఇట్టం. కైలాసం సుత చెల్లంటే పానమిడ్తడు.

ఆ నాత్రి శానాల్లకు ముగ్గురు కల్సి బువ్వతిన్నరు. కైలాసం పరద్దాన్నంగ తింటాంటే సరం తప్పింది. సరోజ సట్న లేసి ఎడం సేతుల నీల్లు తీస్కోని కైలాసం మాడ మీద మెల్లంగ సర్సింది. 'ఎవ్వలో నిన్ను యాది సేసుకుంటాండ్లన్నా..' అన్నది ముసి, ముసి నవ్వులు నవ్వుకుంట.

'ఇంకెవలుంటరే.. మీ అవ్వనే. సచ్చి యాడున్నదో గాని.. నా కొడుకు పనిమంతుడైండని యాది సేత్తాంది' అన్నడు రామాచారి.

కైలాసానికివేవీ దమాకులకెక్కుత లేవు. బుక్క మీద బుక్క పెట్టుకుంట తిని కంచంల సెయ్యి కడుక్కున్నడు.

'మాయిలమే తింటివేందిరా.. మారన్నం పెట్టుకోలే..' అడిగిండు రామాచారి.

'అన్న ఎప్పుడైనా దబ్బున్నే తింటడు నాయ్నా..' అని అన్నకు వత్తాసు పైలికింది సరోజన.

కైలాసం తన అర్రలకు పోయి మంచంమ్మీద నడుం వాల్సిండు. సెల్లుఫోను తీసి వాట్సాప్ల

దోస్తులకు కబర్ పంపిచ్చిండు. వాల్ల నుండి మల్లేదో వచ్చినట్టున్నది. 'రేపు పొద్దుగాల పని కాంగనే మల్ల కబర్ పెడ్త. మన ప్లాన్ స్కక్సెస్ కావాలె' అని జవాబిచ్చిండు.

ఎంతకూ నిద్ర రాకచ్చింది. ఎప్పుడు తెల్లర్తదా.. అని పానమంత పింజం, పింజం కాబట్టింది. తెల్లరగట్ల జరంత కన్నంటుకున్నట్టున్నది.

* * *

పురంగ తెల్లారింది.

'ఛీ.. ఛీ.. ఇవ్వాల సుత గింత పొద్దెక్క దాక పన్న' అని మన్సుల ఇసుక్కుంట లేసిండు కైలాసం. గబ్బ, గబ్బ అన్ని పనులు సేసుకునుడు సూసి సరోజన ఇచ్చంత్ర పోయింది. వంటిట్లకు పోయి కోపుల చాయె తీస్కచ్చి కైలాసానికిచ్చుకుంట.. 'నాయ్న ఎగిలి బారంగనే లేసి పని మీద ఊరికి పోతాంటే చాయె పెట్టిచ్చిన. జరంత మిగిలింది తాగు' అన్నది సరోజన.

'మరి నీకో..' అని అడిగిండు కైలాసం. మిగిలిన చాయె తను తాగకుంట తనకు తెచ్చిచ్చిందని సంబుర పడుకుంట కోపు తీసుకున్నడు.

'యాడికో తయారైతానవ్...' అని అడుగుదామనేటాల్లకు.. 'మీ అన్న ఉన్నడా..' అన్కుంట వత్తాన మచ్చాలును సూసి మాట ఎన్కకు తీసుకున్నది సరోజన.

తనే మచ్చాలును తీస్కరమ్మని సరోజనకు చెబ్దామనుకున్నడు. కానీ, మచ్చాలే సర్రాసుగ వచ్చుడు సూసి బీర్పోయిండు కైలాసం. 'ఇయ్యాల లేసి చెల్లె మొకమే సూసిన గందుకే అనుకున్నయన్ని అనుకున్నట్లే జర్గుతానై' అని మన్సులనుకున్నడు కైలాసం.

'మచ్చాలూ.. అన్న తోటి మాట్లాడుతుండు. నేను మనిద్దరికి చాయె పెట్టుకత్త' అని వంటింట్లకు పోయింది సరోజన.

'నువ్వు పనిమంతుడైనవని మీ నాయ్న వాడ, వాడల చాటింపు చేసిండు. ఆ పనిమంతుని పనితనమేందో సూద్దామని వచ్చిన' అన్నది మచ్చాలు.

కైలాసం ఉబ్బి పోయిండు. తన మంచమెన్కున్న బూరుగు సందుగను సూయించిండు. సందుగని సూసి ముక్కు మీద ఏలేసుకున్నది మచ్చాలు. సందుగను సూత్తాంటే సూడబుద్దైతాంది. సందుగకు ఒక పక్క సిన్నంగ పొక్కలు.. పొక్కల సుట్టు నగషీలు సెక్కినౌ.. శాన ముద్దత్తాంది. మరి పొక్కలెందుకు' అడిగింది మచ్చాలు.

'సందుగలకు గాలి వచ్చి పోవాలని ఇటు సుత సెక్కిన సూడు' అని మచ్చాలును సందుగ సుట్టు తిప్పుకుంట సూయించిండు కైలాసం.

'అబ్బ.. శాన బాగున్నది' అని కైలాసాన్ని తెగ మెచ్చుకోబట్టింది మచ్చాలు.

'ఇంక నేను సదువు బందు సేసి మా పనిల పడ్త' అన్కుంట మచ్చాలుకు ఇట్టమైన తమ్సప్ గిలాసల పోసిచ్చిండు. 'మరి నీకో' అన్నట్టు సూసింది మచ్చాలు.

'నేనిప్పుడే చాయె తాగిన మచ్చాలూ. నువ్వు తాగు'

మచ్చాలు గిలాస అట్ల కాలి అయ్యిందో లేదో.. ఇట్ల పక్కకున్న మంచంల వాలిపోయింది. సట్న తలుపు మూసచ్చిండు కైలాసం. తన మందు బాగనే పని సేసిందని ఖుసీ పడుకుంట మచ్చాలును అమాంతం ఎత్తుకొని బూరుగు సందుగల పండుకోబెట్టిండు. సందుగ తలుపు మూసి చిలుకు పెట్టిండు. మల్ల పోయి ఏం ఎర్గనట్టే తలుపు తీసుకొని వంటిట్లకు పోయిండు.

'మచ్చాలును వాల్ల నాయ్న పిలుత్తాండని తమ్ముడచ్చి తీస్కపోయిండు' అని పిల్లి కూనలెక్క అన్నడు కైలాసం.

'మరి చాయె చేత్తానగదా..' అన్నది సరోజన.

'నా దోస్త్ వత్తాండు.. తాగుతడులే.. నువ్వైతే చాయె బగ్గ మసలపెట్టు కాంగనే తీస్కరా..' అన్కుంట మల్ల తన కమ్రలకు పోయిండు కైలాసం.

సెల్ఫోన్ తీసి తన నర్సయ్య దోస్త్కు కబర్ పెట్టిండు. ఐదు నిముసాలల్ల నర్సయ్య తన లగేజీ ఆటో తీస్కోని కాకిలెక్క ఇంటి ముందల వాలిండు. సరోజన తెచ్చిన చాయె ఇద్దరు తాగిండ్లు.

నర్సయ్య, కైలాసం ఇద్దరు కల్సి బూరుగు సందుగను ఆటోలో ఎక్కిచ్చుకున్నరు.

'సందుగని అప్పజెప్పి వత్త' అని సరోజనకు ఇంటి జాగ్రత్తలు సెప్పి బైలెల్లిండ్లు.

తమ ప్లాను ప్రకారం ఆటోను ఊరవతల ఒక పాడుబడ్డ బంగ్లకు తీస్కపోతాంటే తొవ్వల ఆటో కూషైంది. నర్సయ్య దిగి సూసిండు. ఒక పయ్య పంపుచారైంది. కైలాసం సుత కిందకు దిగిండు. ఇద్దరు కల్సి పయ్య ఇప్పి ఇంకో పయ్య ఎక్కిచ్చుకొని బంగ్ల చేరేటాల్లకు.. అక్కడున్న ఇంకో ఇద్దరు దోస్తులు కయ్యిమని పైకి లేసిండ్లు. జరిగిన సంగతి సదిరి సెప్పిండు నర్సయ్య.

'సరే.. సరే..' అని ఒకల్నొకలు సందాయించుకొని ముగ్గురు పొయ్యి రాల్ల లెక్క కూకున్నరు. చేసంచిల తెచ్చిన బబ్బుడాలు, ముద్దగారెలు తీసి ముందల పెట్టుకున్నరు, ఒక పుల్ మందు బాటల్ ఖతం సేసిండ్లు. గబ్బ గబ్బ తాగేటాల్లకు నిసా పుల్లుగ తల్కాయెలకెక్కింది. నర్సయ్య ఈలేసుకుంట సొలుక్కుంట పోయి బూరుగు సందుగ తెర్సిండు. సందుగల సరోజను సూసి కెవ్వుమన్నడు కైలాసం. తల్కాయె తిరిగి పోయింది. దెబ్బకు నిసా దిగి పోయింది.

'నర్సయ్యా.. ఇది మా చెల్లె సరోజనరా. గిండ్లకెట్లచ్చింది' ఏడ్సుకుంట దోస్తులకు దండం పెట్టబట్టిండు కైలాసం.

'చెల్లె లేదు గిల్లె లేదు. ఏందిరో మాట మార్తనవ్.. మన ప్లాను పకారం సందుగల ఉన్న దాన్ని పొతం పెట్టి ఖతం సెయ్యాలె. ఔనా.. కాదా..!' అన్కుంట నర్సయ్య తతిమ్మ దోస్తుల దిక్కు సూసిండు. వాల్లు సుత 'నిజమే కదా' అన్నట్టు బూరుగు సందుగ సుట్టు నిల్సున్నరు.

సరోజనకు తెల్వి వచ్చి లేసి నిలబడపోయి మల్ల కూలబడ్డది. కైలాసం దోస్తులను నూకేయబోయిండు. సట్న అందరు కల్సి కైలాసాన్ని బంగ్ల తంబానికి కట్టేసిండ్లు.

ఎదురుంగ మచ్చాలు కనబడేటాల్లకు కట్టెసర్సుక పోయిండు కైలాసం.

'కైలాసం.. నీ సంగతంతా పసిగట్టిన మా అన్న మీ ఆటో కూషైనప్పుడు సందుగలకెల్లి నన్ను తీసి నీ సెల్లెను పండబెట్టిండు' అని నవ్వబట్టింది మచ్చాలు. కైలాసం అప్సోసై సూడబట్టిండు. ఇంతల నర్సయ్య సరోజన మీద సెయ్యేయబోయిండు.

'అరేయ్ నర్సా.. ఇదేం వర్సరా.. నిన్ను నరికేత్తరా..' అని బగ్గ ఒఱ్రుకుంట మంచం మీదికెల్లి కిందబడ్డడు కైలాసం.

* * *

'ఏందిరా.. గట్ల ఒఱ్రితివీ.. కలగిట్ల వచ్చిందా ఏంది' అన్కుంట ఎదురుంగ నాయ్న కనబడేటాల్లకు పురంగ తెలివికచ్చిండు కైలాసం. 'ఇదంతా కలనా!' అని నోరు తెర్సి సూరును సూడబట్టిండు.

వంటింట్ల సరోజన కూరగాయలు కోసుకుంట కైలాసం ఒఱ్రుడుకు గజ్జున వన్కి సూపుడేలు కోసుకున్నది. అయినా కాతరు సెయ్యకుంట అన్న దగ్గరికి ఉర్కచ్చింది. వంటిట్లకెల్లి ఈడిదాక రకుతం సుక్కలు, సుక్కలు పడుడు సూసి తల్లడిల్లిండు కైలాసం. ఏడ్సుకుంట సరోజనను దగ్గరికి తీసుకున్నడు. సరోజన ఏలు సల్లని నీల్లతోని కడిగి పసుపు రాసి పాత చీరంచు సీల్చి కట్టిండు. 'అన్నకు రాకీ కట్టే చెల్లెకు ఇయ్యాల అన్న చెల్లెకు రాకీ కడ్తాండా..!' అన్నట్టు అప్సోసై సూడబట్టిండు రామాచారి. కైలాసం అనుమానంగ తన మంచం తలాపునకున్న బూరుగ సందుగను సూసిండు. అది అక్కడ్నే ఉన్నది. అయోమయంగ నవ్వుకుంట హమాంఖాన్ల సొచ్చిండు.

'నేను శాన తప్పు సేయబోయిన. నా చెల్లెకు జరంత ఏలు కోసుక పోతెనే నా మన్సు గింత తల్లడిల్లింది. కోసుక పోయిన మచ్చ మానిపోతదేమో గాని, జిందగి మీద పడ్డ మచ్చ మాసిపోవుడుండది.. మనిసిని సెనం, సెనం కాల్సి మసి సేసి పారేత్తది. మచ్చాలు సుత ఒక అన్నకు సెల్లెలే కదా..! నా కంటే మచ్చాలు బగ్గ సదువుతాంటే ఆమెతోని పోటీ పడి నేను సుత బగ్గ సదువుకోవాలే గాని దమాక్ లేనోన్ని. ఆమె బతుకు బండలు సెయ్యాలనుకున్న. దీనికంతటికీ కారనం.. సెల్ఫోను. దాన్ని మంచికి వాడకుండా బేకార్ పనులకు వాడుడు ముప్పుకత్తాంది. దేసంమ్మీద నా లెక్క పాగల్ గాండ్లు శాన మంది ఉన్నరు. ముందుగాల నా దోస్తులను మారుత్త. నాయ్న సెప్పిన దాంట్ల నయాపైసంత తప్పు లేదు. నేను సుత కుల వుర్తి సేసుకుంట సదువుకుంట పది పాసైత. నాయ్న కోర్కెలు తీరుత్త' అని మన్సుల పమానం సేసుకుంట హమాంఖాన్లకెల్లి బైటికి వచ్చి రామాచారి కాల్లను మొక్కబట్టిండు కైలాసం.



# స్వీట్ బాక్స్

నండూరి సుందరీ నాగమణి

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



నండూరి సుందరీ నాగమణిది హైదరాబాద్. మహబూబ్‌నగర్ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. రచన ఆమె అభిరుచి. **2010** నుంచి ఇప్పటి వరకు **160** కథలు, మూడు నవలలు రాశారు. వివిధ వార, మాసపత్రికల్లో ఇవి ప్రచురితం అయ్యాయి. వచన, పద్యకవిత్వంలో కూడా నాగమణికి ప్రవేశం ఉంది. సమాజంలో జరిగే సంఘటనల నుంచి ఉద్భవించేదే అసలైన సాహిత్యం అని, సాహిత్యం అనేది ప్రజాభివృద్ధికి చక్కని బాట వేయాలని కాంక్షిస్తున్నారు.

**బయట హోరున వాన! ఉరుముల సవ్వడి. అయితే** ఆ శబ్దాన్ని మించిన రణగొణధ్వని మా బ్యాంకు లోపల. అరవై సంవత్సరాలు దాటిన వృద్ధురాళ్ళే అక్కడున్న ఖాతాదారులంతా. కౌంటర్లకి అటుపక్కన నేల మీద కూర్చున్నారు వాళ్ళ వంతుకై నిరీక్షిస్తూ. ఇంచుమించు యాభై మంది వరకూ ఉంటారు.

వర్షం రావడం వల్ల గానీ, లేకపోతే వారి సంఖ్య మూడువందలకి పైగా ఉంటుంది. ప్రతీ నెలా ఒకటో తారీఖు నుంచి పదవ తారీఖు వరకూ వాళ్ళకి పెన్షన్ పేమెంట్లు ఉంటాయి. వీరంతా ఒకప్పుడు బీడీ కార్మికులు.

ఈ నిజామాబాద్ జిల్లాలో ప్రతీ ఇంట్లోని స్త్రీలంతా చేసేది ఒకటే పని. కంపెనీ వారిచ్చిన తునికాకు, పొగాకు పొడి తీసుకుని బీడీలు చుట్టి ఆ కంపెనీకి ఇవ్వడం. ప్రతీ బాలికకూ చిన్నప్పటి నుంచే ఇలా బీడీలు చుట్టడంలో తల్లులు శిక్షణ ఇస్తారు. ఈ మహిళా కార్మికులకు కంపెనీల నుంచి దక్కేది మాత్రం చాలా తక్కువ. వెయ్యి బీడీలకు రెండు వందల రూపాయల లోపలే. ఇంట్లోని మగవాళ్ళు ఎన్నిపనులు చేసినా చాలా సంసారాలు నడిచేది మాత్రం మహిళల చేతి కష్టం మీదనే అంటే అతిశయోక్తి కాదేమో.

వయసు మీరిన బీడీ కార్మికులకు పెన్షన్ జాతీయ బ్యాంకుల ద్వారా పొందే ఏర్పాటు చేసింది ప్రభుత్వం. పాపం ముదివగ్గులైపోయిన ఈ వృద్ధురాళ్ళంతా చుట్టుపక్కల ఊళ్ళనుంచి కూడా నెలనెలా పెన్షన్ కోసం వస్తూ ఉంటారు. ఉదయం ఎనిమిది, ఎనిమిదిన్నరకే బ్యాంకుకి వచ్చి బయట కూర్చుంటారు. తలుపులు తెరవగానే వాళ్ళు కూడా మాతో పాటే లోపలికి వచ్చి, కూర్చుంటారు టోకెన్లు తీసుకుని. అసలు నిశ్శబ్దంగా ఉండలేరు. ఇక్కడే నెలకోసారి కలుసుకుంటూ ఉంటారేమో ఏవేవో కబుర్లు చెప్పుకుంటూనే ఉంటారు.

మేనేజర్‌గారు ఆయన క్యాబిన్‌లో ఎవరో పెద్ద కస్టమర్లతో బిజీగా ఉన్నారు. కౌంటర్లలో

ఆఫీసర్లు, క్యాషియర్లు బిజీగా ఉన్నారు. ఉపశాఖాధికారిగా చెక్కులూ, విత్‌డ్రాయల్స్ పాస్ చేస్తూ నేనూ బిజీగానే ఉన్నాను. ఒక్కరి వేలిముద్రా స్పష్టంగా లేదు. పాస్‌బుక్కులలో ఫోటోలు లేవు. అలాంటి కేసెస్‌లో టోకెన్ నంబర్‌తో వాళ్ళను పిలిచి ముఖాలు చూసి, ఆధార్‌కార్డ్ ఉందో లేదో అడిగి, పాస్‌బుక్ మీద ఫోటో అతికించి, బ్యాంకు రబ్బర్‌స్టాంపు వేయించుకోవాలని చెప్పి, మళ్ళీ వేలిముద్ర వేయించుకోవలసి వస్తుంది.

టీ కుర్రాడు వచ్చి టేబుల్ మీద టీకప్పు పెట్టడంతో చేస్తున్న పనికి విరామం ఇచ్చి, టీ తాగి ఆ డిస్పోజబుల్ కప్‌ను చెత్తబుట్టలో వేసి ఇటు తిరిగేసరికి ఎదురుగా ఓ ముసలవ్వ, అరవై ఐదు సంవత్సరాల వయసు ఉంటుందేమో ఆమెకు. దీనంగా నావైపే చూస్తూ నిలబడి ఉంది. వంగిపోయిన నడుము, కొద్దిగా మాసిన తెల్లచీర, జాకెట్టు, పాతబడిన కళ్ళజోడు, ముడుతలు పడుతున్న ముఖం, వేలిముడి వేసిన నాలుగు పోచల జుట్టు..

చటుక్కున గుర్తు వచ్చేసింది.. ఈమె పేరు గంగవ్వ. రెండు నెలల నుంచీ ప్రతీ నెలా వచ్చి తనకు పెన్షన్ వచ్చిందో లేదోనని పాస్‌బుక్ చూపించి అడుగుతోంది.

'జర సూడవ్వ, నా పైసలు వడినయో, లేవో..' పాసుబుక్‌ని నా చేతికిచ్చి నిలబడింది.

సిస్టమ్‌లో ఆమె ఖాతాను చెక్‌చేసి, 'లేదవ్వా, ఈ నెల కూడా పడలేదు' అన్నాను పుస్తకం అందిస్తూ.

'రాలేవ బిడ్డ? ఎట్ల మల్ల?' దీనంగా అడిగింది.

మరోసారి అకౌంట్ చూడగానే ఆశ్చర్యం కలిగింది. 'చాన్నాళ్ల నుంచి పడట్లేదు కదవ్వా? బ్యాంకులో అడగలేదా?' అన్నాను.

'అర్సుకున్న బిడ్డ. ఊర్కిబోయిన ఆర్నెల్లు. మూణ్ణెల్లసంది తిర్గబడ్తిని, పైసల్ వడలేదని చెప్పుడే గాని ఎందుక్క వడలేదో చెప్పెటొళ్ళు లేరు..'

'సరే అవ్వ, చూస్తున్నావు కదా, ఎంత రద్దీగా ఉన్నదో, నువ్వు పదో తారీఖు తర్వాత వస్తే వివరంగా మాట్లాడతాను..' అనునయంగా చెబుతూనే పేమెంట్లు పాస్ చేయసాగాను.

'మా ఊర్కిబోనికి కూడ పైసల్లేవవ్వ..' అంది కన్నీరు పెట్టుకుంటూ. నాకేం చేయాలో తోచక బ్యాగ్‌లోంచి వందరూపాయల నోటు తీసి అందించాను.

'ఒద్దు బిడ్డ, నా పైసల్ నాకొచ్చే తొవ్వ సూడు మల్ల..' అంది.

'చూస్తానులేమ్మా, పదకొండో తారీఖున సాయంత్రం నాలుగు తర్వాత రా.. ఉండనీ నీ పైసలు వచ్చాక ఇద్దువులే..' అన్నాను.

'నీ కాల్మొక్కుత బిడ్డ..' అనుకుంటూ వెనుతిరిగింది గంగవ్వ.

ఆ వేళ పనంతా పూర్తయి ఇంటికి వెళ్ళాక కూడా ఆమె దీనవదనమే గుర్తువచ్చింది.

* * *

సాధారణంగా ఎంత పనివత్తిడిలోనున్నా నేను కస్టమర్లను కసురుకోను. సాధ్యమైనంత వివరంగా మాట్లాడి వాళ్ళ సమస్యను పరిష్కరించడానికే ప్రయత్నిస్తాను. ఎప్పుడైనా నా గొంతు పరుషంగా వినిపించిందంటే అవతలి వ్యక్తి నన్ను చాలా విసిగించి ఉంటారని మా బీయమ్‌గారు

అంటూ ఉంటారు.

నా సర్వీస్‌లో చాలా భాగం భాగ్యనగరంలోనే గడిచింది. మధ్యమధ్యలో బయటికి వెళ్ళినా మహబూబ్‌నగర్ జిల్లాకో, వరంగల్ జిల్లాకో వేసేవారు. నిజామాబాద్ రావడం ఇదే మొదటి సారి. ఇక్కడి వాతావరణం చాలా వైరుధ్యంగా ఉంటుంది. అన్ని సీజన్లూ తీవ్రతలో కాస్త ఎక్కువే. అంటే తీవ్ర గ్రీష్మ ఋతువు, తీవ్ర వర్ష ఋతువు, తీవ్ర శిశిర ఋతువు.. వేసవిలో తీవ్రమైన గాడ్పులు.. ఉదయం పది గంటలకే మధ్యాహ్నపు ఒంటిగంటకు ఉండేంత తీవ్రమైన ఎండ. అలాగే వర్షం, అలాగే చలీ.. వచ్చిన కొత్తలో వాతావరణంలోని మార్పులకు, బ్యాంకులోని విపరీతమైన రద్దీకి, ఎడతెగని పని వత్తిడికీ ఎంతో భయపడినా ఇప్పుడు బాగా అలవాటు అయిపోయింది. ఇంకో ఆరు నెలల్లో ఇక్కడ నాకు చేయవలసిన మూడేళ్ళ సర్వీసు పూర్తి అయి హైదరాబాద్‌కి పోస్టింగ్ వచ్చేస్తుంది.

* * *

పదకొండో తారీఖు వచ్చినా ఈ సారి రద్దీ తగ్గలేదు. పెన్షన్లు ఇస్తూనే ఉన్నాము.

లంచవర్ ముగియగానే ఉన్నట్టుండి మా బీయమ్ సర్ లోపలికి పిలిచి, 'మాధురీ, పెన్షనాఫీస్ నుంచి ఫోన్ వచ్చిందమ్మా. ఈరోజేదో మీటింగ్ ఉందట. మన బ్యాంకు తరపున నిన్ను పంపిద్దామని అనుకుంటున్నాను. సాయంత్రం నాలుగింటికే మీటింగ్. నాకు జోనలాఫీస్‌లో పనుంది. నేను కౌంటర్ క్లోజ్ చేసి, అక్కడికి వెళతాను. నువ్వు మీటింగ్‌కి వెళ్ళిరా..' అని చెప్పారు.

నేను గబగబా పని ముగించుకుని మీటింగ్‌కి వెళ్ళిపోయాను. అక్కడ పీయఫ్ ఆఫీసులో (మా బీడీ కార్మికుల పెన్షన్ ఆఫీసు) నగరంలోని బ్యాంకర్లకు, అక్కడి అధికారులకు మీటింగ్ జరిగింది. నిజానికి ప్రతీనెలా జరిగే మీటింగ్‌కి మా మేనేజర్‌గారే వస్తారు. మీటింగ్ ఫార్మలే. మినిట్స్ బుక్‌లో సంతకాలు అయ్యాక అందరికీ చాయ్‌లు తెప్పించారు. కొంతమంది కో-బ్యాంకర్లు పరిచయమయ్యారు. అక్కడి సిబ్బంది కొంతమంది కూడా దగ్గరకు వచ్చి పలకరించారు.

'మాధురీ మేడమ్ మీరేనా? ప్రతీ నెలా మీతో ఫోన్‌లో మాట్లాడే మహేష్ నేనే.. బాగున్నారా?' అని నవ్వుతూ పలకరించాడతను.

నేనూ నవ్వి, అతని పర్సనల్ నంబర్ తీసుకున్నాను, నా నంబర్ అతనికిచ్చి. అప్పటికే ఆరున్నర దాటింది. అందరి దగ్గరా సెలవు తీసుకుని ఇంటి ముఖం పట్టాను.

* * *

మర్నాడు నేను బ్యాంకుకి వెళ్ళేసరికే వరండాలో ఎదురుచూస్తున్న గంగవ్వ నా వెనుకే లోపలికి వచ్చింది.

'ఎప్పుడు వచ్చావు అవ్వా, బాగున్నావా?' ఆదరంగా పలకరించాను.

'నిన్న రమ్మంటివిగ బిడ్డ, అచ్చిన. నువ్వు లేకుంటివి..' అంది.

'అయ్యో, అవును కదా, మీటింగ్‌కి పోవలసి వచ్చింది అవ్వా.. మరి మీ ఊరికి వెళ్ళి వచ్చావా?'

'పోలె బిడ్డ పైసల్లేవు నా తాన. నీకుగిట్ల సౌ రూపయ ఇవ్వబడితిని. గీడనె మా యారాలుంటే

ఆమింట్ల పండిన. ఇగ నీతోని మాట్లాడినంక బోదమని ఊకున్న. జర చూస్తవావ్వ నా పైసల్కత?'

'సరే అవ్వా చూస్తా.. కొంచెం సేపు కూర్చో.. నందూ ఒక చాయ్ తెప్పించి ఈమెకిప్పించు' అని పురమాయించి, నేను క్యాషియర్‌తో కలిసివెళ్ళి సేఫ్ తెరిచి, ఆయన క్యాష్ తీసుకుని తన కౌంటరుకి వచ్చిన తరువాత సిస్టమ్ తెరిచి, తన అకౌంట్ చూశాను. సరిగ్గా కిందటి జనవరి నుంచి పెన్షన్ ఆగిపోయిందామెకు. అంటే సరిగ్గా ఇప్పటికి ఇరవై నెలలు.

నాకు లీలా మాత్రంగా ఒక అనుమానం తోచింది. కౌంటర్ చూస్తూనే గంగవ్వను పిలిచి నా టేబుల్ ఎదురుగానున్న కుర్చీలో కూర్చోమన్నాను.

బిడియపడుతూనే ఒదిగి కూచుంది.

'తిన్నావా అవ్వా ఏమైనా?' అనుమానంగా అడిగాను.

'రాగిజావ తాగిన బిడ్డ నువ్వు తిన్నవా?' అమాయకంగా అడిగింది.

'తిన్నానవ్వా మరి నువ్వు బతికున్నట్టు సర్టిఫికేటిచ్చావా?'

'ఇచ్చిన్నవ్వ'

'ఎప్పుడు, మొన్నటి దీపావళికాక, అంతకు ముందు దీపావళికి ఇచ్చి ఉండాలి కదా'

'ఇచ్చిన్నవ్వ. ఇచ్చినంకే మా సెల్లె సచ్చిపొయ్యిందని నిర్మలెల్లిపోయిన. గాడనే ఉన్న. గిప్పుడు ఊరికచ్చిన. నా కొడ్కు పైసల్ తీస్కరమ్మంటే బేంకికి మస్తు సార్లొచ్చి అడిగిన'

'అవునా?' అంటూనే పీయఫ్ ఆఫీసు మహేష్ మొబైల్‌కి కాల్ చేశాను.

గంగవ్వ పీపీవో నంబర్ చెప్పి, పెన్షన్ ఆగిపోయిందని కాస్త చూడమని రిక్వెస్ట్ చేసాను.

మళ్ళీ చెబుతానని కాల్ కట్ చేశాడతను.

గంగవ్వ తన కష్టాలు చెప్పుకోసాగింది. చెల్లెలి కూతురు దగ్గర ఉండి వచ్చిందట. నిజామాబాద్‌కి గంట దూరంలో ఉండే కొడుకు దగ్గరకి వచ్చేస్తే కోడలికి అత్త ఉండడం ఇష్టం లేదుట.

ముసలిదానికి తిండి పెట్టడం దండగని విసుక్కుంటుందట. పెన్షన్ పైసలు పట్టుకురమ్మని ఆర్డర్ వేసిందట. ఇంతాచేసి నెలకు పెన్షన్ కేవలం మూడువందలు.

ఇవన్నీ వింటుంటే చాలా బాధ కలిగింది నాకు. ముసల్ది కన్న కొడుకు కావాలి, అతని తల్లి వద్దు! అయ్యో కోడళ్ళంతా ఒక్కలాగే ఆలోచిస్తారెందుకో ఎన్నాళ్ళో బతకని ముసలి ప్రాణాన్ని కాస్తంత ఆదరంగా చూస్తే ఏమైపోతుంది. తన బిడ్డల్లో బిడ్డలాంటిదే కదా.

మొబైల్ మోగటంతో చటుక్కున ఆన్సర్ చేశాను. మహేష్ చెప్పాడు, లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వకపోవడం వల్లే పెన్షన్ ఆగిపోయిందని.

'ఇప్పుడు లేటెస్ట్ లైఫ్ సర్టిఫికేట్ తీసుకుని, పంపిస్తే రెగ్యులరైజ్ అవుతుందా మహేష్?' ఆరాటంగా అడిగాను.

'అవుతుంది మేడమ్. ఆమె దగ్గర ఒక లెటర్ కూడా తీసుకోండి, ఎప్పటి నుండి పెన్షన్ రావడం లేదో ఆ నెల నుంచీ పెన్షన్ ఇప్పించమని రాయించి, మీ నుంచి రికమెండ్ చేస్తూ

పంపించండి. నేను పని అయ్యేలా చూస్తాను'

'థాంక్స్ మహేష్'

నింపిన లైఫ్ సర్టిఫికేట్ మీద ఆమె వేలిముద్ర వేయించి, సర్టిఫై చేసి, మరొక అర్జీ రాసి దాని మీద కూడా వేలిముద్ర వేయించాను.

'ఇకవెళ్ళి, వచ్చే నెలలో రా నేను ఆఫీసు వాళ్ళతో మాట్లాడి పైసలు వచ్చేలా చూస్తాను' అన్నాను.

'పొమ్మంటవ బిడ్డ' లేచింది గంగవ్వ. ఆమె కళ్ళలో నిస్సహాయత. నాకు అర్థమైంది. ఆమె పరిస్థితికి చాలా బాధ కూడా కలిగింది. మళ్ళీ మరొక వంద నోటు తీసి ఆమె గుప్పిట్లో పెట్టాను. కళ్ళనీరు నింపుకొని వెనుతిరిగింది. అప్రయత్నంగా నా కళ్ళు కూడా చెమ్మగిల్లాయి.

* * *

మరుసటి నెల పెన్షన్ స్క్రోల్స్ రాగానే గబగబా గంగవ్వ పీపీవో నంబర్‌తో వెదికాను. నా ముఖం పత్తిపువ్వులా విప్పారటం నాకే తెలిసింది.

'మేడమ్, మీ అవ్వకి పెన్షన్ వచ్చిందా?' మా కొలీగ్ సందీప్ అడిగాడు. నవ్వుతూ 'అవునన్నట్టు' తల ఊపాను. ఏరియర్స్‌తో కలిపి, ఆరువేల ఆరు వందలు.

ఆ క్షణంలో నాకు కలిగిన ఆనందం ఇంతా అంతా కాదు. నాకు ప్రమోషన్ వచ్చినా ఇంత సంతోషం, సంబరం కలిగి ఉండేది కాదు! వెంటనే మహేష్‌కి ఫోన్ చేసి, థాంక్స్ చెప్పాను అతను చేసిన సహాయానికి.

* * *

నేనెంతగానో ఎదురు చూస్తుంటే నాలుగో తారీఖున వచ్చింది గంగవ్వ.ఆమె రాగానే అంత రద్దీలోనూ, పని ఆపేసి, నేనే ఆమెకు ఎదురు వెళ్ళాను.

'రావ్వా, నీకు పైసలొచ్చినయ్' సంతోషంగా చెప్పాను. గంగవ్వ గాజు కళ్ళల్లో ఒక్కసారిగా మెరుపు. 'అవ్వా (ఔనా) బిడ్డ? అచ్చినయ్యా నా కాతల వడ్డయా?'

'అవునవ్వా నీకు ఆరువేల ఆరువందలు వచ్చినయ్. పైసలెన్ని రాయించుకుంటవో రాయించుకో.. నందూ, ఈమెకి కాస్త హెల్ప్ చెయ్యి. విత్‌డ్రాయల్ రాసిపెట్టు వేలిముద్ర వేయించు' పురమాయించి, పని కొనసాగించాను.

ఈలోగా గంగవ్వ విత్‌డ్రాయల్ నా దగ్గరకు వచ్చింది. ఐదువేల ఐదు వందలకి రాయించుకున్నట్టుంది. వెంటనే పాస్ చేసి, క్యాష్ కౌంటర్‌కి పంపించాను.

మరో పది నిమిషాలకి నా దగ్గరకి వచ్చింది గంగవ్వ.

'సంతోషమేనా అవ్వా?' అడిగానామెను.

'సల్లగుండాలవ్వ నువ్వు. మస్తు కుష్ అయ్యిండె నాకు. ఈ పైసల్ తీస్కెల్లి నా కోడాలికిస్త. ఎవరికో బాకున్నదంట (బాకీ ఉన్నదట)'

'సరేనవ్వ, పోయిరా' అన్నాను.

'ఇద్గొ బిడ్డ నీ దో సౌ' రెండు వంద కాగితాలు అందించబోయింది.

'వద్దవ్వా.. ఉంచు.. ఫరవాలేదు.. నీ బిడ్డలాంటి దాన్ని. ఇలా అప్పు తీర్చెయ్యనక్కరలేదు. పండ్లు కొనుక్కుని తిను' మృదువుగా చెప్పాను.

'తీస్కోవ్వా గింత సాయంజేసినవ్ గంతె సాలు. మల్ల నాకు పైసల్ గావలంటె ఇచ్చెడిది నువ్వేగా' అంటూ బలవంతంగా నా చేతిలో డబ్బుంచి సంతోషంగా బయలుదేరింది.

* * *

అది మొదలు ప్రతీ నెలా పెన్షన్ పైసలకు వచ్చినప్పుడు నన్ను కలవకుండా వెళ్ళేది కాదు గంగవ్వ. కోడలు ఆమెకు కొత్త బట్టలు కొనిచ్చిందేమో, తెల్లనివే అయినా మంచివే కట్టుకుని వచ్చేది. రోజులు వేగంగా గడుస్తున్నాయి. చూస్తూండగానే ట్రాన్స్‌ఫర్ సీజన్ వచ్చేసింది. నాకు హైదరాబాద్‌కి బదిలీ అయింది. నెలాఖరుకు రిలీవ్ అవ్వమంటే ఒక్క ఐదు రోజుల తరువాత రిలీవ్ అవుతానని మేనేజర్ గారిని రిక్వెస్ట్ చేశాను. నా స్థానంలో పోస్ట్ చేసిన ఆఫీసర్ కూడా ఇంకా రాలేదు. పెన్షన్ రద్దీని తట్టుకోలేమని తెలుసు కనుక మేనేజర్‌గారు కూడా సంతోషంగా ఒప్పుకున్నారు. మూడవ తారీఖున వచ్చిన గంగవ్వకు గేటు దగ్గరే నా బదిలీ వార్త తెలిసిందేమో, వచ్చీ రాగానే, 'ఏందవ్వ మాదురీ, ఐద్రబాదు పోతున్నవంటలే?' అంది ఏడుపు గొంతుతో.

'అవునవ్వా ఎప్పటికైనా వెళ్ళాల్సిందే కదా. మా సారూ, పిల్లలూ అక్కడ, నేనిక్కడ మా ఇంటికి పోవాలి కదా గంగవ్వా. అరె, ఏడవకు అయ్యో ఏడవకు అవ్వా' అప్పటికే నా చేతులు పట్టుకుని ఏడుస్తున్న ఆమెను ఎలా ఆపాలో నాకు అర్థం కాలేదు.

'గింత మంచి మేనేజరవ్వవు నువ్వు ఎంత సాయం జేసినవ్ నాకు అందరు నీ యసుంటోల్లుంటె మా గరీబోళ్ళకి తక్లీపులుండవ్ తియ్' అంది కళ్ళు తుడుచుకుంటూ.

'కాసేపు కూచో, పని తగ్గినాక మాట్లాడతాను ' అన్నాను ఆమె భుజం తట్టి. మరో ఐదు నిమిషాల తర్వాత నా ముందు ప్రత్యక్షమైంది గంగవ్వ. ఆమె చేతిలో ఒక పేకెట్టు.

'తీస్కో బిడ్డ' అని నా చేతిలో పెట్టింది. తెరిచి చూస్తే అర్థకిలో స్వీట్స్ ప్యాకెట్. నాకు మతిపోయింది. ఇంచుమించు నూటేభై పెట్టి అంటే తన పెన్షన్‌లో సగం డబ్బు.. ఏమిటీ అభిమానం? ఎందుకీ వాత్సల్యం?

'తింటవ్ కదవ్వా?' అనుమానంగా అడిగింది.

'తింటానవ్వా. తినకుండానే నా మనసు తియ్యగా అయిపోయింది' బుగ్గలమీద కన్నీరు తుడుచుకోకుండానే ఆమెతో చెప్పి, నేనొక స్వీట్ నోట్లో పెట్టుకుని, మరొక స్వీట్ తీసి తినమని ఆమె చేతికిచ్చాను.

నన్ను విడువలేక విడువలేక విడిచిపెట్టి వెళ్ళింది గంగవ్వ. మనసు భారమౌతూ ఉంటే సీటులో కూలబడి తిరిగి పనిలో నిమగ్నమయ్యాను.



# పోరాటం

చేవూరి శ్రీరాం

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 186



చేవూరి శ్రీరాం గణితం ఉపాధ్యాయులు. జనగాం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. హన్మకొండలో నివాసం. సాహిత్య పఠనం, పద్య, వచన, కథా రచనలో ప్రావీణ్యం పొందారు. వీరు రాసిన.. వృత్తి, అర్ధాంగి, లక్క ఇల్లు, కాలుష్యం.. కథలు బహుమతులు గెలుచుకున్నాయి. వచన కవిత్వంలో రంజని కుందుర్తి అవార్డుతో సహా పలు ప్రతిష్టాత్మక అవార్డులు పొందారు. అమ్మకు ప్రేమతో (స్మృతి పద్య కావ్యం) ప్రచురణకు సిద్ధంగా ఉంది.

**'ఎట్లైతదో ఏమో? అల్లుని బాధ ఎట్ల దీర్తదో!** బిడ్డ కలకల నవ్వక రెండు నెల్లైంది' మనసులో అనుకోబోయి పైకే అనేసింది లచ్చవ్వ మొగుడు సాలయ్యకు అన్నం పెడుతూ.

'ఏమయ్యా! ఏమన్న ఆలోచించినవ బిడ్డ గురించి! పొద్దున్నించి సాయంకాలం దాకా రాళ్లు పగుల గొడ్తావు కాని నీ మనసు మాత్రం రాయోల్లనే ఉన్నది' మళ్లీ తనే అంది లచ్చమ్మ!

శివరాత్రి సాలయ్యది జనగాంల పల్లెటూరు. వడ్డెర కుటుంబం పెద్ద. ఒకళ్లకు అపకారం తలపెట్టని మంచి మనిషి. ముగ్గురు బిడ్డలు. ఒక కొడుకు. ముగ్గురు బిడ్డలకూ పెండ్లి జేసిండు. వారందరూ పనులకోసం పట్నం వెళ్లి అక్కన్నే స్థిరపడ్డరు. అదృష్టం కొద్దీ అల్లుళ్లు మంచోళ్లే దొరికిర్రు. పెద్దబిడ్డ రజిత గురించే ఇప్పుడు వాళ్ల బాధ.

రజిత ఆమె మొగుడు ఎంకటేశం ఇద్దరూ పది తరగతులు చదివినోళ్ళే. తమ పిల్లలను చదివించాలని కాయుషు. పోయంత పోరగాళ్ళ చదువుల మీదనే పెట్టి కష్టపడుతున్నరు. ఎంకటేశం కష్టపడి పనిచేసేటోడే. చిన్నకొడుకు అనారోగ్యం పాలై ఆస్పత్రిల జేరితె లక్ష రూపాయలు దాసుకున్న డబ్బులు, లక్ష రూపాయలు అప్పు తెచ్చిపెట్టిన డబ్బులు రెండు లక్షలు ఖర్చైతెగాని పోరడు నిమ్మళంగా లేడు. ఇప్పుడు పెద్దోనికి కాలేజీ ఫీజు కట్టాలి. ఆ డబ్బులే చిన్నోని రోగానికి పెట్టిండు. పరిస్థితులు చేతులు దాటినాక కుదురుకోవడం కష్టమే.

ఇక్కడ సాలయ్య పరిస్థితీ బాగలేదు. దెబ్బ మీద దెబ్బ పడ్డట్టు రెండేళ్ల నుంచి సాలయ్య

కుటుంబానికి దయ్యం పట్టినట్లు సమస్యల మీద సమస్యలు. మేడారం జాతరెల్లినంక రెండు నెలలకు చిన్న బిడ్డ పెండ్లి జేసిండు. దాదాపు పది లక్షలు ఖర్సైనయి. ఇప్పుడు మళ్లీ మేడారం సందడి మొదలైంది. ఆ తర్వాత రెండో బిడ్డ ప్రసూతికి ఇంటికొచ్చింది. రెండో కాన్పు. ఐనా లచ్చవ్వ తనింట్లనే జేసింది. నాల్గు నెలలు ఇంట్లో ఉంచుకుంది. వచ్చేటోల్లు, పొయ్యేటోల్లు తాగుడు, తినుడు లక్ష రూపాయల దాక ఖర్సైంది.

అప్పుడే పిడుగు పడ్డట్టు, బావిలో మట్టి తవ్వి పూడిక పనిజేస్తుంటె క్రేన్ తాడు తెగి మట్టిలాగే తొట్టి లోపలి మనిషి మీద పడ్డది. వాడు చావు బతుకులల్ల ఉన్నడు. తన దగ్గర పని చేసేటోడు కాబట్టి సాలయ్య వానికి రెండు లక్షలు ఖర్చు పెట్టిండు. బతికిండు పోరడు. బావి యజమాని పదివేల కంటె ఎక్కువ ఇయ్యనన్నడు. విషయం పంచాయితీల ఉన్నది. లచ్చవ్వ బంగారం కుదువ బెట్టి కొంత, నోటి మాటతోని కొంత అప్పు తెచ్చి మనిషిని బతికించుకున్నడు సాలయ్య. నా దగ్గర పని జేసెటోడు నా కొడుకు లాంటోడే. వాన్ని బతికించుకోవల్సిన బాధ్యత నాదే అంటూ ఖర్చు పెట్టిండు.

ఈ సమస్యలు ఆ సమస్యలు పనులు లేక డబ్బులు రాక ఇప్పుడు పరిస్థితి చూస్తే చేతిల చిల్లి పైస లేదు. ఉన్న రెండెకరాల యవసాయం మూలకుబడ్డది.

మళ్ళీ రెండు వారాలైతె మేడారం జాతర! ముగ్గురు బిడ్డలు, అల్లుళ్ళు, ఇద్దరు బామ్మర్దులు వాళ్ళ కుటుంబాలు, ఇద్దరు తమ్ముళ్ళు వాళ్ళ కుటుంబాలు మొత్తం ముప్పైమందికి పైగా వారం రోజులు.. కనీసం యాభై వేలన్నా ఖర్చయితయి.

ఎన్నడూ లేంది పెద్దల్లుడు డబ్బులడిగిండు. చేతిలో చిల్లి గవ్వలేదు.

'లచ్చవ్వ! పరిస్థితి నీకు తెల్వందిగాదు. ఉన్న బంగారం మొన్ననే కుదువబెడ్తివి. ఎట్ల చెయ్యాలె? ఏం చెయ్యాలె అని ఆలోచిస్తున్న! మనాదికి కంటిమీద కునుకు రావట్లే. నువ్వు గింత తిని పండుకో! నమ్ముకున్న దేవుడే తొవ్వ జూపెడ్తడు' తాత్త్వికంగా పల్కి చెయ్యి కడిగిండు సాలయ్య.

తెల్లారింది. శుక్రవారం. లచ్చవ్వ ఇల్లలికింది. గడపలు పూచింది. ఎర్రమట్టితోని గోడలు అలికి ముగ్గులు పెట్టింది. నెత్తి మీద స్నానం చేసి దేవునికి దణ్ణం పెట్టింది. 'తల్లీ ! నీ జాతరకు ఇంటి రాజులం వస్తం కని నా బిడ్డను కనికరించు' అని సమ్మక్కకు మొక్కుకుంది. వంటజేసింది. మొగన్ని పిల్చి సద్ది సదిరి పనికి పోవడానికి తయారవుతుంటే.. మరొక్క వార్త..

చూడుచూడని ఉన్న పనులు కూడా బంద్లై పది రోజుల నుండి ఇంట్లనే కూర్చున్న పెద్దల్లుడు. ఉండబట్టుకోలేక ఆఘమేఘాల మీద పుట్టింటికొచ్చింది బిడ్డ రజిత. రావడంతోనే తల్లి మీదపడి ఏడుపు మొదలు పెట్టింది.

'ఏం జరిగిందే! సెప్పా పెట్టకుండ ఊడిపడ్డవ్!' గాభరా పడుతూనే అడిగింది లచ్చవ్వ.

'రాగనే గట్లడుగుడేంది. జెర నిమ్మళంగాని! బిడ్డా ఎందుకా ఏడుపు. ముఖం కడుక్కని

రాపో. ఓ ముద్ద అన్నం తిని మాట్లాడుదువు గని' అంటూ సాలయ్య బిడ్డను ఇంటెన్కకు తీసుకుపోయి ముఖం, కండ్లు కడిగిచ్చి తీసుకువచ్చిండు.

లచ్చవ్వ అన్నం ప్లేట్లో పెట్టి కలిపి ఇచ్చింది. బిడ్డ కొంచెం నిమ్మళమైంది తల్లిని తండ్రిని చూడంగనె.

అన్నం తినుకుంటూ పొద్దున ఇంట్లో ఏం జరిగిందో చెప్పసాగింది రజిత.

* * *

'ఏందయ్యా ఇది! పొద్దున్నే తాగుడు మొదలుబెట్టినవ్! ఎన్నడూ లేంది ఈ కొత్త అలవాటేంది?' కాస్త గట్టిగానే మొగుడు ఎంకటేశాన్ని నిలదీసింది రజిత.

'నోర్మూసుకోయెహే! చిన్నోడు మంచంలనే ఉన్నడు. ఇంక కోలుకోలేదు. పెద్దోనికి కాలేజీ ఫీజు కట్టకుంటె ఇప్పుడు పరీక్ష రాయనియ్యరు. ఉన్న పైసలన్ని ఐపోయినయ్! పది రోజుల నుండి పనిలేదు. చావమంటవ! మందు తాగనులే గని గింత ఇసం తెచ్చియి! తాగి పుటుక్కుమంటే నీ కళ్లు చల్లబడుతాయ్' గట్టిగనే బదిలిచ్చిండు ఎంకటేశం.

కొయ్యబారిపోయింది రజిత.

పెనిమిటి కొత్తగ మాట్లాడుతుంటే మాటలు రాక మూగవోయింది.

కాసేపటికి తేరుకుని చెప్పసాగింది.

'గదేంది మావ! పైసలు ఎక్కడ పోయినయ్ మావ! కడుపున పుట్టిన పోరనికి బాగలేకుంటెనే గద ఖర్చు పెట్టినవ్! చేసుకున్న కట్టం పోయింది గని రెక్కలు పోయినయ! మల్ల సంపాదించు కుంటం! నీతోపాటు నేనుగూడ పనికొస్తా. కట్టజీవి రెక్కాడితే కట్టలు అటకెక్కాల. పని ఈ ఊర్లో దొరకకుంటె ఇంకో చోటికి పోతం. మనది చిన్న సమస్య మావా! గిటువంటి చిన్న చిన్న విషయాలకే పేణం తీసుకోవాలంటే భూమ్మీద మడిసే మిగిలేటోడు కాదు' ధైర్యం చెప్పింది రజిత.

స్వతహాగా మృదుస్వభావం కల్గిన వెంకటేశం మాటలు రాక మౌనంగా ఉంటే మళ్ళీ తనే చెప్ప సాగింది రజిత.

'కట్టాలు మనిషికి కాకుంటే మానుకు వస్తయా! ధైర్యంగ ఎదుర్కొనేటోడే బట్ట కట్టగల్గుతడు. సమస్యలిచ్చిన దేవుడు సమాధానాలు కూడా వాటి పక్కనే ఉంచుతడంట. నువ్వు దిగులు పడకు మావా! నేను జూసుకుంట కదా! ' అంటూ అన్నం పెట్టి ఓదార్చ సాగింది రజిత.

మొగనికి ధైర్యం సెప్పింది కానీ ఆమె మనసులో కూడా భయం లేకపోలేదు. ఇద్దరూ భయపడ్తూ కూర్చుంటే పిల్లలు, సంసారం ఆగమైతయని ఆమెకు తెలుసు. అందుకనే ధైర్యం చూపసాగింది.

కానీ, తనను తాను ఎంతసేపు ఊరడించుకోలేకపోయింది. బస్కెక్కి బుర్రున తల్లి

దగ్గరికొచ్చింది.

జరిగిందంతా విని తల్లి లచ్చవ్వ మాట్లాడబోతుంటే పోలోమని గూడెం పెద్దలు కట్టకట్టుకొని వచ్చింరు సాలయ్య కోసం.

'ఏందిరా! అందరూ ఒక్కపాలే కట్టకట్టుకొని వచ్చింరు. ఏం సంగతి' సాలయ్య వచ్చిన వాళ్ళను ప్రశ్నించిండు.

'మావా మర్చిపోయినవ! పది రోజులైతే మేడారం జాతర! మన గూడెం పక్కనే లింగంపల్లి చిన్న జాతర! మేడారం కంటే ముందే లింగంపల్లి పోవాల. అక్కడ దర్శించుకొని సాయంకాలం నిద్ర చేసి తెల్లారి మేడారం పోవాల. లింగంపల్లి జాతరకు పొయ్యే ముందు గూడెంల గొఱ్ఱెపోతును కొయ్యాల! ఆ పోతును ఎప్పుడూ నువ్వే ఇస్తవుగద! అందుకని వచ్చినం'

సాలయ్యకు నోట మాట రాలేదు. సమస్యలల్ల పడి జాతర సంగతే మర్చిపోయిండు.

లోపలికిపోయిండు. అమ్మోరికి దణ్ణం పెట్టుకున్నడు. 'నువ్వే కాపాడుతావ్ నాకు తెలుసు తల్లీ' అన్నడు. రెండు నిమిషాలు కండ్లు మూసుకుని కూర్చుండు. తర్వాత బయటికి వచ్చిండు. ముఖంల కొత్త కాంతి.

'సర్లెండి! నేనిచ్చేది నేనిస్త! అందరు కలసి ఏర్పాట్లు చేయండి. ఏదైనా కొట్లాటలు లేకుండ కల్సి చేసుకోండి' దృఢంగా పల్కిండు సాలయ్య! ఆ మాటలు విని గూడెం వాసులు వెళ్ళిపోయిర్రు.

వెంటనే బిడ్డకు సెప్పిండు.

'బిడ్డా! నువ్వు ఉన్న పళంగ ఇంటికి పో. రంది మీద ఉన్న పెనివిటిని ఇడిచి పెట్టి గిట్ల రావడం మంచిది కాదు. రెండు, మూడు రోజులల్ల అమ్మ నీ దగ్గరకొస్తది. నిన్ను, అల్లున్ని పిల్లలను తీసుకుని ఇక్కడికి వస్తది. ఎట్లాగూ జాతరకు రావల్సిందే కదా! కాకపోతే ఓ మూడు నాల్గు రోజుల ముందే ఇక్కడకు రండి. బాబాయ్‌లను, మామయ్యలను, చెల్లెళ్ళను అందర్నీ పిలుస్త. ఒకరోజు లింగంపల్లి పోవాల. మూడు రోజులు మేడారం పోవాల. అన్నీ మర్చిపోయి ఓ వారం పదిరోజులు హాయిగ ఉండండి. జాతర ఐనంక నీ బాధ సమ్మక్కనే తీరుస్తుంది' దృఢంగా పలికిండు సాలయ్య.

లచ్చవ్వ వెంటనే లోపటికెళ్ళి డబ్బు గురిగిలో తాను దాచిన డబ్బులు నాలుగొందలుంటే అవి బిడ్డకిచ్చి బస్సెక్కిచ్చి వచ్చింది. అల్లున్ని, పిల్లలను జాగ్రత్తగ సూసుకోమని సెప్పింది. చిన్న చిన్న కష్టాలకు భయపడొద్దని సెప్పింది.

* * *

లింగంపల్లి ఊరు ఊరంత పండుగ వాతావరణం. యే ఇల్లు చూసినా మావిడాకుల తోరణాలు, ముగ్గులు, ఇంటినిండా చుట్టాల కోలాహలం. ఆడ బిడ్డలతోటి వదినా మరదళ్ళ

సరసాలు. బావాబామ్మర్దుల సంబరాలు. జనమంతా ఇళ్ళలోనే ఉండడం లేదా జాతరలో ఉండడం జరిగింది. ఊర్లో రోడ్లు నిర్మానుష్యంగైనయి. అందుకే పండుగ అంటే నల్గురిలో ఉండటం, నవ్వుతూ ఉండటం..

వడ్డెరగూడెం నుండి ఐదారు ట్రాక్టర్లు బయల్దేరినయి. ఒకదాంట్లో సాలయ్య కుటుంబం ఉంది. అందరూ వచ్చిండు. లింగంపల్లి జాతరల స్థలం చూసుకుని టెంట్ వేసుకున్నరు. మొక్కులు తీర్చుకున్నరు. ఆ రాత్రి అక్కన్నే నిదుర చేసింరు. తెల్లారి మేడారం బయల్దేరింరు.

రోడ్డంతా వేలాది వాహనాల సందడి. 100 కిలోమీటర్ల ప్రయాణానికి దాదాపు ఇరవై నాల్గు గంటలు పడుతుంది.

మేడారం అంటే కోటిమంది ఒక్కటయ్యే జాతర! అమ్మను నమ్ముకుంటే బాధలు, రందులు ఉండవన్న విశ్వాసానికి ప్రతీక!!

ఆ విశ్వాసమే కోట్లాదిమందిని అలసట యెరుగకుండా మూడు నాలుగు రోజులు పరమానందంతో అక్కడికి అడుగులు వేయిస్తుంది.

అక్కడికి చేరుకునే సరికి తెల్లారింది. అక్కడొక ఆవాసంలో వసతి సౌకర్యాలు చూసుకొని జంపన్న వాగుకు స్నానాల కోసం చేరుకుంది సాలయ్య కుటుంబం.

జంపన్న వాగులో మునుగుతున్న అల్లుడు ఎంకటేశం ముఖంలో ఏదో కొత్త వెలుగు. చావుకళ, బాధ, రందితో నీరసించిన ఆ ముఖం ఇన్నాళ్లకు మళ్ళీ జీవం తెచ్చుకుంది.

సాలయ్యకు ఆనందమన్పించింది. చుట్టూ చూశాడు. లక్షలాదిమంది అమితమైన విశ్వాసంతో మునిగి తేలుతున్నారు. అమ్మఒడిలో సేదతీరుతున్న పసిపిల్లల్లా ఉన్నారు జనం. ఆనందం, కేకలు, కేరింతలు..

అందరి మనసులోనూ అమ్మే.. ఆమెపై అచంచలమైన విశ్వాసమే.

రజిత ఇద్దరు కొడుకులను మొగన్ని కలిసి నలుగురూ చేతులు పట్టుకుని మునిగి తేలినాక చెప్పసాగింది. చదువుకున్న అమ్మాయి. నాల్గు రోజుల నుంచి సమ్మక్క సారలమ్మ పుస్తకంలోని విశేషాలు చదివింది. 'మావా! కాకతీయరాజులపైనే ఒంటి చేత్తో పోరాటం మొదలు పెట్టింది. ఏ దశలోనూ వెన్నుజూపకుండా మొక్కవోని ధైర్యంతో పోరాడింది. ఇక్కడ మనం తెల్సుకోవాల్సింది గదే మావా! పిరికి పందల్లా పారిపోకుండా సమస్యలకు ఎదురీది పోరాటం సెయ్యాల! పెద్దోడా! చదువుకునే పిలగానివి నువ్వు. నీ చదువుల నువ్వు సాధించాల! మా పనులల్ల మేం సాధించాల! మనసు గట్టి చేసుకొని పట్టుదల పెంచుకోండి. భీరువులుగా వచ్చి ధీరులుగా పోవాలె జంపన్న వాగుల మునిగితే. తాగుడుకు తినుడుకు కాదు ఇక్కడికి వచ్చేది. అమ్మల పోరాటపటిమ తెల్సుకోని జీవితంల పోరాటం చేయ్యాల. గెలవాల' ఒకదేవత వలికినట్లుగా గంభీరంగా వినబడుతున్న మాటలు వెంకటేశంను, పిల్లలను ఏదో అలౌకిక ఆనందానికి అనుభూతికిలోను చేయసాగినయ్. పక్కనే ఉన్న మైకుల పాటలు వినబడుతున్నాయి. 'కాకతీయుల మీద కదం

తొక్కిన తల్లి మా అమ్మ సమ్మక్క మా అమ్మ సారమ్మ దయిజూపవే' అంటూ వస్తున్న ఆ పాటలు వారిని పునరుజ్జీవితులను చేశాయి.

* * *

జాతర ముగిసింది. ఎవరిండ్లల్లకు వారు చేరుకున్నరు. సాలయ్య శెట్టి దగ్గర భూమి కాయతాలు పెట్టి రెండు లక్షలు తెచ్చిండు. శెట్టి గల్ల పెట్టిల కాగితాలు గర్వపడుతున్నయి సాలయ్య కొచ్చిన కష్టం తీర్చినమని. కాకపోతే తల్లి చేతుల్నించి వెలయాలు చేతుల పడ్డట్టు బాధపడుతున్నయి కూడా.

ఆ డబ్బులల్ల ఒక లక్ష రూపాయలు తీసి పెద్ద అల్లునికిచ్చిండు. బిడ్డను అల్లుడిని కూర్చోబెట్టి సంబరంగ పైసలు ఇయ్యబోయిండు. అల్లుడు తీసుకోలేదు. సాలయ్య ఆశ్చర్యపోయిండు.

గత నాలుగైదు నెలల నుంచి డబ్బుల కోసం వెంపర్లడుగున్న అల్లుడు హఠాత్తుగ డబ్బులు వద్దని చెప్పే సరికి లచ్చవ్వ, సాలయ్య కొయ్యబారిపోయింరు.

'గిదేందే! రజిత! మీ అయ్య మీరు ఆనందంగా ఉండాలని డబ్బులు తెచ్చిండు. ఇప్పుడొద్దంటున్నరేంది' తేరుకున్న తల్లి రజితను ప్రశ్నించింది.

రజితకు కూడా అర్థం కావడం లేదు. ఆశ్చర్యంగా భర్త ముఖంలోకి చూసింది. కట్టం వస్తే పోరాటం సెయ్యమని సెప్పింది. ఈ సారి మీరు నా కష్టం తీరుస్తరు. మల్లింకోపాలు నాకీ కట్టం వత్తే ఎవరు తీర్చాల? ఎవరి కట్టం వారే తీర్చుకోవాల. ఆ ధైర్నం కవాల. మీ డబ్బులు వద్దు మీ ప్రేమ చాలు మాకు' ఆలోచిస్తూనే చెప్పిండు వెంకటేశం.

'నాయనా! అవసరమైతే నా డబ్బులు నేనే సంపాదించుకుంటా. ఒక్కరోజు ట్రాక్టర్ లోడ్ దింపితే వెయ్యి రూపాయలొస్తయి నాకు. నువ్వేం భయపడొద్దు. మనకు అమ్మమ్మ పైసలే వద్దు' పెద్ద కొడుకు నరేష్ చెప్పిండు.

'సరే! ఇంకోసారి తీసుకోకండి! ఈ ఒక్కసారి తీసుకోండి. చేబదులుగా తీసుకోండి. మళ్ళీ ఇయ్యండి' అని అత్త లచ్చవ్వ చెప్పినా ససేమీరా వినలేదు వెంకటేశం.

ఔను! పోరాట పటిమ ఒక కుటుంబాన్ని గెలిపించింది.

వీరి గెలుపుతో ఓటమినంగీకరించిన సూర్యుడు మెల్లగా పడమటి కొండల చాటుకు జారుకున్నాడు.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 193



# ఒక ఆకుపచ్చని ఆశ!

బి. మురళీధర్

**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సొనాలా గ్రామంలో మురళీధర్ 1955లో జన్మించారు. సుమారు 35 యేండ్లు వ్యవసాయ శాఖలో విస్తరణ అధికారిగా పనిచేసి 2013లో ఉద్యోగ విరమణ పొందారు. 1975లో హైదరాబాద్‌లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభల్లో విద్యార్థి ప్రతినిధిగా పాల్గొన్న ఆయనకు అప్పటి నుంచీ తెలుగు భాషపై మమకారం పెరిగింది. కవిత్వంతో మొదలైన ఆయన సాహితీ ప్రస్థానం కథ, నవల, నాటక రచనల వరకూ సాగింది. ఇప్పటి వరకు ఆయన రాసినవి 21 కథలు. వాటిలో 14 కథలు వివిధ పత్రికలు, కథల పోటీల్లో బహుమతులు పొందాయి. 1995లో 'నిరుడు కురిసిన కల' నవల ఆంధ్రప్రభ నవలల పోటీల్లో మొదటి బహుమతి అందుకున్నది. వ్యవసాయంలోని వివిధ అంశాలపై రాసిన 150 లఘునాటికలు 'ఆకాశవాణి' ద్వారా ప్రసారమయ్యాయి. సాహితీరంగంలో రచనలకు అనేక పురస్కారాలు అందాయి.

**'మీరంతా ఉత్సాహం ఉరకలేస్తున్న యువకులు!** ఈ రోజుతో మీరు ప్రయోజకులయ్యారని యూనివర్సిటీ మీకు పట్టాలిస్తున్నది. దేవుని గుడిలాంటి ఈ బడిలో మీరు సంపాదించిన జ్ఞానమంతా మన దేశానికి పనికిరావాలి! ముఖ్యంగా మన పల్లెల్లో వ్యవసాయ జూదంలో తమ బతుకుల్నే ఫణంగా పెడుతున్న రైతన్నలకు, మన అన్నదాతలకు మీ విజ్ఞానం కొండంత అండగా నిలుస్తుందని వ్యవసాయశాఖ మంత్రిగా ఆశిస్తున్నాను. మీలాంటి యువకులు పంటపొలాల్లోకి దిగాలే గానీ..! మనదేశంలో ఒక్కటంటే ఒక్క ఆకలిచావు కూడా ఉండబోదని నేను ఈ సభాముఖంగా ప్రకటిస్తున్నాను!'

వ్యవసాయశాఖ మంత్రివర్యుల ప్రసంగం ఎంతో ఆవేశంగా, స్ఫూర్తిదాయకంగా సాగు తున్నది. వ్యవసాయవర్సిటీలో చదువు ముగించుకొని బయటి ప్రపంచంలోనికి అడుగుపెడు తున్న పట్టభద్రుల పట్టాల ప్రదానోత్సవసభ ఆకుపచ్చని మొక్కల అలంకారాలతో హరితసభగా అనిపిస్తున్నది. మంత్రిగారి ప్రసంగానికి పిల్లలు బాగా ఉత్తేజితులవుతున్నట్లు వాళ్ళ మొహాలు చూస్తేనే తెలుస్తుంది. మంత్రి గారి మాటల గారడీ మాయలో పడిపోయి నిశ్శబ్దంగా వింటున్నారు.

'మీరు ఇప్పుడు మీ తాత ముత్తాతల కాలంలోలాగా మేడిపట్టుకొని అరక దున్నక్కరలేదు. కొడవలి చేత పట్టుకొని కోతలు కోసే పనిలేదు! అన్నీ యంత్రాలే చేస్తాయి! అదిగో ఆ ప్రదర్శనలో ఉన్న యంత్రాలు వీటిని నడిపే వారికోసం ఎదురుచూస్తున్నాయి. సబ్సిడీ మీద ప్రభుత్వం

అందించే ఈ యంత్రాలతో వ్యవసాయం రూపరేఖల్నే మార్చేసి ఈ దేశ ప్రజలకు ఇంత అన్నం పెట్టి, అన్నదాతలనే పేరును సార్థకం చేసుకోవాలని మిమ్మల్ని బలంగా కోరుతున్నాను. కాబోయే యువ రైతుల్లారా! లేవండీ! నడుం బిగించండి!'

* * *

లుంగీని నడుంచుట్టూ బిగించుకొని లేచాడు గంగాధర్. 'అవ్వా! నేను గట్ల మన చేనుదాకా వోయస్తనే!' అన్నాడు వంటింట్లో ఉన్న తల్లితో.

'ఏందిరా సిన్నోడా! చేనుకాడికి బోతవా? గంతదూరం నడిచిపోతవా? నీకు ఎండల తిరిగే అలవాటు యాడున్నదిరా! నల్లబడిపోతవురా కొడుకా! ఇగో నీ కోసం ఉడుకుడుకు పాల కడియాలు బోస్తున్న. మక్కగారెలు అయినయి. ఇవ్విదిని గా పందిరి కింద సల్లగ పండుకో సిన్నా! నిన్ననే పట్నం కెల్లి అస్తివి గదా!' ఎంతో ప్రేమగా అన్నది లచ్చుమమ్మ. ఉన్న ఒక్క కొడుకు పట్నం కెల్లి సెలవులకు ఇంటికస్తే ఇష్టమైన ఫలహారాలు జేసిపెట్టి పోయేటప్పుడు మళ్ళీ అన్నీ కట్టిచ్చుడు లచ్చుమమ్మకు అలవాటే.

'లేదవ్వా! మళ్ళ అచ్చినంక దింటగని, బాపు గూడా చేండ్లనే ఉన్నడు గదా! ఏం జేస్తున్నడో సూసస్త!'

'ఆడ నీకేం దెలుస్తదిరా! పట్నంల సదువుకొని అచ్చినోడివి. నీకు మనసేను తొవ్వ గూడా సక్కగ దెల్వది. నువ్వేం ఎగుసం జేసేదున్నదా ఏంది మంచిగ పెద్ద సర్కారీ నౌకరీ జేసుకో! గివన్నీ నీకెందుకురా!'

'నేను సదివిందే ఎగుసాయం సదువే అవ్వా! సర్కారీ నౌకరీలు యాడన్నా కుప్పవోసి ఉన్నయా, పిసికి మనకియ్యటందుకు! గివన్నీ నీకు దెల్వది గని, నేను పోయొస్తా!' అని గంగాధర్ చేను తొవ్వపట్టిండు. తొవ్వ నడుస్తున్న గంగాధర్ చెవుల్లో మొన్నటి మంత్రి గారి ప్రసంగం ఇంకా వినిపిస్తూనే ఉంది. అవును! నేను వ్యవసాయం చేస్తాను! ఈ దేశంలో అన్నార్తుల ఆకలి తీర్చడానికి పంటలు పండిస్తాను. ఏదన్నా చేసి చూపించాలి! తనకు సొంత భూమి ఉండనే ఉంది! మొన్నటి నుండే తాను ఒక అద్భుతమైన కలగంటున్నాడు. ఆ కలను నిజం చేసుకోవాలి! 'ముందు కలలు కనండి! ఆ తర్వాత వాటిని నిజం చేసుకోండి!' అన్న అబ్దుల్ కలాం మాటలు తననెంతో ప్రభావితం చేశాయి. హాస్టల్లోని తన గదిలోని గోడకు అందంగా రాసిపెట్టుకున్న మాటలు అవి. చేను గట్ల మీద హుషారుగా నడుస్తున్నాడు గంగాధర్.

దూరంగా నాలుగు పెద్ద మామిడి చెట్లు కనిపిస్తున్నాయి. అవి వాళ్ళ చేండ్లోనే ఉన్నాయి. చిన్నప్పుడు స్నేహితులతో కలిసి ఆ చెట్లపై కోతికొమ్మచ్చి ఆడుకున్న జ్ఞాపకాలు! రఫ్ కాపీలో నుండి చింపుకొన్న కాయిదాలలో ఉప్పూకారం పొట్లాలు కట్టుకుని వచ్చి, మామిడి కాయలతో అద్దుకొని తిన్న రుచి జ్ఞాపకానికి వచ్చి నోట్లో నీళ్ళూరినాయి గంగాధర్‌కు. చిన్నప్పటి జ్ఞాపకాలు ఒకొక్కసారి నోట్లోనే కాదు కంట్లో కూడా నీళ్ళను ఊరిస్తాయి. అంతటి శక్తి ఆ జ్ఞాపకాలకు ఉంది మరి!

ఆ చెట్లముందున్న చెలుక భూమి ఎండకు మరింత ఎర్రగా కనిపిస్తోంది. ఎన్నో ఎగుళ్ళు దిగుళ్ళతో, మధ్యమధ్యలో బీడుగా వదిలేసిన బండరాయి బొగుడలతో అనాకారిగా కనిపిస్తోంది. గంగాధర్ యూనివర్సిటీలో ప్రయోగాలు చేసిన పొలాలు ఎంతో సమతలంగా స్కేలుతో గీతలు గీసి కొలతలు వేసినట్లుగా ఉంటాయి. అలాంటి చతురస్రపు మడులలో వేసిన పంటలు గూడా కంటికి ఇంపుగా కనిపిస్తాయి. తన భూమిని చూసిన గంగాధర్‌కు ఎంత నిరాశ, నిరుత్సాహం కలిగినాయి.

దూరంగా మట్టి పెల్లల్లో పెల్లగా కలిసిపోయిన గంగాధర్ తండ్రి మల్లయ్యను తలమీద తెల్లని పటుక ఆధారంగా గుర్తుపట్టాడు. చేతిలో చిన్న గడ్డపారతో ఏదో తవ్వుతున్న తండ్రి వద్దకు చేరుకున్నాడు గంగాధర్. 'బాపూ' అని పిలిచాడు.

'ఓరి సిన్నా! నువ్వెప్పుడొస్తివిరా? గింత ఎండలవడి అచ్చినవు. ఇప్పుడేముంటయిరా ఈడ సూడతందుకు! రానేం అచ్చినవు పోయి ఆ సెట్లనీడ కింద గుసుండుపో! నాపనిగాంగనే ఇద్దరం కలిసి ఇంటికివోదం!' అన్నాడు.

'అట్ల గాదే బాపూ! నేను మన సేను సూద్దమనే అచ్చిన! నేను సద్వే సదువు ఎగుసాయం సదువని నీకు ఎరుకనే గదా! నేను గూడా నీతో కలిసి ఎగుసం జేద్దమని అంటున్నా బాపూ!'

మల్లయ్య తవ్వుతున్న పని ఆపి గంగాధర్‌ను చూశాడు ఆశ్చర్యంగా! 'గన్ని పైసలు వోసి పట్నంల సదివిపిస్తే మళ్ళ నువ్వు గూడా నాలా ఎగుసం జేస్తనంటే ఏమన్నా మతలబున్నాదిరా సిన్నా! ఏదన్నా ఇంత సర్కారీ నౌకరి జేసుకొని నీడపట్టుకు సుఖపడ్తవనే గదా నిన్ను సదిపిచ్చింది.! మల్లయ్య ఇంటిమీద నుండి ఊరుతున్న చెమట సుక్కలు, రాతి నుండి ఊరుతున్న స్వచ్ఛమైన ఊటనీరులా మెరుస్తున్నాయి. నిజంగానే అతని శరీర రంగూ, రూపూ నల్లరాయి బండకన్నా తక్కువేం కావు.

'పోదాం పా! ఇంటికి వోయి మాట్లాడుకుందాం!' లేచాడు మల్లయ్య.

* * *

ఆ బ్యాంకు మేనేజర్ కూడా ఉత్సాహం ఉరకలేస్తున్న యువకుడే. గంగాధర్‌లాగా వ్యవసాయ పట్టభద్రుడు కూడాను. గంగాధర్‌లాగా వ్యవసాయం చేద్దామన్న కలలు గన్నవాడే. కానీ, ఉద్యోగం రాగానే తల్లిదండ్రుల మాట కాదనలేక చేరిపోయాడు. ఆయన గంగాధర్ ప్రణాళికలన్నీ విన్నాడు. స్వయంగా వెళ్ళి గంగాధర్ చేను చూసివచ్చాడు. గంగాధర్‌లో తనని చూసుకున్నాడేమో గానీ, నేల చదును చేయడానికీ, బోరు వేసుకోవడానికీ అవసరమైన ఋణం మంజూరు చేసి చేతికందించాడు.

తన ఎర్ర చెలక గర్భంలో నుండి పాతాళగంగ పైకి పొంగి పొర్లుతుంటే మల్లయ్య దంపతుల కళ్ళల్లో నుండి ఆనందభాష్పాలు అంతేధారలుగా పొంగిపొర్లాయి. తన చెలకలో నీళ్ళు పారడమన్నది మల్లయ్య ఒక జీవితకాలపు నెరవేరని కల. కానీ, ఇప్పుడు కొడుకు అపర భగీరథుడై పాతాళగంగను పైకి రప్పించాడు. ట్రాక్టర్లూ, బుల్‌డోజర్లూ చేను స్వరూపాన్ని

మార్చేశాయి. పాతాళగంగ పారడానికి సిద్ధంగా ఉంది. అన్నింటికీ తోడు ప్రభుత్వం అప్పుడే వ్యవసాయదారులకు ఇరవై నాలుగు గంటల ఉచిత కరెంటు పథకాన్నీ ప్రకటించింది. వ్యవసాయం చేయడానికి ఎవరికైనా ఇంతకంటే అనుకూలమైన పరిస్థితి ఇంకేముంటుంది? మంత్రిగారి మాటలు గంగాధర్ చెవుల్లో ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి.

* * *

'చూడు గంగాధర్! నేనిప్పుడు నీకు అప్లికేషన్ ఫారమ్ ఇచ్చినా అది నీకు ఎందుకూ పనికిరాదు! దానిమీద మీ ఎంపీటీసీ సంతకం, మీ ప్రాంత జడ్పీటీసీ సంతకం, ఆ తర్వాత మీ యంఎల్ఏ సంతకం అయితేనే దానికి విలువ!'

రైతులకు మినీ ట్రాక్టర్లు సబ్సిడీ మీద ఇస్తున్నారని తెలిసి సంబంధిత అధికారి వద్ద దరఖాస్తు చేయడానికి వచ్చాడు గంగాధర్.

'అదెమిటిసార్! మీరు గూడా అట్లంటరు! మీరు నాకేం సహాయం చేయలేరా! మీరు చదువుకున్న యూనివర్సిటీ నుండే వచ్చాను! కనీసం ఆ అభిమానంతోనన్నా!' గంగాధర్ మాట విని నవ్వాడు ఆ అధికారి.

'అభిమానం! ఇక్కడ అన్ని అభిమానాలను చంపుకొని పనిచేస్తున్నాం! మనకు అక్కడ కాలేజీలో నేర్పిందొకటి! ఇక్కడ మేం నేర్చుకుంటున్నది మరొకటి! మేం వాళ్ళ మాట దాటడానికి వీల్లేదు! ఈ విషయంలో ప్రభుత్వం కూడా స్పష్టమైన ఉత్తర్వులిచ్చింది. మేం ఏమిచ్చినా, ఎవరికిచ్చినా ప్రజాప్రతినిధుల ఆమోదం తీసుకున్న తర్వాత ఇవ్వాలని! మరి వాళ్ళు గూడా వాళ్ళ కార్యకర్తలకి న్యాయం చేసుకోవాలి గదా?'

గంగాధర్ నిరాశ పడడం చూసి ఆ అధికారికి కొంత జాలివేసింది!

'రా! గంగాధర్! అలా ఛాయ్ తాగి వద్దాం!' అంటూ బయటకు తీసుకువెళ్ళి చాలాసేపు గంగాధర్‌కు విషయమంతా వివరించి చెప్పాడు.

'పని కావాలంటే అదొక్కటే మార్గం! అయినా అవుతుందన్న గ్యారంటీ లేదు. నీ మీద అభిమానంతో, వ్యవసాయం చేస్తానని బయలుదేరావు కాబట్టి చెప్పాను! నీ ఇష్టం'

'సగం సబ్సిడీ పోతుంది కదా సార్!'

'అంతేకదా మరి!'

'ఆ యంత్రాలు తమను నడిపే వారికోసం ఎదురుచూస్తున్నాయి! కదలండి!' అంటూ ఆనాడు మంత్రిగారు చేసిన ప్రసంగం గంగాధర్ చెవుల్లో వినపడ్తూనే ఉంది!

* * *

అప్పుడే కోసిన టమాటా క్రేట్లను మినీట్రాక్టర్ ట్రాలీలో వేసుకొని రైతుబజార్‌కు బయలుదేరాడు గంగాధర్. అనేక కుట్రకుతంత్రాలతో కూడిన యుద్ధరంగంలో గెలిచిన వీరుడి

మొఖంలో కన్పించే గొప్ప విజయగర్వం గంగాధర్ మొఖంలో తొణికిసలాడుతున్నది. గత పదిహేను రోజుల్లో రెండుసార్లు పంటను మార్కెట్‌కు తెచ్చాడు. మంచిధర పలికింది. ఇప్పుడు దిగుబడి ఇంకా మంచిగ వస్తున్నది ధర ఇలాగే ఉంటే కొంతలాభం రావచ్చనుకుంటున్నాడు. జిల్లా కేంద్రంలోని రైతుబజార్ తమ ఊరికి దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరం ఉంటుంది.

రైతుబజార్ చౌరస్తా అంతా కోలాహలంగా ఉంది. ఏదో మీటింగ్ జరుగుతున్నట్లుంది. మధ్యమధ్యలో 'నశించాలి!' అంటూ నినాదాలూ వినిపిస్తున్నాయి.

'పోశెట్టి కాకా! ఆ చౌరస్తాల ఏమయితున్నదే! మంది బాగా నిండింద్రు!' తన ఎదురుగా ఖాళీ బుట్టలను నెత్తిమీద పెట్టుకొని వస్తున్న పోశెట్టిని అడిగాడు గంగాధర్.

'ఇంకా నీకెరుక గాలేదా! ఇయ్యాల టమాటా రైతులందరూ టమాటాలు చౌరస్తాల పారబోసి ధర్నా జేస్తున్నారు. నిన్నటిసంది నడుస్తున్నది ఈలొల్లి! పోయి నువ్వు గూడా మీటింగుల గూసుండుపో!'

ట్రాక్టరు తన మనుషులకప్పజెప్పి చౌరస్తా వైపు నడిచిండు గంగాధర్.

ఆ చౌరస్తా మధ్యలో టమాటాలు గుట్టలుగా పోసి ఉన్నాయి. పక్కనే చిన్న వేదిక మీద మైకులో ఎవరో ఎర్రచొక్కా వేసుకున్న నాయకుడు మాట్లాడుతున్నాడు. ఆయన పక్కన ఇంకా రకరకాల రంగుల చొక్కాలూ, కండువాలు వేసుకున్న నాయకులు నిలబడి ఉన్నారు.

'రైతు సంక్షేమం కోసమే మా ప్రభుత్వం పనిచేస్తోంది అని రైతు పేరున రామనామ జపం చేస్తున్న ఈ ప్రభుత్వం రైతులకోసం ఏం చేసిందో చెప్పాలి! ఇరవై నాలుగు గంటలు ఉచిత కరెంటు ఇస్తే సరిపోతుందా? రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన ధర ఇప్పించ రాదా! ఇక్కడి సరుకును పక్క రాష్ట్రాలకు తరలించి అక్కడ అమ్ముకోనిస్తే రైతు బాగువడతాడు కదా! ఏం చేస్తుందీ ప్రభుత్వం'

నాయకులు ఒక్కక్కరు మాట్లాడుతున్నారు.

'ఈ ప్రాంతం టమాటా పండించే రైతులను ఆదుకోవడానికి జ్యూస్ ఫ్యాక్టరీలు తెరిపిస్తామన్న ఎన్నికల హామీని తుంగలో తొక్కింది ప్రభుత్వం!' అర్థం తెలియకపోయినా పత్రికల, చానెళ్ళ భాష అందరు నాయకులకు పట్టుబడింది.

'మన రాష్ట్రానికి పొరుగు రాష్ట్రాల నుండి కూరగాయలను తెప్పించుకోవాల్సిన ఖర్మ పట్టిందని ఇక్కడి రైతులను బాగా ప్రోత్సహించి సాగుచేయించారు. పండిన పంటను గిట్టుబాటుధరకు అమ్మిపెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే కూరగాయల దిగుమతిని వెంటనే ఆపివేయించాలి'

ఆ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు టమాటా రైతుల గురించి తక్కువగా, ప్రభుత్వాన్ని తిడుతూ ఎక్కువగా మాట్లాడుతున్నారు. గంగాధర్‌కు అసలేం అర్థం కావడంలేదు. వారం కింద ఇరవై రూపాయలకు కిలో ధర పలికిన టమాటా ఈ రోజు రూపాయికి కిలో కూడా

ఎవరూ కొనడం లేదంటే– అసలేం జరిగింది?

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత కరెంటును వాడుకొని, భూగర్భజలాలను అత్యధికంగా వినియోగించుకొని రైతులంతా ఆ ప్రాంతంలో ఒకటే రకం పంట పండించడంతో వచ్చింది అసలు చిక్కు. వాతావరణం కూడా అనుకూలించడంతో వేసినపంట వేసినట్లు బాగా దిగుబడులు వచ్చాయి. దాంతో చుట్టు పక్కల యాభై గ్రామాల నుండి వచ్చిన టమాటాలు మార్కెట్‌ను ముంచెత్తడంతో ఈ పరిస్థితి వచ్చింది.

ట్రాక్టరును ఊరు బాటకు మళ్ళించి, ఎప్పటిలా ఖాళీ ట్రాలీతో గాకుండా నిండుట్రాలీతో వాపసు వెళ్తున్నాడు గంగాధర్. వ్యవసాయ వైకుంఠపాళీలో రెండు నిచ్చెనలను అతికష్టం మీద ఎక్కిన గంగాధర్‌ను పాము మింగడంతో మళ్ళీ కిందకి జారిపోయాడు. యుద్ధరంగంలో ఓడిపోయి (కూర) గాయాలతో ఇంటికి వెళ్తున్న యోధుడి మొహంలోని నిర్లిప్తత గంగాధర్ మొఖంలో కనిపిస్తున్నది.

* * *

'నేను ముందే నీకు సెవిన జెప్పిన గదరా సిన్నా! ఎగుసం జేసుడు వద్దు! మంచిగ నౌకరి జేసుకోరా అన్నా! ఇనకపోతివి! మనం ఎంత మెహనత్‌జేసి పండిచ్చినా ఆకరికి అమ్మెతందుకువోతే అడివే! ఎవడు మన పక్కకు నిలబడడు' మల్లయ్య అన్నాడు.

'ఎగుసం జేసేటోడికి ఎంతున్నా ఇయాళరేపు పిల్లనియ్యతందుకు గూడా ఎనకాముం దవుతున్నరు' లచ్చుమమ్మ బెంగగా అన్నది.

'ఎగుసం జేసే రైతును ఎవ్వడు బాగుపడనియ్యడురా గంగన్నా! ఇత్తనాలు అమ్మెటోడు, ఎరువులమ్మెటోడు, మందులమ్మెటోడు, ఆకరికి పంటగొనేటోడు అందరు– అందరూ రైతుకు దుష్మన్‌లే! ఇన్నవా'

'ఈ దుష్మన్‌లతోటి యుద్ధం జేద్దాం బాపూ! గట్ల ఒక్కసారికే కాడి ఎత్తేసి, కాళ్ళు జాపి కూలవడితే బతుకుతమా బాపూ! సూస్త! ఈళ్ళందరి సంగతీ జూత్త! కానీ నేను మాత్రం ఎగుసం బందు వెట్ట అవ్వా! పిల్ల దొరకదని ఫికరు బడకు. ఉంటదిలే నా అసుంటి మొండిదే యాడనో ఒక తావుల!' గంగాధర్ తల్లిదండ్రుల్ని సముదాయించాడు.

* * *

ట్రాలీనిండా రకరకాల కూరగాయల్ని నింపుకొని స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ రైతుబజార్‌కు బయలుదేరాడు గంగాధర్. ట్రాలీలో కనీసం మూడురకాల ఆకు కూరలూ, నాలుగైదు రకాల కాయగూరలూ ఉన్నాయి. ఇప్పటి దాకా వచ్చిన అనుభవంతో ఒకటే పంటపై ఆధారపడకుండా రకరకాల కూరగాయలను సాగుచేస్తున్నాడు గంగాధర్. అమ్మకాలు కూడా ఆశాజనకంగా ఉండి ఇదివరకు వచ్చిన నష్టాలు పూడిపోయేట్లు ఉన్నాయి. శత్రువులెందరు అడ్డగించినా యుద్ధంలో అలుపెరుగని యోధుడిలా పోరాడి గెలుపు సాధించే యోధుడిలా

కనిపిస్తున్నాడు గంగాధర్. నిజానికి కాలేజీ నుండి వచ్చిన గంగాధర్‌కూ, ఇప్పటి గంగాధర్‌కూ పోలికే లేదు. గెలిచి తీరాలన్న తపనతో రాత్రీపగలూ మట్టితో మమేకమై రంగు మారిపోయి, పూర్తి రైతు రంగులోకి మారిపోయాడు. నిజమైన రైతులెవరూ రంగు తేలి ఉండరు. ఉన్న రంగును కూడా పోగొట్టుకొని కొత్త రంగులోనికి మారిపోతారు. ఆ రంగు పేరు శ్రమశక్తి వర్ణం.

రైతుబజార్ చౌరస్తాలో ఏదో సమావేశం జరుగుతోంది! తన ట్రాలీ నుండి కూరగాయలను దించి దుకాణం పేర్చమని తన మనుషులకు చెప్పి మీటింగు వైపునకు నడిచాడు గంగాధర్.

'సామాన్య మానవుడి కష్టాలు తీర్చలేని ఈ ప్రభుత్వం అధికారం నుండి తప్పుకోవాలి! కూరగాయల ధరలు సామాన్యుడి జేబుకు గాయాలు చేస్తున్నాయి. ఏది కొందామన్నా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి!' పత్రికలు టీవీల వాళ్ల పుణ్యమా అని గల్లీ లీడరు కూడా పత్రికా భాష మాట్లాడుతున్నాడు.

గంగాధర్‌కు వెంటనే గుర్తుకు వచ్చింది! అవును ఈ నాయకుడే ఆ రోజు టమాటాలని చౌరస్తాలో పోయించి రైతులకు న్యాయం జరుగాలని గొంతు చించుకున్నది! ఇప్పుడేమో రైతులు కూరగాయల ధరలు పెంచేశారని తగ్గించమని రైతులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు.

'మన రాష్ట్రంలో కూరగాయలు పండించడం చాతగాకపోతే ప్రభుత్వం వెంటనే పక్క రాష్ట్రాల నుండైనా కూరగాయలను దిగుమతి చేసుకొని వినియోగదారులను ఆదుకోవాలి!'

ఈ నాయకుడే ఆ రోజు పక్క రాష్ట్రాల నుండి కూరగాయలను తెప్పించడం అడ్డుకొని రైతులను ఆదుకోవాలని గట్టిగా మాట్లాడింది. ఈ రోజు సరిపడా కూరగాయలను పక్క రాష్ట్రాల నుండి తెప్పించమంటున్నాడు.

'సామాన్యుడి బతుకు మరింత భారం చేసే కూరగాయల ధరలను వెంటనే తగ్గించాలి! లేదా ప్రభుత్వమే సబ్సిడీ మీద కూరగాయలను ప్రభుత్వ దుకాణాల ద్వారా, రైతుబజార్‌లో అమ్మాలి!'

ఈ నాయకుడే రైతులకు గిట్టుబాటుధర లభించకపోతే అమరణ నిరాహార దీక్ష చేస్తానన్నది. ఇప్పుడేమో ఇలా మాట్లాడుతున్నాడు.

గంగాధర్ ఇక వినలేకపోయాడు. అందర్నీ తోసుకొని గబగబా వేదికమీదకు చేరుకున్నాడు. 'ఒక్క నిమిషం' అంటూ మైకు లాక్కుని మాట్లాడడం మొదలుపెట్టాడు.

'అయ్యా! అందరికీ రాం! రాం! నేను సామాన్యమైన సన్నకారు రైతుని. వ్యవసాయ గ్రాడ్యుయేట్‌ని. రాత్రనక పగలనక కష్టం జేస్తూ కూరగాయలు పండిస్తున్న రైతుని. మొన్నటి సీజన్‌లో టమాటాకు ధర లభించక ఇదే చౌరస్తాలో రైతులు టమాటాలు పారబోశారు. కూసుని అమ్మితే కనీసం పంట కోయించిన కూలీలు కూడా నిండక నిండాමునిగిపోయాం. ఇప్పుడు ఒక నెల రోజులుగా కొంచెం ధర దొరుకుతున్నదనుకుంటే, సామాన్యుడు అన్యాయమై పోతున్నాడు అని అంటున్నారు. మీరు చెప్పే సామాన్యుడి కంటే ఇంకా సామాన్యుడు రైతు! ఈ విషయం మీకు తెలువదా? రైతులలో మిలియనీరు ఉన్నారా? కనీసం లక్షాధికారులున్నారా?

మీరు మరో విషయం గమనించాలి. పెద్ద రైతులెవరూ కూరగాయలు పండించరు! కూరగాయలు పండించేవారంతా సన్నకారు చిన్నకారు రైతులే! ఈ ఎండాకాలం మూడు నెలలే మా పంటకు గిట్టుబాటు ధర దొరికేది. వాతావరణం అనుకూలించని మండుటెండల్లో, అనేక కష్టనష్టాలకు ఓర్చి, మా చెమటోడ్చి పండించిన కూరగాయల్ని ఒక్క పది రూపాయలు ఎక్కువ పెట్టి కొనలేరా! అదీ ఒక మూడు నెలలే! ఏ షాపులోనూ బేరమాడని వినియోగదారుడు ఒక్క కూరగాయల దగ్గరికి వచ్చేసరికి బేరమాడందే కొంటాడా చెప్పండి? ఎందుకు ఈ సన్నకారు రైతుల మీద ఇంత పగ – ద్వేషం. బయటి నుండి కూరగాయలు తెప్పించి మా కడుపుకొడ్తారా? రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడానికి, ప్రభుత్వాన్ని ఏదో ఒక వంకతో తిట్టడానికి మమ్మల్ని బలిపశువుల్ని చేస్తారా?'

గంగాధర్ యుద్ధం మొదలయింది! ఈ యుద్ధంలో గంగాధర్ గెలవాలి! అందుకు మనమంతా తలో చేయి వేయాలి! సమస్త రైతాంగం గంగాధర్‌తో పాటు ఒక ఆకుపచ్చని ఆశ వైపుకి తమ ప్రయాణం మొదలు పెట్టాలి!


Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 203



# బతుకు వాసన

గండ్రకోట సూర్యనారాయణ శర్మ

సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



గండ్రకోట సూర్యనారాయణ శర్మ 1979లో మొదటి కథ రాసిన కథా రచయితగా ప్రస్థానం మొదలుపెట్టారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని పినపాకలో పుట్టారు. హైస్కూల్ వరకు పినపాకలోనే చదివి మెదక్‌లో ఇంటర్, జోగిపేటలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ తెలుగు చదివారు. 1984లో ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్‌లో క్లర్క్‌గా ఉద్యోగంలో చేరి అనతికాలంలోనే అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. తెలంగాణ సహకార అపెక్స్ బ్యాంకులో ఉద్యోగ విరమణ చేశారు. 1979 ఏప్రిల్‌లో ఆంధ్రభూమి వీక్లీలో ‘దేవుడి కళ్ళు’ మొదటి కథ అచ్చయ్యింది. వివిధ పత్రికల్లో ఇప్పటివరకు దాదాపు ఇరవై కథల వరకు అచ్చయ్యాయి. శర్మ మొదటి నవల ’ఆనంద హేల’ స్వాతి మాసపత్రికలో వచ్చింది.

**బూమి.. సూడ సక్కని సుక్క. ఇంటర్మీడియెట్** జదివిన బూమి, సిద్దిరాములు పెండ్లాంగా గా పల్లెటూర్ల అడుగుపెట్టింది. గా ఊరు అడివి మద్యల ఉంటది. ఊర్లకి అస్తుంటే కుడేపు పెద్ద చెర్వు. చెర్వు దాటినంక ఒక రావిచెట్టు కిందున్న అరుగుమీన హనుమాండ్లు విగ్రహం. గది దాటినంక ఊరు సురువవుద్ది. రెండొందల గడప ఉన్న గా ఊర్ల జనం శానమటుకు అబం సుబం తెలీనోల్లే.

పదహారేండ్ల వయసుతో మిలమిలా మెర్సిపోతా, పోట్లగిత్తలా ఉన్న బూమిని జూసి కొంతమంది మాత్రం కల్లప్పగిచ్చి చూసెటోల్లు.

సిద్దిరాములుకు రాంభూపాల్ దొర ఇంట్ల నౌకరి. పొద్దుగలనే లెగిసి ఎల్లిండంటే ఇగ మల్లీ రాత్రికే వొచ్చుడు. పసువులకి మేత ఏసుడు, పాలు బితుకుడు, పొలం దున్నుడులాంటి పన్లతో అలిసిపోయి రాత్రి ఇంటికొచ్చిన ఆనికి బూమి బువ్వబెట్టి, ఆలించి పాలించి మురిపించెడిది. పొద్దుగలనే ఆని ముకంజూస్తే తెలిసిపోయెడిది ఆడ్ని అదెంత సుకపెట్టిందో.

ఒక్కేడు గడిసేసరికి ఆల్లకో కొడుకు బుట్టిండు. పేరు బాస్కర్. ఆడు పెరిగి పెద్దయి స్కూల్కి బోబట్టిండు. స్కూల్నుంచి వొచ్చిన కొడుకుని తనతాన కూసుండవెట్టుకుని, వానికి అర్దంగాని పాటాలు సక్కగా చెప్పెడిది.

ఓ రోజు రాత్రి సిద్ది ఇంటికి వొస్త వొస్తనే 'బూవీ! రేపు మా దొర ఇంట్ల పనిమనిసి రాదంట. జర నీ పెండ్లాముని తోల్కరారా సిద్దీ అని దొరసానమ్మ అడిగినాది. నువు రావాలె' అన్నడు.

'చల్ తీయ్. మీ దొరింటికి నేనేమిటికి వొచ్చుడు?' అంది భూమి తలెగరేసి.

'గట్లనమాకె. నిన్నుదెస్తనని దొరసానికి జెప్పిన. నా ఇజ్జత్ బోతది' అన్నడు. సదువుకున్న పెండ్లాన్ని పనికి తోల్కెల్లుడు ఆనికీ ఇష్టం లేకున్నా, దొరసాని మాట గాదన్లేక బూమిని బతిమాలిండు. ఒక్కదినమే అంటుండుగన్క మగన్ని తక్లీపుల బెట్టుడు ఏమిటికని 'సరే వొక్కదినమేగద. వొస్తలే' అంది.

ఐతే ఒక్కదినంతో సరిపోలే. వారం రోజులు ఎల్లాల్సొచ్చింది బూమికి. ఇంద్ర బవనంల రంబ లెక్క, తన ఇంట్ల తిరుగుతున్న బూమిని జూసిన దొర గుండె జారిపోయింది. 'పన్జేసేటోనికి ఇంత సక్కని సుక్క పెండ్లామా' అని సలమల అయ్యిండు.

ఒకరోజు అర్ర ఊకుతుండగ ఎనక్కెల్లి ఎవరో గట్టిగ బట్టినట్టై, గిర్రున ఎనక్కి దిరిగింది బూమి. ఎనకనే దొర ఉండుడు జూసి 'గిదేంది దొర. నేను పనిమనిసిని' అంది.

'తెల్సే. అందుకే బట్టిన. పిల్లల తల్లి లెక్క లేవు నువ్' అన్నడు రాంభూపాల్.

'తప్పు దొర. మేం అసుంటోల్లంగాదు. పన్జేసుకు బతికెటోల్లం' అంది దూరంగబోతూ.

ఆయ్న ఆమె పైటబట్టి 'బెడ్రూముల మాలాంటి దొరలతాన గసుంటి ఎక్వతక్వలుండవ్. నీకు మస్తు ఇనాములిస్త. ఒక్కపాలి రా' అని జబర్దదస్తీగ దగ్గరికి లాగిండామెని. గా లాగుడికి ఆయ్న చాతీ మీదికి బడ్డ బూమి, జర తమాయించుకుని, లాగి ఆయ్న చెంపమీద సాచి కొట్టింది. గంతే... ఆమె సేతుల్ల ఎంత బలముందో తెల్వదుగానీ, ఆయ్న కండ్లముందు ఒక్కతూరి సుక్కలు గనిపించినై. ఆమె మర్లబడి తన సెంపమీద గంత గట్టిగ కొడ్తదని ఆయ్న ఊహించలే. ఆయన్ని కొట్టినంక, ఆడికెల్లి బిరాన ఉర్కుకుంట వొచ్చి తన ఇంట్ల బడింది.

గిక్కడ దెబ్బ తిన్నదొర తలదీసినట్లైంది. 'తన జిందగిల గింత దన్క తను కోరుకున్న ఏ ఆడదీ తనని కాదనలే. తనని గొట్టలె. అసుంటిది ఒక పనోడి పెండ్లం తనని కొట్టుడా. తన ఇజ్జత్కీ సవాల్' అని కుతకుత ఉడికిపోతూ అర్రలకెల్లి బైటికచ్చిండు.

బైట కొట్టంల పశువులకి దానా ఏస్తున్న సిద్ది గనిపించేతలికి బూమి మీన కోపం ఆనిమీదికి మర్లింది. గాడనే సూర్ల ఉన్న సింత బరికె బట్టుకుని ఆని పెయ్యంతా కమిలిపోయేతట్లు సితకబాదిండు.

దొర ఎందుగ్గొడుతున్నడో తెల్వక సిద్ది అటూ ఇటూ ఉర్కిండు. దాంతో దొర ఇంకా కోపంతో 'బట్టెబాజ్! పొలానికి బొమ్మంటే ఇంక ఈడనే ఉన్నవేందిరా? దొర మాటంటె లెక్కలేదుర?' అంటూ కసిదీర మరో రెండు తగిలించి 'పోరా పో.. పోయి నీ బాబుకు జెప్పుకో. ఈ దినంకెల్లి నీకీడ నౌకరీ లేదు. ఈ ఊర్ల నువ్వెట్ల బత్కుతవో జూస్త' అని వాని గల్లబట్టి గడి బైటకి జబర్దస్తీగ నెట్టిపడేసిండు.

దొరకి అంతగనం కోపం రానికి తను జేసిన తప్పేంటో తెల్వక, పరేషాన్ అయి దెబ్బలు తగిలిన తావుల రుద్దుకుంట ఇంటి తొవ్వ బట్టిండు. జరిగిందేమిటో బూమి తన పెనిమిటికి జెప్పలే. కానీ బాస్కర్ మాత్రం దొర ఇంట్ల ఏదో జరిగిందని అనుమానపడ్డడు.

గా దినం సంది సిద్ధిరాములు గా ఊర్ల పనికోసం ఎవనితానికి బోయినా 'పనీ గినీ లేదు. ఎల్లెల్లు' అని అనబట్టిన్రు. వానికి కాల్లు సేతులూ ఆడలే. గప్పుడు వానికి ఎర్కయ్యింది.. దొరని కాదని ఊర్ల ఎవడూ బత్కలేడని.

* * *

'గంతదూరం బోయి పైసల్ కమాయించకుంటే దినం గడ్వదాయేంది. 'ఉసురుంటె ఉప్పుకల్లు అమ్ముకు బతకచ్చని నీకు సమజైతలేదు' అంది బూమి మగనితో.

' గిక్కడ దొరతో కిరికిరి అయినసంది నాకు ఏ నౌకరీ లేకుంటబోయింది. గిట్ల నేను బేకార్గ ఎన్నొద్దులుండాలె. నా దోస్తు కిష్టిగాడు సైన్యంల పనిజేస్తుండు. గక్కడిప్పుడు రిక్రూటుమెంట్లు ఉన్నయ్యంట. నన్ను రమ్మని పిల్సిండు. అవల్దారైతే లచ్చలు కమాయించొచ్చు'

'గాడ నీకు నౌకరీ ఇవ్వనీకి ఆల్లు కాసుగ్గూసున్నరా?' అంది బూమవ్వ.

'ఎల్లి జూస్త. నౌకరీ వొస్తే ఎల్తా. లేకుంటే తిరిగి వొచ్చుడైతే బరాబరేగద. కిష్టిగాడు దినాం పోన్ జేస్తుండు రమ్మని. నా పెర్సనాలిటీగూడ మంచిగనే ఉంటదిగద. గందుకే ఈ నౌకరీ గేరంటీగ వొస్తదని సెప్తుండు'

'నువ్వాడికి బోయి లచ్చలు కమాయించుడు గిప్పుడు అవుసరమా. ఐన సైన్యానికి బోవుడంటే నా ప్యానం గుబగుబలాడతంది. గొంగడి వున్నంతమట్టికి కాల్లు జాపుకుండమన్నరు. ఈడనే ఏ పనన్నా సూసుకోవొచ్చుగద' అందామె దిగులుగా.

ఎంత సెప్పినా ఇనకుండ సిద్ది జిద్దు జేసుడుతో ఇగ ఏమీ జెయ్యలేక సరేనన్నది బూమి.

నెల తిరిగేసరికి సిద్ధిరాములు సైన్యంల సెలక్టవుడు, కాశ్మీరుల పోస్టింగ్ వొచ్చినట్లు అప్పాయింటుమెంటు ఆర్డరు తీసుకొనుడు గూడ అయిపోయింది.

డ్యూటీల జాయినవ్వనికి ఎల్లేముందు గా ఊర్ల స్కూల్ హెడ్‌మాస్టర్గా పనిజేస్తున్న శివరాం సార్ని గల్సిండు. ఐదో తరగతి అయినంక ఇంక సదువు సాల్జెయ్యమని అన్న తన తండ్రికి సమ్జాయించి, తనని పదో క్లాసుదంక జదివేతట్లు జేసిన శివరాం సార్ మాటంటే సిద్ధికి ఏదమంత్రం లెక్క. 'సార్! నా కొడుకుని నీ సేతిల బెడ్తున్న. ఆడు ఎట్ల జదువుతున్నడో జర నువ్వే అర్సుకోవాల. ఇంట్ల ఆనికి ట్యూసన్ గూడ సెప్పుర్రి. నెలనెల పైసలు బంపుత' అని జెప్పిండు.

'సిద్దీ! నీ బిడ్డగూర్చి నువ్వేమి ఫికర్ బడక. నేను జూస్కుంట. నువ్వెల్లి రా' అని జెప్పిండు. గా సార్ కాల్లకి మొక్కి వచ్చేసిండు.

రైలెక్కేముందు బూమిని దగ్గరికి దీస్కుని 'ఎందుకంతగనం బుగులువడ్తవ్. మల్లీ సమ్మచ్చరం దిర్గేతలికి నీ ముందుంట' అన్జెప్పి రైలెక్కిండు.

సిద్ది ఊరొదిలి ఎల్లినంక దొర రెచ్చిపోయిండు. బూమిని లొంగదీసుకోనికి మస్తు కతలు వడ్డడు. కానీ, ఆమె లొంగలే. ఇంటికి మనుసుల్ని బంపిండు. పైసల్ ఆశ బెట్టిండు. భయపెట్టిండు. అయినగానీ బూమి లొంగలే. దాంతో ఆయ్నకి రోసం ఎక్వయింది. ఏంజేస్తె

గా‘ఊరబిచ్చ’ తనకి లొంగుతదొ ఆనికి సమజ్ గాలె. బగ్గ సోంచాయించినంక ఒక రాస్త గండ్లవడ్డది. తన మనుసుల్ని బిల్చి ఏంజెయ్యాలో జెప్పిండు.

తన పెనిమిటి కాశ్మీర్ ఎల్లినంక తన పొలానికి ఎల్లిన బూమికి గక్కడ దొర మనుసులుండుడు జూసి ఆల్లతో లొల్లికి దిగి ‘ఎవురన్నా నా పొలంల కాలుబెడితే నరుకుతా బిడ్డా’ అంటూ వార్నింగ్ ఇచ్చింది.

దొర రంగంలోకి దిగిండు. పెద్దలతో పంచాయితీ బెట్టించిండు. రెడీగా బెట్టుకున్న దొంగ పత్రాలు జూపించి, పొలాన్ని తనకి అమ్మి, సిద్దిరాములు పైసలు దీసుకున్నడని జెప్పిండు. దాంతో ఊరి పెద్దలంతా గా పొలం ఆయ్నదేనని తీర్పు ఇచ్చిన్రు.

సేసెడిది లేక బూమి పొలం వొదిలేసుకుంది. దొర తన మనుసుల్ని బంపి ‘నాతానికొస్తె నీ పొలం నీకిస్త’ అని చెప్పించిండు. బూమి రోకలిబండ బట్కని, గట్ల వొచ్చినోల్లందర్ని ఉర్కించి కొట్టింది.

బాస్కర్ మాత్రం తమకు జరిగిన అన్నేయానికి కుతకుత ఉడికిపోయిండు. బూమి వాన్ని సముదాయించింది.

* * *

ప్రతి ఏడూ ఇంటికచ్చే సిద్దిరాములు గా ఏడు రాలేదు. గిక్కడ కార్గిల్ వార్ జరుగుతంది. గందుకే రానికి కుదరలె. ఈ యుద్దమైపోంగనే వస్త అని పోన్జేసిండు.

మగని కోసం ఎదురుసూస్తున్న బూమికి, యుద్దంల మన దేశం గెలిసిందని వినంగనే ఆమె మస్త్ ఖుష్ అయింది. ఐతే ‘మన సైనికులు కొందరు యుద్దంల దుష్మనోల్ల చేతికి చిక్కినారనీ, వాల్లని ఇడిపించనీకి బాత్చీత్ నడుస్తుందనీ టీవీల జెప్పంగ విని మల్ల పరేషాన్ల బడింది.

గప్పుడు శివరాం సార్ బూమితో ‘నువ్వు దైర్యంగా ఉండు. ఎట్టనైనా నీ మగన్ని సర్కారోల్లు ఇడిపిస్తరు. ఆడు జరూర్ తిరిగొస్తడు. పైసల గురించి నువ్వేమీ ఫికర్ వడక. మా స్కూల్ల టెంపరవరీగ టీచర్ పని జెయ్యన్కి ఎవరైన ఉంటే సూడమని మా పై ఆఫీసర్జెప్పిండు. సిద్ది వొచ్చిందన్క నువ్వు టీచర్ పని జెయ్యి’ అని తోడబుట్టిన అన్న లెక్క అండగ నిలబడ్డడు. దాంతో బూమికి జరంత నిమ్మలమైంది. బాస్కర్ని పక్కనున్న టవున్ల ఇంటర్మీడియెట్ల జేర్పించి, తను దినాం స్కూలుకు బోబట్టింది.

తన మగడు సేమంగ రావాలని ముత్యాలమ్మ తల్లికి అనేకం మొక్కులు మొక్కింది.

* * *

ఓ రోజు పట్నం నుంచి వొచ్చిన ఒక పోరడు ‘అక్కా! బాస్కర్ నక్సలైట్లలతో దోస్తీ జేస్తున్నడు’ అన్జెప్పిండు.

గా మాటలు వినంగనే బూమికి శక్కరొచ్చినట్లయింది. నిద్రవట్టలే. తెల్లారంగనే టవున్కి బయలెల్లింది. హాస్టల్కెల్లి బాస్కర్ని బట్కని బోరుమని ఏడ్చింది. ‘బేటా! మీ నాయిన ఏమయిండో దెల్వదు. నువ్వు సదువు వొదిలి ఎవుర్తోనే తిరగబడ్తివని తెలిసింది. మనకెందుకు

బిడ్డా అసుంటివన్నీ. గిట్ల జేసుడు మంచిగుందా?' అంది.

'ఏ.. ఊకో అమ్మ! గసుంటిదేమీ లేదు. మనింటి సంగతి నాకు దెల్వదా? నువ్వేమీ ఫికర్ వడకు' అని జెప్పిండు. దాంతో ఆమెకి కాస్త నిమ్మలమైంది.

* * *

ఓ రోజు రాత్రి దబ్బుదబ్బుమని దర్వాజ మీద సప్పుడవుడు ఇని ఉలికిపడి లేసి కూసుంది. గా సప్పుడు కోసమే ఎదురుసూస్తున్న బాస్కర్ శటుక్కున లేసి 'ఎవురూ' అనుకుంట ఎల్లి దర్వాజా దీసిండు.

దర్వాజ బైట నిలబడున్న పాతికేల్ల పోరడు బూమితో 'అన్నలు బిలుస్తున్నరు. స్కూలుతానికి రఁన్రీ' అని జెప్పిండు. ఒక్కపాలిగ ఆమె గుండెలు గుబగుబలాడినై. దర్వాజ దగ్గరికేసి ఏదో గులుక్కుంట, బాస్కర్ ఎన్కనే నడిచింది.

ఆమె అక్కడికెల్లేతలికి ఊరి జనం సుట్టుముట్టూతా మూగి ఉన్నరు. మద్దెల తుపాకులు బట్కని శానామంది నిలబడి ఉన్నరు. ఆల్లని సూస్తేనే తెల్వబట్టె.. అడివిల దిరిగే అన్నలని. ఆడ మగ కలిసి, కమ్ సె కమ్ ముప్పైమంది దాంక ఉంటరు. వాల్ల మద్యన ఉన్న దొర కాల్జేతులు కట్టేసి కొట్టటంతో లబోదిబోమని ఏడుస్తుండు. ఆయ్న వొల్లంతా దెబ్బలతో రక్తంగారబట్టింది.

అన్నల నాయకుడు బూమిని జూడంగనే 'అక్కా! నీ దిక్కుకెల్లే గీ పంచాయితీ బెట్టినం.. గీ బద్మాష్కి కావరం ఎక్వ అయి, మీ ఊర్ల జనాల్ని సతాయిస్తుండనీ, పేదోల్ల బూములన్నీ లాక్కుంటుండనీ శానా కంపిలైంటులొచ్చినై. ఈనికి బీమారి బగ్గ ఎక్వ అయ్యింది. గాదాన్కి మాతాని గోలీల దవా ఉంది. ఒక్క గోలీ మా తుపాకిలకెల్లి ఈని తలలోకి దిగితే ఈని బిమారి ఖతమైతది. అదే ఈనికి మా దళం ఇచ్చే ట్రీట్మెంట్' అన్నడు.

'అంటె ఈయ్నని సంపేస్తరా అన్నా?' అనడిగింది బూమి.

'అవ్. పేద జనాల్ని పీడించే ఇసుంటి వర్గ సెత్రువులకు మేం మరణశిక్ష అమలు జేస్తం' అన్నడు.

వాల్లు దొరని జంపనీకే వొచ్చిన్రనీ దెల్సిపోయిందామెకు. గందుకు కారణం తన బిడ్డ బాస్కరేనని గూడా అర్థమైంది. గందుకే 'అన్నా. నామీన గుస్స జెయ్యకుంట ఒక్క డవుటు కిలియర్ జేయున్రి. గీ దొర తప్పు జేసిండని మీరు ఈయ్ని జంపేస్తరు. గా తర్వాత ఈయ్న ఏ తప్పూ జెయ్యలేదనీ, నేనే జూట్మాటలు జెప్పిన్ననీ తెల్సిందనుకో. గప్పుడేం జేస్తరు? ఈయ్నని బతికిస్తరా? లేకుంటే అబద్దం జెప్పినందుకు నన్ను జంపుతరా?' అని అడిగింది.

నాయకుని నుంచి జవాబు లేదు.

'ఏం అన్నా? జవాబు లేదేం. నువ్వేగాదు. దీన్కి ఎవ్వలూ సమాధానం జెప్పలేరు. ఎందుకంటే సంపుడు శానా ఈజీ. కానీ, బతికిచ్చుడు ఎవ్వని తరం గాదు. అడవిల బలిసిన జంతువు బక్కజిక్కిన జంతువుల్ని ఏటాడి సంపి తింటది. గది మృగ నేయం. మనం మృగాలం

కాదు. మనుసులం. మనకి దేవుడు జరంత దిమాక్ ఇచ్చిండు. పేమ, దయ, జాలిలాంటి గుణాలిచ్చిండు. జర పుర్సత్ల సోంచాయించున్రి' అంది.

దానికి నాయకుడు ఆమెతో 'ఈనికి బతికెడి హక్కు లేదని మా దళం డిసైడ్ జేసింది. సావే ఈనికి సరైన శిక్ష' అన్నడు.

'మీరు ఈయ్ని జంపుతనంటే నేనొప్పుకొనెడిదిలేదు. మనం బతుకుతా, పక్కోడిని బతికేట్లు చేసుడు గొప్ప. 'బతుకు వాసన' దెల్సినోడు ఎవుర్నీ సంపడు. సంపుడు అనేది మనిసిని మాయంజేస్తదిగని, వానిలోని చెడుని మాయం జెయ్యదు. తప్పు జేసినోనికి శిచ్చ వేసుడు కర్కటే గని మీరు ఏసెడి సిచ్చ ఈనికే గాకుంట, ఇసుంటోల్ల కాందాని మొత్తానికీ ఒక పాటంలెక్క ఉండాల. ఇగముందు ఎవ్వడైనా అసుంటి పని జెయ్యనికి గజ్జున వణకాలి. ఎదురు జెప్పెటోడు లేడని గీ దొర ఇన్ని దినాలు ఇరగబడిండు. గిప్పుడు సూడున్రి.. సిన్న పోరనిలెక్క ఎట్ల ఏడుస్తుండో. మారనీకి ఆయ్నకొక్క శాన్సు ఇవ్వున్రి' అంటూ రెండు సేతులూ నడుంపైన బెట్టుకుని, నాయకుని సేతిల ఉన్న తుపాకి ఎదుట కరెంట్ పోల్ లెక్క నిటారుగ దైర్యంగా నిలబడి 'ఈయ్ని సంపనీకే నువ్వు డిసైడు అయ్యుంటే ముందుగాల నన్ను సంపు' అంది.

నాయకునికి ఏంజెయ్యాల్నో తెల్వలా. ఎంతజెప్పినా దొరని జంపనీకి బూమి ఒప్పుకోలే. మల్లీ దళం సబ్యులతో నాయకుడు శానాసేపు డిస్కసన్ జేసినంక, బూమి దెగ్గరికొచ్చి 'అక్కా. పేరుకు దగ్గట్టు నిజంగా నువ్వు బూదేవివే. నీ అసుంటి ఆడుదాన్ని నా జన్మల ఇంతవరకూ సూడలే' అని దొరని జూస్తూ 'ఒరే బేవకూఫ్! మా హిస్టరీల గింతదంక మేము టార్గెట్ చేసిన ఎవడ్నీ వదిలింది లేదు. నీ కిస్మత్ మంచిగుంది. గీ అక్క జెప్పబట్టి బతికిపోయినవ్. గిప్పటికైనా బుద్దిదెచ్చుకో. నువు జబర్దస్తీగా దీస్కున్న బూములన్ని ఎవురివి వారికిచ్చేయ్. ఇంకోపాలి ఏ ఆడకూతుర్నయినా చెరబట్టినట్టు తెలిసిందో నువ్వు ప్రానాలతో ఉండవ్. యాదుంచుకో బిడ్డా' అని ఎచ్చరిక జేసిండు. గా తర్వాత అన్నలంతా సిటికెలో అక్కడ్నుంచి అడవుల్లోకి మాయమై పోయిన్రు.

అన్నలకు ఎదురు నిలిచి, తనకు కొత్త బతుకునిచ్చిన బూమి కాల్లపై బడి శమించమని అడిగిండు దొర.

'లే దొరా. నువ్వు పెద్దోనివి. నాకు మొక్కుడెందుకు? ఊర్ని పాలించెటోడు నేయాన్ని, దర్మాన్ని పాటించాల. జనాల్ని కన్నబిడ్డల్లెక్క జూస్కోవాల. గప్పుడు జనమే నీ కాల్మొక్తరు' అంది. ఆయ్న పెండ్లాం, పిల్లలు గూడ బూమికి దండం బెట్టి, ఆడికెల్లి ఎల్లిపోయిన్రు.

జనమంతా బూమి ధైర్యాన్ని మెచ్చుకుంటూ తమ ఇండ్లకేసి బయలెల్లిన్రు. తన తల్లి తెగువకు, మంచితనానికి బాస్కర్ నోట మాట రాలేదు.

తూరుపు దిక్కున విచ్చుకుంటున్న సూరీడి ఎలుగురేకలు బడి, దయగల తల్లి ముత్యాలమ్మ లెక్కబూమి మొకం ఎలిగిపోసాగింది.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 211



# గుట్ట మీద దేవుడు

మధుకర్ వైద్యుల

**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**



మధుకర్ వైద్యుల చిన్నతనం నుంచే రచనారంగం మీద ఆసక్తి ఏర్పరుచుకున్నారు. పాఠశాల నుంచే కవిగా, రచయితగా ఉన్నారు. 1995లో జర్నలిస్టుగా వృత్తి ప్రారంభించారు. మరోవైపు సాహిత్య, సామాజిక సేవా రంగంలో సేవలు అందిస్తూనే ఉన్నారు. ఆయన చదువుకున్న స్కూల్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తీసిన 'శాంతికిరణం' అనే పాఠశాల మ్యాగజైన్‌కు 'జ్ఞాపిక' అనే కవిత తొలిసారి రాశారు. 2014లో 'స్వతంత్ర సుమాలు' కవితా సంపుటి తెచ్చారు. 'అమ్మకావాలి', 'బతుకు చిత్రం', ఒక అమ్ము... ఒక అభి', 'ప్రేమిస్తే', 'కడప టూ హైదరాబాద్ వయా అనంతపూర్' తదితర కథలు ప్రజాశక్తి, సూర్య దినపత్రికల్లో అచ్చయ్యాయి. 'మా ఊరి జాడేది', ప్రాయశ్చిత్తం' కథలు నమస్తే తెలంగాణ 'బతుకమ్మ'లో, 'అందమైన విధ్వంసం' కథ నవతెలంగాణ 'సోపతి'లో ప్రచురితమయ్యాయి. 'పోరుబాట' అనే సీరియల్ నవల సూర్య దినపత్రికలో ప్రచురితమైంది. ఇప్పటి వరకూ 20 కథలు, మూడు వందల కవితలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. వాటికి ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందాయి. 1996 నుంచి కోల్‌వాయిస్, చర్చ, ఆంధ్రప్రభ, ప్రజాశక్తి దినపత్రికల్లో పాత్రికేయునిగా సేవలందించారు. సూర్య దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరి ఆదివారం అనుబంధం ఇన్‌చార్జ్‌గా, ఫీచర్స్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆదివారం అనుబంధం 'బతుకమ్మ'లో సీనియర్ జర్నలిస్ట్‌గా ఉన్నారు.

**తూర్పున ఆకాశం పూర్తిగా తెలవారనేలేదు. ఊరి ఆడవాళ్లు** ఒక్కరొక్కరిగా లేచి వాకిలి ఊడ్చి కళ్లాపి చల్లుతున్నారు. ఇంట్లో మరుగుదొడ్లు ఉన్నా.. ఆరుబయటి గాలికి అలవాటు పడ్డ కొన్ని జీవితాలు చేతిలో చెంబుతో చెట్ల చాటుకు వెళుతున్నాయి.

కూ.. కూ.. కిచ.. కిచ.. కావ్ కావ్... చెట్ల కొమ్మల్లో పక్షుల కిలకిల రావాలు. వాటి అరుపులు విని కుక్కలు భౌ.. భౌమని అరుస్తున్నాయి.

'ఒరేయ్.. రామన్న.. లింగయ్యా.. రాజీగా ఉన్నారారా..' సమ్మయ్యా అరుస్తు పరుగెత్తు కొస్తున్నాడు. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఒక్కసారిగా అలజడి రేగింది. సమ్మయ్య అరుపులకు ఊరు ఊరంతా మేల్కొంది. అందరి ఇండ్లముందు బల్బులు వెలిగాయి. పడుకున్న వారు, అప్పుడే మెలకువ వచ్చిన వారంతా బయటకు పరుగెత్తుకు వచ్చి ఊరి మోతుబరి రాంరెడ్డి ఇంటి ముందు చేరారు.

పరుగెత్తుకుంటూ వచ్చిన సమ్మయ్య ఆ గుంపునకు ఎదురుగా చేరాడు.

'ఏంట్రా సమ్మయ్యా.. ఏమయింది? ఎలుగుగొడ్లు ఏమన్న తరిమినయా? దొంగలు ఎవరన్న ఎంట వడ్డరా?' లుంగీ, బనీను మీదున్న రాంరెడ్డి ప్రశ్నించాడు.

'అదేం లేదయ్యా. గా పెద్దగుట్ట మీద..' ఆయాసపడుతూ అగిపోయాడు. అందరి ముఖాలు విచ్చుకున్నాయి. 'పెద్దగుట్ట మీదా ఏమయ్యింది?' అందరి ఆలోచన అదే!

'ఆс.. పెద్దగుట్ట మీదా ఏం జరిగిందిరా?' రాంరెడ్డి నోట అనుమానం నిండిన ప్రశ్న ధ్వనించింది?

అందరూ ఆయననే చూస్తున్నరు.

'గుట్టమీదా దేవుడు ఎలిసిండు' అసలు విషయం చెప్పేశాడు.

'దేవుడా' ఆశ్చర్యంగా అడిగాడు రాంరెడ్డి.

'దేవుడు ఎలిసిండా?' అందరూ ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ గుసగుసలాడు తున్నరు.

'అవును పటేలా. దేవుడే.. పెద్దపెద్ద కళ్లు, పెద్ద బొట్టు, పేద్ద.. నాలుక అచ్చం మనఊరి పోచవ్వ తల్లి లెక్కనే ఉన్నది'

రాంరెడ్డికి ఏం అనాలో అర్థం కాలేదు. గుసగుసలు ఎక్కువయ్యాయి.

తూర్పు దిక్కున సూర్యుడు వెలుగులు చిమ్ముతూ తెరలుతెరలుగా బయటకు వస్తున్నాడు.

'ఓరేయ్ సమ్మా.. పదరా చూద్దాం.. గుట్టలేందీ? దేవుడు ఎలుసుడేందిరా? అరేయ్ అందరూ రండి' రాంరెడ్డి అందరినీ పురామాయించాడు.

అక్కడ నిలబడి ఉన్నవాళ్లంతా ఎవరి ఇండ్లకు వాళ్లు తాళాలు వేసి ఉన్న పళంగా గుట్టకు బయలుదేరారు. కొంతమంది ఇంట్లో ఉన్న కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు కూడా తీసుకుని మరీ బయలుదేరారు.

పదినిమిషాల్లో ఊరుఊరంతా గుట్టమీదుంది. సమ్మయ్య చెప్పిన దగ్గర రాయితో చెక్కిన అమ్మవారి విగ్రహం దర్శనమిచ్చింది. అది ఎన్నో ఏళ్ల కాలంనాటి దానిలా పాతబడి ఉంది.

విగ్రహాన్ని చూడగానే ఊరివాళ్లంతా చెంపలేసుకుంటూ కళ్లు మూసుకుని ఎవరికి తోచినట్లు వారు దండం పెట్టుకుంటున్నారు. కొంతమంది తమవెంట తెచ్చిన పసుపు, కుంకుమ చల్లి కొబ్బరి కాయలు కొడుతున్నారు.

తెనుగోల్ల లచ్చిమికి పూనకం వచ్చింది. 'అరేయ్ మీ పాపాలు పండినయి. నన్ను నా గుట్ట మీద నుంచి పంపేయ్యాలని చూస్తా(రా' అంటూ పూనుతుంది. ఆమెను మరో ఇద్దరూ పట్టుకున్నారు.

'అయ్యో తల్లి ఇది నీ గుట్ట నిన్నెవరు పంపుతారు తల్లి, శాంతించు తల్లి శాంతించు' ఎవరో వేడుకుంటున్నారు.

'నేను శాంతించాలంటే ఈ గుట్ట మీదా నా గుడి కట్టాలే. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున జాతర చేయాలే. నా గుట్ట మీద చిన్నరాయి కూడా కదల్చకూడదు' పూనకం వచ్చిన లచ్చిమి చెబుతున్నది.

'అట్లనే తల్లి అట్లనే నీవన్నట్లే చేస్తం. గుడి కడుతం తల్లి. తప్పకుండా కడుతాం' గ్రామస్తులు చెబుతున్నారు.

అప్పటి వరకు నోటమాట రాక నిలబడి పోయిన రాంరెడ్డి కాళ్లకింద భూమి కదిలినట్లనిపించింది. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన గుట్టను కరిగించి రాళ్లుగా మార్చి కోట్లు సంపాదించుకోవాలనుకుని ఇటీవలె క్వారీ పెట్టడానికి ప్రభుత్వ అనుమతి తెచ్చుకున్నాడు రాంరెడ్డి. దానికోసం లక్షలు ఖర్చుపెట్టాడు. కానీ ఇప్పుడు.. ఇలా.. ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా నడుస్తూ ఇంటిదారి పట్టాడు.

ఇదంతా గమనిస్తున్న సమ్మయ్య ఆనందంతో నవ్వుకున్నాడు.

ఊరికి పడమరన పెట్టని గోడగా ఉండి.. చెట్లు, చేమలతో పాటు వర్షకాలంలో గుట్టమీద పడే వర్షపునీరు కిందికి చేరి గుట్టకింద భూములకు నీరందించి పంటలు పండడానికి కారణమవుతుంది. పశువులకు పశుగ్రాసం, పక్షులకు ఆవాసం, ఊరివాళ్లకు సీతాఫలాలు అందిస్తున్న గుట్టను కరిగిద్దామనుకున్నాడు రాంరెడ్డి. ఊరి జనం ఎంత చెప్పిన వినకుండా అధికారులకు లంచాలిచ్చి మరీ పర్మిషన్ తెచ్చుకున్నడు. అందుకే సమ్మయ్య పట్నం వెళ్లి అమ్మోరు విగ్రహాన్ని కొనుక్కొచ్చి గుట్టమీద పెట్టాడు. ఈ విషయం తెనుగు లచ్చిమికి మాత్రమే చెప్పి పూనకం వచ్చినట్లు నటించమన్నాడు. ఊరందరికోసం చేసే పని కనుక ఆమె కూడా ఒప్పకుంది.

అదేం తెలియని ఊరి జనం దేవుడు వెలిశాడని గుడి కట్టడానికి సిద్ధమయ్యారు. ప్రజలందరికీ ఉపయోగపడే గుట్టను కాపాడుకోవాలనే తలంపుతో తలపెట్టిన తమ పథకం పారినందుకు సమ్మయ్య, లచ్చిమి ఆనందంతో ఇంటిదారి పట్టారు.

Katha - 2019_FN_Layout 1 10/5/2019 6:59 PM Page 216